

జననం తే. 2-8-1924; బి. ఏ. దాకా చదువు

కుటుంబ నియంత్రణలో శిక్షణ; వక్త, గ్రంథకర్త,
స్వచ్ఛంద సమాజ సేవకురాలు

మల్లాది సుబ్బమ్మ ట్రస్టు	వ్యవస్థాపకురాలు
మహిళాభ్యుదయ సంస్థ	అధ్యక్షురాలు
ప్రజాస్వామ్య ప్రచురణలు	మేనేజింగు డైరెక్టరు
వైవాహిక, కుటుంబ సలహాసంఘం	కార్యదర్శి
మహిళాభ్యుదయ గ్రంథాలయం	ప్రెసిడెంటు

ఆం. ప్ర. అభ్యుదయ వివాహవేదిక డైరెక్టరు
ఆం. ప్ర. హేతువాద సంఘం ఉపాధ్యక్షురాలు
అ. భా. రాడికల్ హ్యూమనిస్టు సంఘ జాతీయ సమితి సభ్యురాలు
భారత హేతువాద సంఘ కార్యనిర్వాహక సమితి సభ్యురాలు

ప్రేమ + సెక్స్ = నీతి

మల్లాది సుబ్బమ్మ



ప్రజాస్వామ్య ప్రచురణలు [ప్రై] లిమిటెడ్
9, ఎం. ఐ. జి. హెచ్. కాలనీ, మెహిదీపట్నం,
హైదరాబాద్ - 500 028

ప్రజాస్వామ్య ప్రచురణలు నెం. 29

ప్రేమ + సెక్స్ = నీతి

రచన: **వల్లాది సుబ్బమ్మ**

ప్రథమ ముద్రణ 1984

ప్రతులు 1000

పబ్లిషర్సు:-

ప్రజాస్వామ్య ప్రచురణలు (ప్రై) లిమిటెడ్
హైదరాబాద్-500 028

సోల్ డిస్ట్రిబ్యూటర్స్:-

వికాసం

9, ఎం. ఐ. జి. హెచ్. కాలనీ,

మెహిదీపట్నం, హైదరాబాద్.
పిన్: 500 028 ఫోను 31423

వెల రు. 17-00

ముద్రణ :

లిబర్టి ప్రింటర్స్
చీరాల-523 155

ఆహార, నిద్రా, మైథునాలు మానవ జీవితముఖ్యభాగాలు. స్త్రీ పురుషుల సెక్సుపాత్రను సరిగా మదింపు చెయ్యాలంటే సామాజిక చరిత్ర అవగాహన అవసరం అవుతుంది. ఆదిమ సమాజంలో స్త్రీ పురుషుల మధ్య సెక్సు సంపర్కం విధినిషేధాలు లేకుండా యధేచ్ఛగా జరిగేది. సంఘపరిణామంలో సెక్సు జీవితాన్ని క్రమబద్ధం చేయటానికి, సంతానం తల్లిదండ్రులను నిర్ధారణ చేయటానికి వివాహ వ్యవస్థ ఏర్పడ్డది. మానవుడు ఆశాజీవి. అతని విద్వత్తు, విజ్ఞానం రోజు రోజుకూ క్రొత్త రూపురేఖలు దిద్దుకుంటూ వుంటాయి. అలాగే ఒకప్పుడు సెక్సు పరమ గోప్యమని, నిందార్హమని అనేక విధినిషేధాలతో నిండివుండేది. నేడు దాని పరిధులు, విలువలు మారాయి. కేవలం సంతానంకోసమే లైంగిక కార్యమనే సిద్ధాంతం తల్లక్రిందులయింది. డైరెక్టుగా సంపర్కం లేకుండా "టెస్టుట్యూబు" బేబీలు తయారవుతున్నాయి. సంతానం కనాలన్నా, వొద్దనుకున్నా అది మనచేతిలో పని అయింది. కనుక సెక్సు పరిధి మారింది. అది అన్యోన్య ప్రేమకు, ఆప్యాయతలకు ఆలవాలమయింది.

రచనలో వాస్తవికత వుండాలనేవారు అసలు వాస్తవికతను చూచి భరించలేరు. ఒక స్త్రీ నిలబడి నాకు సెక్సు కోరిక తీరలేదు; అది కావాలి, దానికి నైతికమైన మార్గమున్నదా? అని ప్రశ్నించినప్పుడు మనకెందుకు జుగుప్స కలగాలి? కనుక వాస్తవికత లాంటి కల్పితం రచనల్లో రంగరించాలంటారా? సత్యం విని సహించలేరా? ఊహాలోకాల్లో విహరించటం క్షంతవ్యంకాదు. కనుక బాధలను, సమస్యలను అర్ధంచేసుకొని సరియైన, న్యాయమైన తీర్పు ఇవ్వాలి రచయిత. అలాంటి రచయితే అసలయిన స్రష్ట. ఆ రచనలే సమాజ ప్రగతికి సోపానాలవుతాయి.

సమాజం త్వరితగతిని మారుతోంది. నీతి అనేది దేశ కాల పరిస్థితులనుబట్టి వుంటుంది. ఒకనాడు అయిదుగురు భర్తలుగల

ద్రౌపది సమాజామోదం పొందింది. ఈనాడది గర్హనీయం. కాల గతిలో ఎన్నో మార్పులు, మరెన్నో చేర్పులు, కూర్పులూ వస్తూ వుంటాయి. లైంగిక స్వేచ్ఛ స్త్రీ కోరినా, పురుషుడు కోరినా అది శరీర ధర్మంగా భావించాలికాని అది ఆడదైతే తప్పు, పురుషుడైతే ఒప్పు అనే భావం అర్థరహితం. లైంగిక ఉద్రేకాన్ని పెంచి ఇత రులపై దౌర్జన్యానికి, హింసకు ప్రోద్బలపరిచేది అసభ్యకరమంటే అందులో తప్పులేదు. అసలు విధవరాలైనా, విధురుడైనా ఒంట రిగా [redacted] అదేం తప్పుకాదు; నేరం అంతకన్నా కాదు. లేక వారు సహచర్యాన్ని కోరినా తప్పులేదు. అది వారివారి వ్యక్తి త్వాన్నిబట్టి, అభిరుచుల్నిబట్టి వుంటుంది. అంతేకాని దానికి గీటు రాయి ఏదీలేదు. తమ బిడ్డలకోసం త్యాగంచేసే నిగ్రహం వుంటే అది శ్లాఘనీయమవుతుంది. లేదా తనశరీరం, మనస్సూ తృప్తిగా ఆనందంగా వుండాలనుకోవటం ఒక్కొక్కరికి ఒక్కోవిధంగా వుంటుంది. ఒకరికి త్యాగమే పరమ ధ్యేయమైతే మరొకరికి సుఖ ప్రదమైన జీవితమే తృప్తినిస్తుంది. ఏది ఏమైనా మూడోవ్యక్తికి హానికలిగించని లైంగిక విధానంలో తప్పులేదు.

ఈ నవలా రచనలో సందర్భోచితంగా చివరిమాట వ్రాయుటకు తగు సలహాలనందించుటకు నాకు సర్వవిధాలా తోడ్పడ్డారు నా జీవిత సహచరులు శ్రీ ఎం. వి. రామమూర్తిగారు నా సహ కార్యకర్తగా సహాయ సహకారాలందించుటేకాక కొండంత అండ దండలిచ్చిన రామ్మూర్తిగారిని నేను విస్మరించలేను. వారి తోడ్పాటు లేనిదే ఈ నవలా ప్రచురణ దుర్ఘటమయ్యేది. అందుకు వారికి నేనాజన్మాంత కృతజ్ఞురాలను.

రచయిత :

మల్లాది సుబ్బమ్మ

విరహాన్ని రతి ఉపరతులతో వాల్మీకి వర్ణిస్తుంటే విని ఆనందిస్తున్నామేకానీ ఆ రామాయణ గ్రంథాన్ని నిరశిస్తున్నామా? భాగవతంలోని రాసక్రీడలు, జలక్రీడలు, గోపికాక్రీడలన్నీ అసత్యాలని ఆ యా గ్రంథాలపై మండిపడుతున్నామా? క్షేత్రియ్య, మువ్వగోపాల పదాలు, అన్నమాచార్య కీర్తనలు ఇలా ఎన్నో మరెన్నో సెక్సు జీవితాన్ని నానార్థాలతో పాటలు పాడుతున్నాం. అలాగే కళాపూర్ణోదయం, శృంగారనైషధం, కుమారసంభవంలాంటి కావ్యాలలోని భావం, భాషా తెలిసే వాటిని శిరోధార్యాలుగా స్వీకరిస్తున్నామా? లేదా? వాటిని అసభ్యాలని ఎందుకు త్రోసి వేయటంలేదు? పైగా పవిత్ర గ్రంథాలుగా మాననీయాలుగా అవి ప్రసిద్ధి చెందాయా లేదా? అనేవి ఆలోచనాంశాలు.

రసికత, శృంగారం లేని జీవితం ఎడారి వంటిది. భాషా జ్ఞానం పెరుగని రోజుల్లో మన పూర్వీకులు దాంపత్య జీవిత రహస్యాలను కొండలపైన, గుహల్లోనూ, కుడ్యాలపైన చక్కనినేర్పుతో శిల్పాలుగా చెక్కేవారు. ముఖ్యంగా దేవాలయాలపై రకరకాల భంగిమలలో నిలువెత్తు రాళ్ళపై శిల్పప్రక్రియ సాగించి లైంగిక ప్రబోధం చేశారు. కోనారక్, ఖజూరారో, రామప్ప, నేపాలీ లాంటి దేవాలయాలపై అవి నేటికీ రకరకాల బంధాలతో దర్శనమిస్తున్నాయి. దేశ, విదేశాలవారు సైతం వేలసంఖ్యలో వచ్చి చూచి వాటిని ఫోటోలుతీసి పెట్టుకుంటున్నారు. బూతుబొమ్మల దేవాలయాల్ని ధ్వంసం చెయ్యమని, అశ్లీల సాహిత్య ప్రబంధాలు, కావ్యాలు, పురాణాలు తగులబెట్టమనే ఉద్యమాలను మనం ఎందుకు నడపటంలేదు? ఇటీవలే ఒక వేయి సంవత్సరాలనుండి వచ్చింది ఈనాటి వక్రభాష్యం. సెక్సుజీవితాన్ని కావాలని వొదులుకున్న స్త్రీ పురుషులు ఇంద్రియ నిగ్రహం చెయ్యలేక ఎన్నో కష్టాలపాలౌతున్నారు; మరెన్నోవిధాల మానసిక క్లేశాన్ని పొందుతున్నారని మానసిక వైద్యశాస్త్రజ్ఞులు వెల్లడిస్తున్నారు.

సెక్సుకు విపరీత భాష్యాలు చెప్పే ప్రబుద్ధులూ లేకపోలేదు. సెక్సును మోక్షసాధనంగా అభివర్ణించి ప్రచారంచేసే గురువులు కోకొల్లలు. మనదేశంలో ఆశ్రమాలు నెలకొల్పి కాముక క్రీడల ద్వారా మోక్షప్రాప్తికి సోపానాలు నిర్మించిన రజనీష్‌లాంటివారు కొందరైతే; తాంత్రిక పద్ధతుల్లోని పాంచరాత్ర విధానంలో సెక్సుకు విపరీతస్థానం కల్పించేవారు మరికొందరున్నారు. ప్రస్తుత సమాజంలో మోసం, కృత్రిమం, విశ్వాసరాహిత్యం, నీతి నిజాయితీలేమి గూడుకట్టుకొని వున్నాయని తలపోస్తూ ఈ సమాజమునుండి పారిపోవాలని ప్రయత్నించే హిప్పీలు సెక్సును కేవలం సంతోష సాధనమార్గంగా వాడుతున్నారు. మత్తుపదార్థాలను సేవించడం, వావివరుసలు లేకుండా లైంగిక స్వైరవిహారం చేయడం వీరి నైజంగా మారింది. దాహంవేస్తే నీరు త్రాగినట్లు శారీరక ఉద్రిక్తతను తొలగించుకోటానికి, కామదాహం తీర్చుకోటానికి నీతినియమాలు, సమాజం అడ్డురాదని వాదించేవారూ వున్నారు. దీనినే (Drink of water theory) అని పిలుస్తారు. ఇలా వెర్రితలలు వేసే విపరీత మనస్కులు చాలామందివున్నారు. వారి సిద్ధాంతాలు అపభ్రంశాలు. అవి ఆచరణయోగ్యం కాకపోగా పెడదారిని పట్టిస్తాయి.

కామశాస్త్రం పేరు స్త్రీలసలే వినరాదు, కాని పురుషులైతే చాటుమాటుగా కొని రహస్యంగా చదివినా తప్పులేదు. మొదటి బిడ్డ ధర్మజుడని తర్వాతి బిడ్డ కామజుడని గాంధీ నిర్వచిస్తూ కాముకులైన భర్తలను నిరోధించమని స్త్రీలకు హితవు చెప్పాడు. భర్తలను నిరోధించటానికి అసలు స్త్రీలు ఇష్టపడతారా? అసలు లైంగిక ఆకర్షణ పరస్పరమనీ ఏకపక్షం కాదనీ గాంధీకి తెలియదా? అనేది మరో చిక్కుప్రశ్న. తార చంద్రుణ్ణి కామించినప్పుడు బృహస్పతి శపిస్తుంటే "నీ జీవితమంతా వ్రతములు, జపములు, తీర్థయాత్రలు, ఘోరతపస్సులతోనే గడిపావుకాని, యెన్నడైనా నాపొందు కోరావా" అని నిలదీసి అడుగుటే దానికి తార్కాణం. స్త్రీ పురుషుల భౌతిక మానసిక తృప్తికి జరిగే సృష్టికార్యం పాపమూకాదు, రహస్యమూకాదు. మునిముచ్చులనైనా, జడదార్లనైనా పరవశింపజేసేది దాంపత్యజీవితం. అదిలేని జీవితానికి పరిపూర్ణత లేదు.

ఎవరికోసం వ్రాశాను ?

"మీరేదో సంస్కరణవాదులని, అనాధలకు, ఆర్తులకు వివాహాలు చేస్తున్నారని విన్నాను. మరి నా కథ విని, నా సమస్యను సాల్వ్ చేస్తారా ? నేనిలా అడుగుతున్నానని అసహ్యించుకుంటారా? నలుగురి పిల్లల తల్లిని నేను. నా వయస్సు 24 సంవత్సరాలు. నేనొక విధవరాలను నా పెద్దపిల్లకు పది, ఆఖరి పిల్లకు ఆరేళ్ళు నిండాయి. నా భర్తపోయి ఈనాటికి అయిదేళ్ళయింది. నాకు ఇంకా సెక్సుకోరిక తీరలేదు. తీరని అశాంతి నన్ను చుట్టుముట్టి దహించివేస్తోంది. నేను పెళ్ళాడితే నా బిడ్డలకు అపఖ్యాతి కాదా, వారికి భవిష్యత్తు వుంటుందా ? అసలు నన్ను పెళ్ళాడే నాధుడు వుంటాడా ? నా గతేమిటి ? నన్నేం చెయ్యమంటారు ? నాకు మీరిచ్చే సలహా ఏమిటి ?" ఇట్లు అభ్యుదయ వివాహ వేదిక నిర్వాహకులకు ఒక అభాగ్యురాలి విన్నపము. "అలా ధైర్యంగా తనలో మండుతున్న జ్వాలాగ్నిని వెలిబుచ్చగలిగిన ఆ అభాగ్యురాలి కోరికే ఈ నవల రాయడానికి కారణమయింది. అలాంటి నిర్భాగ్యులెందరో! మరెందరో!!"

సెక్సుద్వారా స్త్రీ ఆనందాన్ని పొందాలని కోరుకోవడం తప్పా ? కేవలం సంతానప్రాప్తికోసం మాత్రమే ఆమె సెక్సు జీవితానికి అర్హురాలా? సెక్సు పేరెత్తగానే స్త్రీ సిగ్గుతో మెలికలుతిరిగిపోవాలా; ఆ మాట వింటేనే ఆమె ఉలిక్కిపడాలా; లేక భయంతో వొణికిపోవాలా; నిజానికి స్త్రీ జీవితంలో సెక్సుకు స్థానంలేదా ? సెక్సు విషయం ఆడది మాట్లాడరాదు; వినరాదు; చర్చించరాదు అనే ఆంక్షలు ఆమెకెందుకు విధించారు ? ఎవరు విధించారు ? సెక్సును పరమ గోప్యంగా వుంచక తప్పదా ? దీనికి కారణాలేమిటి ?

సెక్సును రహస్యంగా దాచాలని ఒకచెంప చెప్తూనే మరో వంక అమ్మాయికి యుక్తవయస్సు వచ్చినప్పటినుండీ ఆమెకు

సెక్సును అనుక్షణం గుర్తుచేస్తూనే వున్నారు. రజస్వల కాగానే పెద్ద సంరంభం, హడావుడి చేస్తారు. పెళ్ళితంతు సరేసరి. గర్భాదానపు మంత్రాలన్నీ సెక్సుజీవిత చిత్రణాన్ని వివరిస్తాయి. అమ్మాయి గర్భధారణ జరగగానే సూడిదలు, సీమంతాలు జరుపుతారు. ప్రసవం కాగానే బారసాల మహోత్సవాలు, ఆర్భాటాలు. ఇలా స్త్రీ జీవితంలో సెక్సును ఆమెకు అనుక్షణం గుర్తుచేసే సంఘటనలు, క్రతువులు ఎన్నో వున్నాయి. ఇక సాహిత్యపరంగా ఆలోచిస్తే సెక్సుతో మిళితమైన మువ్వగోపాల పదాలు, అష్టపదులు అమ్మాయిలచేత పాడించి; నాట్యాలు చేయించి పెద్దలు ఆహ్లాదించడంలో అర్థమేమిటో !

ఒకరకంగా ఆలోచిస్తే మన పూర్వీకులు సెక్సును నీచంగా చూడలేదు. వారు సెక్సు జీవితానికి తగినంత ప్రాధాన్యత ఇచ్చారు. మన ఋషులు ఆనందోపాసకులు; జీవితాన్ని సుఖప్రదమూ, ఫలప్రదమూ చేసుకోటానికి వారు కృషిచేశారు. సెక్సును శాస్త్రవిషయంగా గ్రహించి అధ్యయనం చేశారు. వాత్స్యాయనుని కామశాస్త్రం దీనికి తార్కాణం. మన ప్రాచీన సాహిత్యంలో, ప్రబంధాలలో స్త్రీ అంగాంక వర్ణన "పాెంచత్ భూషణ బాహుమూల రుచితో పాలిండ్లు పొంగార" పెద్దన్న మనుచరిత్రలోనూ, "వివాద ప్రోత్సిత శ్రీకుచోపరి చేలాంచలమైన వీడడు" పోతన్నగారి భాగవతంలోనూ, "కాంతూడూ, నీవు ఏకాంతమున పెనగు వేళ'' లాంటివి రామదాసు కీర్తనలలో మిక్కుటంగా వున్నాయి. వాటిని నాడేకాక నేడూ చదివి పరవశులమవుతున్నాంకదా ! ఇంత ముద్దుపళని "రాధికా స్వాంతనం" చదివి ఆనందించని రసికులున్నారా అనేది మరో శేషప్రశ్న. అలాగే జయదేవుని గీతగోవిందం పచ్చి శృంగార కావ్యం కాదా ? ఆ అష్టపదులలో నానారకాల రతిక్రీడలను దేవుని పేరుతోచిత్రిస్తే ఈనాటికీ మనం వాటినికంఠస్తం (బై హార్టు) చేస్తూనే వున్నాం కాదా ! ఎందువల్ల ? సీతా వియోగ

ప్రేమ + సెక్స్ = నీతి

"తాజావార్త! కల్నల్ కమలాకరరావుపై మేజరు గున్నేశ్వరరావు క్రిమినలు కేసు. వ్యభిచార నేరం" అని ఎనిమిదేళ్ళ కుర్రవాడు రిజర్వుబ్యాంకు ఉన్న రోడ్డుప్రక్క పేవ్‌మెంటుమీద కేకలు వేస్తున్నాడు. ఆ రోడ్డు మహారద్దీగా వుంటుంది. సికిందరాబాదునుండి నాంపల్లిమీదుగా పాతనగరం పోయే బస్సులు, కార్లు వగైరాలు, చిక్కడపల్లి ప్రాంతంనుండి అటు సనత్‌నగరు ఇటు మెహిదీపట్నం పోయే వాహనాలు ఆ రోడ్డుననేపోతాయి. బస్సుల రొదతో, కార్ల శబ్దంతో, స్కూటర్ల కూతలతో వాతావరణం చాల దుర్భరంగా ఉంటుంది. ఇంత శబ్దంలోనూ ఆ కుర్రవాని కేకలు బాటసారులను ఆకర్షిస్తున్నాయి. జనం ఎగబడి ఆ సాయంత్రం దినపత్రిక కాపీలను కొంటున్నారు.

ఆ రోడ్డుమీదనే కొండమీది వెంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్ళే సందు ఉన్నది. సందు మొదట్లో కొబ్బరికాయలు, అగరు వత్తులు, తమలపాకులు, పూలు అమ్మే దుకాణాలు చాలఉన్నాయి. జనం కొండపైకి ఒక ప్రవాహంలా వెళ్తున్నారు. అంతప్రవాహం కొండదిగి వస్తూన్నది.

రామలింగం ఆ సందులోగుండా రోడ్డుమీదికి వస్తున్నాడు. అతను స్ఫురద్రూపి, ఏభై అయిదేండ్ల వయస్సుంటుంది. ముఖాన పెద్దబొట్టు అతని సనాతనత్వాన్ని చాటుతున్నది. చేతిలో సగం కొబ్బరిచిప్పతో ముందుకు నడుస్తున్నాడు. ఆయనకు ఆరడుగుల

దూరంలో నలభైయేండ్లు పైబడ్డ స్త్రీ వస్తున్నది. చూసేవారికి ఆమె అతనిని అనుసరిస్తున్నట్లు తోస్తుంది. ఆయన మధ్య మధ్య వెనుతిరిగి ఆమెవైపు చూస్తున్నాడు. ఇంతలో పత్రికలమ్మే కుర్రవాడు రామలింగాన్ని సమీపించాడు. "తాజావార్త, తాజావార్త" అనే కేక రామలింగం దృష్టిని ఆకర్షించింది. పత్రికల అబ్బాయిని దగ్గరకు పిలిచాడు. పత్రిక చేతుల్లోకి తీసుకున్నాడు. పతాక శీర్షికను చూచాడు. దిగ్భ్రమ చెందాడు. వెంటనే పత్రిక కొన్నాడు. భార్య సౌభాగ్యమ్మనుపిలిచి ఆమెకు పత్రిక పతాక శీర్షికనుచూపించాడు. ఆమె నోరు నొక్కుకుంది. ఎంత అన్యాయం, ఎంత అవినీతి అని వాపోయింది. రామలింగం నుదుటిమీద ముడతలు పడ్డాయి, చిరాకుపడ్డాడు. త్వరత్వరగా బస్సుస్టాపు వద్దకు నడిచిపోయారు ఆ దంపతులు.

రామలింగం వర్ణాశ్రమ ధర్మాలను పాటించే బ్రాహ్మణమతావలంబి. సనాతన హిందూమతం అన్నిమతాలకంటే మహోన్నతమయిందని ఉత్కృష్టమయిందని అతని విశ్వాసం. అతని భార్య సౌభాగ్యమ్మకూడా అతని భావాలను ఆమోదించే వ్యక్తి. ఆ విషయంగా వారిరువురికి ఏనాడూ అభిప్రాయ భేదాలు రాలేదు. కాకపోతే వారిరువురికీ ఒకటే చింత, వారికి సంతానం లేదు. పుత్రుడు లేనందున పున్నామ నరకం తప్పించుకునేందుకు అవకాశాలకోసం వారు తహతహలాడుతున్నారు. ఆ ప్రయత్నంలోనే వారు రోజూ ఆ ఆలయానికి రాకపోకలు సాగిస్తూవుంటారు.

వారు కాపురముండేది లకిడికాపూల్‌వద్దనున్న ఎనిమిదిఅంతస్తుల భవనం'కిరణ్మయి' అపార్టుమెంట్సులో 303 నెంబరుప్లాటులో. రామలింగం సెక్రటేరియట్‌లో సెక్షన్ సూపరింటెండెంటు. కాస్తో

కూస్తో రోజూ చేయి తడి అవుతుంది కనుక ఫ్లాటు కొన్నాడు. సెక్రెటేరియట్‌కు దగ్గరగా ఉంది కదా అని మోజుపడి తీసుకున్నాడు. ప్రతి అంతస్తులో ఎనిమిది ఫ్లాట్సు ఉన్నాయి. ఆ బిల్డింగులో అరవై నాలుగు కుటుంబాలు కాపురముంటున్నాయి. ఆ ఆవరణలోనే మరో బిల్డింగు ఉంది. అదీ ఎనిమిదంతస్తుల భవనమే. దానిలోనూ మరో అరువదినాలుగు ఫ్లాటులు ఉన్నాయి. రవాణా ఖర్చులు కలిసివస్తాయని, ప్రయాణంచేసే కాలం కలిసి వస్తుందని ఆశపడి జనం ఆ ఫ్లాటులలో కాపురాలు చేస్తున్నారు.

బస్సుస్టాపువద్ద రామలింగం దంపతులకు ఒక దంపతుల జంట కన్పడ్డది. వారే ప్రభాకరం నళినులు. నళిని చంకలో ఏడాది బిడ్డ, ప్రభాకరం చేతిలో రెండున్నర ఏండ్ల పిల్లవాడు ఉన్నారు. వాళ్ళ వాలకంచూస్తే వాళ్ళు దైవదర్శనం చేసుకొని వచ్చినట్లున్నది. ప్రభాకరం వయస్సు రమారమి ముప్పైఏమూ డేండ్లు ఉంటుంది. అతని భార్య నళినికి ఇరవై ఎనిమిదేళ్లుంటాయి. ఆమె అందాల బొమ్మ. అతడు సాదా మనిషి. వారిరువురినీ చూచినవారికి "కాకిముక్కుకు దొండపండు"సామెత జ్ఞాపకం వస్తుంది. ప్రభాకరం నళినులు రామలింగం కాపురముంటున్న బిల్డింగులోనే అదే అంతస్తులో 301 నెంబరు ఫ్లాటులో కాపురముంటున్నారు.

రామలింగం ప్రభాకరాన్ని సమీపించి పత్రిక చూపిస్తూ "చూచావుటోయి తాజావార్తను" అని అడిగాడు.

ప్రభాకరం తన చేతిలోని ఆంధ్రపత్రికను చూపిస్తూ 'చదివాను' అన్నాడు.

సౌభాగ్యమ్మ నళినిని పలకరించింది "ఏమమ్మాయి, దైవ దర్శనం బాగా జరిగిందా ?"

"తీరికగా చూచామండీ దేవతామూర్తులను" సమాధానం చెప్పింది నళిని. రామలింగం ప్రభాకరాన్ని ఉద్దేశించి-

"ఎంత ఘోరకలి! ఈ రోజుల్లో కొంతమంది ఆడవాళ్లు మరీ బరితెగించారోయి" అన్నాడు.

"అంతగాక ఇంకేముందండీ! కాలం పూర్తిగా మారిపోతున్నది. మతం, మర్యాద మాసిపోతున్నాయి" ప్రభాకరం వెక్కిపడ్డాడు.

"మన అపార్టుమెంట్సు పేపర్లోకి ఎక్కిందోయి" అన్నాడు రామలింగం వ్యధాభారాన్ని సూచించే గొంతుతో.

"ఆ! ఆ! ఈ రకంగా మన బిల్డింగుకు ప్రచారం రావటం దురదృష్టకరం" కటకటపడ్డాడు ప్రభాకరం.

ఇంతలో బస్సు వచ్చింది. జనం కిటకిటలాడుతూ ఉన్నారు. ఆడవాళ్లు ముందువరసలో నుంచున్నారు. ఆడపిల్లలు కొంతమంది ఫుట్‌బోర్డుమీద నిలబడి ప్రయాణం చేస్తున్నారు. ఇక వెనుక ద్వారంవద్ద సరేసరి. ఫుట్‌బోర్డుపై ఒక కాలు మాత్రం పెట్టగలిగి వేలాడుతున్న మగపిల్లలు ఒక పదిమందిదాకా ఉన్నారు. బస్సు ఆగడం, ఒకజనప్రవాహం బస్సులోనుండి బయటపడటం, మరో జన ప్రవాహం బస్సులోకి చేరడం అంతా త్రుటిలో జరిగిపోయాయి. వస్తున్న బస్సును ముందుగానే గమనించిన ఈ జంటలు తమకు బస్సులో చోటు దొరకదని తీర్మానించుకొని కాలినడకన ఇల్లు చేర దల్చుకున్నారు, నడక సాగించారు. పత్రికలమ్మే కుర్రవాడు "తాజావార్తలు" అని అరుస్తూనే అక్కడ తిరుగుతున్నాడు.

2

అసెంబ్లీ దగ్గర ఉన్న పబ్లిక్‌గార్డెన్స్‌లో సాయంత్రంవేళకి అనేక రకాల వ్యక్తులు చేరతారు. ఇతరత్రా కలసికోవటానికి అవకాశం లేని ఉద్యోగస్తులు, విద్యార్థులు, పిల్లలను వెంటబెట్టుకొని గాలిపీల్చుకుందామని వచ్చే దంపతులు, ప్రశాంతంగా చదువుకోవచ్చని వచ్చే విద్యాసక్తిగలవారూ, నిరుద్యోగులూ, నిరాశ్రయులూ ఒకరేమిటి అన్నిరకాల జనం అచ్చటికి చేరుతుంది. ఏ చెట్టు ప్రక్కనో, ఏ గుబురు మూలనో, ఏ పొదరింటి ప్రక్కనో చోటుచేసుకుంటారు ప్రేయసీ ప్రియులు. పిల్లలు ఆడుకోటానికి బాగా స్థలం ఉన్నచోట మధ్యగా బైఠాయిస్తారు పిల్లలకోడు లయిన కుటుంబీకులు. కాలక్షేపం బటానీలు అమ్మేవాళ్లు, చాక్లెట్లు, పిప్పరమెంట్లూ అమ్మే పిల్లగాండ్లూ పార్కు అంతా తిరుగుతూ వుంటారు.

ఒకరోజు సాయంత్రం ఒక యువతీ, ఒక యువకుడూ ఒక గుబురు ప్రక్కన కూర్చొని మాట్లాడుకుంటున్నారు. వారు దగ్గరగా కూర్చున్నట్లే లెక్క. ఒకరిపై మరియొకరు ఒరిగిపోలేదు. కాకపోతే 'నన్ను ముట్టుకోకు' అన్నట్లుగా దూరంగా కూర్చోనూలేదు. వారిమధ్య ఉన్న ఎడం సన్నిహితత్వాన్ని సూచిస్తున్నది. కాని మమేకత్వానికి ఏదో అడ్డంకి ఉన్నట్లు తోస్తూంది.

"తాజావార్త, తాజావార్త" అనే పత్రికలమ్మే కుర్రవాని కేక వీరికి వినపడింది.

"విన్నావా తాజావార్త కేకను" అన్నాడు ఆ యువకుడు.
'తాజావార్తలు లేనిదేరోజున' అన్నది ఆ యువతి.

"ఆ తాజావార్త మనది కాదుగదా" అన్నాడు అతడు.

ఫక్కున నవ్వింది ఆమె.

ఆమె నవ్వులో శ్రుతి కలిపాడు అతడు. తమ నవ్వులు ఇతరుల దృష్టిని ఆకర్షిస్తాయేమోనని ఇద్దరూ కలవరపడి చుట్టూకలియజూచారు. ఎవరూ తమను పట్టించుకున్నట్లులేదు. స్థిమితపడి ఒకరినొకరు చూచుకొని చిరునవ్వులు చిందించారు.

"పద్మజా! నీ హాస్టలు జీవితం ఎలాగుంది?" ఏదో మాట్లాడాలికదా అని సంభాషణ ఉపక్రమించినట్లున్నది అతని ధోరణి.

"ప్రకాష్! నీ లాడ్జిలో నీ జీవితం ఎలాగుందో నాదీఅంతే" జవాబొచ్చింది పద్మజనుండి.

ఈ అనవసర సంభాషణకు వారికే నవ్వు వచ్చింది. ఇద్దరూ ఒక్కసారిగా విరగబడి నవ్వారు. అంతలో వారి ముఖాలలో విన్నదనం ప్రస్ఫుటించింది. వారి మధ్యనున్న అఖాతం వారికి దృగ్గోచరం అయి ఉంటుంది.

"ఎన్నాళ్ళీ ఒంటరి జీవితాలు" ప్రశ్నించాడు ప్రకాష్.

"మనబోటి బీదవాళ్ళకు ఒంటరిజీవితాలుగాక మరేమిదక్కుతాయి?" ఎదురు ప్రశ్నవేసింది పద్మజ.

"నిజంగా మనవి ఒంటరిజీవితాలేనంటావా?" శూన్యంలోకి చూస్తూ పలికాడు ప్రకాష్.

"ఇద్దరం ఉన్నప్పుడు మనవి ఒంటరి జీవితాలు ఎందుకు అవుతాయి? ఎందుకు కావాలి?" సూటిగా సమస్యను లేవనెత్తింది పద్మజ.

"ఆ దృష్టితో మన పరిస్థితిని ఇంతవరకూ నేను పరిశీలించ లేదు అవ్యక్తుణ్ని" అని తన అవివేకానికి తను చింతిస్తున్నట్లు మాట్లాడాడు ప్రకాష్.

ఎక్కువగా తను చొరవ చూపించానేమోనని పద్మజ కలవర పడింది. ఇంతవరకూ ఇలాంటి విషయాలలో పురుషులే చొరవతీసి కొంటున్నారు. స్త్రీలకు వాంఛలులేక కాదు.

కాని సమాజం వారి ఉత్సాహానికి ఆనకట్టలు కట్టూవచ్చింది.

వాటిని అధిగమించలేకపోతోంది స్త్రీ ప్రవృత్తి. సమాజం సాంకేతికంగా మారుతున్నది. రాజకీయ ఆర్థికరీతులు క్రొత్తవి ఉద్భవిస్తున్నాయి. కాని సంస్కృతీపరమైన భావాలు ఇంకా రాజ్యంచేస్తున్నాయి ప్రజానీకపు మనోవీధుల్లో.

తను కానిమాట అనలేదు, ఆ విషయం పద్మజకు తెలుసు. ప్రకాష్‌ను తను గాఢంగా ప్రేమించింది; ప్రకాష్‌కు పద్మజ ప్రాణం. అలాంటిసందర్భాలలో ఇరువురుకీ ఈఅజ్ఞాతవాసం ఎందుకో? ఎవరు వేసారు ఈ శిక్ష ? దీనికిగాను తామిరువురూ చేసిన నేరమేమిటి ? బీదరికం పాపమా ? బీదరికం సామాజిక జాడ్యం కాదా ?

"ప్రకాష్ ! బాధపడ్తున్నావా ?" సానుభూతిగా పలికింది పద్మజ.

"కాదు పద్మజా ! నీదేం పొరపాటు లేదు. నా కళ్లు తెరిపించావు. నాకు జ్ఞానోదయము కలుగజేశావు. నీవు నా గురువువు" ఆవేశంతో మాట్లాడాడు ప్రకాష్.

"ఎవరు గురువులో ఎవరు శిష్యులో తేలేకాలం ఇంకా రాలేదు కదా !" చిలిపిగా రిమార్కు చేసింది పద్మజ.

ప్రకాష్ ఆమె కళ్ళల్లోకి సూటిగా చూచాడు. ఆమె కళ్ళల్లో కొంటెతనం కొట్టవచ్చినట్లు కనపడింది అతనికి.

"ఈరోజు నీ మాటలు నాకు అర్థంకావటంలేదు" తన అయోమయావస్థను ఎరుకపరిచాడు ప్రకాష్.

పద్మజ ముఖాన్ని గాంభీర్యం ఆవరించింది. ఆమె చూపులు మారిపోయి ఏదో సుదూర విశ్వంలోకి ఆమె చూస్తున్నట్లున్నది. ఆమె గంభీరవదనం జగజ్జగీయమానంగా ప్రకాశిస్తున్నది. ఆ సుందర రూపానికి ముగ్ధుడైనాడు ప్రకాష్. తన్మయత్వంలో మునిగిపోయాడు. ఆమెను దగ్గరకు లాక్కుని గట్టిగా కౌగలించుకొని ముద్దుపెట్టుకున్నాడు. అంతా ఒక క్షణంలో జరిగిపోయింది. ఆ సంఘటన ఆమెకు అయిష్టమయినట్లు కన్పించటంలేదు.

అర్ధనిమీలిత నేత్రాలతో ఆమె అతని ముఖసౌందర్యాన్ని తనివితీరా చూస్తున్నది. ఆ స్థితిలో వారు ఎంతసేపు ఉన్నారో వారికే గమనంలేదు.

"తాజావార్త. క్రిమినల్ కేసు" అనే పత్రికలమ్మేవాడి మాటలు పెద్దగా వినపడ్డాయి. వారివురు విడిపోయారు. తనేదో తప్పు చేసినట్లు భావిస్తున్నాడు. ప్రకాష్ సిగ్గుతో తలవంచుకున్నాడు. ప్రకాష్ పద్మజలు ఇద్దరూ హిందువులు. హిందూ సంస్కృతి వారికి చిన్ననాటినుండి అలవడింది. శోభనం అయ్యేవరకు తన కన్యాత్వాన్ని కాపాడుకోవలసిందని కన్యకూ, అన్య స్త్రీ సంపర్కంగానీ, ఆ మాటకు వస్తే శోభనానికి పూర్వం భార్యతో సంపర్కంగాని పనికిరాదని చిన్నప్పటినుండీ వారు వింటున్న మాటలు. అలాంటప్పుడు అంటే పద్మజను తను ఇంకా వివాహమాడలేదు. ఆమె ఇంకా తనది కాలేదు; తను ఆమె మనిషికాలేదు,

ఆమెను స్పృశించడం ధర్మ వ్యతిరేకంకదా! ఈ దోష భావా లతో అతడు క్రుంగిపోయాడు.

ఈ సంఘటన తర్వాత పద్మజ ముఖం శోభాయమానంగా ప్రకాశిస్తోంది. ఆమెలో నూతనోత్తేజం ప్రవేశించింది. ఆమె మేధాశక్తి పురివిప్పి నాట్యమాడింది. క్రొంగొత్తకోర్కెలు, ఊహలు, పోహలు ఆమెలో వెలిశాయి. మరోసారి ప్రకాష్ తన్ను ముద్దాడితే బాగుండునన్నట్లున్నది ఆమె వాలకం. అలవోకగా కవ్విస్తూ పద్మజ ప్రకాష్‌వైపు చూసింది. అతని దైన్యాన్ని చూచి సానుభూతి చూపించవలసిందిపోయి విరగబడి నవ్వింది. ఆమె పకపకా నవ్వుతుంటే ముత్యాల్లా మెరిశాయి ఆమె తెల్లని పళ్లు. వేయి మల్లెలు విరిసినట్లుంది ఆ నవ్వు. లక్ష మెరుపులు మెరిసినట్లుంది. ఇంద్రధనస్సు విరిసిన ఆకాశంలాగుంది ఆమె వదనం. ఆ నవ్వుకు అదిరి పడ్డాడు ప్రకాష్. తల ఎత్తి చూచాడు.

"రా ప్రికాష్! నా ఒడిలోకి రా" అని ప్రకాష్‌ని లాక్కొని తన అక్కున చేర్చుకుంది పద్మజ. బడిలోకి రమ్మనే మాస్టారును అనుసరించిన పిల్లవాడిలా ఆమె ఆజ్ఞను పాటించాడు ప్రకాష్. పరవశంతో ఒకరి కౌగిలిలో మరొకరు ఉండిపోయారు. అలా ఎంత కాలం గడిచిందో! దగ్గు వినబడింది. పార్కులో వున్నామనే స్పృహతో విడిపోయారు వారిరువురూ.

"పద్మజా! మన పెండ్లి ఎప్పుడు?" తృళ్ళిపడుతూ లేచి అడిగాడు.

"ప్రకాష్! మనిద్దరం ఒక యిల్లు అద్దెకు తీసుకోగలిగినప్పుడు" తాపీగా జవాబు చెప్పింది పద్మజ.

"ఇంటికీ పెండ్లికీ లంకె అన్నమాట" బిక్కమొగంతో అన్నాడు ప్రకాష్.

"మరి ఇల్లు ఉన్నప్పుడేగదా నేనుఇల్లాలినయ్యేది?" లోపల బాధపడుతూ పైకి చమత్కరించింది పద్మజ.

"అయితే మన పరిస్థితి ఎల్లకాలమూ ఇంతేనా ?"

"ఎందుకవుతుంది? మనిద్దరం సంపాదించి ఇల్లు అద్దెకు తీసుకుందాం. అప్పుడు ప్రశాంతంగా వుందాం."

"అది ఏనాటికి సాధ్యమవుతుందో !"

"నా పిచ్చి ప్రకాష్, ఏమీ బెంగజెందకు. మనం ఒకేచోట కాపురం ఉండకపోయినా మనం ఆలుమగలమే" నిర్భయంగా, ఖచ్చితంగా చెప్పింది పద్మజ.

"అంటే పెండ్లిచేసుకొని విడిగా ఉందామనా నీ అభిప్రాయం" బిక్కమొగంపెట్టి జాలిగా అన్నాడు.

"అదికాదోయి వెర్రివెంగళప్పా! పెండ్లి అయితే నన్ను హాస్టలునుండి గెంటేస్తారు. కనుక పెండ్లి అయి విడిగా ఉండే ప్రసక్తేలేదు" అన్నది పద్మజ.

"ఏమో, నీ మాటలు వింటుంటే నాకు మతిపోతోంది. నన్ను అయోమయంలో ముంచేసి ఆటలాడిస్తున్నావు."

"అయితే నిదానంగా విను. మనం పెళ్ళిచేసుకున్నామనుకో: ఇల్లు అద్దెకు తీసుకొనే స్థితిరాదు. ఇల్లులేనిది ఒకేచోట కాపురముండలేము. పోనీ పెళ్ళిచేసుకొని విడిగా ఇప్పటిలాగా వుందామంటే నన్ను హాస్టల్లోనుంచి పంపేస్తారు. నేను రోడ్డుమీద

కాపురం చేయలేనుగదా! ఈ విషమస్థితినుండి తప్పించుకోటానికి ఒకటే ఒక ఉపాయం. అదేమంటే మనం పెళ్ళిచేసుకోకుండా ఇప్పటిలాగానే విడిగా నివసిద్దాం. కాని ఆలుమగలుగా ఉందాం. అంతే. ఇప్పటికైనా అర్థమయిందా మట్టిబుర్రకు" పద్మజ వివరించింది.

ప్రకాష్ మనోవీధిలో ఆలోచనలు తళుక్కున మెరిశాయి. పద్మజ మేధాసంపత్తికి మురిసిపోయాడు. ఎంత చిక్కుముడిని ఎంత తేలికగా విడదీసింది? స్త్రీని మందమతిగా అభివర్ణించిన వాడు అవివేకి. కాని తన పాడుమనస్సుకు అన్నీ అనుమానాలే! ఆమె చెప్పే విషయం ఎలా సాధ్యం?

"కాని పద్మజా! నేను ఏమంటానంటే...." ప్రకాష్ గునిశాడు.

"ఇక ప్రశ్నలకు తావులేదు. నేను కమాండర్‌ని. నీవు సైనికుడివి. నీవు నాకు విధేయతగావుండి, నా ఆజ్ఞలను పాటించాలి తెలుసా? లేకపోతే నీకు శిక్ష తప్పదు" ఆధికారికంగా పలికింది పద్మజ.

"ఏమిటో ఆ శిక్ష?" అనకుండా ఉండలేకపోయాడు ప్రకాష్.

"శిక్ష రుచి చూపిస్తే తప్ప నీకు అర్థమయ్యేటట్లు లేదు. వట్టి బండమనిషివి" అంటూ ప్రకాష్‌ని ముందుకు లాక్కొని అతని అధరం చుంబించి అతని క్రింది పెదవిమీద గాటుపెట్టింది పద్మజ.

"ఇప్పటికయినా అర్థమయిందా శిక్ష ఎలాంటిదో!" అంటూ ప్రకాష్‌ని అడిగింది పద్మజ.

"ఊఁ ఊఁ!" అంటూ తల పంకించాడు ప్రకాష్. ఇంతలో 'తాజావార్త, కల్నల్ కమలాకరరావుపై మేజరు గున్నేశ్వరరావు క్రిమినల్ కేసు; వ్యభిచార నేర ఆరోపణ' అరుస్తూ పత్రికలమ్మే కుర్రవాడు పద్మజా ప్రకాష్‌లవద్దకు వచ్చాడు.

పద్మజ పత్రిక కొన్నది. ప్రకాష్ ఆమె చేతిలోనుండి పత్రిక లాక్కొని చదివాడు.

"నీకు పెళ్ళి అయివుంటే నీ భర్త నామీద ఇలాగే కేసు పెట్టే వాడుకదా!" ప్రకాష్ ప్రశ్నార్థకంగా మాట్లాడాడు.

"అందుకేగా నేను పెండ్లి చేసుకోవడంలేదు" కిలకిలానవ్వింది పద్మజ.

ఆమె నవ్వు గూళ్ళకుచేరే పక్షుల కిలకిలారావాలతో కలసి పోయింది.

3

సాయంత్రం అయిదున్నర గంటలయింది. 'హల్లో పద్మినీ, సినిమాకు పోదాం వస్తావా?' అంటూ 304 నెంబరు ఫ్లాటులోకి ఒక యువకుడు ప్రవేశించాడు. అతనికి ముప్పై ఏండ్లు ఉంటాయి. మంచి కండలు తిరిగిన శరీరం. అందమైన ముఖం, తీర్చిదిద్దిన కనుముక్కుతీరు, విశాలమైన ఛాతీ, అతడు సుందరాకారుడన టంలో సందేహం లేదు.

"సూర్యారావా! రావోయి, కూర్చో. ఇప్పుడే వస్తాను. మరి

ఏం పుచ్చుకుంటావ్ స్టాఫుడిర్రింకు, ఆరంజి, పైనాపిల్, బాదాం ఏం కావాలి ?" అన్నది పద్మిని.

"థాంక్యూ, నాకేమీ అక్కరలేదు స్టాఫ్టడ్రింక్సు" అన్నాడు సూర్యారావు. వెంటనే ఆమె తన గదిలోకి వెళ్ళింది. ఆమెకు పాతికేళ్ళ వయస్సుంటుంది. రంగు అంతగా లేదు. కాని ఆమె కళ్ళల్లో ఏదోఅనిర్వాచ్యమైన ఆకర్షణ ఉంది. కాకపోతే తీర్చిదిద్దిన శిల్పంలా ఉంటుంది ఆమె విగ్రహం.

సూర్యారావు రాకను గమనించాడు నలుబదేండ్ల నడివయసు మనిషి. ఆతడు అనాకారికాడు కాని అందగాడని చెప్పడం కష్టం సన్నకళ్ళూ, విశాలమైన నుదురూ, కురచకాళ్ళూ ఇవి అతని ఆకార విశేషాలు. అతడే వెంకటారావు. అతగాడు పద్మిని భర్త. వెంకటారావు సూర్యారావును పలుకరించలేదు. సూర్యారావు వెంకట్రావు ఉనికిని గుర్తించనే లేదు. వెంకట్రావు తన గదిలోకి వెళ్ళిపోయాడు.

పది నిమిషాలయిన తర్వాత పద్మిని మేకప్ చేసుకొని వచ్చింది. ఆమె అచ్చం అప్సరసలాగుంది. సూర్యారావు ఆమెను చూశాడు. ఆమెను తను ఎంతకాలంగానో చూస్తున్నా, ఈరోజు ఆమె ఏదో అపురూపంగా కన్పడింది అతనికి. తదేక దృష్టితో ఆమెను చూస్తూ సోఫాలో కూర్చున్నాడు.

"ఏమిటి ! చూపులతోనే నన్ను మింగేస్తావా ?" అని కవ్వించింది పద్మిని.

"అంతటి అదృష్టమా నాకు" సూర్యారావు గొంతు పలికింది.

"ఎంతకూ తృప్తి ఉండదు ఈ మగాళ్ళకు" ఆదోలా చూసింది పద్మిని.

"ఊఁ ఊఁ!" అంటూ తల పంకించాడు ప్రకాష్. ఇంతలో 'తాజావార్త, కల్నల్ కమలాకరరావుపై మేజరు గున్నేశ్వరరావు క్రిమినల్ కేసు; వ్యభిచార నేర ఆరోపణ' అరుస్తూ పత్రికలమ్మే కుర్రవాడు పద్మజా ప్రకాష్‌లవద్దకు వచ్చాడు.

పద్మజ పత్రిక కొన్నది. ప్రకాష్ ఆమె చేతిలోనుండి పత్రిక లాక్కొని చదివాడు.

"నీకు పెళ్ళి అయివుంటే నీ భర్త నామీద ఇలాగే కేసు పెట్టే వాడుకదా!" ప్రకాష్ ప్రశ్నార్థకంగా మాట్లాడాడు.

"అందుకేగా నేను పెండ్లి చేసుకోవడంలేదు"కిలకిలానవ్వింది పద్మజ.

ఆమె నవ్వు గూళ్ళకుచేరే పక్షుల కిలకిలారావాలతో కలసి పోయింది.

3

సాయంత్రం అయిదున్నర గంటలయింది. 'హల్లో పద్మినీ, సినిమాకు పోదాం వస్తావా?' అంటూ 304 నెంబరు ఫ్లాటులోకి ఒక యువకుడు ప్రవేశించాడు. అతనికి ముప్పై ఏండ్లు ఉంటాయి. మంచి కండలు తిరిగిన శరీరం. అందమైన ముఖం, తీర్చిదిద్దిన కనుముక్కుతీరు, విశాలమైన ఛాతీ, అతడు సుందరాకారుడన టంలో సందేహం లేదు.

"సూర్యారావా! రావోయి, కూర్చో. ఇప్పుడే వస్తాను. మరి

ఏం పుచ్చుకుంటావ్ స్ట్రాబెర్రీ, ఆరంజి, పైనాపిల్, బాదాం ఏం కావాలి ?" అన్నది పద్మిని.

"థాంక్స్యూ, నాకేమీ అక్కరలేదు స్టాఫ్టడ్రింక్స్" అన్నాడు సూర్యారావు. వెంటనే ఆమె తన గదిలోకి వెళ్ళింది. ఆమెకు పాతికేళ్ళ వయస్సుంటుంది. రంగు అంతగా లేదు. కాని ఆమె కళ్ళల్లో ఏదోఅనిర్వాచ్యమైన ఆకర్షణ ఉంది. కాకపోతే తీర్చిదిద్దిన శిల్పంలా ఉంటుంది ఆమె విగ్రహం.

సూర్యారావు రాకను గమనించాడు నలుబదేండ్ల నడివయసు మనిషి. ఆతడు అనాకారికాడు కాని అందగాడని చెప్పడం కష్టం సన్నకళ్ళూ, విశాలమైన నుదురూ, మరచకాళ్ళూ ఇవి అతని ఆకార విశేషాలు. అతడే వెంకట్రావు. అతగాడు పద్మిని భర్త. వెంక ట్రావు సూర్యారావును పలుకరించలేదు. సూర్యారావు వెంకట్రావు ఉనికిని గుర్తించనే లేదు. వెంకట్రావు తన గదిలోకి వెళ్ళిపో యాడు.

పది నిమిషాలయిన తర్వాత పద్మిని మేకప్ చేసుకొని వచ్చింది. ఆమె అచ్చం అప్సరసలాగుంది. సూర్యారావు ఆమెను చూశాడు. ఆమెను తను ఎంతకాలంగానో చూస్తున్నా. ఈరోజు ఆమె ఏదో అపురూపంగా కన్పడింది అతనికి. తదేక దృష్టితో ఆమెను చూస్తూ సోఫాలో కూర్చున్నాడు.

"ఏమిటి ! చూపులతోనే నన్ను మింగేస్తావా ?" అని కవ్విం చింది పద్మిని.

"అంతటి అదృష్టమా నాకు" సూర్యారావు గొంతు పలికింది.

"ఎంతకూ తృప్తి ఉండదు ఈ మగాళ్ళకు" అదోలా చూసింది పద్మిని.

"ఆశ ఎవరికైనా పుట్టుంది నీబోటి వాళ్ళను చూస్తుంటే" తనది తప్పుకాదని సమర్థించుకుంటున్నాడు సూర్యారావు.

"చాల్లే నీ కబుర్లు, వట్టిగొడ్డుకు అరుపులు ఎక్కువ" ఎగతాళి చేసింది పద్మిని.

"నేను వట్టిగొడ్డునుకాను, సర్కస్ జంతువును, నీవు రింగు మాస్టరువు" నవ్వాడు సూర్యారావు. అతని నవ్వులో తన నవ్వు కలిపింది పద్మిని. ఈ నవ్వులు విని వెంకట్రావు తన గదిలోనుండి డ్రాయింగు రూములోకి వచ్చాడు.

"ఏమండీ! నేను సూర్యంతో సినిమాకు వెడుతున్నాను. నేను డిన్నరుకు రాలేను. మీరు నా కోసం వెయిటు చేయకుండా భోంచేయండి" భర్తకు ఆజ్ఞలు జారీచేసింది పద్మిని. సూర్యారావు లేచాడు. పద్మిని తనచేయి అతనికి అందించింది. ఒకరి చేయి ఒకరు పట్టుకుని ఫ్లాటులోనుండి కారిడారులోకి వచ్చారు నవ్వు కుంటూ. ప్రక్కనున్న 303 నెంబరు ఫ్లాటు తలుపు తెరుచుకుంది. రామలింగం బయటకు వచ్చి ఈ జంటను చూస్తూ నిలబడ్డాడు వెంకట్రావు ఫ్లాటుకు మరోప్రక్కనున్న 305 నెంబరు ఫ్లాటు తలుపు తీశారు ఎవరో. నలుబది ఏండ్ల స్త్రీ వాకిట్లో నిల్చుంది. ఆ ప్రక్కనే ఉన్న 306 నెంబరు ఫ్లాటు తలుపు తీసిన చప్పుడయింది. ముప్పదేండ్ల మహిళ కారిడరులోకి వచ్చింది. తన ఫ్లాటువాకిట్లోనుంచొని వెళ్తున్న పద్మినీ సూర్యారావులను తదేక దృష్టితో జూస్తున్న వెంకట్రావు కూడా వీళ్ళ కంటపడ్డాడు, చిరునవ్వులతో వారందరూ తలుపులు వేసుకున్నారు. వెంకట్రావు నిట్టూర్చాడు. పద్మినీ సూర్యారావులు లిఫ్టుదిగి వెళ్ళిపోయారు.

సినిమాహాలులో బాక్స్‌కు టిక్కెట్లు కొన్నాడు సూర్యారావు. ఇద్దరూ బాక్స్‌లో కూర్చున్నారు. హాలులో దీపాలు ఆరిపోయాయి. తెరమీద అడ్వర్‌టైజుమెంటు ఫిల్ములు వస్తూపోతూ ఉన్నాయి.

"పద్మినీ" అంటూ సోఫాలో ఆమె దగ్గరకు జరిగాడు సూర్యారావు.

"సూర్యం" అంటూ ఆతని మెడలో చేతులు వేసింది పద్మిని. అలా అరగంటసేపున్నా వారికి అది క్షణంగా తోచింది. అసలు ఫిలిం వచ్చింది. అది అహల్య కధ. కోడి 'కొక్కరొకో' అని కూసింది. గౌతముడు కాలకృత్యాలు తీర్చుకోటానికి నదీ తీరానికి వెళ్ళాడు. వెంటనే ఇంద్రుడు ప్రవేశించాడు గౌతమ రూపంలో.

"మన కధే చూడటానికి వచ్చాం" అన్నాడు సూర్యారావు.

"మా ఆయనను మోసంచేసి నీవు ఇంట్లోకి రాలేదుగా! రాజమార్గాన్నే వచ్చావు" తేడా తెలియచెప్పింది పద్మిని.

"అది నా అహల్య నాకిచ్చిన ధైర్యం" గర్వంగా పలికాడు సూర్యారావు.

"నీ పద్మిని పిరికిపంద కాదోయి సూర్యం" నిబ్బరంగా మాట్లాడింది పద్మిని.

"ఆ ధైర్యం ఎంతకాలముంటుందో చూద్దాం" అంటూ ఆమెను వాటేసుకుని కౌగలించుకున్నాడు సూర్యారావు.

"నీవు జీవించి ఉన్నన్నాళ్ళూ నీకే అడ్డూ వుండదుసూర్యం" తన స్వతంత్రతను చాటింది పద్మిని.

వారు సినిమా చూడటం మానేసి ఎంతోసేపయింది. ఒకరి కళ్ళల్లోకి మరొకరు చూస్తూ ఒకరి ఒడిలోకి మరొకరు ఒరిగిపోతూ

కాలం వెళ్ళబుచ్చారు. సినిమా అయిపోయింది. హాలులో లైట్లు వెలిగాయి. జనం బయటికి కదులుతున్నారు.

"జనాన్ని పోనీండి బాబూ! ఆ వాసన నేను భరించలేను" తన అసహ్యాన్ని వెలిబుచ్చింది పద్మిని.

హాలులోనుంచి బయటికివెళ్ళే జనం బాగా పల్చబడ్డది.

పద్మినీ సూర్యారావులు బయటికి వచ్చి ఆటోరిక్షా ఎక్కి ఆబిడ్స్‌లోవున్న త్రీఏసెస్ రెస్టారెంట్‌కి వెళ్ళారు. హాలులో మూల నున్న ఒక టేబుల్‌ను సెలెక్టు చేశాడు సూర్యం. ఆమెను అక్క డకు తీసికొని వెళ్ళి కూర్చోబెట్టాడు. లైటింగు చాలా తక్కువగా ఉంది. అది ఈనాటి ఫాషను. ఆ మిణుగురు వెలుతురులో కూర్చు న్నారు వారిరువురూ. ఒకరిపై ఒకరు దృష్టులు సారించుకుంటూ.

బేరర్ దగ్గు వారిని ఈ ప్రపంచంలోకి తెచ్చింది. తనకు విస్కీ, ఆమెకు జిన్ ఆర్డరిచ్చాడు. బేరర్ అవి తెచ్చి ఇచ్చాడు. కారపుబూందీ, వేయించిన వేరుసెనగ బద్దలూ బల్లమీద పెట్టాడు బేరర్. తీరికగా మత్తుపానీయాలు పుచ్చుకుంటున్నారు.

"పద్మినీ! ఇలా ఎంతకాలం మనం తిరగాలి?" సమాధానం కోసం ఆమె కళ్ళలోకి చూశాడు సూర్యారావు.

"సూర్యం! ఏమిటి నీ పిచ్చి ఆలోచనలు! మనిద్దరి మధ్య అడ్డువచ్చేవాడు ఈ ప్రపంచంలో లేడు. ఇప్పుడు నీకేం తక్కు వయింది?"

"పద్మినీ! నేను అనేది అదికాదు. నీవు నా యింట్లో నా కళ్ళముందు ఎప్పుడూ మెలగాలని నేను కోరుకుంటున్నాను అది తప్పా? క్షణంకూడా నీ ఎడబాటును సహించి బ్రతకలేనని నీకు తెలియదా?"

"సూర్యం! మీ మగాళ్ళ వరసే అంత. వాళ్ళకు అందిన ఆనందాన్ని అనుభవించలేరు. ఎంతసేపూ ఇంకోడిని చూసి అసూయపడతారు" చీవాట్లు పెట్టినంతగా వ్యాఖ్యచేసింది పద్మిని.

ఉలిక్కిపడ్డ సూర్యారావు పద్మిని మనస్తత్వాన్ని నెమరు వేసుకున్నాడు.

ఆమె సర్వస్వతంత్ర ప్రవృత్తి అతనికి కాలేజీరోజులనుండి చిరపరిచితమే. ఆమె కలవారి పిల్ల. ఆమె కోరింది ఏదయినా సరే ఆమె కాళ్ళదగ్గరకు వచ్చి వ్రాలేది. కాలేజీలో ఎందరో మగ విద్యార్థులు ఆమె దృష్టిని ఆకర్షించాలని తాపత్రియపడేవారు. ఆమెకు ఇష్టం లేనివాళ్ళను పురుగులకన్నా హీనంగా చూసేది. తన కిష్టమైన వాళ్ళను దగ్గరకు చేర్చేది. ఎవరో ఏదో అనుకుంటారని ఇతరులు తన్నుచూచి నవ్వుకుంటున్నారనే భయం ఆమెకు ఏనాడూ లేదు. అలా ఆమెకు చేరువయిన వాళ్ళలో సూర్యారావు ఒకడు. అమెరికాలో పదేండ్లు ఉద్యోగం చేసి తనదేశంలో వ్యాపారం పెట్టాలని వచ్చిన వెంకట్రావు పద్మిని కుటుంబానికి దూరపు చుట్టం. ఆమెను చూసి, ఆమె స్వతంత్ర ప్రవృత్తిని గమనించి వెంకట్రావు ఆకర్షితుడయ్యాడు. ఆమెను తనకిచ్చి పెళ్ళి చేయమని ఆమె తల్లిదండ్రులను కోరాడు. వారామెను సంప్రతించారు. ఆమె వెంకట్రావుతో మాట్లాడి 'సరే' అంది. అందరూ ముక్కుమీద వేలేసుకున్నారు నలుబడి ఏండ్ల పెండ్లికొడుకు అని. పెండ్లికి అందరూ స్నేహితులులాగే సూర్యారావుకూడా వెళ్ళాడు. సూర్యారావు ఒక్కడే హైద్రాబాద్‌లో మిగిలిపోయిన ఆమె స్నేహితుడు.

"పెండ్లిలో పద్మిని పలకరించింది సూర్యారావును. "కనప పట్టాండవోయి కాలక్షేపానికి" అని హెచ్చరించింది పద్మిని.

అప్పటినుండి రాకపోకలు సాగిస్తున్నాడీ సూర్యారావు. వెంకట్రావు అభ్యంతర పెట్టలేదు అతనిని. కాకపోతే అతనిని పలకరించనూలేదు. వెంకట్రావు ప్రవృత్తి అర్థంకాలేదు సూర్యారావుకు. ఈ ఆలోచనలతో తలనొప్పి తెచ్చుకోవడం అతనికి ఇష్టంలేక పోయింది.

గ్లాసులు ఖాళీ అవుతున్నాయి. బేరర్ గ్లాసులు నింపుతున్నాడు. నాల్గు రౌండ్లు తిరిగాయి. ఇద్దరికీ బాగా మైకం తలకెక్కింది. డిన్నరుకు ఆర్డర్ యిచ్చిన పదార్థాలను వదిలివేసి లేచారు ఇద్దరూ. సూర్యం చెక్కు దస్కతు చేశాడు. పద్మిని అడుగులు తడబడుతున్నాయి. ఆమెకు చేయి అందిచ్చి ఆమెను ఆటో ఎక్కించి తను ప్రక్కన కూర్చున్నాడు. ఆటో అపార్టుమెంట్సుకు చేరింది. లిఫ్టు ఎక్కించి ఆమెను 3వ అంతస్తులోకి తెచ్చాడు సూర్యారావు. పద్మిని అడుగులు తడబడ్తున్నాయి.

"మైడియర్ సూర్యం ఇదిగో తాళంచెవి. ఫ్లాటు తలుపు తీయి" అంటూ పెద్దగా అరుస్తున్నది ఆమె. పద్మిని చేతిలో హాండ్‌బ్యాగ్ పట్టుతప్పి నేలమీద పడింది. ఆమెకూడా నేలమీద కుప్పకూలింది ఒక్కసారిగా. ధబోలుమని శబ్దమయింది. ప్రక్క ఫ్లాటులో రామలింగం, మరో పక్కఫ్లాటులో రుక్మిణమ్మ తలుపులు తీసుకొని బయటకు వచ్చారు. సూర్యారావు ఫ్లాటు తలుపులు తెరిచాడు పద్మిని యిచ్చిన తాళపుచెవి సాయంతో. ఆమెను అమాంతం ఎత్తుకొని డ్రాయింగ్ రూము సోఫాలో పడుకోబెట్టాడు. ఆమె స్పృహలో లేదు; ఇంతలో వెంకట్రావు డ్రాయింగురూము

లోకి వచ్చాడు. అతడి రాకను గమనించాడు సూర్యారావు. వెంటనే తలుపు మూసి బయటికి వెళ్ళిపోయాడు.

వెంకట్రావు ఆమె దుస్తులు మార్చి ఆమెను బెడ్‌రూంలోకి మోసుకొని వెళ్ళి బెడ్‌మీదకి చేర్చాడు.

4

మర్నాడు ఉదయం రామలింగానికి కాఫీ అందిచ్చింది సౌభాగ్యమ్మ. అప్పటికి అతడు పూజా పునస్కారాలు పూర్తిచేసుకున్నాడు.

"సౌభాగ్యం నిన్న ఏం జరిగిందో తెలుసా? నీవు నిద్రపోతున్నావు అపుడు" ఆమె కుతూహలాన్ని రేకెత్తించే పద్ధతిలో.

"ఏమండీ! ఏం జరిగిందేమిటి? అంత విడ్డూరమా? లేక ఘోరకలా? ఎక్కడ? ఎవరికి? ఏమిటో చెప్పండి చంపక" ప్రాధేయపడింది సౌభాగ్యమ్మ.

"మన ప్రక్క ఫ్లాటులోవున్న పద్మిని వెంకట్రావులు తెలుసుగా నీకు" కనురెప్పలెగరేస్తూ ముసిముసి నవ్వులు నవ్వాడు.

"అదేమిటండీ అంత విడ్డూరంగా మాట్లాడుతున్నారు. ప్రక్క ఫ్లాటులోని ఆ కోకిలా పిల్లేగా పద్మిని. ఆమె నాకు బాగా తెలుసు ఎప్పుడూ కళకళలాడుతూ ఉంటుంది."

"కళకళలాడదూ మరి, రంకు సాగుతుంటే."

"అదేమిటండీ అప్రాచ్యపు మాటలు. మీ మగాళ్ళ వద్దతే అంత. కాస్త ఆడది నవ్వుతూ పేలుతూ ఉంటే చూడలేరు."

"మధ్య నామీద ఎందుకే విరుచుకుపడతావు, ఆమె భర్త వెంకట్రావు కళ్లు మూసుకున్నట్లుగా నన్నూ కళ్లు మూసుకో మంటావేమిటి ?" హాస్యోక్తి విసిరాడు.

"అయితే యింతకూ మీరనేది ఆ అమ్మాయి పరాయి మగాడితో తిరుగుతున్నదనేగా ?"

"తిరగడం ఏమిటీ ? గెంతుతూందంటాను. అక్కడ అది కాదు అసలు విషయం. ఆ భర్త ఎలా సహించి ఊరుకున్నాడంట అదీ నా అనుమానం."

"ఏమోనండీ ! మీ మాటలు నేనునమ్మలేను. ఆ అమ్మాయి, ఆమె మొగుడు ఎంత ఆప్యాయంగా ఉంటారో మీరే చూస్తే తెలుస్తుంది. చెట్టాపట్టాలేసుకొని ఎంచక్కా సినిమాకు వెళ్తారు, పార్కుకు పోతారు. నవ్వుకుంటూ పరాచకాలాడుకుంటూ ఇంటికి వస్తూంటారు. మీరుచెప్పేదంతా చోద్యంగా వుంది."

"నువ్వు చెప్పిందంతా నిజమేననుకో! నేను కాదనను. కాని మరి అది తిరిగే తిరుగుడు అదేనే నాకు అర్థంకానిది. ఆ పద్మినిని వెంకట్రావ్ ఎలా సహిస్తున్నాడో ఏమో ! ఆ మాటకొస్తే ఆ గున్నేశ్వరరావే నయం. పెండ్లాన్ని తన్ని తరిమేసి ఆమె మిండగాడి మీద కేసుపెట్టాడు. అదీ మగతనం అంటే."

"మీరు మెచ్చుకోవాలి ఆ గున్నేశ్వరరావు వ్యవహారం. సరి పోయింది. ఆ కమలాకరరావును తన యింటికి ఆహ్వానించింది తను. తన భార్య నీరజకు పరిచయం చేసింది అతను. వాళ్ళ స్నేహం పెరగడానికి అవకాశం యిచ్చింది ఆయనే. ఇప్పుడుపెద్ద పత్తిత్తులాగ కేసు పెడతాడా! ఏం మగాళ్ళండీ!" ఎద్దేవగాఅన్నది.

"అదికాదే ! మగాడన్న తరువాత పరువూప్రతిష్టా ఉండాలా అక్కరలేదా ?" కోపంతో అన్నాడు రామలింగం.

"ఆ పరువేమయిపోయిందండీ పెళ్ళాన్ని తన పై ఆఫీసరుకు జతకలిపినప్పుడూ'' హేళన ధ్వనితో అడిగింది.

"నీవెప్పుడూ ఇంతే ! చటుక్కున ఎదురుతిరిగి కూర్చుంటావు."

"ఇంతకూ నేను కానిమాట ఏమన్నానండి ?"

"అయితే నీరజ చేసిన పని మంచిదంటావా ? పద్మిని ఆ సూర్యారావుతో షికార్లు వెళ్ళడం సబబేనంటావా ? పోనీ, నీవే తేల్చిచెప్పు."

"అలా రండి దోవకు. మగాళ్ళు ఎన్ని పోకిళ్లు పోయినా ఎంత చెడతిరిగినా వంశ గౌరవమూ, పరువూ ప్రతిష్ట ఆడదాని మీది ఆధారపడతాయండీ. అదే తరతరాల భారత సంస్కృతి మనకు నేర్పింది" సౌభాగ్యం అన్నది.

''అయితే పద్మినిది తప్పంటావు."

"కాదని వేరే చెప్పాలటండీ ? నిక్షేపంలాంటి మొగుడింట్లో ఉంటే వెలిచవి మరగడం ఎందుకండీ ఈ వాజమ్మలు."

"మనం ఈ అపార్టుమెంట్సులో ఈ అంతస్తులో వచ్చి పడ్డాం. అంతా రభసగా ఉంది. 302 నెంబరు ఫ్లాటులో గున్నేశ్వరరావు గోల, 304 నెంబరు ఫ్లాటులో పద్మిని రభస. అటు ఆ 306 నెంబరులో ఆ సావిత్రమ్మ మగాళ్ళను నమిలి మింగేస్తున్నట్టు చూస్తుంది, ఛీ, ఛీ చివరికి ఈ మురికికూపంలో పడ్డాం తెలియక వచ్చి."

"ఏమండీ! నాకు తెలియక అడుగుతాను. ఎంతో లక్ష ణంగా పూజా పునస్కారాలు పూర్తిచేసుకున్నారు, కొండంతపుణ్యం సంపాదించుకున్నారు. ఈవేళ ఎందుకండీ మీకు ఈ రంకు పురాణం."

"అయితే చుట్టూ మురికి వాసన కొట్టూంటే ముక్కు మూసు కొని ఎలా కూర్చోవడం?"

"అదా మీ బాధ. ముక్కు మూసుకొని, కళ్లు మూసుకొని ఇంట్లోనుంచి బయటకు పొండి, మళ్ళీ బిల్డింగులో అడుగుపెట్ట గానే అలాగే సరాసరి మన ఫ్లాటులోకి రండి."

"ఇదేం దాగుడుమూతల ఆట అనుకొన్నావా? చిన్ననాడు కనుక ఆ ఆటలు ఆడేం. ఇప్పుడు కుదరదు?"

"అయితే నన్ను ఒకమాట చెప్పమంటారా."

"అనదల్చుకుంది అనేసెయ్యి, ఆలస్యమెందుకు?"

"వెనుకటికి ఓ కథ చెప్పేవారు. ఒక వారకాంత యింటికి ఎదురుగా ఒక సన్యాసి నివశించేవాడట. వారకాంత పాపంచేస్తు న్నదని బాధపడుతూ ఆమె దగ్గరికి విటుడు వచ్చినపుడల్లా ఒక చిన్న గులకరాయి ప్రక్కన వేసేవాడట. కొన్ని సంవత్సరాలకు అక్కడ పెద్ద గుట్ట తయారు అయిందట. వారకాంత చనిపోతూ భగవంతుణ్ని ప్రార్థించి 'నారాయణ, నారాయణ' అంటూ చని పోయిందట. కొద్దిరోజులకు సన్యాసికూడా చనిపోయాడట. వార కాంతను స్వర్గానికి చేర్చారట దేవదూతలు. సన్యాసిని నరకానికి తీసుకువెళ్ళారట యమదూతలు. విన్నారా సొంతం కథను" రెట్టిం చింది సౌభాగ్యమ్మ.

"ఇంతకూ మళ్ళీ ఊసు పట్టించుకోకుండా వుండమంటావు నన్ను. ఏమోనబ్బా నాకు నచ్చటంలేదు నీ ధోరణి. ఏమైనా ఆ గున్నేశ్వరరావుకు సాయంచెయ్యాలనుకుంటున్నాను" రోషంతో అన్నాడు.

"సరే మీ యిష్టం వచ్చినట్లు చేసుకోండి. ఒక్కటి నేను కోరేది. మీ మగాళ్లు మాత్రం మా ఆడవారి పూజా పునస్కారాలకు పతివ్రతా ధర్మానికీ అడ్డురాకండి. అదే పదివేలు."

"అదేనే నేను చెప్పేది; నేను చేసేదికూడా అదేనే. నీవు చెప్పింది కాదంటానా ?" తన గొప్పతనాన్ని చాటుకున్నాడు రామలింగం.

వెంకట్రావు ఫ్లాటుకు ఒకప్రక్క రామలింగం, మరోప్రక్క మోహనరావు ఉంటున్నారు. మోహనరావుది 305 నెంబరు ఫ్లాటు. రుక్మిణి అతని భార్య. ఆమెకు నలుబది ఏండ్లుంటాయి. దబ్బపండు లాంటిఛాయ, మిలమిలమెరుస్తున్న దేహకాంతి. ముగ్గురుబిడ్డలతల్లి అయినా బిగువుచెడని శరీరం. చెంపకు చేరడేసి కళ్ళు. ఆ అపార్టుమెంట్సులోని మొత్తం ఆడవాళ్ళలో ఆమె అందగత్తెయని చెప్పుకుంటారు. 301 నెంబరు ఫ్లాటులోని నళిని సుందరి క్రింద లెక్క. కాని రుక్మిణి అందం ముందు నళిని ఆగదు.

రుక్మిణి ఎప్పుడో ఒకప్పుడు తప్ప ఇల్లువిడచి బయటికి వెళ్ళినట్లు కన్పడదు. పిల్లలకు పోషణ, చదువు చెప్పడం, విద్యాబుద్ధులు గరపటం ఏమోకాని ఆమెకు ఇరుగిండ్లకూ పొరుగిండ్లకూ పోవటానికి తీరిక సమయమే దొరకదు.

మోహనరావు చిన్న వ్యాపారం చేస్తున్నాడు. ఉన్నంతలో

భార్య రుక్మిణికి పిల్లలకు లోపంలేకుండా వాళ్ళను పోషిస్తున్నాడు. రుక్మిణి అంటే అతనికి మంచిప్రేమ, అభిమానం కూడాను. అంతే కాదు గౌరవమూను. ఆమె అతని పిల్లల తల్లి, మరోరకంగా చెప్పాలంటే ఆమె అంటే అదోరకమైన భక్తికూడా లేకపోలేదు.

మోహనరావు ఆఫీసులో చిత్రావతి అనే పడుచు అతని సెక్రటరీ. ఒకరోజు సాయంత్రం ఆరుగంటలకు చిత్రావతిని వెంటబెట్టుకొని ఇంటికి వచ్చాడు మోహనరావు. భార్యను పిలిచి తన సెక్రటరీకూడా తన ఇంట్లోనే భోజనం చేస్తుందని చెప్పాడు. రుక్మిణి తల ఊపింది. డ్రాయింగురూంలోకూర్చుని మోహనరావూ, చిత్రావతి ఆఫీసు పని చూచుకొన్నారు. తొమ్మిది గంటలకు భోజనాలు చేశారు. పిల్లల గదిలో చిత్రావతికి పడకను ఏర్పాటు చేయమనీ, పిల్లలను డ్రాయింగురూంలో పడుకోపెట్టవలసిందనీ, తనూ చిత్రావతీ ప్రొద్దుపోయేవరకు పిల్లల గదిలో ఆఫీసు కాగితాలు వ్రాసుకుంటామనీ మోహనరావు చెప్పాడు. అలాగే ఏర్పాటు చేసింది రుక్మిణి. పిల్లలను డ్రాయింగురూంలో పడుకోబెట్టి తను తన గదిలోకి వెళ్ళింది రుక్మిణి.

మోహనరావు చిత్రావతులు పిల్లలగదిలో కూర్చుని ఆఫీసు పని చూసుకుంటున్నారు, లైటు వెలుగుతూ వుంది. పదకొండు గంటలయింది. రుక్మిణి నిద్రలోకి జారుకున్నది.

రుక్మిణి నిద్రలేచేటప్పటికి తెల్లవారుజామున అయిదుగంటలయింది. ప్రక్క మంచంమీద భర్తమోహనరావులేడు. డ్రాయింగు రూములోకి వచ్చింది, పిల్లలు గాఢనిద్రలో వున్నారు. వాకిలి తలుపు ఓరవాకిలిగా వేసివుంది. రాత్రి పడుకొబోయేటప్పుడు

వాకిలి తలుపు వేయడం మర్చిపోయాడేమో తన భర్త అని భావించింది. వంట ఇల్లు, భోజనాల ప్రదేశం, డ్రాయింగురూము తన గది అన్నీ కలయజూచింది. ఏమీ సామానులు పోలేదు. ఇదంతా అదృష్టమనుకుంది. పిల్లలగది తలుపు సగం తీసివుంది. ఆమెకు లేనిపోని అనుమానం పట్టుకున్నది, తన భర్త ప్రొద్దున్నే లేచి బయటికి ఎందుకు వెళ్ళినట్లు! మామూలుగా ఏడు గంటల లోపున లేవడే? అదీగాక క్రితం రాత్రి పొద్దుపోయిందాకా ఆఫీసు పని చూసుకొన్నాడుగదా! సరే! సంకోచాన్ని సంబాళించుకొని పిల్లల గదిలోకి చూచింది. పడకమీద భర్త ఒక్కడే ఉన్నాడు. ఆమె మనస్సు కీడు శంకించింది. మనస్సు పరిపరివిధాల పోయింది. గదిలో ప్రవేశించింది. భర్తదగ్గరకువెళ్ళి పరిశీలించింది. అతడు ఉచ్ఛ్వాస నిశ్వాసాలు చేస్తున్నాడు. అమ్మయ్యా! అనుకొంది. తన మెళ్లో ఉన్న మంగళసూత్రం తీసి కళ్ళకు అద్దుకుంది. మళ్ళీ గది అంతా ఒకసారి కలయజూచింది. భర్త నిద్రిస్తున్న పరుపుమీద అణిగిపోయిన మల్లెపూలు కనపడ్డాయి. ఘుమఘుమ అత్తరువాసనవచ్చింది. అస్తవ్యస్తమైనగూడకట్టుతో పడివున్నాడు పరుపుమీద. రుక్మిణి బుర్రలో తళుక్కున మెరిసింది ఒక ఆలోచన. ఆయన సెక్రటరీ ఈ గదిలోనే కాలక్షేపం చేసింది తన భర్తతో. తనకు ముఖం చూపలేక ప్రొద్దున్నే ఇల్లు విడిచివెళ్ళి పోయింది. ఇది గ్రహించిన రుక్మిణికి తన కాళ్ళక్రింద ఎవరోమట్టి తొలుస్తున్నట్లు, తను అగాధంలో పడిపోతున్నట్లు తోచింది. ఎంతో కష్టంమీద ఆమె డ్రాయింగురూములోకి వచ్చి సోఫాలోకూలబడ్డది.

అనేకభావాలు ఆమెనుముట్టడివేశాయి ఇదినిజమా?లేకకలా? తనభర్త తనను ఇంతవరకూ ఏనాడూ నిరాదరణ చేయలేదు. దేనికీ

లోపం చేయలేదు. ఆ మాటకు వస్తే తనూ ఆయనకు ఏ ఇబ్బందీ కలుగచేయలేదు. ఇరవై ఏండ్ల కాపురంలో ఏనాడూ వారి మధ్య కలతలులేవు. తనంటే అతనికి ఎంతో ఆప్యాయత. తనూ ఏనాడూ ఇది కావాలని ఆయనను అడగలేదు. ఎలా గ్రహించేవాడో ఏమో తనమనస్సులోమాట ఆమెకోరకుండానే ఆమెకు అన్నీ అందేవి. అదీ అతని ప్రత్యేకత. పోనీ దాంపత్య జీవితం అందామా అంటే తనని ఎంతో ఆదరించేవాడు. తనవల్ల సుఖపడ్డాడేకానీ ఏనాడూ కష్టపడ లేదు. తనూ ఆయన ఇష్టప్రకారమే నడుచుకొనేది. కాకపోతే ఆయన కున్నంత సెక్సువ్యామోహం తనకు ఏనాడూలేదు. అయినా ఆయన ఇబ్బందిపడినట్లు తనకుతోచలేదు. తనకు చేతనైనంతవరకు పత్నిగా అతనిని పరవశింపచేసింది. మరి ఎందుకు జరిగినట్లు ఈ ఘోరకలి? ఇది యాదృచ్ఛిక సంఘటనా? లేక ఒకపథకంలో భాగమా? అంతకు ముందునుండీ జరుగుతూ వచ్చిన రహస్య నాటకాన్ని తనకు బహిర్గతం చెయ్యటమా? ఇది తనకు నోటీసా? తన పరిస్థితి ఏమిటి? తన పిల్లలు గతేంకాను? ఏదైనా తొందర పడరాదని నిర్ణయించుకుంది రుక్మిణి. తను మామూలకు భిన్నం రాకుండా సంచరించడమే అవసరం అనుకొంది. వేచిచూస్తే కాలమే అన్నిటినీ వెలికితీస్తుందని ఆశించడం అవివేకం కాదని తేల్చుకుంది.

మోహనరావు ఉదయం ఆరుగంటలకు నిద్రలేచాడు. తను పిల్లలగదిలో ఉన్నానని గ్రహించాడు. కలవరపడ్డాడు. డ్రాయింగ్ రూములోనికి వచ్చాడు. పిల్లలు ఇంకా నిద్రపోతున్నారు. భార్య వంటఇంట్లో వున్నట్లు అక్కడ జరిగే శబ్దంవల్ల గ్రహించాడు. చకా చకా తన పడకగదిలోకి వెళ్ళి తన మంచంమీద పడుకొని కళ్లు

మూసుకొన్నాడు. ఏడున్నర అయింది. పిల్లలు లేచి స్నానాదులు చేసి టిఫిను తిని, టిఫిన్ బాక్సులు, సంచులు తీసికొని స్కూళ్ళకు వెళ్ళారు. అప్పటికి తీరింది రుక్మిణికి. వాకిలి తలుపువేసి తన పడకగదిలోనికి వెళ్ళింది. భర్త నిద్రపోతున్నాడు తన మంచం ప్రక్కన మంచంమీద. ఆమెకు నవ్వు వచ్చింది. అతికష్టంమీద ఆపుకుంది. మృదువుగా ఆమె చేతివ్రేళ్ళతో స్పృశించింది అతని కపాలాన్ని. కళ్ళుతెరిచాడు మోహనరావు. మంచంమీదనుండి లేవకుండానే ఆమెవైపు చేతులు చాచాడు. రుక్మిణి మోహనరావు చేతుల్లో వాలిపోయింది.

బహుశః తను అనవసరంగాఅన్యాయంగా తనభర్తనుశంకించిందేమో ! తెల్లవారుజామువరకు కాగితాలు చూచుకొని తన భర్త ఆగదిలోనే అలసిసొలసినిద్రపోతే ఆమెవెళ్ళిపోయిందేమో ! రుక్మిణి తన భర్తను అనుమానించటం మహాపాపమనుకుంది. ఇలాంటి మోహనమూర్తినా అనుమానించటం ! అలాంటి ఆలోచన రావటమే తప్పు ! అతడు పవిత్రమూర్తి. ఈ భావం రాగానే ఆమె మనస్సు తేలిక అయ్యింది. ఒడలు సళ్ళు విడిచింది. రుక్మిణి ఆవేళ సత్యభామై భర్తపై నర్తించింది. ఆ మోహన సుందర రూపాన్ని చూస్తూ ధన్యుడయినాడు మోహనరావు.

5

ఆ రోజు తెల్లవారుజామున నాల్గున్నర గంటలయింది. ప్రభాకరంకు ఎందుకో మెళకువ వచ్చింది. వాకిలి తలుపు తీసి

సిగరెట్ వెలిగించుకొని మూడవ అంతస్తు కారిడరులో అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు. ఇంతలో 305 నెంబరు ఫ్లాటు వాకిలి తలుపు తెరుచుకుంది. చెదిరిన జుట్టుతో, నలిగిన బట్టలతో మేకప్ పోయిన ముఖంతో ఒక స్త్రీ చరచరా బయటికి కలయజూచింది. ఒక్క ఉదుటున లిఫ్టువద్దకు చేరింది. ఆటోమేటిక్ లిఫ్టుదిగివెళ్ళిపోయింది.

ఆమె అందగత్తెకాదు. చామనఛాయరంగు, కళ్ళల్లో ఆకర్షణలేదు, అ మాటకు వస్తే ఒకసారి ఆమెను చూచినవారెవరూ ఆమెను జ్ఞాపకం చేసుకోవలసిన అవసరం ఉండదు. అంతటి సాదామనిషి. కాకపోతే ఆమె ఆడమనిషి.

ఆమె బయటకు వచ్చింది మోహనరావు ఫ్లాటునుండి మోహనరావు వ్యాపారస్థుడు, ఆ విషయం జ్ఞాపకం వచ్చింది ప్రభాకరంకు. ఆమెను తను మోహనరావు ఆఫీసులో చూశాడు. ఆమె అతని సెక్రటరీ. ఆమె తెల్లవారుజామున హడావుడిగా ఎందుకు వెళ్ళిపోయింది? మరి ఆ రూపమేమిటి? రావణాసురుని చేత అవమానింపబడిన రంభ నలకూబరుని వద్దకు పరిగెత్తిపోయిన పౌరాణిక దృశ్యం అతని స్మృతిపథంలో మెదలింది. ఇందులో ఏదో నిగూఢ రహస్యం ఉన్నది. మోహనరావు తన సెక్రటరీతో వ్యభిచార జీవితం సాగిస్తున్నాడా? అసంభవం. భార్య ఇంట్లో వుండగా అలాంటి నైచ్యానికి పాలుపడగలడా ఏ పురుషుడైనా? అందులో భార్య ముగ్గురు బిడ్డల తల్లి. పైగా అతని భార్య రుక్మిణి పార్వతీ అమ్మవారి అంత అందగత్తె. ఆమె ఇంట్లో ఆమె సమక్షంలో ఇంతటి ఘోరపాపానికి మోహనరావు ఎలా పాల్గొనగలిగాడు? మోహనరావు మంచివాడేననుకుందాం. మరి ఆ సెక్రటరీ వేషం రూపురేఖలు ఏం తెలియచేస్తున్నాయి? సందేహం

లేదు ఇందులో. ఆమె అత్యాచారానికి గురికాకపోవచ్చునుకానీ ఆమె మోహనరావుతో సంపర్కం పెట్టుకొనే పోతున్నది. ఒకసారి మోహనరావు ఆ స్త్రీ, వాళ్ళ సంవేశనా చిత్రాన్ని ఊహించు కొన్నాడు ప్రభాకరం. అతని ఉద్రేకం తారాస్థాయికి వచ్చింది. మనిషి ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. అతని దేహం బిగుసుకు పోయింది. సిగరెట్ పారేసి వాకిలి తలుపు వేసి తన పడకగదిలోకి చేరాడు. పిల్లలు ప్రక్క పడకగదిలో వాళ్ళ నానమ్మ దగ్గర పడు కున్నారు. తన భార్య నళిని ఒక్కతే తనగదిలో వుంది. పడకగది తలుపు మూశాడు. ఆమె సరసన చేరాడు. ఆమె వక్షస్థలంపై చేయివేశాడు. ఆమె మూలిగింది. చేయి తీసివేసింది. ప్రక్కకు ఒదిగి పడుకొంది. ప్రభాకరం ఆమెను వెనుకనుండి పొదివి పట్టు కున్నాడు. ఆమె కళ్లు తెరిచింది, తన భర్తను చూచింది.

"అబ్బ వదలండి! నాకు తలనొప్పిగా ఉంది" అంటూ మళ్ళీ కళ్ళుమూసుకుంది. ప్రభాకరంకు చిరాకెత్తుకొచ్చింది. తన బాధను ఆమె గుర్తించలేదని ఆమెమీద కోపం వచ్చింది. తను భర్త. ఆమె భార్య. ఆమె తన కోర్కెను మన్నించాలి. తన అవ సరాలను తీర్చాలి, అదేపత్నీధర్మమంటే. దానినేగదాతరతరాలుగా తల్లులు తమ కుమార్తెలకు బోధిస్తూ వచ్చింది. నళినికి ఎంత సాహసం? తనను తృణీకరిస్తుందా? కానీ అనుభవిస్తుంది. చకా చకా బ్లౌజు గుండీలు ఊడదీశాడు, ఆమెకు నిద్రాభంగమయింది.

"ఏమిటండీ ఈ ఆగడం? వేళాపాళా లేకుండా?" తిరస్కార సూచకంగా పలికింది. ఆమె మాటలు అతని విషయంగా అగ్నికి ఆజ్యంపోసినట్లు అయ్యింది. అతని కన్నులు ఎర్రబడ్డాయి. నాసికా పుటాలు ఎగరటం ప్రారంభించాయి. అధరం అదురు

తున్నది. అతనికి మాటలతో పనిలేదు, ఆమె చీరను తొలగించాడు, ఆమెను ఆక్రమించాడు.

ఈ అవమానానికి గురి అయినందుకు నళిని మనస్సు క్షోభించింది. ఏం చేస్తుంది భారత గృహిణి? ఏం చేయగలదు పతి ప్రణాలలామ? అనుభవించాలి పెళ్ళినాటి ప్రమాణ ఫలితాన్ని? ఎవరు ఆలకిస్తారు ఆమె మొరను? ఏ న్యాయస్థానం సమర్థిస్తుంది ఆమె వాదనను? ఏ ధర్మశాస్త్రం ఆమెను ఆదుకుంటుంది? భార్య దేహం భర్తది. అది అతని సొత్తు; అతని ఆస్థి. దానిపై అతనికి సర్వాధికారం. ఆమెను అతడు పోషిస్తున్నాడు, రక్షిస్తున్నాడు. ఆమె సంతానాన్ని పోషిస్తున్నాడు. వాళ్ళకు విద్యాబుద్ధులు చెప్పిస్తున్నాడు. ఎందుకు? ఎవరికోసం? భార్య తను మాన, ధన, ప్రాణాలు భర్తవని పురాణాలు ఘోషించడంలేవా? పురాణాలు, ధర్మశాస్త్రాలు, మతగ్రంథాలు, అన్నీ కోడై కూస్తున్నాయి భర్త అధికారాన్ని కాదనరాదని. ఇవన్నీ పురుషులు రాసినవి. వాళ్ళ ప్రయోజనాలను రక్షించుకొనే నిమిత్తం తాటాకులలో వ్రాశారు. పార్లమెంటులో, శాసనసభలలో చట్టాలు ఆమోదిస్తున్నారు. వాటిలో పురుషులదే ఆధిక్యత, వారిదే పెత్తనం. ఇంత ఘాతుకానికి పురుషుడు పాల్పడుతూవుంటే అన్యాయమని అరిచే మనిషిలేని పరిస్థితివుంది ఈనాడు. భర్త దౌర్జన్యానికి భార్య బలి అయిపోవలసిందేనా?

ఏమీ చేయలేక నళిని భర్తను వ్యతిరేకించలేదు. అతనికి తన దేహంమీదనుండి త్రోసివేయలేదు. కళ్ళు మూసుకొని నిశ్చలంగా భరిస్తున్నది రెండు రకాల బాధలను. ప్రభాకరం నళిని కనురెప్పలు మూతపడటం గమనించాడు. మోహ పారవశ్యంలో

శృంగార రసాంబుధిలో ఆమె తేలియాడుతున్నట్లు ఊహించు కున్నాడు. విజృంభించాడు. ఆమె అతని దౌష్ట్యానికి తట్టుకోలేక మూలిగింది. ఆమె మూలుగు మన్మథ సామ్రాజ్య సంకేతమని తలిచాడు. ప్రభాకరం ప్రళయతాండవం చేశాడు. ఆమె చేష్టలుడి గింది. అతడు అలసిపోయాడు. తన రెండు చేతులతో అతనిని ప్రక్కకు నెట్టివేసింది, చలనరహితంగా పడివున్నాడు ప్రభాకరం కొంతసేపు. ఆమె అతని స్థితిని చూచింది. ఆమెకు అతనిపై అసహ్యం వేసింది. జుగుప్స తారస్థాయికి చేరుకుంది. తన స్థితికి తానే భయపడ్డది ఆమె. మరోనిమిషం ఇలాగడిస్తే అతన్ని తను హత్యచేస్తానేమోనని ఆమెభయపడింది. తనుహంతకిగా నిర్ణయింప బడి జైలుపాలయితే తన ఇద్దరి పిల్లల గతేంకాను ? తనుతొందర పడకూడదు. కాని జరిగిన అత్యాచారం తనను దహించివేస్తున్నది. ఒకవైపు అతనిపై కసి, మరోవైపు తన పిల్లల భవిష్యత్తును గురిం చిన భయం. ఆమె అదృష్టం బాగుంది. అతడు లేచాడు. కాళ్లు కడుక్కొని వచ్చి మంచినీళ్లు త్రాగి మంచంమీదకుపోయి పడుకు న్నాడు. ఆమె తన దృక్కులను అతనిపైపునుండి మరల్చుకుంది. ఆమెలో అశాంతి విపరీతంగా చోటుచేసుకుంది. ఆమె కన్నులు మూతపడటంలేదు. ఆమె దృక్కులు దేనినో అన్వేషిస్తున్నాయి. అంతర్దృష్టి సారించింది నళిని. ప్రభాకరం ఎప్పుడూ ఇంతే. అత నికి సరసమంటే ఏమిటో తెలియదు. శృంగారానికి, వడ్రంగానికి తేడా గ్రహించలేని మూర్ఖుడతను. పచ్చి స్వార్థపరుడు. ఎదుటి మనిషి భావాలకు ఉద్వేగాలకు ఏ మాత్రం విలువనివ్వని పశువు. తన అవసరాన్ని తీర్చుకొని సాగిపోయే జంతువు. తన పిల్లల తల్లినికూడా గౌరవించలేని సంస్కారహీనుడు. పశువూ సంతానాన్ని

కంటుంది. అతడూ అంతే, తను ఇద్దరు పిల్లల్ని కన్నది అతని వల్ల. ఇద్దరు పిల్లలలో ఏ ఒక్కరూ శృంగార సన్నివేశ ఫలితం కాదు. ఇరువురూ పైశాచిక ప్రవర్తన ఫలితాలే.

ఆమెకు బాహ్యచైతన్యం కలిగింది. సూర్యకాంతి కిటికీలో గుండా తనపై ప్రసరిస్తున్నది. దేహం బరువెక్కినట్లుగా ఆమెకు బాధ కలిగింది. నరాలజ త్తిడి, మెదడులో ఫిరంగులు ప్రేలుతున్న రొద. యాతన అనుభవిస్తున్నది. అలా అలా కళ్లు తెరుచుకొని ఏడుగంటలదాకా పడుకుంది నళిని.

6

మర్నాడు ఉదయం తొమ్మిది గంటలకు ప్రభాకరం రామలింగంగారి వాటాలోకి వెళ్లాడు. రామలింగం అతనిని సాదరంగా ఆహ్వానించి, కుశల ప్రశ్నాదికం చేశాడు. వీళ్ళిద్దరి వాటాల మధ్య గున్నేశ్వరరావు వాటా ఉంది. అందుకని గున్నేశ్వరరావుని గురించి మాట్లాడాలని రామలింగం తహతహ. మోహనరావు ప్రవర్తనను ప్రస్తావించాలని ప్రభాకరం ఆరాటం. ప్రభాకరమే సంభాషణను ఉపక్రమించాడు.

"విన్నారా రామలింగంగారూ! 305 నెంబరు ప్లాటుఆయన మోహనరావు వ్యవహారం?"

"ఏమిటి ప్రభాకర్ ఆ వార్త! అడిగాడి వ్యాపారము బాగుంది. కుటుంబమూ సలక్షణంగా ఉంది.

" అవి బాగానే ఉన్నాయండి. బాగుండనిదల్లా అతని ప్రవర్తనే."

" అదేమిటయ్యా. ఏదో వింత విషయంలాగుంది !"

" వింతకాక మరేమిటండీ. ముగ్గురు బిడ్డలతండ్రి తన సెక్రటరీతో తన ఇంట్లో తన భార్య ఎదుట అలా ప్రవర్తిస్తాడా ?"

" ప్రభాకర్ ! నన్ను చంపక. చెప్పదలచుకున్నదేదో వేగిరం విశదంగా చెప్పవయ్యా "

" అదికాదు రామలింగంగారూ ! ఏబయ్యేపడిన మనిషి వ్యభిచారానికి దిగవచ్చుటండ్రీ !"

రామలింగం షాక్ తిన్నాడు. అతడికి మోహనరావంటే ఎంతో గౌరవం. సెక్రటేరియటులో ఏదో పని ఉండివచ్చి, పక్కవాటా వాడినని మొగమాట పెట్టకుండా, తనకు మామూలుగా చేరవలసిన వెయ్యి రూపాయలనోట్ల బొత్తిని తనకు అందించాడు. మోహనరావు పెద్దమనిషి రామలింగం దృష్టిలో.

" ప్రభాకర్ ! నీవు ఏదో పొరపడి ఉంటావయ్యా !"

" చూడండి రామలింగంగారూ ! మోహనరావు సెక్రటరీ ఉందే ఆ అమ్మాయి అతని వాటాలోనుండి తెల్లవారుఝామున నాలుగున్నర గంటలకు బయటికి రావడం నేను చూచానండీ "

" ఏమైనా ఆఫీసుపని ఉండివచ్చి వెళ్ళిపోతున్నదేమోనయ్యా. ప్రతిదానికీ మనం బెదిరిపోకూడదు. అనుమానపిశాచం మహాచెడ్డది "

"రామలింగంగారూ! నేను అంత అవ్యక్తంగా మాట లాడటంలేదండీ. భీతహరిణేక్షణఅయి శృంగార రసాధి దేవతలా ఆమె బయటికి వచ్చిందండీ!!"

"ఎట్టెట్లా! కాలం మారిపోతున్నదయ్యా. అయినా ఈ ఆడవాళ్ళు ఎంత మంచి మగవాళ్ళనుకూడ చెడగొట్తారయ్యా."

"మీరు భలేవారండీ రామలింగంగారూ! ఎటు త్రిప్పి ఆడ వాళ్ళమీద నేరంవేస్తారు ఎప్పుడూ" అన్నాడు ప్రభాకరం.

రామలింగం ధర్మోపదేశం చేయపూనాడు.

"చూడవయ్యా. నీవు చిన్నవాడివి. అనుభవజ్ఞానం నాకన్నా తక్కువ. మన మతగ్రంథాల పఠనం నా అంతచేసి ఉండవు. చెప్తావిను. స్త్రీ నరకద్వారమని అన్ని మతగ్రంథాలు ఘోషిస్తు న్నాయి. సర్పం ఆదామును లోభపెట్టలేక పోయిందా? అవ్వ కదూ ప్రోత్సహించి ఆదాముచేత జ్ఞానఫలాన్ని తినిపించింది. బైబిలు ఈ కథను చెప్పింది కదా! శంకరాచార్యులవారు నిరశించారు స్త్రీ రూపాన్ని. స్త్రీలు ప్రమాదకారులని గుర్తించే బుద్ధుడు తన సంఘంలో మొదట్లో స్త్రీలను చేర్చుకోడానికి నిరాక రించాడు. తరువాత పినతల్లి వత్తిడివల్ల చేర్చుకున్నాడు కాని తత్ఫలితంగా బౌద్ధసంఘంపతనమయింది. భారతయుద్ధం ఎందుకు జరిగింది అంటావు? ద్రౌపది ప్రతిజ్ఞాఫలితం కదూ. అందాక ఎందుకు! సీత లక్ష్మణుని నానామాటలూ అని రాముని వెదుక్కొని రమ్మనమని పంపకపోతే రావణుడు ఆమెను ఎత్తుకొనిపోగల్గేవాడేనా? సీతాపహరణం లేకపోతే రామరావణ యుద్ధం, ఆ మారణహోమం జరిగేది కాదయ్యా. నా మాట నమ్ము ఈ సమాజపతనానికి స్త్రీలే ముఖ్యకారకులు." ప్రవక్తలా పోజు పెట్టాడు రామలింగం.

" ఇన్నాళ్ళకు మీ ముఖతః ఈ నగ్నసత్యాన్ని గ్రహించ గల్గాను." రామలింగానికి నమస్కరించాడు ప్రభాకరం.

రామలింగం మళ్ళీ అందుకున్నాడు.

" ప్రభాకర్! విషయం తెలిసికుంటే చాలదు. దానిని ఆ జ్ఞానాన్ని వాడాలయ్యా. ఆచరణంలోనికిరాని జ్ఞానం ఉందే అజగళస్తనం లాంటిది. "

" ఇంతకూ, నన్ను ఏం చేయమంటారో సెలవిచ్చారుకాదు." తన సందేహాన్ని వెలిబుచ్చాడు ప్రభాకరం.

" చెప్తావిను. మన గున్నేశ్వరరావు కల్నల్ కమలాకరరావు మీద కేసు పెట్టాడు తెలుసుగా "

"అవునండీ ఆనాడు సాయంత్రపు పత్రికలో చదివాంకదా!"

" ఈ వ్యభిచారం కేసులున్నాయే, మామూలుగా రుజువు కావటం కష్టమయ్యా. అందుకని మనం ఇద్దరం గున్నేశ్వరరావుకు, అనుకూలంగా సాక్ష్యం చెప్పాల్సి ఉంటుంది."

" మనం సాక్ష్యంచెప్తే కల్నల్ కమలాకరరావుకు శిక్షపడు తుంది కాని గున్నేశ్వరరావు భార్య నీరజకు శిక్షలేదు కదండీ ?"

" నిజమే ;"

"మరి ఆడమనిషిని వదలేసి మరో పురుషుడిని శిక్షాపాత్రుడిని చేస్తే పురుష ప్రపంచానికి జరిగేదేమిటండీ !" నీళ్ళునమిలాడు ప్రభాకరం.

" తస్సాదియ్యా ప్రభాకర్. నీవు మనగాడివే. బలే ప్రశ్న వేశావు. స్త్రీలు దుర్మార్గులు కనుక స్త్రీలను శిక్షించాలని ఇందాకటి

నుండి చెప్పానా? దానికి నీవు అంగీకరించావు. కాకపోతే కమలాకర రావుకు శిక్షవేస్తే అది నీరజకు శిక్ష ఎలా అవుతుందని నీ ప్రశ్న. అవును కదూ ?"

"అవునండీ ! అదే నా ప్రశ్న."

"కమలాకరరావు ఎవరు. నీరజ అనే స్త్రీకి ప్రియుడు. కనుక కమలాకరరావుకు శిక్షపడితే నీరజకు ఆ శిక్షపడ్డట్టే. ఆ శిక్ష ఆమె అనుభవించినట్లు లెక్క. ఇప్పటికైనా తెలిసిందా ధర్మ సూక్ష్మం ?" ఉపనిషత్ సారాన్ని ప్రబోధించాడు ఆదిశంకరుని స్థానంలో కూర్చున్న రామలింగం.

"ఇంతవరకూ మీవద్ద ధర్మాలే నేర్చుకున్నానండీ. ఇపుడు ధర్మసూక్ష్మం తెలుసుకున్నాను. కనుక ఈ కేసు విషయంలో గున్నేశ్వరావుకు అనుకూలంగా ఏ రకమైన సాక్ష్యం చెప్పమంటే ఆ రకమైన సాక్ష్యం చెప్తాను."

"ప్రభాకర్ ! నీబోటిపురుషులు వెయ్యికి ఒకడున్నా సమాజానికి ఆడవాళ్ళవల్ల అనర్థాలు ఉండవయ్యా" రామలింగం ప్రభాకర్‌ను అభినందించాడు మహదానందంతో. ప్రభాకరం రామలింగంవద్ద సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు.

7

306 నెంబరు ఫ్లాటులో కాపురముంటున్న ముప్పైఏండ్ల మహిళ పేరు సావిత్రి. ఆమె విధవరాలు. ఆమెకు ఇద్దరు పిల్లలు మూడేండ్లవాడు, అయిదేండ్లవాడు. అయిదేండ్ల వాడిని కిండరు గార్టెనులో వేసింది. మూడేండ్లవాణ్ణి నర్సరీ స్కూలులో పెట్టింది. ఆయాలువచ్చి వారిరువురిని తీసుకొనివెళ్తారు ప్రతిరోజు ఉదయం.

సావిత్రి భర్త చనిపోయి ఏడాది అయింది. ఆమె భర్త ధన వంతుడవటంవల్ల ఆమె పోషణకూ పిల్లల పోషణకూ ఆమె ఇబ్బంది పడవలసిన అవసరం లేకపోయింది.

ఆ రోజు సాయంత్రం పద్మినీ సూర్యారావులు చెట్టపట్టాలు వేసుకొని సినిమాకు పోవడం తను మూడవ అంతస్తు కారిడరు లోంచి చూసింది మొదలు సావిత్రి మనస్సు మనస్సులోలేదు. ఆమె పూర్వస్మృతులు ఆమెను బాధించ మొదలుపెట్టాయి.

ఆమె భర్త శశిధర్ చనిపోయేనాటికి అతనికి ముప్పైఏళ్ళు. సావిత్రి దురదృష్టమా అని అతడు సెరిబ్రలు మలేరియా వ్యాధి వచ్చి ఇరవైనాల్గు గంటలలో చనిపోయాడు. వాళ్ళది ఒక విధంగా ప్రేమ వివాహం. ఆమెకు ఇరవైనాల్గవఏట వివాహం జరిగింది. ఆమె ఇండియన్ యైర్‌లైన్సులో యైర్ హోస్టస్‌గా ఉండేది. ఒక రోజు తన వ్యాపార సందర్భంలో విమానంలోపోతూ సావిత్రిని చూచాడు శశిధర్. ఆమె అందం, సౌకుమార్యం, సంభాషణారీతి, నడక, ఒయ్యారం, మాటతీరు ఒకటేమిటి ఆమె అతని దృష్టిని ఆకర్షించింది. ఆమె చిరునామా కనుగొని ఆమెతో పరిచయం పెంచుకున్నాడు శశిధర్. ఒకరి భావాలు మరొకరికి నచ్చాయి. ఒకరి అభిరుచులు మరొకరి మన్ననను పొందాయి. జీవితంయెడ ఇద్దరికీ ఒకే దృక్పథం ఉందని ఇద్దరూ గ్రహించారు వివాహం చేసుకున్నారు.

వివాహనాంతరం విహారయాత్రకు అనేక సుందర ప్రాంతా లను దర్శించారు వారిద్దరూ.

అది పడమటి కోస్తా ప్రాంతంలో ఒక చిన్న పట్టణానికి దగ్గరలోవున్న సముద్రతీరం. తామిరువురూ సైకిళ్ళు త్రొక్కుకొని అచ్చటకిచేరారు. దుస్తులు మార్చుకున్నారు.

అది సాయం సమయం. రెండు ఫర్లాంగుల వెడల్పువున్న ఇసుక తిన్నెలు. బారున కనుచూపుమేర తీర్చిదిద్దిన తీరపుగీత. కలుగులలోనుండి వెలికివచ్చి నడయాడుతూ అడుగులసవ్వడి కాగానే జరజరా కలుగులోనికి పరుగెత్తే యండ్రకాయలతో ఓ! సముద్ర తీరమంతా ఎర్రని ముద్దమందారాలతో కప్పబడినట్లుంది. అవే ఆ యండ్రకాయల రంగు ఎరుపువల్ల ఒక్కసారిగా నేల ఎర్రగా ఉండేది. ఈ మార్పుకు తను కిలకిలా నవ్వేది. నవ్వువిని శశిధర్ వెనక్కు తిరిగివచ్చి తన భుజంపై చెయ్యివేశేవాడు. తను శశిధర్ కళ్ళల్లోకి చూచేది. శశిధర్ కన్నార్పకుండా తనని చూచేవాడు. అలా నిశ్చలంగా ఒకరికొకరు అభిముఖంగా నిలుచివుండేవాళ్ళు. ఒకనాడు బాహ్యచైతన్యం ఇద్దరిలో నశించింది. ఇంతలో ఒక అల వచ్చి వాళ్ళ మీగాళ్ళవరకు తడిపింది. తలలెత్తిచూచారు. సూర్యుడు పశ్చిమాంబుధిలో క్రుంగబోతున్నాడు. ఆకాశమంతా జేగియ మానంగా ఉంది. చిత్రకారుని కుంచెకందని రంగులు ఆకాశంలో హొయలు చూపిస్తున్నాయి. తెలుపు, ఎరుపు, నీలం, పసుపు, గచ్చకాయ, ఊదారంగులు దాగుడుమూతలు ఆడుకుంటున్నాయి. ఒక్కొక్కసారి కొన్ని కలుస్తున్నాయి. మరొక్కసారి మరికొన్ని కలుస్తాయి. కలగల్పులు, విడాకులు. ఇక్కడా సాంసారిక రీతులే. ఇద్దరూ పులకితులయినారు. శశిధర్ తనని నీళ్ళల్లోకి నడిపించుకు వెళ్ళాడు. ఒక అల వచ్చింది. అది మరీ పెద్దదికాదు; అంత చిన్నదీకాదు. శశిధర్ తనని బలవంతంగా అదిమిపెట్టి నీళ్ళలో ముంచాడు. తనూ మునిగాడు. తనకు సముద్రస్నానం క్రొత్త. నిజానికి అదే తన మొదటి సముద్రప్రవేశం. తను ఉక్కిరి బిక్కిరి అయింది. అల దాటిపోయింది శశిధర్ లేచాడు. తను చిరు కోపంతో అతనిని చూచింది. ఇంతలో మరో అలవచ్చింది. తన

చేయిపట్టుకొని 'ఎగురా' అన్నాడు. యాంత్రికంగా తను గెంతింది. ఆ అల తనను బాధపెట్టకుండా సాగిపోయింది. ఈ సముద్రస్నానం తనకు ఉల్లాసంగానేవుంది. కాని చెప్పా పెట్టకుండా నీళ్ళల్లో ముంచాడని శశిధర్‌పై చికాకు; కాని ఆ చికాకులో ఆప్యాయత మిశ్రితమయింది. తన తర్జనితో అతనిని బెదిరించింది. అతడు నాలిక బయటపెట్టి తనను వెక్కిరించాడు. తను నుదురు చిట్లించింది. ఆమె పచ్చని శరీరం. ఆమె నుదురు మేఘావృతమయిన వినీల ఆకాశంలాగుంది ఒక్క క్షణం. శశిధర్ తన ప్రక్కకు వచ్చాడు. వాటేసుకొని కౌగలించుకున్నాడు. అబ్బ ఎంత హాయి. ఒక చెంప సముద్రజలాల చల్లదనం మరోచెంప అతని పరిష్వంగంవల్ల తన దేహంలోకల్గిన నులివెచ్చదనం, అతడు కౌగిలి విడిపోకుండా ఉంటే బాగుండును. పెద్ద అల వచ్చింది. తను చూడలేదు. శశిధర్ తనను అమాంతంగా ఎత్తుకొని గెంతాడు. ఇద్దరూ చతికిలపడ్డారు. అల నీళ్ళు తమ మీదుగా దాటిపోయాయి. అల తీరాన్ని దాటి విరిగిపోయింది. తామిద్దరూ లేచి నిలబడ్డారు. అలనీళ్ళు లోపలికి వస్తున్నాయి. తన కాళ్ళ క్రింద ఇసుక జారిపోతున్నది. తను నిలబడలేకపోతున్నది. తను 'శశీ' అని కేకపెట్టింది. శశి తనను పొదివి పట్టుకొని ఒడ్డుకుచేర్చాడు. తాము వేసుకున్న దుస్తులు తడితో ఒంటికి అంటుకొనిపోయి ఉన్నాయి. శశి తనవంక చూస్తున్నాడు. తను తన శరీరాన్ని చూచింది. అబ్బ! ఆ వంపులూ సొంపులూ అన్నీ ప్రస్ఫుటంగా కనబడుతున్నాయి. తనకు సిగ్గేసి "ఛీ సిగ్గులేదూ అలా ఆడపిల్లవైపు చూడ్డానికి?" అని అతనిని నెట్టేసి దుస్తులు మార్చుకోటానికి దూరంగా ఉన్న పొదమాటుకు పోయింది. చుట్టూ కలయజూచింది. కనుచూపుమేర ప్రాణి

సంచారంలేదు. భయం వేసింది. త్వర త్వరగా దుస్తులు మార్చుకొని శశిని చేరాలని సంకల్పించుకొంది సావిత్రి. వెంటనే బేతింగ్ సూటు విప్పేసింది తను. తలనూ ఒంటినీ టవలుతో రుద్దు కుంటున్నది. శరీరంలో వెచ్చదనం ఉద్భవించింది. శశి కౌగలింత ఆమె స్మృతి పథంలో మెదిలింది. శశి కౌగలింతలో వెచ్చదనానికి ఇప్పుడు తను అనుభవించేదానికి తేడావుంది. అదివేరు, ఇదివేరు. దాంట్లో ఏదో అనిర్వాచ్య అనుభూతి. 'శశి తనను ఇప్పుడు కౌగలించు కుంటే ఎంత బాగుండునూ' అని తలపోసింది. ఆ భావం తన మనస్సులోకి రాగానే తన కన్నులు అర్ధనిమీలితాలయినాయి. ఇంతలో తనచుట్టూ పెనవేసుకున్న పురుష హస్తాలు తనని ఈ ప్రపంచంలోకి తెచ్చాయి. తనకు భయంవేసింది. ఎవరో అత్యా చారానికి ఒడికట్టున్నారని కంపించిపోయింది. మనసును కూడగట్టుకొని కళ్ళు తెరిచింది. ఎదురుగా శశి. తన ఆనందానికి మేరలేదు. 'శశీ' అని పెద్దగా పిలిచింది. "ఊ! నేనే" అన్నాడు శశి. తను శశిని చూచింది. లుంగీతో మాత్రమే ఉన్నాడు శశి. అబ్బ అతని ఛాతీ ఎంత అందంగావుంది. కండలు తిరిగిన అతని అవయవసౌష్టవం తనని ముగ్ధురాలినిచేసింది. తను విశ్రాంతి తీసుకోడానికే అతనికి ఆ ఛాతీ ఏర్పడిందని తన ఊహ. తనను చూచుకుంది. తను పూర్తిగా నగ్నశరీరి. ఇంకా దుస్తులు వేసుకో లేదన్నమాట. అలరించే కోపంతో పక్కకుచూచింది. అచ్చట ఒక పెద్దజంపకానా దానిపైన ఒక తెల్లనిదుప్పటీ పరిచిఉన్నాయి. దుప్పటిపైన మల్లెలు. ఎంత రసికుడు శశి. తనకు సిగ్గువేసింది. ఎవరైనా చుట్టుప్రక్కల ఉన్నారేమోనని కలయజూచింది. నిర్మా నుష్యం. కొంగలు భూమివైపు బారులుతీర్చి పోతున్నాయి. గంటకో అరగంటకో సముద్రంలో మునిగిపోయే సూర్యుడు తప్ప

మరెవ్వరూలేరు. తనకు ధైర్యం వచ్చింది. శశి తనని ఎత్తుకొని పోయి పడకమీద దించాడు. తను నుల్చొనివున్నది, ఎదురుగా శశి.

"నుల్చోలేను బాబూ!" అంటూ పడకమీదికొరిగింది. శశి ఆమె ప్రక్కన పరున్నాడు.

"ఇంకా తనని కౌగిలించుకోడేమి?" తన మనస్సు తనను తొందరపెడుతోంది.

"తను ఎంత మందమతి? ఎంత సోమరిపోతు?" తను శశిని విసుక్కుంటున్నది మనస్సులో.

శశి ఆమెను కౌగిలించుకున్నాడు. తను చూస్తే ఇద్దరూ ఒకరికొకరు అభిముఖంగా ఉన్నారు. శశి తన బుగ్గలనూ, అధరాన్ని మృదువుగా చుంబించాడు. అతని అధరాన్ని తను పెదవులతో స్పృశించింది. వేయి విద్యుత్తులు తనలోకి ప్రవహిస్తున్నట్లుంది. శరీరము స్వాధీనం తప్పుతున్నట్లు తోచింది తనకు. శశి కుడిచేయి తనవక్షస్థలంపై నాట్యంచేస్తున్నది. అప్రియత్నంగా తన చేయి అతని వీపుపైపడింది. అతడు తనకు దగ్గరయినాడు. మరుక్షణంలో అతడు నగ్న శరీరి. వారిరువురి శరీరాలమధ్య సూర్యకాంతికితప్ప మరిదేనికీచోటులేదు. అతడు ఆమెను పెనవేసుకున్నాడు. సూర్యకాంతి ఆ కాస్త చోటును పోగొట్టుకున్నది. తాము ఏక శరీరులయినారు. తను అతిలోక సుఖపారవశ్యంలో ఉన్నది అప్పుడు. తను నవోఢ. అతడో శృంగార రసధుని. తను బాహ్య స్మృతిని కోల్పోయింది. కొంత సేపటికి తను కనుకొలుకులలో నుండి శశిని చూచింది. అబ్బ! ఆనాటి అతడి లీలలు ఈనాడు

తలుచుకున్నా తను సిగ్గులో తల మున్కలౌతున్నది. డ్రాయింగు రూములో కుర్చీలో కూర్చున్న సావిత్రి ఇలా పాత గాధను తలచుకుంటూ ఒక అరగంటసేపు ఉండిపోయింది.

ఇంతలో ఎవరో డోర్ బెల్లు కొట్టారు. లేచి తలుపు తీద్దామనుకుంది. తన శరీరం తన స్వాధీనంలోలేదు. కాళ్ళు తను చెప్పిన మాట వినటంలేదు. నిస్సత్తువ; ఏదో చెప్పలేని తీయనిబాధ ఆమె శరీరంలో అణువణువునా ఉన్నట్లుంది. ఇంతలో ఆమెకు శశి మళ్ళీ జ్ఞాపకంవచ్చాడు. శశి ఆఫీసునుంచివచ్చివుంటాడని తలచింది. దబదబా లేచివెళ్ళి తలుపుతీసింది. ఎవరోకాదు పోస్టు బంట్రోతు. దిబ్బమొహమూ వాడునూ. ఎవడికి కావాలి వాడి ఉత్తరాలు. దస్కతు చేయించుకొని రిజిష్టరు కవరిచ్చి సాగిపోయాడు అతడు. తను తలుపు వేసివచ్చింది. బాత్ రూములోకిపోయి షవరుక్రింద నుంచొని టాప్ త్రిప్పింది. తలదిమ్ము తగ్గింది. తన శిరోజాలు తన వక్షస్థలాన్ని కప్పుతున్నాయి. తనను చూచుకుంది తన అందానికి తానే మురిసిపోయింది. తన మెదడులో అనేక ప్రశ్నలు ఉదయించాయి. తన అందమంతా అడవిగాచిన వెన్నెల కావల్సిందేనా ? తను మోడుగా జీవితం సాగించవలసిందేనా ? తన జీవితంలో ఇక వసంతాలురావా ?

8

307 నెంబరు ప్లాటులో రాధమ్మ కాపురం వుంటోంది. ఏభై ఏండ్ల స్త్రీ ఆమె. ఆమె ఇంకా అవివాహిత. విశ్వవిద్యాలయంలో మానసికశాస్త్రంలో రీడరుగా ఉద్యోగం చేస్తున్నది.

రాధమ్మకు విద్యారంగంలో మంచిపేరు ప్రతిష్టలున్నాయి. మితభాషి. ఎక్కువగా తన కాలాన్ని వృధాచేయదు. విద్యార్థులు తరచుగా ఆమెవద్దకు వచ్చి తమ సిద్ధాంత వ్యాసాల విషయంలో సలహాలడిగి పోతూవుంటారు. రాత్రి ఎనిమిది గంటల వరకూ వచ్చే పొయ్యేవారితో ఆమె ఇల్లు ఒక విధంగా రద్దీగా వుంటుందని చెప్పవచ్చు. ఆమె ఫ్లాటు వాకిలి తలుపు సాయంత్రం వేసి వుండడమనే ప్రసక్తిలేదు. అందరికీ అతిధి సత్కారాలు ఆదరంగా జరిగేవి. సావిత్రి ఆ ఆపార్టుమెంటులోనికి వచ్చేటప్పటికే రాధమ్మ 307 ఫ్లాటులో కాపురముంటున్నది. సావిత్రి ఈ బిల్డింగులోకి రాగానే మర్యాదకోసం అరువదినాలుగు ఫ్లాటులవారి దగ్గరకువెళ్ళి పరిచయం చేసుకుంది. ప్రక్కవాటా కనుక అందులో తన లాగా ఒంటరి ఆడమనిషి కనుక మున్ముందుగా రాధమ్మను పరిచయం చేసుకుంది. ఆ తరువాత కారిడరులో కలిసినప్పుడు చిరునవ్వుతో పల్కరించుకోవడమేగాని సావిత్రి రాధమ్మ ఇంటికిపోలేదు. రాధమ్మా సావిత్రి వాటాలోకి ఎన్నడూ తొంగిచూడలేదు కూడా.

ఒకరోజు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ స్థానిక ఎడిషనులో రాధమ్మ ఫోటోవేసి ఆమెపై వ్యాసం ప్రకటించబడింది. వ్యాసాన్ని ఆ మూలాగ్రం చదివింది సావిత్రి.

అప్పటివాకా రాధమ్మ ఇతరత్రాగొప్పతనం సావిత్రికి తెలియనే తెలియదు. స్త్రీ సమస్యలమీద రాధమ్మ ప్రత్యేకంగా కృషి చేస్తుందని సావిత్రి ఆనాడు చదివింది. సాయంత్రం రాధమ్మ వాటాలోకివెళ్ళి ఆమెను అభినందించి వచ్చింది ఆనందం పట్టలేక. తన వ్యక్తిగత సమస్యను గురించి రాధమ్మకు సలహా అడుగుదామని సావిత్రికి తలపుకలిగింది. అడుగవచ్చునో అడగరాదో అనేసందేహం

వచ్చింది మరల. ఇంతకూ రాధమ్మ స్త్రీ సమస్యలకు దరహంమీద సలహా చెప్పగలదేమో కాని వ్యక్తిగత సమస్యలజోలికి ఆమె పోదేమోనని అనుమానం పొడసూపింది. ఏదిఏమయినా తనకన్నా వయసులో పెద్దది. అనుభవజ్ఞురాలు, విద్యావంతురాలు, పండిత కోవకు చెందినదీ అయిన రాధమ్మను సలహా అడగడం తప్పుగా తోచలేదు సావిత్రికి. ఒకరోజు ప్రొద్దున్నే రాధమ్మకు ఫోనుచేసి తన వ్యక్తిగత విషయంలో ఆమె అనుభవపూర్వకమైన సలహా కావాలని, తనకు ఆరోజు సాయంత్రం ఒక అరగంట కాలవ్యవధి కేటాయించాలని కోరింది. ఆ రోజున అంతకుముందే నిర్ణయింప బడిన భేటీలు వగైరాలు ఉన్నాయని మరునాడు సాయంత్రం అయిదుగంటలకయితే ఒక గంటవరకూ వ్యవధి ఉన్నదని రాధమ్మ సాదరంగా జవాబుచెప్పింది సావిత్రికి. ఆ మాటకు ఎగిరిగంతేసింది సావిత్రి. మరునాడు సాయంత్రానికి తన వ్యవహారానికి రాధమ్మ కాలాన్ని కేటాయింపు చేసుకుంది సావిత్రి.

మరునాటి సాయంత్రం కోసం ఎంతో ఆసక్తితో ఎదురుచూడ సాగింది సావిత్రి. రాధమ్మ వాటాకు పోవాలంటే తన వాటామీదు గానే పోవాలి. ఆమె రాకను గమనించవచ్చని సాయంత్రం నాల్గు గంటలనుండే తన వాటావాకిలి సగం తీసిపెట్టి తను డ్రాయింగు రూములో వాకిలికి ఎదురుగావున్న కుర్చీలో కూర్చున్నది. సరిగ్గా నాలుగున్నర గంటలకు రాధమ్మ విశ్వవిద్యాలయం నుండి తన వాటాకు చేరింది. ఈ సంఘటనను గమనించిన సావిత్రి తన వాటా వాకిలి తలుపువేసి రాధమ్మ దగ్గరకు వెళ్ళడానికి ఉచిత వేషధారణ చేయసాగింది. అయిదు గంటలకు అరనిమిషం ఉన్నదనంగా సావిత్రి రాధమ్మ వాకిలి తలుపుకువున్న డోర్‌బెల్ స్విచ్ నొక్కింది

గంట మోగడమూ రాధమ్మే స్వయంగా తలుపుతీయడం క్షణంలో జరిగిపోయాయి. రాధమ్మ సావిత్రిని కౌగలించుకొని చేయిపట్టుకొని సగౌరవంగా లోపలికి తీసుకొనివెళ్ళి డ్రాయింగురూంలో సోఫాలో కూర్చోబెట్టి తను ఆమెకు ఎదురుగావున్న కుర్చీలో కూర్చున్నది. ఇంతలో రాధమ్మ ఇల్లునడిపే పనికత్తె రెండు గ్లాసులలో మజ్జిగతెచ్చి టీపాయ్ మీదపెట్టి వెళ్ళింది. మళ్ళీవచ్చి వేయించిన వేరుసెనగపప్పులు రెండు సాసర్లలోతెచ్చి గ్లాసుల ప్రక్కనపెట్టింది. వాటిని స్వీకరించమని రాధమ్మ సావిత్రిని కోరింది.

"ఇప్పుడే కాఫీత్రాగి వచ్చానండీ" అంది సావిత్రి.

"పరవాలేదమ్మా. మజ్జిగేగా నేను ఇస్తున్నది" అంటూ పుచ్చుకోమంది రాధమ్మ.

ఇక బెట్టుచేయడం అమర్యాదగా ఉంటుందని భావించింది సావిత్రి. వేరుసెనగ పప్పులు రెండు నోట్లోవేసుకొని మజ్జిగకాస్త త్రాగింది.

"నేను తమ సలహాకోసం వచ్చానండీ" ఉపక్రమించింది సంభాషణను సావిత్రి.

"చెప్పావుకదమ్మా నిన్న ప్రొద్దున. అడగదలుచుకుందేదో అడుగు సందేహించకు. నీ పిన్నిలాంటిదాన్ని" అన్న రాధమ్మ మాటలు సావిత్రికి కొంత గుండెధైర్యాన్ని సమకూర్చాయి.

కథ ఎలా మొదలుపెట్టాలో ఆమెకు తెలియటంలేదు. పైగా అడగదల్చుకున్న విషయాన్ని ఎలా రాధమ్మకు తెలియజెప్పాలో సావిత్రికి అవగతం కావటంలేదు. ఎలాగో మనసు దిటవు చేసుకొని నెమ్మదిగా దగ్గింది సావిత్రి.

"నేను ఒంటరిగా పిల్లలతో కాలక్షేపం చేస్తున్నాను. మీకు తెలుసుగదా?" అనగలిగింది సావిత్రి.

"ఆ విషయం నాకు తెలుసుగదమ్మా"

"నేను విధవాలిని. వారు సంవత్సరం క్రిందటనే నన్ను వదిలివెళ్ళారు. అప్పటికి నాకు ఇద్దరు పిల్లలు. వాళ్ళకు ఒకరికి నాలుగేండ్లు, రెండవ పిల్లకు రెండేండ్లు." సావిత్రి కంఠరుద్ధమయి మరి మాట పెగిలిరాలా.

"అయ్యో పాపం! ఆ సందర్భం నాకు తెలియదమ్మా. ఇంత చిన్నదానికి నీకు అంత పెద్ద కష్టమొచ్చిందే" తన దయార్ద్ర హృదయాన్ని ప్రకటించింది రాధమ్మ.

"ఈ ఏడాది నరకయాతన అనుభవించాను. వారి స్మృతులే నాకు ఒక రకంగా అండ! మరో రకంగా శాపం"

"అవునమ్మా! అర్ధం చేసుకోగలను నేను". స్త్రీ పరిస్థితిని మరో స్త్రీ మాత్రమే అర్ధం చేసుకోగలదనే భావం స్ఫురింపజేస్తూ అనునయంగా పలికింది రాధమ్మ.

"నేను వయస్సులో ఉన్నాను. పుష్టికరమైన ఆహారం తీసుకుంటున్నాను. అందరికుండే కోరికలు నాకూ ఉన్నాయి. అందరిలాగా సుఖపడాలనే వాంఛా ఉంది. అది నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నది. తట్టుకోలేకుండా ఉన్నానమ్మా ...." తల దించుకొన్నది సావిత్రి.

"ఇంత వివరంగా చెప్పాలటమ్మా నాకు. ముందుగానే గ్రహించాను నీ విషమ స్థితిని" అదేమీ తప్పుకాదన్నట్లు పలికిందామె కంఠధ్వని.

"పెద్దవారు, పండితులు. జీవితాలను సానుభూతితో పరిశీలించగల సత్తాకలవారు కనుక మిమ్మల్ని ఆశ్రయించాను" అనగలిగింది సావిత్రి అతికష్టంమీద.

"చూడమ్మా! స్త్రీ పురుషులకు కోరికలుండటంలో తప్పులేదు. వాటిని తీర్చుకోవాలనడం సహజం. చిక్కు అల్లా పరిస్థితులు అనుకూలించనప్పుడే వస్తుంది. అంటే నీబోటివాళ్ళ కేసులలో సంఘర్షణ ఏర్పడుతుంది మనస్సులో. ఒకవైపు సామాజికనీతి మరోవైపు వ్యక్తిగత స్వేచ్ఛ, రెంటికీ వైరుధ్యం ఉంటుందిగదా. అదేనండి నా స్థితి ఏం చెయ్యమంటారు నన్ను ఈ పరిస్థితిలో?"

"ప్రతివ్యక్తికీ కామవాంఛ ఉంటుంది. దానిని పెండ్లిద్వారా సమాజానికి సమ్మతం చేయిస్తారు; గుర్తిస్తూ శాసనాలు చేశారు. వివాహానికి అటూ ఇటుగా అంటే వివాహానికి ముందు, వివాహానికి వెలుపల కామవాంఛ తీర్చుకోవటం అధర్మమని అధికారంగా ప్రకటించింది సమాజం." వ్యక్తిగత నీతికి, సామాజిక నీతికిగల అనుబంధాన్ని వివరించింది రాధమ్మ.

"నా కేసు ...." సందేహాన్ని వెలిబుచ్చింది సావిత్రి.

"నిజమేనమ్మా! నీ కేసు మరొకరకంది. కాని దానినీ విడిచి పెట్టలేదు ధర్మశాస్త్రజ్ఞులు. విధవను కోరికలు చంపుకోమని ఆజ్ఞాపించారు."

"విధురుడికి లేని నీతి విధవరాలికి ఏర్పాటు చేయడం అన్యాయం కదండీ" ఒక్కొక్క పదమే మెల్లిగా పలికింది.

"అవును. అది ద్వంద్వనీతి. అంతేకాదు పక్షపాతయుతమైన నీతి. స్త్రీలను అణచివేసే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేయబడిన పద్ధతి అది" ఆవేశంతో మాట్లాడింది రాధమ్మ.

సావిత్రి దిగ్భ్రాంతిచెందింది. ప్రశాంతవదనంతో నిబ్బరంగా ఉండే రాధమ్మ హృదయంలో ఇంత బడబాగ్ని రగులుతోందని సావిత్రి ఎప్పుడూ ఊహించలేదు; ఊహించటానికి సాధ్యమూ కాదు.

"అయితే ఆ నీతిని అతిక్రమించటంలో తప్పులేదుగా?" ప్రశ్నించింది సావిత్రి.

"తప్పొప్పులు ఆ యా పరిస్థితులను బట్టి ఉంటయ్యమ్మా"

"మీరు అనేది నాకు అర్థంకావటంలేదు. క్షమించి వివరిస్తారా" భయపడుతూ, జాలిగా అడిగింది సావిత్రి.

"ఏం లేదమ్మా! సంతానంవున్న విధవరాలి స్థితివేరు; సంతానంలేని విధవ స్త్రీ పరిస్థితివేరు. అదీ నా భావం"

"అంటే నాబోటి వారికి నిష్కృతి లేదంటారా?"

"అంతటి దుర్మార్గానికి నేను ఒడికట్టను సావిత్రీ" రాధమ్మ గొంతు జీరపోయింది.

"మరి ...." నీళ్ళు నమిలింది సావిత్రి.

"మనలో కొందరు స్త్రీలు తెలిసో తెలియకో, కావాలనో వద్దనుకునో ఎలాగయితేనేం కొంతమంది జీవులను ఈ భూ ప్రపంచంలోనికి తెస్తున్నారు. అలా వాళ్ళ జన్మకు కారణభూతు లయినందువల్ల వారికి ప్రత్యేకమైన ఇబ్బందులూ, బాధలూ బాధ్యతలూ వస్తాయి. సంతోషమూ, ఆనందం సంగతి నేను చెప్పనక్కరలేదు. ఆ బాధ్యతలను మానవుడైన ప్రతిజీవి నిర్వర్తించాలి. అదే నా భావం" విశదపరిచింది రాధమ్మ.

"అయితే మీరనేది సంతానం పురోభివృద్ధి కోసం, ఆనందం కోసం నాబోటివాళ్ళు ఆత్మాహుతి చేసుకోవాలంటారు?" కొంచెం ఉద్రేకంతోనే అడిగింది సావిత్రి.

"అలా నిన్ను అగాధంలోకి తోసెయ్యను సావిత్రీ. అంత అవ్యక్తురాలు కాదు ఈ రాధమ్మ"

తొందరపడి ఆమె మనస్సును నొప్పించానేమోనని బాధ పడ్డది సావిత్రి. కాని ఆమె సందేశం తనకు జీవన్మరణ సమస్య కనుక ఉద్రేకపడ్డది.

'ఐ యామ్ సారీ' తన పశ్చాత్తాపాన్ని వెలిబుచ్చిందిసావిత్రి.

"ఏం తప్పుచేయలేదమ్మా నీవు. నీ వయసులో నేనూ అంత ఉద్రేకంలో ఉండేదాన్ని పైగా నా తీర్పు నీకొక సవాల్‌గా భావించావు కదా?" అనునయించింది రాధమ్మ.

"అయితే, ఇప్పుడు నేను ...."

"సావిత్రీ ! ఇది జాగ్రత్తగావిను. ప్రపంచంలో అన్నిటి కన్నా సులువయింది సలహా చెప్పడం. అది రెండురకాలుగా చెయ్యవచ్చు. ఇలా చేయాల్సిందని చెప్పడం ఒకటి. పరిస్థితులను విశ్లేషణచేసి, అందరి వ్యక్తుల సంక్షేమాన్ని పరిగణనలోకి తీసు కొని, సాధ్యాసాధ్యాలను గమనించి ఈ పరిస్థితులలో నేనుంటే ఇలా ప్రవర్తిస్తాను ; ఏం చెయ్యాలో నీవే తేల్చుకో అని చెప్పటం రెండవది. నేను ఎప్పుడూ రెండవ విధానాన్ని అభిమానిస్తాను ; అనుసరిస్తాను."

"సరే ! నా పరిస్థితులలో మీరుంటే మీరు ఎలా సమస్యను పరిష్కరించుకుంటారు." ప్రశ్నించింది మరోసారి.

"స్త్రీ వాంఛలను, సంతానపు సంక్షేమాన్ని సమన్వయం చేసుకునే పద్ధతిని ఆమోదిస్తాను."

"ఇంకా స్పష్టంగా చెప్పండి" కోరింది సావిత్రి.

"నీ జీవితంలోని ఒంటరితనాన్ని పటాపంచలు చేయగల వ్యక్తి నిన్ను అభిమానించి, గౌరవించి, ప్రేమించగల పురుషుడు మాత్రమే. అలాంటి పురుషుడు నీ బరువు బాధ్యతలను అంటే నీ సంతానపు యోగక్షేమాలకు కూడా బాధ్యత వహించగలడు. అలాంటి పురుషుడు నీ జీవితంలో ప్రవేశించే వరకు నీవు వేచి ఉండాలి. త్వరపడకూడదు. అడ్డదారులుగా కన్పించేవి ప్రమాద కరంగా పరిణమిస్తాయి. జీవితంలో నిజానికి అడ్డదారులు పనికి రావు. ఎప్పటికీ - సుదూరమైనా - ప్రజలందరూవాడే రహదారియే మేలు; కాకపోతే కాలహరణం జరుగవచ్చు. ఆ ఇబ్బందిని భరించాలి. తప్పదు; మరోమార్గం నాకు కనిపించటంలేదు" రాధమ్మ ముగించింది తన సందేశాన్ని.

ఆమెకు కృతజ్ఞతతో నమస్కరించి వెళ్ళిపోయింది సావిత్రి.

9

సావిత్రి వెళ్ళిన తరువాత రాధమ్మ మనస్సు తుపానుసమయంలో సముద్రంవలె అల్లకల్లోలమయింది. అంతలావు నిబ్బరం గల మనిషికి ధృతిపోయింది. పనిమనిషిని పిలిచి ఎవరైనావస్తే "అమ్మగారికి తల నొప్పిగావుండి పడుకున్నారు రేపు ఫోనుచేసి రండి" అని చెప్పమంది. పడకగదిలోకి వెళ్ళి తలుపేసుకొని, దుస్తులు మార్చుకొని, నిద్రోచితమైన ఉడుపులు ధరించి ప్రక్క మీదకు ప్రాలింది.

పరుపుపై శయనించేదే కాని నిద్రవస్తేనా. ఆ పరిస్థితిలో నిద్ర ఎలా సాధ్యమవుతుంది ఎవరికైనా? ఆమె జీవితాన్ని ఒకసారి పరిశీలన చేయటం ప్రారంభించుకొంది. తన గత జీవితంలోని ముఖ్య సంఘటనలను నెమరువేసుకోసాగింది.

తను మెట్రిక్యులేషను ప్యాసవగానే తన పెండ్లి కోసం వరులను గాలించ ప్రారంభించాడు తన తండ్రి. తగిన వరుడు లభించలేదు. అంచేత చదివించాడు ఇంటర్మీడియేటు. తరువాత బి.ఏ., చదువుపూర్తయింది దారినబోయ్యే దానయ్యకు కట్టబెట్టటం ఇష్టంలేదు తన తండ్రికి. ఎం. ఏ., లో చేర్పించాడు. తను యూనివర్సిటీకి ఫస్టుగా ఉత్తీర్ణురాలయింది. విశ్వవిద్యాలయాధికారులు పిలిచి సాదరంగా తనకు లెక్చరర్ ఉద్యోగం ఇచ్చారు. మళ్ళీ వరుల వేటను కొనసాగించాడు తండ్రి. తనకన్నా పై చదువు చదివిన వాడికోసం అన్వేషించాడు. చదువుకన్నా సంస్కారం ముఖ్యమని తను తండ్రితో చెప్పింది. ఆ మాటను ఆయన విన్పించుకోలేదు. ముగ్గురు వరులు తటస్థపడ్డారు తండ్రికి. ఒకడు ఏబదివేల కట్నం కోరాడు; మరొకడు తన అమెరికా ప్రయాణానికి, అమెరికా చదువుకు ఖర్చులు కోరాడు. మూడవ అతడు తనని ఉద్యోగం మానివేయమని కోరాడు. మొదటిదానికి తన తండ్రి ఇష్టపడ్డాడు తను తిరస్కరించింది. రెండవ సంబధాన్ని తను మొదట్లోనే తృణీకరించింది. మూడవదానిని గురించి తను ఆలోచించనని తండ్రితో చెప్పింది. అలా మూడుసంబంధాలు తన పరంగా ముక్కచెక్కలయ్యాయి. తన తండ్రి కృశించిపోయాడు పిల్ల పెండ్లి చేయలేకపోయాననే అనేదుఃఖంతో. మధ్య మధ్య, చదివించకుండా బాల్యవివాహం చేస్తే బాగుండేదని వాపోయేవాడు. చదివించి కూతురుకు అన్యాయం చేశాననే దోషభావంతో కుమిలిపోయాడు. దాంతో ఆయన మరణించాడు డెబ్బదవయేట. ఆ వయస్సులోనున్న భర్తను పోగొట్టుకున్న తన తల్లి ఏడాది గవడకముందే తననివిడిచివెళ్ళింది. తనకు నా అనే వారెవ్వరూలేరు. తన పెళ్ళి విషయం ఆలోచించేవాళ్ళెవరూ మిగలలేదు తనకు.

తన యోగక్షేమాలకు తనే బాధ్యతవహించాల్సి ఉంటుందని గ్రహించింది రాధమ్మ.

సుబ్బారావు ప్రవేశించాడు తన జీవితంలో. అతడు తన డిపార్టుమెంటులోనే లెక్చరరు. తెలివికలవాడే; ప్రతిభావంతుడే అందగాడు కాదుకాని అనాకారికాడు. ఉద్యోగ ధర్మంగా ఏర్పడిన పరిచయం స్నేహంగామారింది. అతడు తనను వివాహవిషయం అభ్యర్థించేదాకా వచ్చాడు. తన ఇంటి స్థితిగతులను వివరించాడు. తన చెల్లెలుకు పెండ్లి కావాలట. అందుకని తల్లిదండ్రులు తనకు వరకట్నం కోరుతున్నారట. అందుకని తనను వివాహమాడ మని కోరటానికి సంకోచిస్తున్నాడట. ఈ విషయం తెలియగానే తను తోకత్రొక్కిన త్రాచయింది అన్యాపదేశంగా వరకట్నం కోరు తున్నాడని గ్రహించింది. మరునాడు వివాహప్రస్తావన తేవద్దని అతనితో ఖండితంగా చెప్పింది; స్నేహితులంగా మిగిలిపోదామని అన్నది. నిరాశతో వెళ్ళిపోయాడు సుబ్బారావు. వివాహమయిన తరువాత తన చెల్లెలిపెళ్ళి బాధ్యతను పంచుకోమని అతడు అర్థిస్తే తను ఎంతో ఇష్టంగా ఆ భారమంతా మోయమునేది; కాని షరతులు పెడితే లొంగే ఘటమా తను.

రజనీకాంతారావు కథ మరోరకంగా నడిచింది. అతడు కథలు నవలలు రాస్తాడు; సాహితీపరుడు. అతని రచనలలో ఉదాత్త ఆశయాలూ, భావాలూ ప్రస్ఫుటంగా ఉంటాయి. మహిళా సంక్షేమానికి ప్రాధాన్యతఇస్తాడు కథలలో. స్త్రీని సమాన హోదాతో చూడాలని ఉద్బోధిస్తాడు నవలలో. స్ఫురద్రూపి. సంభాషణా చాతుర్యం అతని సొమ్ము. గంభీరమనస్కుడిలా కన్పిస్తాడు. అతని రచనలు చదివేది తను. అందువల్ల అతనిని పరోక్షంగా ఆరాధించటం మొదలుపెట్టింది. అతని పొందు అభిలషణీయంగా

తోచింది తనకు. సాహితీపరురాలైన తన స్నేహితురాలి ద్వారా అతని పరిచయాన్ని సంపాదించింది. రజనీకాంతరావును ఒకరోజు తన ఇంటికి ఆహ్వానించింది. పిచ్చాపాటి మాట్లాడుకున్నారు. అతని కళ్ళల్లో కళ్ళుపెట్టి తను ఆరాధనాభావంతో చూస్తున్నది. ఇంతలో అతడు తన భుజంపై చేయివేశాడు. ఈ చర్యయొక్క అసంబద్ధతకు తను కంపించిపోయింది. అది పశుప్రవృత్తిగా తాను భావించింది. తనను గురించి అతనికి ఏమీ తెలియదు. ప్రధమ పరిచయంలోనే కామవాంఛను అతడు బహిర్గతం చేయటం తనకు ఎబ్బెట్టుగా తోచింది. అతని చేతిని తీసివేసింది. బహుశః అతనికి అది షాక్ కల్గించివుంటుంది. సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు. తరువాత తెలిసింది. అతడిది భ్రమరజీవితమని. అతనికి ఇద్దరు భార్యలూ, నల్గురు పిల్లలున్నారని. నగరంనిండా అతనిచే మోసగింపబడి అణగారిపోయిన అతివలు అనేకమంది ఉన్నారని.

సోమేశ్వరరావు తనకు తటస్థించిన మూడోవ్యక్తి. అతగాడు ఒక దినపత్రికలో పనిచేస్తున్నాడు. అతని రచనలలో సునిశితత్వం, పరిశీలనాదృష్టి, స్పష్టత, ఒక ఆదర్శమూ, ఒక లక్ష్యమూ, ఉచిత పదప్రయోగం, వాక్యవిన్యాసం, లయ, శయ్య, శైలి అన్ని ప్రస్ఫుటంగా గోచరమవుతాయి. అతని వ్యాసాలను తను తప్పకుండా చదివేది. ఒకసారి తన వ్యాసపరంపర ప్రచురణ విషయం పత్రికా సంపాదకునితో ప్రసంగించటానికి తను వెళ్తే అతడు సంపాదకుని గదిలో ఉన్నాడు తనకు అతనిని పరిచయం చేసాడు సంపాదకుడు. తన విజిటింగుకార్డు ఇచ్చింది. మర్యాదగా తన విజిటింగు కార్డును అతడు తనకిచ్చాడు. అదే అతనితో ప్రధమ పరిచయం. అతనిని గురించి వాకబుచేసింది. అతడు బ్రహ్మచారి యని అతనికి బాదరబందీలు ఏమీలేవని. అంతేగాక అతడు

స్వతంత్ర స్వభావం కలవాడని ఆమెకు తెలిసింది. అతడే తనకు యోగ్యమయిన వరుడు. అందులో అనుమానంలేదు. అతనిని ఎలాగైనా వివాహమాడాలి. అప్పుడు తనకు జీవితంలో సుఖమూ, తృప్తీ లభిస్తాయి.

అతనికి ఫోనుజేసి తన ఇంటికి ఆహ్వానించింది. అతడు వచ్చాడు. ఎంతో ఉల్లాసంగా గడిచింది ఆ సాయంత్రం. వారం రోజులయిన తరువాత అతడు ఫోనుచేశాడు తన ఇంటికి ఆహ్వానిస్తూ. తను గెంతుతూ వెళ్ళిందంటే అతిశయోక్తి కాదు. అంత ఉత్సాహంగా వెళ్ళింది. అతని అతిథి సత్కార తీరు తనను ఆకర్షించింది. ఎన్నో అంశాలను చర్చించారు. ప్రపంచ రాజకీయాలనుండి స్త్రీలయెడ పురుషులు ప్రవర్తించేతీరు దాకా ముచ్చటించుకున్నారు. ఆ రోజు తన సంతోషానికి మేరలేదు. కృతనిశ్చయ అయింది తను అతడే తనకు తగినవాడని.

రాకపోకలు సాగాయి. నాలుగు నెలలు ఇట్టేగడిచిపోయాయి. ఇద్దరూ ఊహాలోకంలో విహరిస్తున్నారు. తామిద్దరు జతకావడం సమంజసమని ఇద్దరూ భావించటం మొదలుపెట్టారు. ఒకరోజు రాత్రి భోజనంవేళకు సోమేశ్వరావు తనఇంటికి వచ్చాడు. మామూలుగా సంభాషణ అయిన తర్వాత భోజనానికి లేమ్మన్నది తను. అతడు ఆహ్వానాన్ని సంతోషంగా అంగీకరించాడు. ఎదురెదురుగా కూర్చుని ఒకరికళ్ళలోకి మరొకరు చూస్తూ తృప్తిగా భోంచేశారు. డ్రాయింగురూంలోకి వచ్చి కూర్చున్నారు ఇద్దరూ. తాంబూలపు పళ్ళెంతెచ్చి టీపాయ్‌మీద పెట్టివెళ్ళింది పనిమనిషి. తనే స్వయంగా ఈనెలుతీసి తమలపాకు చిలకలుచుట్టి అతని చేతికి అందించింది. ఆ సందర్భంలో అతని వ్రేళ్ళను తనవ్రేళ్ళుతాకాయి. ఆ స్పర్శతో

తను పులకితరాలయింది. ఈ రోజు సోమేశ్వరరావు తనవాడు కావాలి. ఆలస్యానికి తావులేదు. తనకున్న గర్వం, అభిజాత్యం ఎగిరిపోయాయి. అతనిని కవ్వించదలచింది.

"మీరు భోంచేయగానే నిద్రపోతారేమో" అన్నది తను సాభిప్రాయంగా.

"నాకు వీలెక్కడ. రాత్రి ఒంటిగంట వరకు రాతకోతలతోనే సరిపోతుంది" జవాబిచ్చాడు రావు.

"నేనూ నిద్రపోను. కాని నాకు చెడ్డఅలవాటుంది. ఒక అరగంట పడకమీద మేనువాల్చాలి. అంతే నాకూ నిద్రరాదు అర్ధరాత్రిదాకా".

"నేనిక్కడకూర్చుని నీకు శ్రమ ఇస్తున్నాను" అన్నాడతను.

అప్పటికే ఇద్దరిమధ్యా చనువుపెరిగింది. అతడు ఆమెను 'నీవు' అని సంబోధించటం మొదలుపెట్టి చాలకాలమయింది. తను అతనిని 'రావు' అని ఆప్యాయంగా పిలుచుకునేది.

"రావూ! పడకగదిలోకిపోదాం నీకు అభ్యంతరంలేకపోతే నేను పడకపై విశ్రమిస్తాను. నీవు ప్రక్కన కుర్చీలో కూర్చొని మాట్లాడుతూవుండు. నీ మాటల మాధుర్యాన్ని తనివితీరక్రోల గలను." రాధమ్మ రావును ఆప్యాయంగా ఆహ్వానించింది.

తను లేచి పడక గదిలోనికి వెళ్ళింది. ఆతడు తనను అనుసరించాడు. అతడు మాట్లాడుతున్నాడు. తను ఊకొట్టున్నది. తన కన్నులు అరమోడ్పుగా ఉన్నాయి. తను తన్మయత్వంలో ఉంది. చటుక్కున బెడ్‌స్విచ్ నొక్కింది. అంధకారంలో రావును

తన ఒళ్ళోకి లాక్కున్నది. తనివితీరా ముద్దాడింది. పరిష్వంగ సుఖాన్ని పొందింది. తన వలువనూ అతని దుస్తులనూతీసిపారేసింది. తామిద్దరూ - ఒకరి తనువు మరొకరి తనువును ఒరుసుకుంటూ - చాలసేపు ఉండిపోయారు. సముద్రంలో పెద్ద అల వచ్చింది. వడ్డును కొట్టుకొని విరిగిపోయింది. మంచుకొండ చూడముచ్చటగా ఉంది; విరిగిపడింది. అరటిచెట్టు పువ్వుపూసింది. రేపోమాపో గెల బయట పడుతుందని గంపెడాస. గాలికి నేలకొరిగింది. సోమేశ్వరరావు నపుంసకుడు. హఠాత్తుగా బాంబుప్రేలి తన నెత్తిన పడ్డట్టయింది. ఇక జీవితంలో వివాహప్రయత్నం చేయలేదు తను.

10

అది సంగారెడ్డిలోని 'హోటల్ శాంతి'. సంగారెడ్డి మెదకు జిల్లా ముఖ్యపట్టణం. జిల్లా కేంద్రమేగాని జనాభా అరువది వేలకు మించదు. అభివృద్ధి చిహ్నాలులేవు ఆ ఊళ్ళో. పరిశ్రమలు లేనట్టే లెక్క. విద్యాలయాల సంఖ్య బహుస్వల్పం. నాగరికత ఇంకా గట్టిగా ఆ ప్రాంతాన్ని తాకినట్లులేదు. ఆ ఊళ్ళోకల్లా 'హోటల్ శాంతి' చెప్పుకోదగ్గది. దాంట్లో ప్రవాసులకు నివాసయోగ్యంగా ఇరవయి గదులున్నాయి; అందులో అయిదు మాత్రం డబుల్ గదులు. ఆ హోటల్‌కు వచ్చారు శనివారం రాత్రి ప్రకాష్ పద్మజలు. డబుల్‌రూం కావాలన్నాడు కౌంటరులో ప్రకాష్. రిజిష్టరులో నమోదుచేశాడు తమ పేర్లను ప్రకాష్; శ్రీమతి ప్రకాష్‌గా. దస్కతు చేశారు ఇద్దరూ. వెంటనే తమకు కేటాయించబడిన 6వ నెంబరు గదికి వెళ్ళారు. అప్పటికే రూముబాయ్ తలుపుతీసి, కూజాలో మంచినీళ్ళుపెట్టి ఏమయినా కావాలేమో అని నిల్చున్నాడు. ఒక అరకిలో ద్రాక్షపండ్లూ, రెండు కప్పులు కాఫీ కావాలని అయిదు

రూపాయలిచ్చి పంపాడు ప్రకాష్. తలుపువేశాడు. పద్మజ ప్రకాష్ కౌగిలిలోకి దూకింది. అలా ఎంతకాలం గడిచిందో వారికి తెలియదు. డోర్ బెల్ మోగింది. పద్మజ కుర్చీలో కూలబడింది. రూమ్‌బాయ్ వారు కోరినపండ్లూ, కాఫీ అందించి, చిల్లరపైకం ఇచ్చి నుంచున్నాడు కారియర్ భోజనం తేవాలేమోనని. "భోజనంచేసి వచ్చాం, రేపు ఉదయం ఆరు గంటలకు రెండు కప్పులు కాఫీ తీసుకురా" అని ప్రకాష్ అతని చేతిలో ఒకరూపాయి ఉంచాడు. బాయ్ వెళ్ళిపోయాడు. గది తలుపు గడియబిగించాడు ప్రకాష్. పద్మజ బాత్‌రూములోకి వెళ్ళి దుస్తులు మార్చుకొనివచ్చి కూర్చున్నది. ప్రకాష్ ఆమెను తదేకదృష్టితో చూడసాగాడు.

"ఏమిటా కొరుక్కుతినే చూపులు" లాలనగా తిట్టింది పద్మజ. ప్రకాష్ హడావుడిగా బాత్‌రూంలోకివెళ్ళి తిరిగివచ్చాడు బనియనుతో తెల్లని గూడకట్టుతో. ఆమె ప్రక్కన మరోకుర్చీలో కూర్చున్నాడు. ఇద్దరూ కాసేపు మాట్లాడలేదు. ఎవరి మనస్సుల్లో ఏమి ఊహలున్నాయో!

ఇది వారిద్దరి జీవితంలో అపూర్వ పరిస్థితి. ఇద్దరూ అవివాహితులు. లోకందృష్టిలో దాంపత్య జీవితానికి ఇంకా అర్హత సంపాదించుకొనని వ్యక్తులు. కాని వారిరువురు హోటలువారి రికార్డులో భార్యాభర్తలు. తమ అంచనా ప్రకారం ప్రేయసీ ప్రియులు; ఆలుమగలు. దాంపత్యజీవితం ప్రారంభించనున్న జంట. కాకపోతే పద్మజను అన్యాయం చేస్తున్నానేమోనని ప్రకాష్‌కు సంకోచం. ప్రకాష్‌ను తొందర పెట్టున్నానేమోనని పద్మజకు అనుమానం.

పావుగంట అలాగడిచింది. పద్మజలేచి పడకమీదికి చేరింది. ప్రకాష్‌వైపు చేతులు చాచింది. ప్రకాష్ ఆమె కౌగిలిలో ఇమిడి పోయాడు. ఆమె అతనిని చుంబించింది. అతడు ఆమెకు చేరువగా జరిగాడు. ఆమె పడకపై ఒరిగింది. అతడు ఆమె ప్రక్కకు ఒరిగాడు అతడు ఆమె అధరపానం చేశాడు. ఆమె అతని జుత్తు లోకి చేయిపోనిచ్చింది. 'యుద్ధంలో గెలిచిన యోధునికి కవచం అవసరం ఏమిటి ?' అంటూ ఆమె బ్లౌజు గుండీలను విప్పాడు. ఆమె పయోధరాలు అతనికి కనులపండువ చేశాయి. ఆమె అతనిని అక్కున చేర్చుకుంది. ఈ సారి ముద్దుపెట్టుకోవటం ఆమెవంతు. అతడు ఆమె దుర్గంలో బంధితుడయ్యాడు. ఆమెలో విజయగర్వం; అతనిలో తన్మయావస్థ. ఇద్దరికీ సంతోషం. ఇది విచిత్రసన్నివేశం; మధురానుభూతి.

ఆ రాత్రి ప్రకాష్ పద్మజలకు ప్రొద్దుపోయేవరకు నిద్రలేదు. కలయికలు, విడిపోవటాలు, మరల సంయోగాలు, మరల వియోగాలు ఇలా కాలందొర్లిపోయింది. తృప్తితో నిద్రలో కిజారారు.

తెల్లవారుజామున నాల్గుగంటలకు గదితలుపు ఎవరో దబదబా బాదినట్లు పెద్ద చప్పుడయింది. ఉలికిపడిలేచారు ప్రకాష్ పద్మజలు. ఒకరినొకరు కలయజూచుకున్నారు. ఇద్దరి వంటిమీద ఏమాత్రం ఆచ్ఛాదనలేదు. ఒకరినొకరి చూచి మరొకరు నవ్వుకున్నారు. చకచకా బయటికివెళ్ళే దుస్తులు వేసుకున్నారు. ఆమె కుర్చీలో కూర్చున్నది. ప్రకాష్ తలుపు తీశాడు. జబర్దస్తీగా పోలీసు డి.ఎస్.పి., సర్కిల్ ఇనస్పెక్టరు, సబ్ ఇనస్పెక్టరు లోనికివచ్చారు. బయట నల్గురు పోలీసులు కారిడరులో ఉన్నారు.

"మిమ్మల్ని అరెస్టు చేస్తున్నాం. పదండి పోలీసు స్టేషనుకు" గర్జించాడు డి.ఎస్.పి.

"ఎందుకు సార్ ! ఏం తప్పుచేశాం మేము. హోటల్ గదిలో ఉండటమే నేరమా!" అడిగాడు ప్రకాష్.

తన అధికారాన్ని సవాలు చేస్తున్నట్లుతోచింది. డి.ఎస్.పి.కి. సి.ఐ. ని పిలిచి వీళ్ళను స్టేషనుకు తీసుకుపో అని ఉత్తరువు జారీ చేసి వెళ్ళిపోయాడు.

సామాను సర్దుకోటానికి అయిదు నిమిషాలు వ్యవధి ఇచ్చాడు సర్కిల్ ఇనస్పెక్టరు.

ప్రకాష్ పద్మజలు గది వెలుపలికి వచ్చారు. కారిడరులోనికి రాగానే ప్రక్క గదిలోనుండి ఒక యువకుడూ యువతీ బయటికి వచ్చారు. వారినిచూచి సర్కిల్ ఇనస్పెక్టరు "నమస్కారం కృష్ణా రావుగారూ" అన్నాడు.

"నమస్కారం ఇనస్పెక్టరుగారూ" అన్నాడు ఆ యువకుడు. ప్రకాష్ పద్మజలను పోలీసు స్టేషనుకు తీసుకెళ్ళారు. సర్కిల్ ఇనస్పెక్టరు వెళ్ళిపోతూ కేసు విచారించమని ఉత్తరువు ఇచ్చాడు సబ్ ఇనస్పెక్టరుకు.

తెల్లవారింది. సబ్ ఇనస్పెక్టరు విచారణ ప్రారంభించాడు. ప్రకాష్ పేరు, చిరునామా, ఉద్యోగమూ అలాగే పద్మజ పేరు, చిరునామా, ఉద్యోగం అడిగి తెలుసుకొని కాగితంపై నమోదు చేసుకున్నాడు.

సబ్ ఇనస్పెక్టరు యువకుడు. మంచివాడుగా కన్పడ్డాడు ప్రకాష్‌కు. ప్రకాష్ ధైర్యంచేసి అడిగాడు.

"సర్. మమ్మల్ని ఎందుకు అరెస్టుచేశారు?"

"ఎంత అమాయకుడివయ్యా! బ్రోథెలు ఆక్టుకింద అరెస్టు చేశాం" అన్నాడు ఇనస్పెక్టరు.

నిందితులిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు అని తెలుసుకున్న ఇనస్పెక్టరు వారితో సానుభూతిగా మాట్లాడటం మొదలుపెట్టాడు.

"మాపై మోపిన నేరమేమిటండీ?" మళ్ళీ ప్రశ్నించాడు ప్రకాష్.

"బ్రోథెలులో వ్యభిచారం చేయడం"

"కేసు ఎవరిమీద అండీ!" పద్మజ అడిగింది.

"నీమీదేనమ్మా! అతనిమీద కేసులేదు" ఇనస్పెక్టరు జవాబు.

"ఏమనండీ"

"ఇందాక చెప్పాను కదమ్మా"

"అంటే మీ ఉద్దేశం నేను డబ్బుకు వళ్ళు అమ్ముకునే మనిషినని. అంతేనా? చెప్పండి!" రెట్టించి అడిగింది పద్మజ.

"ఇనస్పెక్టరుగారూ! మేము అలాంటివాళ్ళం కాము. ప్రేమించి పెళ్ళిచేసుకున్నాం. మా ఆదాయాలు చాల తక్కువ. కాపురముండటానికి ఇల్లు అద్దెకు తీసుకోలేక ఆయన లాడ్జిలో, నేను హాస్టలులో జీవితాలు సాగిస్తున్నాం. మమ్మల్ని అపనిందలపాలు చేయబోకండి" పద్మజ ఆవేశంగా పలికింది. ఇనస్పెక్టరు ఒకసారి ఇరువురి ముఖాలలోకి తీక్షణంగా చూచాడు. అతడికి వాళ్ళ కళ్ళల్లో నిష్కల్మషత్వం గోచరించింది.

"అయితే మీ పెండ్లి ఎక్కడ జరిగిందో, పెండ్లికి వచ్చిన పెద్దలెవరో చెప్పండి. పెండ్లి నిజమైతే మిమ్మల్ని వదిలేస్తాను" సద్బుదితోనే పలికాడు పోలీసు అధికారి.

ప్రికాష్ పద్మజలకు పచ్చివెలగకాయ పడ్డట్టయింది. ప్రికాష్ బుర్రకుఏమీతోచటంలేదు. పద్మజబుర్ర పాదరసంలాప్రవహించింది. తను ఎప్పుడో 'మేట్రిమోనియల్ క్రానికల్' అనే పత్రికలో చదివింది. గోపాలంగారనే సంఘసంస్కర్త హైద్రాబాదులో ఉన్నాడని, ఆయన పరకట్నంలేని, కుల మత ప్రసక్తిలేని, మత తంతులేని వివాహాలకు ఆధ్వర్యం వహిస్తారని.

"మా పెండ్లి హైదరాబాద్‌లో జరిగింది. సంఘసంస్కర్త గోపాలంగారు మా పెండ్లి చేశారు." ధైర్యంగా చెప్పింది పద్మజ.

ఆమె చొరవకు అచ్చెరువు పోయాడు ప్రికాష్.

ఆమె సత్వర సమాధానానికి తృప్తిచెందాడు పోలీసు ఆఫీసరు గోపాలంగారి పేరు పోలీసులకూ చిరపరిచితమే.

"సరే కాలకృత్యాలు తీర్చుకొని కాఫీ టిఫిను తీసుకొని రెడీగా ఉండండి. పది గంటలకు హైదరాబాద్ వెళ్దాము." అని వెళ్ళి పోయాడు ఇనస్పెక్టరు.

"పద్మజా! ఎంత ప్రమాదంలో పడ్డాము. ఆలోచించకుండా గోపాలంగారి పేరు చెప్పావు" సందేహాన్ని వెలిబుచ్చాడు ప్రికాష్.

"ప్రికాష్! అప్పుడు ఆలోచించటానికి అవకాశం లేక పోయింది. వెంటనే జవాబు చెప్పాల్సివచ్చింది. ఏదైనా ఆయన పేరు ప్రతిష్ఠలనుబట్టి ధైర్యం చేశాను. గోపాలంగారు మనకు అన్యాయం చెయ్యరు."

పది గంటలకు పోలీసు వ్యానులో ప్రికాష్ పద్మజలు ఇనస్పెక్టరూ హైదరాబాద్‌కు బయలుదేరారు. అక్బర్‌పూల్ లోని కిరణ్ అపార్టుమెంట్సుకు చేరారు. దర్వానును అడిగి గోపాలంగారి

ఫ్లాటు ఎడమవైపు బిల్డింగులో 307 నెంబరు అని తెలిసికున్నాడు ఇనస్పెక్టరు.

వెళ్ళి గోపాలంగారి డోర్ బెల్లు కొట్టాడు పోలీసు. తలుపు తెరిచారు గోపాలంగారు. వచ్చినవారిని లోపలికి ఆహ్వానించారు. ముగ్గురూ వెళ్ళి డ్రాయింగురూంలో ఆశీనులయినారు. ఇనస్పెక్టరు ఎందుకువచ్చిందీ సవివరంగా చెప్పాడు గోపాలంగారికి.

"మీరు వీళ్ళ పెండ్లి చేశారని ఈ అమ్మాయి చెప్పింది. నిజమేనా సార్?''

గోపాలంగారు పద్మజవంక చూచారు. ఆమె కళ్ళల్లో దైన్యం, ప్రార్థన కనుపించాయి గోపాలంగారికి.

ప్రకాష్ ముఖంవంక చూచారు ఆయన. అతని కళ్ళల్లో నిష్కల్మషత్వం, నిజాయితీ గోచరించాయి.

"అవును ఇనస్పెక్టరుగారూ! వీళ్ళ పెండ్లికి నేనే రెండు నెలలకిృంద ఆధ్వర్యంవహించాను. ఈ అమ్మాయి నిస్సందేహంగా ఇతని భార్య" గోపాలరావుగారు ధృడంగా పల్కారు.

పోలీసు అధికారి తృప్తిగా గాలి పీల్చాడు.

ప్రకాష్ పద్మజలను ఉద్దేశించి

"గోపాలరావుగారి పుణ్యమా అని ఈ రోజుకు మీరు బయట పడ్డారు; అదృష్టవంతులు. ఇక ఎప్పుడూ పరాయి ఊళ్ళల్లో మకాములుచేసి కష్టాలలో ఇరుక్కోవద్దు" హితవుచెప్పి గోపాలం గారికి నమస్కారంచేసి వెళ్ళిపోయాడు ఇనస్పెక్టరు.

ప్రకాష్ పద్మజలు గోపాలంగారి పాదాలనంటి నమస్క రించారు.

"అదేమిటర్రా నేనెప్పుడూ పాదాభివందనం చేయనీయను ఎవర్నీ నేను. ఇంతకూ ఇంత తెలివి తక్కువగా ఎందుకు ప్రవర్తించారు?" అన్నారు గోపాలంగారు.

తమ ఆదాయాల సంగతి, తమకు ఇల్లులేని విషయం, ఒకరిని విడిచి మరొకరు సర్వకాలమూ ఉండలేని పరిస్థితి వివరించారు ప్రకాష్ పద్మజలు. వారిని ఆశీర్వదించి పంపివేశారు గోపాలంగారు. తృప్తిగా నిట్టూర్పువిడిచారు ఆయన.

ఆ జంట చెట్టాపట్టాలు వేసుకుంటూ నడిచిపోయారు. ఆ సమయంలో 306 నెంబరు ప్లాటు తలుపు తెరుచుకుంది. సావిత్రి బయటికివచ్చింది. ఈ జంటను కన్నార్పకుండాచూచింది. లిఫ్టులో క్రిందికెళ్ళారు ప్రకాష్ పద్మజలు.

11

ఒకరోజు ఇంగ్లీషు దినపత్రికలో 'హిందూ' లో రాధమ్మ వ్యాసం ప్రకటితమయింది. దాని శీర్షిక "సంఘ సేవకుని మనస్తత్వం." వ్యాసంలో పరిశీలన గంభీరంగా ఉందని అది చదివిన గోపాలంగారికి తోచింది. వ్యాసకర్త్రిని అభినందించాలని భావించాడు. ఆయన పద్ధతే అంత. ఒక మంచిపని ఎక్కడైనా జరిగితే ఆ కార్యకర్తను అభినందించి వచ్చేదాకా ఆయనకు నిద్ర పట్టదు. అది ఆయన నైజం. కొంతమంది దాన్ని చాదస్త మంటారు. ఎవరు ఏమి అన్నా తన అలవాటును మానుకోడు ఆ పెద్దమనిషి. ఆమె పేరు ఎక్కడో విన్నట్లు తోచింది ఆయనకు. జ్ఞాపకం చేసుకోవడం ప్రారంభించారు. వెంటనే స్ఫురించింది.

తను కాపురముంటున్న బిల్డింగులోనే మూడవ అంతస్థులోనే ఒక ఫ్లాటు వాకిలి తలుపుకు ఆమె పేరుగల సైనుబోర్డును చూచినట్లు గుర్తువచ్చింది. దుస్తులువేసుకొని బయలుదేరాడు రాధమ్మ ఫ్లాటుకు గోపాలరావు.

రాధమ్మ ఫ్లాటు డోర్ బెల్ నొక్కాడు. ఆమే స్వయంగా తలుపుతీసింది. గోపాలంగారిని అంతకుముందు ఆమె ఆ బిల్డింగులో చూచింది కాని పరిచయంకాలేదు. గుర్తుపట్టి సాదరంగా డ్రాయింగు రూంలోకి ఆహ్వానించింది. సోఫాలో కూర్చోమని వారితోచెప్పి పనికత్తెకు రెండు కాఫీలు తెమ్మనమని పురమాయించి డ్రాయింగు రూంలోకివచ్చి ఆయనకు ఎదురుగా కూర్చుంది.

"రాధమ్మగారూ! మీ పేరు విన్నాను. కాని మీ పరిచయ భాగ్యం కలుగలేదు ఇంతవరకు."

"నేనూ తమన్ను గురించి బహుధా విన్నాను. ఏమిటో ఒకే అంతస్తులో కాపురముంటున్నా, ప్రక్కవాటాలలో నివశిస్తున్నా, కలసి మాట్లాడడం జరగలేదు." ఏదో నొచ్చుకుంటున్నట్లు మాట్లాడింది రాధమ్మ.

"మీ వ్యాసం ఈ రోజు 'హిందూ' దినపత్రికలో ఇప్పుడే చదివాను. మీ సునిశిత పరిశోధన నన్ను ముగ్ధుణ్ణిచేసింది. మిమ్మల్ని అభినందించటానికి వెన్వెంటనే బయలుదేరి వచ్చాను." అన్నాడు గోపాలంగారు.

"తమబోటి పెద్దల ఆశీర్వచన ఫలితమే నా కృషి. మీ లాంటి వారి సంఘసేవ ముందు నేను చేస్తున్న పని సూర్యుని ముందు దివిటీ లాంటిది." సమ్రతతో పలికింది రాధమ్మ.

"మా ఆవిడ కాంతం ఉన్నపుడు ఇద్దరం కలసి ఏదో మంచి కార్యక్రామం సాగించేవాళ్ళం. అసలు ఈ నా ప్రయత్నానికి ఆమెదే ప్రోత్సాహం. ఆమె దాటిపోయినా నేను పట్టుదలగాసాగిస్తున్నాను" అన్నాడు తాపీగా.

"అయ్యో! ఆమె చనిపోయారా? పాపం! ఈ వయసులో మీకు ఎంత కష్టంవచ్చింది" సానుభూతి చూపింది రాధమ్మ.

"కష్టాలు మనిషికిగాక మానుకు వస్తాయా. కష్టం వచ్చినందుకుగాదు నేను బాధపడేది. పుట్టినవాళ్ళమంతా గిట్టేవాళ్ళమే. కాంతం నన్ను వదిలి వెళ్ళినందుకు కాదు నాకు దుఃఖం. తను ప్రారంభించిన పనిని పూర్తిచేయకుండా, అది సాగటానికి కట్టుదిట్టాలు చేయకముందే ఆమె చనిపోయినందుకు నా సంతాపం."

ఈ వాక్యాలు విని రాధమ్మ నిశ్చేష్టురాలయింది. 'అబ్బ! ఈ మనిషికి ఎంత గుండె నిబ్బరం! భార్యమీద ఎంత గాఢానురాగం! ఆమె, కాంతం నిజంగా చాల అదృష్టవంతురాలు!' మనస్సులో మెచ్చుకుంది రాధమ్మ.

"మీ దంపతుల సేవాకార్యక్రమాన్ని చూడటానికి నోచుకోని మేము నిర్భాగ్యులం" మనస్ఫూర్తిగా అభినందించింది రాధమ్మ.

"మా కించిత్తు సేవా దృక్పథాన్ని మెచ్చుకోవటం మీ సహృదయత్వానికి నిదర్శనం."

"ఇలా ప్రసంగించటం, ఇంత వినమ్రతను అలవర్చుకోవడం మీ బోటి పండితులకు విజ్ఞులకు మాత్రమే సాధ్యం" మనసారా అభినందిస్తూ గోపాలంగారిని కొనియాడింది.

"ఆ, మర్చిపోయాను. మా సమితి కార్యకలాపాల నివేదికను పంపుతాను. మీరు వాటిలోని లోపాలోపాలను నిర్మొగమాటంగా బహిర్గతపరిచి నాకు తగు సలహాలను ఇవ్వమని మిమ్మల్ని కోరుతున్నాను."

"ఎంత మాట! నేను మీకు సలహాలనివ్వదగ్గ దానినా? ఏదైనా ఆ నివేదికను చదవాలని నాకు కుతూహలంగావుంది. నివేదిక పంపండి."

"మీకు కాలేజి టైం అయినట్టుంది. నేను వెళతాను. వెళ్ళే ముందు ఒక్కమాట. నేను నా మిత్రులు నడిపే అధ్యయన తరగతులలో మేము కోరినపుడు మీరు కనీసం ఒకసారి అయినా ప్రసంగించాలి."

"అలా మీ కోరికను మన్నించడం నా విధ్యుక్తధర్మం; అంతేకాదు నాకు మిక్కిలి సంతోషదాయకం."

"వెళ్తానమ్మా" అంటూ నమస్కరించి వెళ్ళారు గోపాలం గారు. ప్రతి నమస్కారం చేసింది రాధమ్మ.

ఎంత విచిత్ర వ్యక్తి! ఈ రోజు ఆయన పరిచయం కావడం తన అదృష్టమని భావించింది రాధమ్మ.

12

మేజర్ గున్నేశ్వరరావు కల్నల్ కమలాకరరావు పై పెట్టిన వ్యభిచారపు కేసు హైదరాబాదు ఛీఫ్ మెట్రోపాలిటన్ మేజస్ట్రేటు కోర్టులో విచారణకు వచ్చింది. కల్నల్ కమలాకరరావు కోర్టువారు

జారీచేసిన సమనులనందుకొని కోర్టుకు హాజరయినాడు. మామూలుగా సెక్సుకు సంబంధించిన నేరాలపై జనానికి ఆసక్తి ఉండటం వల్లనూ, నిందితుడు పెద్ద మిలటరీ ఆఫీసరు అయినందునను జనం తండోపతండాలుగా కోర్టుహాలు నిండి కూర్చున్నారు. రామలింగం, ప్రభాకర్ ఇద్దరూ కోర్టుకువచ్చారు. గున్నేశ్వరరావు కేసుపిలిచారు. అంతకుముందు కొంచెం రణగొణ ధ్వనిగా వున్న కోర్టు నిశ్శబ్దమయింది. చీమ చిటుక్కుమన్నా వినపడేటంతగా వాతావరణం మారింది. కల్నల్ కమలాకరరావు ముద్దాయిలు నుంచునే బోనులో నుంచున్నాడు. ఇరుపక్షాల న్యాయవాదులు లేచి నిలుచున్నారు.

"ఏమండీ కేసు విచారణ ఎప్పటినుండి ప్రారంభిద్దాము" అన్నాడు జడ్జి.

"చిత్తము. ప్రాసిక్యూషను సాక్ష్యానికి ఒక వాయిదా దయచేయించండి. ప్రారంభం కాగానే వరుసగా ప్రతిరోజూ తమరు విచారణను సాగించవచ్చు" మేజరు గున్నేశ్వరరావు విన్నవించుకున్నాడు.

"అలా కాకుండా, ఫిర్యాది సాక్ష్యం ఒకరోజు, తరువాత నాలుగు రోజులకు ఫిర్యాది తరఫు సాక్ష్యుల వాఙ్మూలాలను తీసుకుంటే బాగుంటుందని నా సూచన" సవరణను ప్రతిపాదించాడు ముద్దాయి తరఫు ప్లీడరు.

బాగుంది అలాగే చేద్దాం. ఫిర్యాది వాఙ్మూలం ఇవ్వటానికి ఫిబ్రవరి పదవ తేదికి వాయిదా వేస్తున్నాను" నిర్ణయం తెలిపాడు జడ్జి.

"చిత్తం" అన్నారు ఇరువురు న్యాయవాదులూనూ. కల్నల్ తరువాతి వాయిదాకు తప్పక హాజరుకాగలనని పూచీకత్తు

ఇవ్వటానికి ఆఫీసులోనికి పోయాడు. జనం కోర్టుహాలులోనుంచి ఒక్కసారిగా లేచారు మాట్లాడుకుంటూ. కోర్టుహాలు బజారు వాతావరణాన్ని పొందింది. కోర్టు బంట్రోతు

"సైలెన్స్" అని కేకలు పెడుతున్నాడు రెండు నిమిషాల కొకసారి. కోర్టు హాలు సద్దుమణగటానికి పావుగంట పట్టింది.

"ఇలాంటి కేసులతో ఇదేచిక్కు" రిమార్కు ప్యాసుచేశాడు జడ్జి.

"ఈ కేసులంటే జనానికి మంచి సరదా" వ్యాఖ్యానించాడు ఒక ముసలి ప్లీడరు.

"ఫిర్యాది, ముద్దాయి సంఘంలో పేరు ప్రతిష్టలున్న వాళ్ళయితే ఇదే సంభవిస్తుంది" అన్నాడు మరో న్యాయవాది.

కోర్టు వెలుపలికివచ్చిన జనానికి ఏదో ఆశాభంగం అయినట్లు ఉంది. వారు వెంటనే వెళ్ళిపోలేదు. అక్కడనుంచుని గుంపులు గుంపులుగా చేరి మాట్లాడుకుంటున్నారు. ఇంతలో ఆఫీసులోంచి వచ్చాడు కల్నల్ కమలాకరరావు.

"ఆయనేనయ్యా ప్రబుద్ధుడు. గున్నేశ్వరరావు కాపురాన్ని చెడగొట్టిన పెద్దమనిషి!" తన అసహ్యభావాన్ని వెలిబుచ్చాడు ఒకడు.

"వాడే గున్నేశ్వరరావుకుటుంబ, జీవితానికి నిప్పుపెట్టిన ఘనుడు" ఇది మరొకని వ్యాఖ్య.

'అందగాడేరా! బహుశః అందుకనే గున్నేశ్వరరావు భార్య ఇతనిపై మోజుపడి ఉంటుంది" మూడవవాని సానుభూతి.

కమలాకరరావును ముప్పది ఏండ్లలోపు యువతి సమీపించింది.

"ఆమే గున్నేశ్వరరావు భార్య. పేరు ఏమిటో?" తికమక పడ్తున్నాడు పేరు తెలియక ఒక ముసలాయన.

"ఆమె పేరు నీరజ" అందించాడు ఒక యువకుడు.

"అబ్బ! ఎంత అందం, ఎంత సౌకుమార్యం, ఎంత లాలిత్యం, ఎంత ఇదీ! ఎంత అదీ! అబ్బో! వర్ణిస్తున్నాడు మరో యువకుడు.

ఇంతలో గున్నేశ్వరరావును చూచాడు ఒకాయన.

"ఆయనే కేసు పెట్టినాయన" అని అరిచాడు కొలంబస్ అమెరికాను కనుగొన్నపుడు ఆతనికి కల్గిన అమిత సంతోషంతో.

"వీడెక్కడ దొరికాడురా. చిప్ప మొహం వీడూనూ ఆ అందాల రాశికి" తన బాధను వ్యక్తం చేశాడు ఒక సౌందర్య పిపాసి.

"ఒక చిన్న గున్న ఏనుగులా ఉన్నాడు. అందుకే ఆమె కమలాకరరావును పట్టుకుంది" నీరజపై సానుభూతిని ఒలకబోసింది ఒక మధ్య వయస్కురాలు.

"ఈ వినాయకుడికి ఆ రతీదేవిని ఇచ్చి పెండ్లి చేయటానికి ఆ తల్లిదండ్రులకు ఎలా మనస్కరించిందో?" సందేహాన్ని ప్రకటించింది ఒక యువతి.

"కట్నాలు, కానుకలు ఇవ్వలేని ఆడపిల్లల తండ్రులు అంతకన్నా ఏం చేస్తారు" ఒక ముసలమ్మ సమాధానపడ్డది. కమలాకరరావు నీరజలను చూచిన జనం రెండు ముఠాలుగా చీలిపోయారు.

"ఎంతయినా ఆడది అంత తెగించకూడదు" అని ఒక ముసలాయన అంటే

"తెగించక ఏం చేస్తుంది? ఆ చిరుబొజ్జ సౌందర్యరాశితో ఏ స్త్రీ కాపురం చేస్తుంది?" ఒక మహిళా కాలేజీ స్టూడెంటు సవాలు చేసింది.

"వాళ్ళిద్దర్నీ చూస్తేనే కడుపు నిండుతుంది" అన్నది ఒక యువతి తన భర్త అనాకారి తనాన్ని గుర్తుచేసుకుంటూ.

"అందాన్ని కొరుక్కు తింటామా? మనిషిలో మంచితనం ఉండాలి కాని" నలుబదిఏండ్ల మధ్య వయుస్కుని రిమార్కు.

"ఆ గున్నేశ్వరరావే ఆమెను కమలాకరరావుతో పరిచయం చేయించి ఉంటాడు" అని ఒక తరుణి వాదం.

"పరిచయం చేస్తే మాత్రం ఇంత దాకా రావాలా వ్యవహారం?" ఒక మగ గొంతు పలికింది. విన్నవారు వెనుదిరిగి చూచారు. ఆ గొంతుక రామలింగంది.

"రాకేంచేస్తుంది? మగవాళ్ళే దుర్మార్గాన్ని ప్రోత్సహిస్తుంటే?" సవాలు చేసింది ఒక స్త్రీ కంఠం.

రామలింగం ఆమెవైపు చూచాడు. ఆమె ఎవరోకాదు ప్రభాకర్ భార్య నిళిని.

రామలింగం ప్రక్కనున్న ప్రభాకర్ భార్యవంక గుడ్లురిమి చూచాడు. ఆమె గుంపులోనుంచి తప్పుకున్నది.

"మగవాళ్ళు ఎలావున్నా దేశ సంస్కృతి ఆడవాళ్ళమీదే ఆధారపడుతుంది." సౌభాగ్యమ్మ తీర్పు.

నీరజది తప్పని కొందరూ, గున్నేశ్వరరావుది తప్పని మరి కొందరూ వాదించుకొని ఒక అరగంట అయిన తరువాత ఎవరి ఇళ్ళకు వాళ్ళు వెళ్ళారు.

సాయంత్రం వెలువడే దినపత్రికలో పతాక శీర్షిక.

"కమలాకరరావు కోర్టుకు హాజరు

విచారణ వాయిదా ఫిబ్రవరి 10"

పత్రిక చదివిన పాఠకులు కొందరు ఫిబ్రవరి 10 న కోర్టుకు హాజరుకావాలని నిర్ణయించుకున్నారు.

13

కేసువాయిదాపడ్డ మరునాడు రామలింగం ఇంటికి ప్రభాకర్ వచ్చాడు. "మనం ఈ కేసులో గున్నేశ్వరరావుకు మద్దతు ఇవ్వాలన్నారుకదా మనమేం చేయాలి" అని రామలింగాన్ని ప్రశ్నించాడు.

"ఆ విషయం మనం గున్నేశ్వరరావుతో మట్లాడితేకాని తెలదు" రామలింగం జవాబుచెప్పి ప్రభాకర్‌ను వెంటతీసకొని గున్నేశ్వరరావు వాటాకు వెళ్ళాడు. వీరి రాకకు గున్నేశ్వరరావు చాల సంతోషించాడు. అతిథిమర్యాదలయిన తరువాత రామలింగం సంభాషణ ప్రారంభం చేశాడు.

"మీ కేసు సంగతి విన్నాం. మీ బోటి మంచివారికి రావలసిన కష్టం కాదిది"

"కర్మపరిపాకం అనుభవించక తప్పదు కదండీ!" తనపై తనే సానుభూతి చూపించుకున్నాడు రావు.

"ఇది మీకు జరిగిన అవమానం మాత్రమే కాదు. పురుష జాతి మొత్తానికి సంభవించిన అప్రతిష్ట" తన భావాన్ని విశద పరిచాడు ప్రభాకరం.

గున్నేశ్వరరావు వారిరువురికి తన కృతజ్ఞత తెలిపాడు.

"మీకు ఏ రకమైన సహాయం కావాలన్నా చేయడానికి సిద్ధంగా ఉన్నాం" హామీ ఇచ్చాడు రామలింగం.

"మావల్ల ఏదైనా సాక్ష్యం కావాలంటే చెప్పండి. మీరు సంకోచించనక్కరలేదు" ప్రభాకర్ తమ సంసిద్ధతను తెలియ పరిచాడు.

"మీ బోటివారి అండదండలుంటాయనే ధైర్యంతోనే నేను ఈ వ్యవహారంలోకి దిగాను" గున్నేశ్వరరావు తన విశ్వాసాన్ని వెలిబుచ్చాడు.

గున్నేశ్వరరావు రామలింగం, ప్రభాకర్‌లను తన ప్లీడరు వద్దకు తీసుకొనివెళ్ళాడు. ఆ ప్లీడరు పేరు సీతారామయ్య. కేసు పట్టే జలగలా పట్టుకుంటాడని ప్రతీతి. సీతారామయ్యకు మూడు సంవత్సరాల క్రితం ఒకపెద్ద ఆపద సంభవించింది. ఆయన భార్య తారాదేవి తన ముగ్గురి పిల్లల్నూ భర్త మొగానపడేసి తన కన్నా పదేండ్ల తక్కువ వయస్సువున్న యువకుడితో పలాయనం చిత్తగించింది. వారి జాడ ఇంతవరకు ఆయనకు దొరకలేదు. అప్పటినుంచి సీతారామయ్య స్త్రీ ద్వేషిగా పేరు సంపాదించు కున్నాడు. ఈ విషయం తెలిసే గున్నేశ్వరరావు ఈ ప్లీడరును ఎంపికచేసుకున్నాడు. ప్లీడరు అసమర్థుడేంకాదు; పెద్ద తెలివి తేటలు లేకపోయినా కేసును జాగ్రత్తగాచేస్తాడని ప్రతీతి. అయినా

ప్రతిభ ఎవరికి కావాలి. వెయ్యి కేసులలో ఒక్కదాంట్లో మాత్రమే మేధాశక్తి నివినియోగించాల్సివస్తుంది. సీతారామయ్య గున్నేశ్వర రావును చూచి తల పంకించాడు.

"తమతో ఏకాంతంగా మాట్లాడాలి" అన్నాడు రావు.

తన క్లయింటును, ఆయన వెంటనున్న రామలింగం, ప్రభాకర్‌లను సీతారామయ్య మరోగదిలోకి తీసుకొనివెళ్ళాడు.

సుఖాసీనులయిన తరువాత రామలింగం, ప్రభాకర్‌లను పరిచయం చేశాడు రావు.

"చెప్పండి విషయమేమిటో" అన్నాడు ప్లీడరు.

"నా కేసులో సాక్ష్యం కావాలన్నారుకదా. ఈ మిత్రులు సాక్ష్యం చెప్తామన్నారు" రావు తను వచ్చినపనిని సూచించాడు.

"వీరి కాపురము ఎక్కడ?" న్యాయవాది ప్రశ్న.

"నేనున్న బిల్డింగులోనే. నేనువుండే అంతస్తులోనే. నాది 302 నెంబరు ఫ్లాటు. రామలింగంగారిది 303 నెంబరు ఫ్లాటు. ప్రభాకర్ గారు మరోప్రక్క 301 నెంబరు వాటాలో కాపురముంటు న్నారు."

రావు సమాధానం సీతారామయ్యకు ఎంతో హాయినిచ్చింది. ఎగిరి గంతేసినట్లయింది. 'హమ్మయ్యా' అంటూ ఉచ్ఛ్వాసనిశ్వాసాలు విడుస్తూ "రావుగారూ! ఇంతవరకు మీ ఒక్కరి సాక్ష్యంమీదే ఆధారపడి కేసు గెలిపించాల్సి వస్తుందని భావిస్తూవచ్చాను. ఇక కేసుకేం ఢోకాలేదు. కేసు మీరు గెలిచినట్లే. కమలాకరరావుకు రెండేండ్ల జైలుశిక్ష తప్పదు. నాది పూచీ. విచారణ వాయిదా రోజున మీ సాక్ష్యం పూర్తికాగానే వీరి పేర్లతో సాక్షులజాబితా దాఖలుచేద్దాం. మరి నాలుగురోజుల తరువాత వీరి వాఙ్మూలాలు

తీసుకోవడం జరుగుతుంది. కాకపోతే వీరి విచారణ వాయిదా రెండు రోజులుందనంగా వీరిని ఒకసారి నా వద్దకు తీసుకురండి. వారి సాక్ష్యం ఎలా రూపొందాలో తేల్చుకుందాం." అనిచెప్పి సీతారామయ్య సాక్ష్యం చెప్పడానికి ముందుకువచ్చిన రామలింగం ప్రభాకర్‌లను అభినందించాడు. ప్లీడరుగారివద్ద సెలవుతీసుకొని ముగ్గురూ వెళ్ళిపోయారు.

ప్రభాకర్ విజయగర్వంతో ఇంటికి వేంచేశాడు. త్వరగా భోజనంపెట్టమని ఆఫీసుకువెళ్ళాలని భార్య నళినిని తొందరపెట్టాడు. ఆమెకు ప్రభాకర్ ప్రవర్తనపై ఇటీవల కొంత అనుమానం ఏర్పడింది.

"ఈ రోజు ఇంత ప్రొద్దున్నే ఎక్కడికివెళ్ళారండీ" గోముగా అడిగింది.

"ఎక్కడికి వెళ్ళానా? రామలింగంగారితో కలసి గున్నేశ్వర రావు ప్లీడరు దగ్గరకు వెళ్ళివచ్చాను" తానేదో వీరోచిత కార్యం నెరవేర్చినంత ధీమాగా పలికాడు ప్రభాకర్.

"మీకేం సంబంధమండీ ఆ కేసుతో" సంజాయిషీ కోరింది నళిని.

"సంబంధమా! ఆ కేసుతో ప్రతిపురుషుడికి సంబంధంవుంది; ఉండాలికూడా. పురుషుడికి జరిగిన అపచారానికి శిక్ష పడాల్సిందే"

"ఇంతకూ, మీరు చేయగలిగిందేముందండీ? మీరు ఎప్పుడైనా ఆ రావుగారితో మాట్లాడి ఎరుగుదురా మునుపు!" విషయాన్ని రాబట్టాలనే ఆకాంక్షతో నళిని ప్రశ్నలు వేసింది. ఈ రోజు ప్రభాకర్ పెద్ద ఆత్మవిశ్వాసంతో ఇంటికివచ్చాడు; కనుక రహస్యాన్ని దాచేప్రయత్నం చేయలేదు.

"రావు తరఫున సాక్ష్యం చెప్పటానికి అంగీకరించివచ్చాను. పత్రిక్కవాటా వాడిని కనుక నా సాక్ష్యానికి విలువ జాస్తివుందట. ఆ రోజున కోర్టు ఆవరణలో ఏ నీరజపై నీవు పరోక్షంగా సానుభూతి చూపించావో ఆ నీరజ ప్రియుడు కమలాకరరావుకు రెండేండ్లు జైలు జీవితం ఖాయం!!" విజయగర్వంతో ధీమాగా సమాధానం చెప్పాడు ప్రభాకర్.

భర్త మాటలకు ఉలిక్కిపడింది నళిని. తన భర్త ప్రయత్నాన్ని విరమింపచేయాలని దింపుడు కళ్ళ ఆశతో

"ఆ కమలాకరరావు మీకు ఏం అపకారం చేసాడండీ. ఆయన ముక్కు మొగంకూడా మీకు తెలియవుగదా! అనవసరంగా ఒకరికి కీడెందుకు తలపెట్టాలి'' అడిగింది నళిని.

"వాడెవడో నాకేం తెలుసు. నేనెప్పుడు చూచాను వాడిని. అదికాదు అసలు వ్యవహారం. ఒక స్త్రీ తన భర్తయెడ చేసిన ద్రోహానికి అతగాడు శిక్ష అనుభవించాల్సిందే" రామలింగంచేసిన ధర్మోపదేశాన్ని సంక్షిప్తంగా బయటికికక్కాడు.

నళిని ఇక సంభాషణ కొనసాగించలేదు. భర్తకు భోజనంపెట్టి అతనిని ఆఫీసుకు సాగనంపింది.

తను వెంటనే భోంచేసింది. పిల్లలను దాదికి వప్పచెప్పింది. భర్త ఆఫీసునుంచి వచ్చేలోగా పని పూర్తిచేసుకోవాలని తలచింది. నీరజను కలిసికోటానికి బయలుదేరింది. నీరజ అక్కగారింట్లో ఉంటుందని తను విన్నది పనిమనిషిద్వారా. నీరజకూ, తనకూ మొదట్లో ఒకే పనిమనిషి ఉండేది. ఆమె చెప్తుంటుంది నీరజ విషయాలు. నీరజ అక్కగారింటికి వెళ్ళింది నళిని. నీరజ తలుపు తీసింది. నీరజ అక్కగారు ఇంట్లోలేదు. ఆమె ఒక్కతేవుంది. అది మంచిదేనని భావించింది నళిని.

నళినిని చూడగనే నీరజకు ఆశ్చర్యం కలిగింది. తనను స్త్రీ పురుషులంతా ద్వేషిస్తున్నారని చింతిస్తున్న నీరజకు నళినిరాక విచిత్రంగా కనపడటంలో విడ్డూరంలేదు. తేరుకొని నవ్వుముఖంతో నళినిని ఆహ్వానించి మర్యాద చేసింది. నళినికి సంభాషణ ఎలా మొదలుపెట్టాలనే విషయంలో కొంత బిడియమూ కొంతగా భయ సందేహాలు పొడసూపాయి.

చల్లకొచ్చి ముంతదాచడమెందుకని సూటిగా మాట్లాడు దామని అనుకుంది.

"నీరజగారూ! మీ కేసులో మా వారు గున్నేశ్వరరావుగారి తరఫున సాక్ష్యం చెప్పటానికి నిశ్చయించుకున్నారు." సమాచారం అందించింది నళిని.

తననేదో ఓదార్చటానికి వచ్చిందని, తనకు సాయపడటానికి తయారయిందని అనుకున్న నళిని ఇలా మాటలు మొదలుపెట్టేసరికి నీరజకు షాక్ తగిలినట్లయింది. ఆమె తల ఒక్కసారిగా దిమ్మెక్కింది. చాలా నిగ్రహంతో "అలాగా'' అని అతికష్టంమీద అనగలిగింది.

"నేను ఎంత వద్దన్నా ఆయన వినేటట్లులేరు. కనుక నేను మీ తరఫున సాక్ష్యం చెప్పటానికి నిశ్చయించుకుని మీ దగ్గరకు వచ్చాను." అంది ఆప్యాయంతో బుజంమీద చెయ్యేసి.

నీరజకు మళ్ళీ మరో విద్యుదాఘాతం. చటుక్కున కుర్చీలో నుండి లేచి నళిని కూర్చున్న సోఫాలోకిచేరి నళినిని కౌగిలించుకున్నది అమిత వాత్సల్యంతో.

''మీ రుణం ఎలా తీర్చుకోగలనో నేను చెప్పలేను. కమలాకరం ప్లీడరుతో మాట్లాడి ఈ విషయంమీద ఒక నిర్ణయానికి వద్దాం.

నాకు అక్కచెల్లెళ్లు నా అన్నవారు ఎవరూ ఇంతవరకులేరు. ఇక నుండి నాకు మరో సోదరి లభించిందన్నమాట" కృతజ్ఞతను ప్రకటించింది నీరజ. ఇంతలోనే మరో అనుమానం నీరజ మనస్సులో ప్రవేశించింది.

"నళినీ! ఇకనుండి మనమధ్య గారులు, గౌరవవాచక సంబోధనలు వద్దు; మనమిద్దరం అక్కాచెల్లెళ్ళం."

"అలాగే నీరజా" అన్నది నళిని అమితానందంతో.

ఈ సంబోధన నీరజకు ఎంతో తృప్తిని కల్గించింది. నళినిని పూర్తిగా విశ్వసించవచ్చనే ధైర్యం వచ్చింది.

'అక్కా! ఈ కేసులో నా తప్పేమీలేదమ్మా. అంతా గున్నేశ్వరరావు ఎరుక సమ్మతులతోనే నడిచింది." అన్నది నళిని.

"నేను అదే ఊహించాను చెల్లీ!" నళిని తన ఊహ సరియైనందుకు సంతోషిస్తూ అన్నది.

నీరజకు ఒక్క ఆలోచన వచ్చింది. కాని తనవల్ల నళినికి అపకారం జరుగరాదు. నళిని నీరజకు అనుకూలంగా సాక్ష్యంచెప్తే ఆమెకు భర్తవల్ల ఏదైనా అపాయం సంభవిస్తుందేమో!

"అక్కా! నాకు భయంగావుంది. నీవు నన్ను బలపరిస్తే మీ వారు, మీ వారు ...." నళిని తన మనస్సులో మాట చెప్పేసింది.

"అదా నీ భయం. ఆ విషయం నేను చూచుకుంటాను. అదీగాక స్త్రీజాతికి అన్యాయం జరుగుతుంటే సహించి ఊరుకోవడం కన్నా ఎదిరించి కష్టాలు పడటం విజ్ఞత అవుతుంది."

నళిని ఆత్మవిశ్వాసానికి నీరజ అచ్చెరువు పోయింది. మళ్ళీ ఆమెను కౌగిలించుకొని ఆమెను సగౌరవంగా, ఆప్యాయంగా బస్సు స్టాప్‌దాకా వచ్చి సాగనంపింది.

ఇంటికి తిరిగివస్తున్న నీరజకు తళుక్కున ఒక ఆలోచన బుర్రలో తిరిగింది. ఈ విషయంలో రుక్మిణి సాయంకూడా కోరితే. ఆమె నిదానస్తురాలు. అలాంటి ఆమె సాయం లభిస్తే నీరజ గట్టెక్కినట్లే. రుక్మిణి కాపురముండే 305 నెంబరు ఫ్లాటులోకి వెళ్ళింది. రుక్మిణికి కేసు విషయం, తను కోర్టు ఆవరణలోవిన్న మాటలు అన్నీ చెప్పింది. ఆమె విని ఊరుకున్నది. నీరజ అసలు విషయం బయటపెట్టింది. ఆడవాళ్ళంతా పురుషజాతి చేసే అన్యాయాలను అరికట్టాలన్నది. పురుషులుచేసే కుతంత్రాలను చైతన్యం కల స్త్రీలు ఎదుర్కోవాలన్నది. ఇవన్నీ రుక్మిణిపట్ల స్పందన కలుగజేయలా.

రుక్మిణి అంతావిని ఒక్కమాట అన్నది
"ఆడవాళ్ళం ఏం చేయగలం."

తను సమయం కాని సమయంలో వచ్చానేమోనని నీరజకు తోచింది. వెంటనే వెళ్ళివస్తానని చెప్పి తన ఇంటికి చేరింది.

14

గుణ్నేశ్వరరావు కేసువిచారణ ప్రారంభమయిన మరురోజున ప్రొద్దున వెలువడే దినపత్రికలు పతాక శీర్షికలతో ఆ కేసు వార్తలను ప్రకటించాయి. వెంకట్రావు ఆ పత్రికలను రెంటిని చదివాడు. అందులో గుణ్నేశ్వరరావు తాముండే బిల్డింగులోనే మూడవ అంతస్తులో 302 నెంబరు ఫ్లాటులో తన భార్యతో నివసించేవాడని రాశారు పత్రికలవాళ్ళు. ఈ వార్త తనకు ఆశ్చర్యం కలుగజేసింది. తనెప్పుడూ లిఫ్టుదిగి తన ప్రక్కనున్న ఫ్లాటులోకి పోవడమేగాని

ఇతర ఫ్లాటులలోవున్న వారి విషయం ఏనాడూ పట్టించుకోలేదు. తనిది అలాంటి మనస్తత్వం. ఇంతలావు కేసు తన బిల్డింగులో జరగటం, తనకు ఇన్నాళ్ళనుండీ తెలియకపోవడం తనకు తప్పుగా తోచలేదు. ఎలా 'మిస్' అయ్యాడో ఏమో అంతకుముందు ప్రకటింపబడిన వార్తను తను చూడలేదు.

వార్తంతా పూర్తిగా చదివిన వెంకట్రావుకు కోపంవచ్చింది. ఎవరిమీద? స్త్రీ జాతిమీద. అంత నమ్మకాన్ని పురుషులు తమపై ఉంచితే వాళ్ళు దానిని దుర్వినియోగం చేస్తున్నారు. ఇంతలో తన సొంతవిషయం గుర్తుకొచ్చింది. తన భార్య పద్మిని యొక్క పూర్వచరిత్ర తెలిసే తను ఆమెను వివాహమాడాడు. అంతకుముందు తన జీవితంలో తనకు పద్మినిలాంటి చాలాకీపిల్ల తటస్థించలేదు. ఈ దేశపు కళాశాలల్లో చదివే ఆడపిల్లలు అల్లరిచిల్లరిగ తిరిగినా వివాహమయిన తరువాత బుద్ధిగ ఉంటారని అతడు అనేక నవలల్లో చదివాడు. సెక్సు విషయంలో స్వైరవిహారం సాగే అమెరికాలో కూడా పెండ్లి అయిన తరువాత స్త్రీలు ఎంచక్కా గృహిణిగా జీవితాన్ని గడుపుతారని, భర్తలయెడ విశ్వాసంతో ఉంటారని తను ఎన్నో అమెరికను నవలల్లో చదివాడు; ఎన్నో అమెరికను కుటుంబాలను చూచాడు తను అదేశంలో ఉన్నపుడు. కాని పద్మిని - తన పద్మిని - తన ఆశను నిరాశచేసింది; చేస్తున్నది. పూర్వ స్నేహితులను ఆదరిస్తున్నది; సూర్యారావును ప్రోత్సహిస్తున్నది. తనకు బాధ కలుగకపోలేదు.

ఈ పరిస్థితిలో మగవాడు - అందులోనూ పరువుగలవాడు ఏం చెయ్యాలి? గున్నేశ్వరరావులాగా భార్యమీద కేసుపెట్టి పరువు ప్రతిష్టలను మంటగలుపుకోవాలా? లేక భారత గ్రామాల లోని పురుషులవలె విజృంభించి భార్యను ముక్కలు ముక్కలుగా

నతికెయ్యాలా? అదికాక మూడో మార్గంగా చూస్తూ, సహిస్తూ, ఊరుకోవాలా? ఏది ఉచితం, ఏది అనుచితం. మహాత్మాగాంధి చనిపోయినపుడు శ్రీశ్రీ వ్రాసిన 'ఏది సత్యం ఏదసత్యం' అనే గేయం స్ఫురణకు వచ్చింది. పద్మినిలాంటి యువతిని హింస పెట్టటమా? అసభవం. చూస్తూ కిమిన్నాస్తి అని కాలం గడపటం మహా కష్టతరం. పోనీ ఆమెను తన్ని తగలేసి సూర్యారావు మీద కేసుపెడ్తే? ఈ భావానికే తను అదిరిపోయాడు. అది తనకు అలవి కానిపని. తనను గురించి అందరూ ఎగతాళిగామాట్లాడటాన్ని సహించలేడు. తల బ్రద్దలు కొట్టుకున్నాడు. మరోమార్గం ఉందేమోనని. ఆ! స్ఫురించింది. పద్మినిని తను వదిలేస్తే!, ఆమెకు విడాకులిస్తే! ఇది మంచి అభిప్రాయమని అనిపించింది. కాని ఆలోచించినకొలదీ ఆ మార్గం తనకు అంతగా మంచిదిగా కన్పడటం లేదు. కారణం ఒకటికాదు. అనేకం ఉన్నాయి.

పద్మినిలాంటి చలాకీగల స్త్రీ ఈ ప్రపంచంలో ఉన్నదా అనే సందేహం తనకుకలుగుతూవుంటుంది. ఎప్పుడూ నవ్వుతూ, పేలుతూ ఉంటుంది. ఆమెనుచూస్తే ఎంతటి దౌర్భాగ్యుడు, నిరాశోపహతుడు కూడా జీవితం సాగించడానికి కుతూహలపడతాడు. అది అలా ఉంచండి. ఆమెలాంటి ఇల్లాళ్ళు ఈ భూ ప్రపంచంలో ఎందరు. ఇంటి అలంకరణకు ఆమె పెట్టింది పేరు. ఆ డ్రాయింగు రూము, ఆ డైనింగు ప్రదేశం, బెడ్‌రూమూ, కారిడరు, చివరకు వంటఇల్లు కూడా ఎంత అందంగా తీర్చిదిద్దుతుందో!. తన ఇంటికి వచ్చే వారంతా తనను అభినందించేవాళ్ళు. నిజానికి ఆ అభినందనలు ఆమె కోసం ఉద్దేశించబడేవి. పెండ్లి అయిన తరువాత తను ఏనాడు తన దుస్తుల విషయం ఆలోచించలేదు. తన కళ్ళజోడు,

రిస్టువాచీ, పెన్ను, నెక్‌టైలు, సాక్సు, బూట్లు, ఓ! ఒకటేమిటి సమస్తం ఆమె ఎంపికచేసినవే. తనని మంచి దుస్తులు ధరించే వాడిని అభివర్ణించేవారు సాటివారు. ఇవన్నీ ఒక ఎత్తు. డబ్బు పెత్తనం మరో ఎత్తు. డబ్బు సంపాదన మార్గాలు తెలుసు తనకు; సంపాదిస్తున్నాడు తను. కాని ఎంత ఖర్చుపెట్టాలో ఎంత ఆదా చేయాలో తనకు తెలియదు. ఆ విషయంలో పద్మిని మహానేర్పరి. ఆమె లోభికాదు; దర్జాగా ఖర్చుపెడుతుంది; కాని అనవసరంగా ఒక్కపైసా వృథాచేయదు. ఆదాచేయుటం కోసం ఆమె ఆరాట పడ్డట్లు కనిపించదు; కాని ఆదాచేయకుండా ఉండదు. ఆమెలో ఒక రకమైన సౌకుమార్యం కూడావుంది. ఆమె దుబారాగా ఖర్చు పెట్టున్నట్లు కన్పడినా అందులోనూ అందమే. ఆమె మామూలుగా వంటచేయదు. ఎప్పుడైనా సరదాగాచేస్తే ఆ రోజు నిజంగా విందే. అది దంతసిరికల తనబోటి వాళ్ళకూ తన ఇంటికి అపుడపుడువచ్చే ముఖ్య అతిధులకు మాత్రమే తెలుస్తుంది. ఇన్ని దేశాలు తిరిగిన తనకు ఆమె వంట నిత్యనూతనంగా ఉండేది. ఈ నెల చేసిన వంట మరోనెల చేయదు; వైవిధ్యం ఆమె లక్షణం. నూతనత్వాన్ని ఆమె అభిలషిస్తుంది కామోసు. అందుకే సాదా జీవితాలు గడిపే వారంటే ఆమెకు విసుగు.

వీటినన్నింటిని విస్మరిద్దామన్నా మరచిపోవటానికి వీలులేని విషయం మరొకటివుంది. ఆమెకు సంకల్పం కలిగినప్పుడు తనను ఎంతగా అలరింపజేస్తుందో! ఆమెతో ఈనాటి పొందువేరు; తరువాతి పొందువేరు. దేనికదే విశిష్టతకలది; ప్రతి కలయికలో సొగసూ, సొబగూ, వినూతనత్వం, కళా, కాంతీ అన్నీవుంటాయి. సెక్సు జీవితంలో తను ఏనాడూ ఇబ్బందిపడలేదు. ఇచ్ఛా అయిచ్ఛ లను ఇట్టే పసిగట్టగల జాణతనం ఆమెది. అంతేనా! నిన్నగాక

మొన్న రాత్రి తనను ఆనందరసాబ్ధిలో తేలియాడజేసింది. అటు వంటి అనుభూతులెవరికి దక్కుతాయి! అలాంటి పద్మినిని తను వదిలి జీవించలేడు. అసంభవం. ఆ నాలుగో మార్గానికి స్వస్తి పలికాడు వెంకట్రావు.

మళ్ళీ ఆలోచించడం ప్రారంభించాడు. బుర్ర వేడెక్కి పోతుంది. ఇక మూడో మార్గమే శరణ్యమనుకున్నాడు. తనకు ఆనందాన్ని పంచి ఇస్తున్నంత కాలం, తనకు సుఖ సంతోషాలు చేకూరుస్తున్నన్నాళ్ళూ తను ఆమె మార్గానికి అడ్డు రాకూడని నిశ్చయించుకున్నాడు.

ఈ దృష్టితో చూస్తుంటే గున్నేశ్వరరావు పొరపాటు చేశాడనే అభిప్రాయానికి వచ్చాడు.

ఇలా ఆలోచిస్తూ చేతిలో పేపరుతో కూర్చున్న వెంకట్రావు బుజంపై మృదుహస్త స్పర్శ తగిలింది. తల ఎత్తి చూచాడు. కాఫీకప్పుతో చిరునవ్వులొలకపోస్తూ దర్శనమిచ్చింది పద్మిని. కాఫీకప్పు చేతికిచ్చి, సరసన కూర్చొని, అతని చేతిలోని పేపరుతీసి అవతలపారేసి, తన చేతితో వెంకట్రావును చుట్టేసింది పద్మిని. తత్క్షణమే రావు పద్మిని బాహుపంజరంలో బంధితుడయ్యాడు.

15

ఆ రోజు ఫిబ్రవరి 10, మెట్రోపొలిటను మేజస్ట్రేటు కోర్టు హాలు క్రిక్కిరిసివుంది. బెంచీలు చాలకపోతే కొంతమంది నేలపై కూర్చున్నారు. చాలమంది తలుపుల దగ్గర, కిటికీలవద్ద పట్టక కారిడరులో నుంచున్నారు. మొదటి రోజుకన్నా జనం ఎక్కువ మందివచ్చారు. విచిత్రమేమంటే స్త్రీలు చాలఎక్కువమంది వచ్చారు

ప్రేక్షకులుగా. జడ్జీగారు తన హోదా చాల పెరిగినట్లు ఊహించు కుంటున్నాడు. చివరకు పార్టీల పేర్లు పిలిచే కోర్టు బంట్రోతుకు కూడా ఇతోధిక గౌరవం వచ్చింది అనాడు. 'సైలెన్సు' అని కేకలు వేస్తున్నాడు అతడు. అతని దుస్తులు, అతని డవాలు, తలగుడ్డ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించాయి. పేలవంగావుండే బెంచిగుమస్తా గొంతు ఆ రోజున ఖంగున మోగుతున్నది.

గున్నేశ్వరరావు కేసు పిలిచాడు బెంచిగుమస్తా. "కమలాకర రావు! కమలాకరరావు! కమలాకరరావు" అని కేకపెట్టాడు కోర్టు బంట్రోతు. అతడు వచ్చి ముద్దాయిలకు నిర్దేశింపబడిన బోనులో నిలబడ్డాడు. కలకలం బయలుదేరింది కోర్టుహాలులో. సైలెన్సు అని అరిచాడు బంట్రోతు. నిశ్శబ్దత ఆవరించింది.

గున్నేశ్వరరావు ప్లీడరు సీతారామయ్య లేచి నిలుచున్నాడు. ముద్దాయికి ప్లీడరున్నాడా అని అడిగాడు మేజస్ట్రీటు. అంత వీరభద్రయ్యగారు లేచి తను ముద్దాయి తరఫున వాదిస్తున్నానని మెమో దాఖలుచేసి కూర్చున్నాడు.

"కేసు స్వభావమేమిటి? దాని అంశాలేమిటి. ఎలా రుజువు చెయ్యదల్చుకున్నారు? వివరించండి" అంటూ మేజస్ట్రీటుగారు సాభిప్రాయంగా సీతారామయ్య వైపు చూచారు.

సీతారామయ్య లేచి గొంతు సవరించుకున్నాడు. కోర్టు హాలుచుట్టూ కలయజూచాడు. కమలాకరరావువైపు కాసేపు దృష్టి సారించాడు. తరువాత మేజస్ట్రీటువైపు తిరిగి కేసును గురించి ఉపోద్ఘాతం మొదలుపెట్టాడు.

"ఫిర్యాది గున్నేశ్వరరావు సైన్యంలో మేజరు. అతని భార్య పేరు నీరజ. ఆమె తనభర్తపై ఆఫీసరయిన కల్నల్ కమలాకర

రావుతో వ్యభిచరించింది. ఇదంతా డిసెంబరు 1981 లో జరిగిన గాథ. అంత భారత శిక్షాస్మృతి 497 సెక్షను క్రింద నా క్లయింటు ముద్దాయిపై కేసు దాఖలుచేశాడు. ఫిర్యాది సాక్ష్యం తీసుకోవటానికి ఈ రోజుకు కోర్టువారు కేసును వాయిదా వేశారు."

"కేసులో ఏ అంశాలు ప్రాముఖ్యత వహిస్తాయి?" ఇది మేజస్ట్రీటుగారి ప్రశ్న.

నేను ఫిర్యాది తరఫున అయిదు అంశాలు రుజువుచేయవలసి వుంది.

1) ముద్దాయి నీరజతో లైంగిక సంపర్కం పొందాడు.
2) నీరజ గున్నేశ్వరరావు భార్య.
3) నీరజ ఫిర్యాది భార్యయని ముద్దాయికి తెలుసు.

4) ముద్దాయికీ నీరజకూగల సంబంధం ఆమె భర్తయైన ఫిర్యాది ఎరుక సమ్మతులు, లాలూచీ లేకుండా సాగింది.

5) ఈ సంపర్కం నీరజకు అయిష్టంగా జరిగిందికాదు; దానిలో 'రేప్' నేర స్వభావంలేదు."

అంటూ ఫిర్యాది ప్లీడరు తన పాయింట్లను వివరించాడు.

"మరి మీ సాక్ష్యాధారాలు ఏమిటి?" మేజస్ట్రీటు ప్రశ్నించాడు.

"వివాహం చేయించిన బ్రాహ్మణుడు, పెండ్లికివచ్చిన పెద్ద, పెండ్లి శుభలేఖ, ఫిర్యాదుల సాక్ష్యం ఫిర్యాది నీరజల పెండ్లిని రుజువుచేయడానికి ఉపయోగపడతాయి. ఇకపోతే నీరజ ఫిర్యాది భార్యఅని ముద్దాయికి తెలుసనటానికి ఒక సాక్షి, ఫిర్యాది ఉన్నారు. అసలు నేరాన్ని రుజువుచేయటానికి ఫిర్యాది, మరి ఇద్దరు సాక్షులూ

ఉన్నారు." ముక్తసరిగా ముగించాడు సీతారామయ్య. కూర్చునే టప్పుడు విజయసారథియైన వీరుడిలా పోజుపెట్టి ప్రేక్షకులను అదోలాచూచి మరీ తన కుర్చీలో కూర్చున్నాడు.

కొంత రికార్డు తిరగవేశారు మేజస్ట్రీటుగారు అయిదు నిమిషాలు.

సీతారామయ్య తిరిగిలేచాడు.

"కోర్టువారికి అభ్యంతరం లేకపోతే, ముద్దాయి తరపు ప్లీడరుగారు సమ్మతిస్తే ఈ రోజే పెండ్లికి సంబంధించిన సాక్ష్యం కూడా పెడతాను." అన్నాడు.

వీరభద్రయ్యగారి వంక చూచాడు మేజస్ట్రీటు.

"నాకు అభ్యంతరం లేదు" అన్నాడు ఆయన.

"కోర్టువారి సమ్మతితో సాక్షుల వరసను మారుస్తాను. ముందు పెళ్ళి విషయం సాక్ష్యంపెట్టి చివరకు ఫిర్యాదిని బోనులో ప్రవేశపెట్తాను" అన్నాడు సీతారామయ్య.

చిరాకుపడ్డారు మేజిస్ట్రీటుగారు.

వీరభద్రయ్య వంక తిరిగి

"మీకేమైనా దీని విషయంలో అసమ్మతివుందా?" అడిగారు మేజస్ట్రీటుగారు.

"సరే! అలాగే కానివ్వండి" జవాబుచెప్పాడు వీరభద్రయ్య.

హాలులో గుసగుసలు బయలుదేరాయి.

'భలే తెలివిగా నడుపుతున్నాడురా కేసున ఫిర్యాది తరపు ప్లీడరు' అని కొందరంటే "ముద్దాయి తరపు ప్లీడరుచూడు

ఎంత నింపాదిగా నిండుకుండలాగ వ్యవహరిస్తున్నాడో" మరి కొందరు వ్యాఖ్యానాలు చేశారు.

"సాక్షి పేరుచెప్పండి" అన్నాడు బెంచి గుమాస్తా.

"విద్యారణ్యశాస్త్రి" సీతారామయ్య చెప్పాడు.

బెంచి గుమాస్తా "విద్యారణ్యశాస్త్రిని పిలువవోయి" అని కోర్టు బంట్రోతుకు పురమాయించాడు.

"విదారణశాస్త్రి" అని మూడుసార్లు కేకేశాడు బంట్రోతు. హాలంతా విరగబడి నవ్వింది. మేజస్ట్రీటుగారుకూడా నవ్వు ఆపుకోలేకపోయారు. 'సైలెన్స్' అని మళ్ళీ అరిచాడు బంట్రోతు.

విద్యారణ్యశాస్త్రివచ్చి సాక్షిబోనులో నిలబడ్డాడు. దేవుని మీద ప్రమాణం చేయించాడు బంట్రోతు.

సీతారామయ్యలేచి సాక్షినుద్దేశించి ప్రశ్నలు వేయడం సాగించాడు.

"మీ పేరు"

"విద్యారణ్యశాస్త్రి"

"మీరేం చేస్తుంటారు"

"పౌరోహిత్యం"

"ఏ ఊళ్ళో"

"హైదరాబాదు సికిందరాబాదు జంటనగరాల్లో"

ఫిర్యాదిని పిలవమన్నాడు సీతారామయ్య.

"గున్నేశ్వరరావును పిలవవయ్యా" అని బంట్రోతుకు చెప్పాడు బెంచిగుమస్తా.

"గున్నేశ్వరర్రావూ" అని వత్తి వత్తి పలుకుతూ మూడుసార్లు కేకేశాడు బంట్రోతు. మళ్ళీ శ్రోతలు గొల్లుమన్నారు. పాపం! అర్థంకాలేదు బంట్రోతుకు తన తప్పేమిటో. బిక్కమొగం వేశాడు. మేజస్ట్రీటుగారు తన బల్లమీద ఉన్న బెల్ నొక్కాడు. అదిచూచిన జనం, గంటవిన్నజనం సద్దుమణిగింది.

గున్నేశ్వరరావువచ్చి సాక్షిబోనుప్రక్క నుంచున్నాడు.

సీతారామయ్య మళ్ళీ మొదలుపెట్టాడు విచారణ.

"మీరు ఈ వ్యక్తిని చూచారా ఇంతకుక్రితం" అని గున్నేశ్వరరావువైపు వేలుచూపాడు.

"ఆయన తెలుసు. వారు మేజర్ గున్నేశ్వరరావుగారు"

గున్నేశ్వరరావును వెళ్ళిపొమ్మన్నాడు సీతారామయ్య.

"ఏ సందర్భముగా మీకు ఆయన తెలుసు"

"వారి పెండ్లిని నేను హిందూశాస్త్రప్రకారం చేయించాను"

"ఏ ఊళ్ళో"

"హైదరాబాద్‌లో విజయనగర్ కాలనీ కమ్యూనిటీహాలులో"

"ఎవరితో"

"నీరజ అనే అమ్మాయితో"

"తరువాత ఆమెను ఎప్పుడైనా చూచారా"

"వారింట్లో సంవత్సరానికి ఒకసారి సత్యనారాయణవ్రతం చేయించేవాణ్ణి. అలా మూడుసంవత్సరాలు చేయించాను. వారిరువురు పీటలమీద కూర్చునేవారు."

"దట్స్ ఆల్" అని సీతారామయ్య కూర్చున్నాడు.

మేజస్ట్రీటుగారు వీరభద్రయ్యనిచూచి "క్రాసు ఎగ్జామినేషను చేస్తారా?" అన్నాడు.

"నో క్రాస్" అన్నాడు వీరభద్రయ్య.

"మీరు వెళ్ళవచ్చు" అని గుమస్తా సాక్షితో చెప్పాడు.

"మరోసాక్షి పేరు" అడిగాడు బెంచిక్లర్కు.

"రామారావు" బదులుపలికాడు సీతారామయ్య.

"ఈయనను ఎరుగుదురా" గున్నేశ్వరరావును చూపుతూ సీతారామయ్య ప్రశ్న పరంపర మొదలెట్టాడు.

"వారు మేజర్ గున్నేశ్వరరావుగారు"

గున్నేశ్వరరావును బయటికి పొమ్మని సైగచేశాడు సీతారామయ్య.

"మీకు గున్నేశ్వరరావు ఎలా తెలుసు"

"ఆయన పెండ్లికి నేను హాజరయినాను"

"ఏ ఊళ్ళో"

"హైదరాబాద్‌లో"

"వధువుపేరు నీరజ"

"మీకెలా తెలుసు"

"నాకు పెండ్లిశుభలేఖ వచ్చింది"

"తెచ్చారా"

"ఇదిగో అది"

"ఎగ్జిబిటు పి. వన్" అన్నాడు బెంచిగుమస్తా.

"ఎవరుపంపారు మీకు ఈ శుభలేఖ"

"వధువుతండ్రి మధుసూదనరావు గారు"

"వారు మీకు ఎలా తెలుసు"

ఆయన నేను ఒకే వ్యాపారసంస్థలో పని చేస్తున్నాం."

"అంతే" అని ముగించాడు సీతారామయ్య.

"నో క్రాస్" అన్నాడు వీరభద్రయ్య.

"మూడవ సాక్షి పేరు" అడిగాడు గుమస్తా.

"మేజర్ ఆనంద్" సీతారామయ్య చెప్పాడు.

సీతారామయ్య సాక్ష్యం చెప్పించటం మొదలుపెట్టాడు.

"మీ వృత్తి, హోదా"

"సైన్యంలో ఉద్యోగం, మేజరును"

గున్నేశ్వరరావును పిలిపించాడు సీతారామయ్య.

"ఈయన తెలుసా?"

"తెలుసు. ఆయన మేజర్ గున్నేశ్వరరావు"

గున్నేశ్వరరావును బయటికిపొమ్మన్నాడు బెంచిగుమస్తా.

"ఎలా తెలుసు?"

"గత నాలుగు సంవత్సరాల నుండి హైదరాబాదులోని సి డివ్ లో 3వ బెటాలియనులో ఇద్దరం ఉద్యోగం చేస్తున్నాం"

"ముద్దాయి తెలుసా?"

"వారు కల్నల్ కమలాకరరావుగారు. మా బెటాలియన్ అధికారి"

"మేజర్ గున్నేశ్వరరావుగారి భార్య తెలుసా?"

"ఆమె పేరు నీరజ. ఆఫీసర్సు మెస్‌లో విందులకు ఆమె వచ్చేవారు భర్తవెంట."

"నీరజ గున్నేశ్వరరావు భార్య అని ఎవరెవరికి తెలుసు మీ ఆఫీసర్స్ మెస్‌లో"

"మా మెస్‌లో ఉన్న చిన్న పెద్దా ఆఫీసర్లందరికీ నీరజ పరిచయమే. కల్నల్ కమలాకరరావుగారికి కూడా ఆమె మేజరు గున్నేశ్వరరావు భార్య అని తెలుసు."

ఈ విషయాన్ని ఏ ఆధారం మీద మీరు చెపుతున్నారు"

"మేజర్ గున్నేశ్వరరావు వివాహం కాగానే పార్టీ ఇచ్చి తన భార్యను ఆఫీసర్సు మెస్‌లో అందరికీ పరిచయం చేశాడు. నా ఎదుటనే కల్నల్ కమలాకరరావుగారికికూడా పరిచయంచేశాడు.

"కమలాకరరావుగారు నీరజతో ఎలా ప్రవర్తించేవారు"

"చనువుగా మాట్లాడేవారు"

అడ్డుసవాళ్ళేమీ వేసేదిలేదని ముద్దాయి తరఫు ప్లీడరు చెప్పాడు. హాల్లో కలకలం. "సైలెన్సు" అని బంట్రోతు కేక.

తరువాతి సాక్షి "ఫిర్యాదే" అన్నాడు ప్లీడరు.

కొన్ని మామూలు ప్రశ్నలయిన తరువాత ఫిర్యాది ప్లీడరు ఇలా అడిగాడు.

"మీ భార్య పేరు"

"నీరజ"

"ఎక్కడ పెళ్ళయింది"

"హైదరాబాద్‌లో"

"ఎవరు చేయించారు"

"విద్యారణ్యశాస్త్రిగారు"
'పి. డబ్లుం. వన్' అన్నాడు బెంచి గుమాస్తా.
"మీరేమైనా పెండ్లికి శుభలేఖ వేసారా"
"మా నాన్నగారు వేయించారు."
"తెచ్చారా"
"ఇదిగో అది"
'ఎగ్జిబిటు పి. టు' అన్నాడు గుమాస్తా.
"పెండ్లికి ఎవరెవరు వచ్చారు"
"వేలమంది వచ్చారు. అందులో రామారావుగారు ఒకరు."
'పి. డబ్ల్యు. టు' అన్నాడు గుమాస్తా.
"పెండ్లికి వధువుపైపు శుభలేఖ వేశారా"
"వేశారు"
"ఇదేనా అది"
"అవును"
'ఎగ్జిబిటు పి. వన్' అన్నాడు గుమాస్తా.
"ముద్దాయి నెరుగుదురా"
"ఆయన మా బెటాలియను కమాండరు"
"మేజర్ ఆనంద్‌ను ఎరుగుదురా"
"పి. డబ్ల్యు త్రి" అన్నాడు గుమాస్తా.
"ఎరుగుదును. ఆయన మా బెటాలియనులో మేజరు."
"మీ ఆఫీసర్లలో నీరజ మీభార్య అని ఎవరెవరికి తెలుసు?"

"అందరికీ తెలుసు. నా వివాహం కాగానే మా ఆఫీసర్సు మెస్‌లో పెద్ద పార్టీఇచ్చి అందరికీ పరిచయం చేశాను. మేజర్ రామారావుగారికి, కల్నల్ కమలాకరరావుగారికి కూడ పరిచయం చేశాను. అంతేగాక ఆమె నాతో మెస్‌లో విందులకు వచ్చేది."

"మీకూ ముద్దాయికీ సంబంధాలు ఎలా ఉండేవి."

"ఆయన ఒకప్పుడు తన చెల్లెలుతోను, మరొకప్పుడు ఒంటరిగా మా ఇంటికి వస్తూండేవాడు.

"మీరు ఆయనమీద కేసు ఎందుకు పెట్టారు?"

"నా భార్య నీరజ అని తెలిసికూడా, నా యొక్క ఎరుక, సమ్మతి లేకుండా నా లాలూచీ ఏమీలేకుండా, నా భార్యతో ఆమె ఇష్టప్రకారం లైంగిక సంపర్కం పెట్టుకొని వ్యభిచార నేరాన్ని చేశాడు."

కోర్టుహాలులో సవ్వడి అయింది శ్రోతల గుసగుసలవల్ల. "సైలెన్స్" కేకవేశాడు బంట్రోతు.

"వారిద్దరూ వ్యభిచరించారనే దానికి ఋజువు ఏమిటి?"

"నేను కండ్లారా చూచాను."

"ఎప్పుడు? ఎక్కడ? ఎలా? ఏ సందర్భంలో?"

"ఒకరోజు నేను బెటాలియను పనిమీద పరాయి ప్రదేశానికి వెళ్ళి తిరిగివచ్చాను. ఆ పనికి నన్ను ముద్దాయే పంపించాడు. నాలుగు రోజుల వ్యవధిపట్టే పనిని మూడు రోజులలోనే పూర్తి చేసుకొనివచ్చా. మూడవరోజు రాత్రి తొమ్మిది గంటలకు నా ఇంటికి చేరాను. నా ఫ్లాటు వాకిలి తలుపు తాళం వేసివుంది. నా వద్ద నున్న డూప్లికేటు తాళం చెవితో తలుపుతీసాను. నా బెడ్‌రూం తలుపు సగం తీసివున్నది. వెంటనే బెడ్‌రూమ్‌లోకి వెళ్ళాను. నా పడకమీద ముద్దాయి, నా భార్య నగ్నశరీరాలతో లైంగిక కార్యక్రమంలో ఉన్నారు. వారి గొడవలో నన్ను వారు చూడ లేదు. నాకు క్రోధమూ, శోకమూ వచ్చాయి. అక్కడవుంటే

ఏదైనా అఘాయిత్యం చేస్తానేమోనని భయపడి బయటికివచ్చి స్టడీరూం తలుపు చప్పుడుచేస్తూ వేశాను. దబదబ రాత్రిదుస్తులు వేసుకుని నా భార్య, ముద్దాయి డ్రాయింగు రూంగా వాడే హాలు లోకివచ్చారు. నన్నుచూచి దిగ్భ్రాంతి చెందారు. నేను అచ్చట నుంచోవటం మంచిదికాదని నా వాటా బయటికి వచ్చాను. కారిడరులో 301లో కాపురముంటున్న ప్రభాకర్, 302 ప్లాటులో నివసిస్తున్న రామలింగంగారు కనపడ్డారు."

ఇలా చెప్పి తన రెండు చేతులతో తన ముఖాన్ని కప్పి కున్నాడు మేజర్ గున్నేశ్వరరావు.

"పాపం!", "ఎంత ఘోరం" అనే మాటలు శ్రోతల గుంపులోనుండి వెలువడ్డాయి.

ఫిర్యాది సాక్షి కథనం తనకు సంబంధించినంత వరకు అయిపోయిందన్నాడు వకీలు సీతారామయ్య.

"క్రాస్" అన్నారు మేజస్ట్రేటు.

వచ్చే వాయిదా తేదీకి ఫిర్యాది క్రాసునూ, ఫిర్యాది తరఫు సాక్షులనూ పూర్తిచేయమని ముద్దాయి తరఫు న్యాయవాది అభ్యర్థించాడు.

అతని కోర్కెను మేజస్ట్రేటు మంజూరు చేశాడు.

కేసును ఫిబ్రవరి 18వ తేదీకి వాయిదా వేశారు.

మరో కేసును పిలిచాడు బెంచిగుమాస్తా.

ఒక్కసారిగా హాలంతా ఖాళీ అయింది.

'కేసు ఋజువయింది, కమలాకరరావుకు శిక్ష తప్పద' ని కొందరూ, 'ఫిర్యాది సాక్ష్యం నమ్మతగిందిగా లేద' ని మరికొందరూ

తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. కమలాకరరావు నీరజ తెచ్చిన కారులో కూర్చుని వెళ్ళిపోయాడు.

16

ఆ రోజు ప్రకాష్ పద్మజలు చెట్టాపట్టాలేసుకుని వెళ్తున్నపుడు సావిత్రి చూచినప్పటినుండి ఆమె మనసు చికాకుకు లోనయింది. ఎంత తీసి వేసుకుందామన్నా తన భర్త శశిధర్ లీలలు రోజూ జ్ఞాపకంవచ్చి సావిత్రిని కలవరపెట్టున్నాయి. రాధమ్మగారి సలహా విన్న తరువాతకూడా ఆమెకు మనశ్శాంతి కరువయింది. పోనీ కాలక్షేపానికి ఏదైనా పని పెట్టుకుంటే! లేక ఉద్యోగం చేస్తే. అలాంటి పని భారాన్ని తగిలించుకుంటే పిల్లలు యోగక్షేమాలను తను సరిగా చూడటం పడదేమో! ఉద్యోగం కాదు. తనే మనసు మళ్ళించుకోవాలి. కాని సాధ్యం కావడంలేదు.

పిల్లలు బడికి వెళ్ళారు. ఇంట్లో ఒక్కతే ఉన్నది. వివిధ భారతిలో రేడియో పాట శృంగార రసానికి సంబంధించినవి వస్తున్నాయి. ఏమిటో వీళ్ళకు వేళాపాళాలేదు. లేకపోతే ప్రొద్దున్నే తొమ్మిది గంటలకు శృంగారపు పాటలేమిటి? శశిధర్ స్మృతి పథంలో మెదిలాడు. ఆనాడు శశిధరూ తనూ ముస్సోరిలో గుర్రాల మీద పోతున్నారు. మంచు తుంపరులు తమ ముఖాలను స్పృశించిపోతున్నాయి. చేయెత్తితే అందుతాయేమో అన్నట్లు మేఘాలు తిరుగాడుతున్నాయి. దూరాన హిమాలయ పర్వత శ్రేణుల్లోని లోయలు. ఆ లోయల్లోనుంచి పొగమంచు పైకి ఎగుస్తున్నది. బహుశః అక్కడ జనపదాలు ఉండివుంటాయి. వాళ్ళెలా జీవిస్తున్నారో. వారిది కష్టజీవితం. కనుకనే వారు

హోటళ్ళ దగ్గరకువచ్చి తమ పది పదునాలుగేండ్ల పిల్లగాళ్ళను బొంబాయి, ఢిల్లీ నగరాలకు ఇళ్ళల్లో పనిపాటలకు పంపుతామని అంటుంటారు. శశిధర్ ముందుపోతున్నాడు. "శశిధర్ వేగం తగ్గించు. నేనూ కలసికుంటాను" అని తను కేకపెట్టింది. శశిధర్ గుర్రమూ, తన గుర్రమూ ప్రక్కప్రక్కన పరుగెడుతున్నాయి. ఇంతలో రాచమార్గం నుండి కుడిప్రక్కకు ఒకత్రోవ కనుపించింది. శశిధర్ తన గుర్రాన్ని అటు త్రిప్పాడు. తనకు భయంవేసింది కీకారణ్యంలోని పోతానేమోనని. గత్యంతరంలేక శశిధర్‌ను అనుసరించింది. గుర్రాలు ముందుకు సాగాయి. ఒక ఫర్లాంగు దూరం పోయినతరువాత ఒక ఖాళీస్థలంచేరారు. చుట్టూ నిటారుగా దేవదారు మొదలైన వృక్షాలున్నాయి. అక్కడ తను గుర్రందిగి ఒక చెట్టుకు కట్టేశాడు. తనూ అలాగే చేసింది. నేలమీద పచ్చని గడ్డి; మెత్తగావుంది. సంచిలోనుంచి జంపకానా తీసి నేలపరిచాడు. తను ఆశీనుడయినాడు జంపకానాపై. తనూ కూర్చుంది అతని సరసన. శశి చాల కొంటె మనిషి. ఆ విషయం తనకు అనుభవం లోకి వచ్చింది అనేకసార్లు. 'చిరుతపులి, చిరుతపులి' అన్నాడు శశి. తనకు విపరీతమైన భయంవేసింది. అమాంతం తను అతనిని కౌగిలించుకుంది. అతడు తనను గట్టిగా వాటేసుకన్నాడు. తను అలా ఎంత సేపుందో తనకే తెలియదు. భయంతో కన్నులు మూసుకుంది. "కుహు కుహూ" అనే కోయలకుత వినబడింది. తను కన్నులు తెరిచింది. ఎదురుగా చుసింది చిరుతపులీ లేదు మరీ ఏ పులీలేదు. "అమ్మదొంగా నన్ను మోసం చేస్తావా. ఉండు నీ పని పడ్తాను" అని తను అతని బుగ్గపై దంతక్షతం చేసింది. చిరకోపం ప్రదర్శించాడు. తనకు శిక్షవేశాడు. అది ఎంత మధుర సన్నివేశం! ఎంత మధురానుభూతి ఆ నాడు.

ఇంతలో బెల్ చప్పుడయింది. తన మధురస్మృతులు చెదిరిపోయాయి. పిల్లలను బడిలోదించి వచ్చింది తన పనిమనిషి.

ఆ సాయంత్రం సావిత్రి సినిమాకు వెళ్ళింది. సినిమా చూస్తున్నది. అది "ప్రేమ పూజారి" అనేచిత్రం. ఒక సన్నివేశంలో ప్రేయసి చెయ్యి ప్రియుని చేతిలో ఉంటుంది. లైట్లు వెలిగాయి విశ్రాంతి సమయానికి. ఆమె కుడిచేయి ప్రక్కనున్న యువకుని ఎడమచేతిలో ఉన్నది. ఆమెకు సిగ్గువేసింది. చెయ్యి తీసుకుంది. అతడు చిరునవ్వు నవ్వాడు. ఆ నవ్వులో బలవత్తరమైన ఆకర్షణ ఉన్నది. కాదనడానికి వీలులేని పిలుపు నిండివుంది. అతడు తన పేరు కృష్ణారావని, తను ఒక వ్యాపారస్తుడినని పరిచయం చేసుకున్నాడు. తన పేరు, తన నివసించే ప్రాంతం అతనికి చెప్పింది సావిత్రి. ఇంతలో లైట్లు పోయాయి. చిత్రప్రదర్శన మరల ప్రారంభమయింది. చిత్రాన్ని చూడటంలో నిమగ్న మయ్యారు ఇద్దరునూ. ఆ చిత్రంలో కథ చివరకు విషాదరూపంతో ముగిసింది. ఇక్కడకు వచ్చినా తన కథే వచ్చిందని సావిత్రి బాధపడింది. సావిత్రిని తన కారులో ఆమె ఇంటివద్ద దింపుతానని, అంగీకరించవలసిందని అతడు ఆమెను కోరాడు. ఆమె మొదట్లో అక్కరలేదని, తను వంటరిగా వెళ్ళగలనని చెప్పినా మరోసారి అతడు అభ్యర్థిస్తే అంగీకరించింది. అతడు ఆమెను కిరణ్ అపార్టు మెంట్సు వద్దకు తీసుకొనివచ్చాడు. మర్యాదకోసం అతనిని తన ఫ్లాట్‌లోకి ఆహ్వానించింది కాఫీ త్రాగిపోదురుకాని రండని. అతడు అంగీకరించి ఆమెను అనుసరించాడు. పనిమనిషి తలుపుతీస్తే డ్రాయింగు రూంలోకి అతనిని ఆహ్వానించింది. ఆశీనునిచేసి ఇప్పుడే వస్తానని చెప్పి పిల్లల పడకగదిలోకి వెళ్ళి నిద్రపోతున్న వాళ్ళను చూచివచ్చింది. కాఫీ తెప్పించి ఇచ్చింది.

ఆమె డ్రాయింగురూం సర్దినవిధానాన్ని అతడు మెచ్చుకొని వెళ్ళిపోయాడు.

17

రాధమ్మ దృష్టిని గోపాలంగారి సహృదయత్వం ఆకర్షించింది. ఇంత నిండు వయసులో తొణుకూ బెణుకూ లేకుండా ఒంటరిగా కాపురముంటున్న గోపాలంగారియెడ ఆమెకు సానుభూతి కల్గింది. ఆయన జీవిత తత్వాన్ని గ్రహించాలంటే ఆయనను మరోసారి చూచి మాట్లాడటం అవసరమని తలచింది. ఒకరోజు పొద్దున్నే ఆయనకు ఫోనుచేసింది తను వారి ఇంటికి వచ్చి మాట్లాడాలని అనుకుంటున్నానని. సాయంత్రం ఆరుగంటలకు మ్మనమని ఆయన ఆమెను ఆహ్వానించాడు.

ఎప్పుడూ లేనిది ఆ రోజు రాధమ్మ మనస్సులో ఉత్కంఠ ఎక్కువయింద. ఈ పెద్దమనిషి - గోపాలంగారు - ఎలాకాలం గడుపుతుంటారు? ఆయన వ్యాసంగాలు ఏమిటి? వాటికి ఆయన జీవిత తత్వానికి సమన్వయం ఎలా కుదురుతున్నది? తినబోయే కూరకు రుచి అడగడం ఎందుకని తన మనస్సును సమాధాన పరుచుకుంది.

ఆ సాయంత్రం యూనివర్సిటీనుండి నాలుగున్నర గంటలకే వచ్చేసింది. కాఫ్యాదులు సేవించి గ్రంధపఠనంచేస్తూ కాలం గడిపింది ఆరు గంటలవరకూ.

గోడ గడియారం ఆరుగంటలు కొట్టింది. ఆమె బయలుదేరి గోపాలంగారి ఫ్లాటుకు వెళ్ళింది. తన రాకకోసం ఆయన వేచి

ఉన్నారేమో వాకిలి తలుపు సగం తీసివుంది. తలుపుమీద చేతి వేళ్ళతో కొట్టి ఆమె లోపల అడుగుపెట్టింది. డ్రాయింగు రూంగా వాడుతున్న హాలుభాగం చాల అందంగా అమర్చబడివుంది. చూచి విస్మయురాలైంది. ఒంటరివాడు అన్నీ చిందరవందరగా పడి ఉంటాయని తలచిన ఆమెకు ఊహాచిత్రి భంగమయింది. ఆయన సాదరంగా ఆహ్వానించాడామెను. ఇరువురూ ఆశీనులయినారు. పనిమనిషి బత్తాయి నారింజపండ్ల రసమున్న రెండు గ్లాసులు ఇద్దరికీ ఇచ్చివెళ్ళింది.

గోడకు ఆనుకొనివున్న అలమారులో చక్కగా అమర్చబడిన పుస్తకాల దొంతరలు. ఎదురు గోడకు అలాగే అలమారు, అందులో పుస్తకాలు. ఎదురుగా ఒక స్టీలురాకు. అందులో అనేక మాస పత్రికలు తీర్చిదిద్ది ఉన్నాయి. రాకుపైన మరొక చిన్న అద్దాల అలమారువుంది. అందులో భారతదేశంలోని చేతిపని బొమ్మలు వివిధ ప్రాంతాలవి రకరకాల సైజుల్లో వున్నాయి. పుస్తకాల అలమార్లపై ఆంధ్రప్రాంత శిల్పకళాఖండాలు కొన్ని అందంగా అమర్చబడి వున్నాయి. ఎత్తుగా గోడలకు నాలుగు తైలవర్ణ చిత్రాలు ప్రకృతి దృశ్యాలను ప్రదర్శిస్తూ వ్రేలాడుతూవున్నాయి. ఈ అలంకరణ అంతా గోపాలంగారి భార్య కాంతంగారి పనితనం అయివుంటుందని అనుకున్నది రాధమ్మ. గృహాలంకరణ విషయంలో ఆయనకున్న అభిరుచికి ఆయనను అభినందించింది రాధమ్మ. నిట్టూర్పు విడిచారు గోపాలంగారు. ఇదంతా తన భార్య కాంతం ప్రజ్ఞావిశేషమని చెప్పారు. అప్పుడు ఆయన కళ్ళు చెమర్చినయి. రాధమ్మ తను వచ్చిన విషయం బయటపెట్ట తలచింది. ఇన్నాళ్ళనుండి తను అనేక విషయాలలో పనిచేస్తున్నా,

తను పుస్తకాల పురుగు. గ్రంథపఠనమే కాని వాస్తవానుభవం లేదు. జీవితానుభవంతో రంగరిస్తేకాని పాండిత్యం ప్రకాశించదు. గోపాలంగారు కార్యవాది; శుష్కప్రవచనాలతో కాలంగడిపే మనిషి కాదు. కనుక ఆయనవద్ద ఎంతో నేర్చుకోవలసి వుంటుందనే గంపెడాశతో వచ్చింది.

"మీ సంఘసేవను గురించి చాల విన్నాను" సంభాషణను ప్రారంభించింది. "అభిమానం ఉన్నవాళ్ళు అనేమాట అది." అన్నాడు గోపాలంబాబు.

"అసలు ఏ మనిషి అయినా సంఘసేవకు ఎందుకు పూను కుంటాడో తమ ముఖతః వినాలనివచ్చాను" అంది రాధమ్మ.

"అడగవలసిన ప్రశ్న అడిగారు. సంఘసేవకు పూనుకునే వారు అనేక తెఱగులవారు. పేరుప్రతిష్టల కోసం పూనుకునేవారు ఒకతెగ. సమాజసేవ ద్వారా కొన్ని వసరులు, వెసులుబాట్లు కలుగు తాయని వాటికోసం తాపత్రయపడే రకం రెండవది. సమాజం వల్ల తను బాగుపడ్డానని గ్రహించి, సమాజానికి తాను ఋణగ్రస్తు డనని చింతనచేసి, దానిని తీర్చుకునే నిమిత్తం ఆ మార్గాన్ని అనుసరించే వర్గం మూడవది. వీటన్నింటికి భిన్నంగా ఏ ప్రయ త్నమూ, ఏ భావనాలేకుండా సహజంగా సంఘసేవచేసే జాతి నాల్గవది.

"వీటిలో ఏది మంచిదని తమ అభిప్రాయం?" సమాధానం కోసం గోపాలంబాబు కళ్ళల్లోకి చూస్తూ కూర్చున్నది రాధమ్మ.

"అసలు ఏమీ చెయ్యరు కొందరు; ప్రారంభించి మానేస్తారు మరికొందరు; అనేక విఘ్నాలకులోనై మానేస్తారు అనేకులు. చివరిదాకా నిలిచి సేవచేసేవారే ధన్యులు. కనుక మొదటివర్గం

అధమాధమంకాగా రెండోది అధమం మూడోది మధ్యమం. నాల్గవది ఉత్తమం." సేవా ఉత్కృష్టతను విచారించాడు గోపాలంబాబు.

ఈ విశ్లేషణా శక్తికి అచ్చెరువందింది రాధమ్మ. అయినా ఆమెకు మరో సందేహం కల్గింది.

"నాల్గవదయిన ఉత్తమజాతికి సంఘసేవవల్ల ఒరిగేదేమిటి?"

"ఇక్కడ ఒక్క అంశాన్ని మనం జాగ్రత్తగా పరిశీలించాలి. ఏదైనా ఒరగాలని ఆశిస్తే ఆ వ్యక్తి నాలుగవ కోవలోనుంచి మొదటి రెండు తెగలలో ఏదో ఒకదానిలో చేరిపోతాడు. అలా ఆశించటం విషయాన్ని ఉపసంహరిస్తే, నాలుగవ వర్గానికి కలిగేది ఆత్మ సంతృప్తి. ఈ కోవకుచెందిన వ్యక్తి సంఘసేవ చెయ్యకుండా ఉండలేడు. దానినే కొందరు పరిహాసంగా అనేక పేర్లతోపిలుస్తారు. కుండూతియని కొందరూ; వ్యసనమని మరికొందరూ అభివర్ణిస్తారు. నిజానికి అది అలాగే కన్పడుతుంది. మూడవ వర్గంవారి ఆత్మతృప్తికీ నాలుగవ వర్గం వారి ఆత్మతృప్తికీ తేడావుంది. వీటిలో మొదటి దానిలో ఋణవిముక్తివల్లకల్గే భావన అది. రెండవదానిలో వచ్చేది దేనికీ పరిహారంకాదు. అది సైజగుణ అభివ్యక్తత; అంతే." చక్కగా స్పష్టీకరించాడు.

ఈ వివరణ విన్న తరువాత గోపాలంబాబు నాలుగవ కోవకు చెందిన ఉత్తమ సంఘసేవకులని రాధమ్మ గ్రహించింది. తనకు తెలియకుండానే ఆయనయెడ ఆరాధనాభావం ఏర్పడింది.

మరొక్క సందేహం.

"వైజ్ఞానికదృష్టికల వ్యక్తికి కళాభిజ్ఞత ఉండటానికి అవకాశ ముందా?"

"వైజ్ఞానిక దృష్టికి కళాభిరుచికి వైరుధ్యంలేదు. వైజ్ఞానిక దృష్టికి మూలం కుతూహలం; సత్యాన్ని తెలుసుకోవాలనే తపన. ప్రపంచంలో కన్పడే అద్భుతాలవెనుక దాగివున్న శక్తులను వాటి సంబంధాలను అవగతం చేసుకోవటానికి చేసే ప్రయత్నం అది. కళకు మూలాధారం లయతోకూడిన సమన్వయం. వైవిధ్యాలలోని సుందర వస్తుతత్వాన్ని వెలార్చేది కళ. విజ్ఞానశాస్త్రం విశ్లేషణకు ప్రాధాన్యతనిస్తుంది. కళ సంశ్లేషణకు ప్రముఖస్థానం ఇస్తుంది. ఒక సత్యాన్ని గ్రహించడానికి రెండు మార్గాలు; ఒకటి విశ్లేషణ, రెండవది సంశ్లేషణ. మొదటిది ఏకత్వంలో భిన్నత్వాన్ని చూస్తుంది. రెండవదానికి భిన్నత్వంలో ఏకత్వం గోచరిస్తుంది. వాస్తవానికి ప్రపంచం ఏకైక వస్తుసంజనిత. దానిని పదార్ధమనండి, శక్తి అనండి. రెండూ ఒకటే. ఒక పరిస్థితిలో అది పదార్ధంగా కన్పడుతుంది. మరో పరిస్థితిలో అది శక్తిగా దర్శనమిస్తుంది. కాంతి పుంజాన్ని తీసుకోండి. ఒకరకంగా చూస్తే అది కాంతికణాల సముదాయం; మరోరకంగా గమనిస్తే అది కాంతి తరంగం. కనుక మనం అద్వైత వాస్తవ భౌతికతత్వాన్ని ఆశ్రయించాలి. అంతేకాని తప్పులు తడకలతో కూడిన తాత్విక రీతుల వెంబడి పరుగిడరాదు."

గోపాలంబాబు పాండితీప్రతిభకు, ఆయన భావనా బలిమికి, సమ్యక్‌దృక్పథానికి తన మనస్సులో రాధమ్మ జోహారులర్పించింది. గోపాలంగారికి పెద్దగా డిగ్రీలున్నట్లు తోచదు. అలాంటి వ్యక్తికి ఇంత విజ్ఞానం, ఇంత ధీశక్తి ఎలావచ్చాయని ఆమె వెఱగుపడింది.

గోపాలంగారు మహిళోద్యమ పక్షపాతి అనిపేరు. తమ సహజంగా స్త్రీల ఉన్నతినికోరే మనిషి. ఈ విషయంపై వారితో ముచ్చటించాలని ఆమె సంకల్పం.

"ఇప్పటికే చాల కాలాతీతమయింది. మీ కాలాన్ని వృథా చేశానేమో! వెళ్ళివస్తాను. ఈ సారి మహిళోద్యమంపై తమ అభిప్రాయాలను అర్థం చేసుకొవాలని అభిలాష" అంటూ రాధమ్మ గోపాలంవద్ద సెలవు తీసుకున్నది.

తన వాటాలోకి పోబోతుండగా 301 నెంబరు ఫ్లాటులో కాపుర ముండే నళిని కన్పడింది.

"ఏం! నళినీ! బాగున్నావా" అని పల్కరించింది రాధమ్మ.

"అంతా సజావుగానే జరిగిపోతున్నది ఒక్క నీరజకేసుతప్ప" తన వ్యగ్రతను వెలిబుచ్చింది నళిని.

"విన్నానమ్మా నేనూ. పాపం! ఇరుకునపడింది మంచి పిల్ల" సానుభూతి వ్యక్తంచేసింది రాధమ్మ.

"సమయం వచ్చినప్పుడు మీరు ఆమెను ఆదుకోవాలి" అభ్యర్థించింది నళిని.

"చూద్దాంలే నళినీ! ఒకరికొకరు ఆసరాగా ఉండక పోతే ఎలా" అంటూ తన వాటాలోకి పోయింది రాధమ్మ.

ప్రభాకర్ ఇంకా ఇంటికిరాలేదు కనుక ఒకసారి ఈ విషయంపై పద్మిని సాయం అడిగివద్దామని నళిని బయలు దేరింది ఆమె ఫ్లాటుకు. పద్మిని ఒక్కతేవుంది. భర్త వెంకట్రావు ఇంట్లోలేడు. పద్మిని నళినిని ఆహ్వానించింది. పెద్దగా ఆప్యాయత ఇద్దరిమధ్యా లేకపోయినా, ఒక అంతస్తులో ఉండటంవల్ల, లిఫ్టు ఎక్కేటప్పుడో, దిగేటప్పుడో, కిందనున్న దుకాణాలలో కలసి కోవడం, మందహాసాలు చిందించుకోవడం ఇద్దరికీ పరిపాటి.

నళిని ఆశీనురాలయింది. 'సాఫ్ట్' డ్రింకు తెప్పించిఇచ్చింది పద్మిని.

వచ్చినపని ఏమిటో అన్నట్లు చూచింది పద్మిని.

"పద్మినీ! నీరజ చిక్కుల్లోపడింది" అన్నది నళిని.

"నేనూ విన్నాను. కాని మనకనవసరమని నేను పట్టించుకోలేదు." పద్మిని జవాబు ఇచ్చింది.

"ఆమె చాల కష్టదశలోవుంది. ఆమెను ఊబిలో దింపిన భర్తే ఆమెకు ఎదురుతిరిగాడు. ఆమెకు మన అండదండలు చాల అవసరం" గట్టిగా చెప్పింది నళిని.

"నీవు చెప్పినది ఏదీ నేను కాదనను. నన్ను ఒక్కమాట చెప్పమంటావా? కష్టపడవుకదా! ఇది విను. భర్తను చెప్పు చేతల్లో ఉంచుకోలేని భార్యఅంటే నాకు మహచెడ్డ చిరాకు; అసహ్యం కూడాను. నా నుండి నీరజకు ఏ సహాయమూ కోరకు." అంటూ పద్మిని లేచి నుంచున్నది. ఈ మాటలకు అదిరిపడ్డ నళిని తన ఇంటికి చరచరా నడిచి వెళ్ళిపోయింది.

18

నాగార్జునసాగర్‌వద్ద మంచి సదుపాయంగల ప్రయాణీకుల వసతి గృహాన్ని ప్రభుత్వం కట్టించింది. అందులో గదుల అద్దెలు మధ్యతరగతి వారికి అందుబాటులో ఉంటున్నాయి. దాంతో నాగార్జునసాగర్‌కు విహారయాత్రకు వచ్చేవాళ్ళకు అనుకూల వాతావరణం ఏర్పడింది.

నాగార్జునసాగర్ చారిత్రిక యాత్రాస్థలం. అచ్చట క్రీ.శ. 100 నుండి 250 వరకు ఇక్ష్వాకురాజులు పరిపాలించారు. ఆనాడు బౌద్ధమతం అచ్చట చాల ప్రబలంగా ఉండేది. రాజులు హిందూ మతావలంబులు. రాణులు బౌద్ధమతాభిమానులుగా ఉండేవారు. ఆనాటి బౌద్ధస్తూపం శిధిలావస్థలో ఉంది. విహారాలు చిహ్నాలు ఉన్నాయి. 1500 మందిదాకా శ్రమణులు కూర్చుని ధర్మబోధను వినడానికి వీలయిన గ్యాలరీవుంది. అది రెండు కొండలనానుకొని వున్నందున ఉపన్యాసకుని కంఠధ్వని కొండలను తాకి తిరిగి శబ్ద రూపంలో విద్యార్థులకు వినిపించేది. ఆర్యనాగార్జునుడు విహరించిన ప్రదేశం. మధ్యమ కారికలను వ్రాసిన శూన్యవాద పండితుడు నాగార్జునుడు. రసాయనశాస్త్ర పారంగతుడైన నాగార్జునుడు, సిద్ధాంతకర్త నాగార్జునుడు ఇద్దరు వ్యక్తులా ఒకే వ్యక్తియా అనే విషయంలో భేదాభిప్రాయాలున్నాయి. కృష్ణానదికి ఆనకట్టకట్టి నాగార్జునసాగర్ నిర్మాణం జరిగినందున బౌద్ధవిహారస్థలం నీటితో మునిగిపోయింది. జాగ్రత్తగాతీసి సాగరమధ్యంలో ఒక కొండమీద మళ్ళీ అదేవిధంగా ఏర్పాటుచేశారు ఆనాటి చారిత్రక అవశేషాలను.

అలాంటి నాగార్జునసాగరు ఇటీవల ప్రేమికుల యాత్రా స్థలంగా మారింది.

ఒకరోజు రాత్రి తొమ్మిదింటికి ప్రయాణీకుల వసతిగృహానికి పద్మినీ సూర్యారావులు చేరారు. భోజనశాలలో పద్మజా ప్రకాష్‌లతో ఒకే టేబిలుమీద భోజనానికి కూర్చోవలసి వచ్చింది. పరస్పర పరిచయాలయినాయి. పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నారు. పద్మినీ సుర్యారావు తమకు కేటాయించబడిన గదికి వెళ్ళిపోయారు. పద్మజ ప్రకాష్‌లు డబుల్‌రూం కోసం రిసెప్షను ఆఫీసువద్దకు వెళ్ళారు.

ఉద్యోగి గది లేదన్నాడు. బిక్కమొగం వేశారు వారిరువురూ. ఇంతలో అక్కడికి కృష్ణారావు వచ్చాడు. వీళ్ళను సంగారెడ్డిలో హోటలులో చూచినవాడు కనుక గుర్తుపట్టాడు. వీళ్ళనుచూసి అతనికి జాలివేసింది.

"మీరు ఆనాడు సంగారెడ్డిలో నాకు కన్పడినవారు కదూ?" అంటూ నర్మగర్భితంగా ప్రశ్నించాడు.

అతడు తమ రహస్యాన్ని బయటపెట్టనందుకు వారు అతనికి మనస్సులో కృతజ్ఞతలు తెల్పుకున్నారు.

'అవును' అని దీనంగా అన్నాడు ప్రకాష్.

మేనేజరును పిలిచి తనకు కేటాయించబడిన రెండు డబుల్ రూమ్స్‌లో ఒకదానిని వారికి ఇవ్వవలసిందని చెప్పి కృష్ణారావు వెళ్ళిపోయాడు తన వెంట వచ్చిన యువతితో. ప్రకాష్ పద్మజలు అతనికి కృతజ్ఞత చెప్పుకోవటానికి కూడా సావకాశం లేకపోయింది. గదిఅద్దె చెల్లించ పోయినారు.

"తీసుకోవటానికి వీలులేదు. కృష్ణారావుగారు కోప్పడతారు" అన్నాడు మేనేజరు.

"రిజిష్టరులో పేర్లను నమోదు చేయనక్కరలేదా?" అని అడిగాడు ప్రకాష్.

"కృష్ణారావుగారి గది మరొకరికిస్తే అలాంటివాటికి తావు లేదు" అన్నాడు మేనేజరు.

మేనేజరుతో ఏదో మాట్లాడటానికి వచ్చిన సూర్యారావు ఈ సంభాషణ చివరిభాగం విన్నాడు. ప్రకాష్ పద్మజలు తమ గదికి వెళ్ళిపోయారు. సూర్యారావు చిరునవ్వునవ్వుతూ

"ఎవరోయి ఈ అగంతకులు ?" అని మేనేజరును ప్రశ్నించాడు.

"కృష్ణారావుగారి అతిథులండీ'' అన్నాడు మేనేజరు.

"అంటే పెళ్ళికాని జంట అనేకదా నీ అభిప్రాయం!" అని అడిగాడు సూర్యారావు.

"చిత్తము, చిత్తము. ఇట్టే పసిగట్టారు. ఎంతైనా రసజ్ఞులు" అన్నాడు మేనేజరు.

నాలుగు డ్రింక్సు పంపించమని మేనేజరుకు ఆర్డరిచ్చి మరీ వెళ్ళాడు సూర్యారావు తన గదికి.

గదిలోకి పోగానే నీకో గమ్మత్తు కథ చెప్తానని పద్మినిని కూర్చోపెట్టాడు సూర్యారావు. ఇంతలో కుర్రవాడు డ్రింకుసుతెచ్చి బల్లమీదపెట్టి వెళ్ళిపోయాడు. అవి మామూలు డ్రింక్సుకావు. నికాల్సయిన మత్తు పానియాలు. గ్లాసులోపోసి వాటిలో మంచు గడ్డముక్కలువేసి ఒక గ్లాసు పద్మినికిఇచ్చి తనోగ్లాసు పుచ్చుకుని 'ఛీర్స్' అన్నాడు సూర్యారావు.

ఇంతకూ కథ చెప్పలేదని తొందరపెట్టింది పద్మిని.

"నాకో స్నేహితుడున్నాడు. వాడొక డాన్ జువాన్; అంటే పైలావచ్చీసు మనిషి. వాడూ మనలాగే నాగార్జునసాగరు నెలకొకసారయినా వస్తాడు. వాడెప్పుడూ రెండు డబుల్ రూములు బుక్ చేస్తాడు. ఒకటి తనకూ తన ఆనాటి ప్రేయసికి ఉంచుకుంటాడు. రెండవదానిని ఆగంతకులుగా వచ్చిన పెండ్లికాని ప్రేయసీప్రియులకుదానం చేస్తాడు. అనేక దానాలను గురించి విన్నాం; చివరకు

భార్యాదానం గురించికూడా చదివాం. కాని సకాల ఆశ్రయదానం గురించి అంతకుముందెప్పుడూ ఏ గ్రంధంలోకూడ చదవలేదు కదూ" అంటూ ముగించాడు కధను సూర్యారావు.

"ఈ కధవింటే, మనకుకూడ ఎప్పుడైనా దానం చేశాడేమిటీ ఈ పెద్దమనిషి అనే ప్రశ్న వస్తుంది సూర్యం" అన్నది పద్మిని.

"అబ్బే ? ఎంత మాట ! భార్యలుగావున్న నీబోటి వాళ్ళకు అలాంటి దానాలు చేయడు వాడు. వాడిదంతా స్పెషలైజేషను. పెండ్లికాని ఆడపిల్లలూ, ఒంటరితనం అనుభవించే విధవలూ- వీరే వాడి జ్యూరిస్ డిక్షన్‌లోకి వస్తారు."

"ఇతరుల భార్యల సాంగత్యం నీ ప్రత్యేకత అన్నమాట!" పద్మిని వెటకారంగా పలికింది.

ఉలిక్కిపడ్డాడు సూర్యారావు.

"కొంపతీసి మీ ఆయనచేత 'అడల్టరీ' కేసు పెట్టిస్తావేమిటి నా మీద" దీనంగా పలికాడు సూర్యారావు.

"పిరికి సన్నాసీ ! గున్నేశ్వరరావు కాదు నా భర్త. నీరజ లాంటిదికాదు నీ పద్మిని. భర్తను తన గుప్పిట్లో బంధించుకోగల శక్తివంతురాలు."

సూర్యారావుకు ధైర్యం వచ్చింది.

"మరో పెగ్గు ఇయ్యి; లేకపోతే నిజంగా మా ఆయనచేత నీ మీద కేసు పెట్టిస్తాను" దబాయించింది పద్మిని.

మరో పెగ్గు ఇచ్చాడు ఆమెకు. గ్లాసుమీద గ్లాసు ఆమె త్రాగుతూనే ఉంది. అతడు గ్లాసు నింపుతూనే ఉన్నాడు. ఆమె అచేతనావస్థలోకి జారిపోయింది. తరువాత

ఆమె సందర్భంగా సూర్యారావు ఏలా వ్యవహరించాడో ఏమో ఆమెకు తెలియదు. అవతల గదిలో పద్మజా ప్రకాష్‌లు తమ అదృష్టానికి తామే అబ్బురపడుతూ మాట్లాడుకుంటున్నారు. సంగారెడ్డి అనుభవం ఇంకా వారు మరచిపోలేదు. పోలీసులు అరెస్టు చేయడం, హైద్రాబాదు తీసుకొనిరావడం, తాము ధైర్యంచేసి బొంకినా అది చివరకు ఇబ్బందిలేకుండా పరిష్కారం కావడం ఇంకా వారి స్మృతిపథాలలో ఉన్నాయి. ఈ రోజు గది దొరకకపోతే బస్సుస్టాండులోనుంచొని అర్ధరాత్రి హైదరాబాద్‌పొయ్యే బస్సులలో సీట్లకై వేచి ఉండాల్సివచ్చేది. అక్కడా సీట్లు దొరుకుతాయనే గ్యారంటీలేదు. ముందు ఏర్పాట్లు లేకుండా రావడం తమదే తప్పు. ఇంతమంది ప్రయాణీకులు — కాదుకాదు — విహార యాత్రికులు ఉంటారా అని భావించారు. అందుకే ముందుగా రిజర్వుచేసుకో లేదు. నెలకొకసారయినా తప్పకుండా ఇచ్చటికి విచ్చేసే పెద్ద మనుష్యులుంటారని తమకు తెలియదు. కృష్ణారావు ధర్మమాయని తాము ఈ రోజు ఒక ఇంటివారయ్యారు. ఆ నాడు గోపాలంగారు, ఈ నాడు కృష్ణారావుగారు ఆదుకున్నారు. కృష్ణ శబ్దం తమకు పరిచయమైంది. బహుశః తాము ఆడేవి కృష్ణలీలలా కనుక అలా సహాయం కల్పివస్తుందేమో! ఇలా సరదాగా ముచ్చటలాడుకుంటూ కొంత కాలం గడిపారు. పద్మజ ఆవులించింది. ప్రకాష్ లేచాడు. ఇద్దరూ సమయోచిత దుస్తులు ధరించారు. మన్మథస్వామి పూజకు పూనుకున్నారు.

మరునాడు జాముప్రొద్దెక్కి నిద్రలేచిన పద్మినిని సూర్యారావు తన కారులో హైదరాబాద్ చేర్చాడు. మధ్యాహ్నం పన్నెండు గంటలయింది. ప్లాటు వాకిటి తలుపుదగ్గర ఆమెను దించి వెళ్ళిపోయాడు సూర్యారావు. పద్మిని కళ్ళు చింతనిప్పుల్లా ఉన్నాయి.

ఆమె కాళ్ళు తడబడ్తున్నాయి. మాట అస్పష్టంగా ఉన్నది. డోర్ బెల్లు నొక్కబోయి తలుపు దగ్గర నుంచున్నది. ఇంతలో రామ లింగం భార్య సౌభాగ్యమ్మ క్రిందికి పోవటానికి లిఫ్ట్‌దగ్గరకు పోతూవుంది. పద్మిని సౌభాగ్యమ్మను చూచి చేయి సైగచేసింది. సౌభాగ్యమ్మ ఆగింది.

ఇంతలో 306 ఫ్లాటులో నుంచి సావిత్రి బయటికివచ్చింది. చూస్తూ, వింటూ నుంచున్నది.

"చూచారా సౌభాగ్యమ్మగారూ! ఎన్ని వింతలు జరుగు తున్నాయో లోకంలో. పెళ్ళికాని జంటలు కాపురం చేయటానికి కొంతమంది పుణ్యాత్ములు గదులు దానంచేస్తున్నారు. అహ్హహ్హా!" అంటూ తన వాకిలి తలుపు దబదబా బాదింది పద్మిని. పనిమనిషి తలుపుతీసింది. ఆమె ఇంట్లోకివెళ్ళింది.

పద్మిని మాటలువిని సౌభాగ్యమ్మ ఆశ్చర్యపడ్డది. ఆ నాడు పద్మిని అక్రమప్రవర్తనను గురించి భర్త చెప్పగావిన్నది. ఈనాడు తూలుతూ పరాయి మగాడితోవచ్చిన పద్మినినిచూచింది. అంతేగాక పెళ్ళికాని యువతీ యువకులు కాముక క్రీడలలో పాల్గొంటున్నారని పద్మిని ముఖతః విన్నది.

"ఏం పాడుకాలమొచ్చిందిరా భగవంతుడా? సీతా, సావిత్రి, తార, దమయంతీ, మండోదరీ పుట్టిన భారతదేశం ఇట్లా భ్రష్టం కావలసిందేనా?" వాపోయింది సౌభాగ్యమ్మ.

19

అది ఫిబ్రవరి 17 రాత్రి. గున్నేశ్వరరావు కేసు విచారణ రేపనంగా. సమయం తొమ్మిదిన్నర గంటలు. భోజనానాంతరం

విశ్రమించారు ప్రభాకర్ నళినులు. రేపు ఉదయం గున్నేశ్వర రావు ప్లీడరు ఆఫీసుకు పోవటం, మధ్యాహ్నం కోర్టుకు పోవటం, తను సాక్ష్యం ఇవ్వటం వీటినిగురించి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు ప్రభాకర్. ఇతని పరధ్యానాన్ని గమనించింది నళిని. అతని దగ్గరకుచేరి

"ఏమండీ! ఏమిటి అంత పరధ్యానంగా ఉన్నారు" అని లాలనగా అడిగింది.

ప్రభాకర్ మాట్లాడలేదు.

"ఏమండీ! పిలిస్తే పలకనైనా పలకరు. ఏమిటండీ అంత తీవ్రమైన ఆలోచన?"

ప్రభాకర్ ఊకొట్టి ఊరకున్నాడు.

"అబ్బ! ఏం మగాళ్ళు! ప్రక్కనున్న యవ్వనంలోవున్న భార్య ఉందనియైనా గ్రహించలేని మంగమతులు!" కవ్వించింది నళిని.

అలాంటిమాట ఇంతవరకు, కాపురంచేస్తున్న ఇన్ని సంవత్స రాలలో ఒక్కసారయినా వినలేదు ప్రభాకర్.

ఉలిక్కిపడ్డాడు. ఊహాప్రపంచంలోనుంచి వాస్తవప్రపంచం లోకి ఒక్కసారిగా జారాడు.

"ఏంలేదు. రేపు ఫిబ్రవరి 18. గున్నేశ్వరరావు కేసు విచారణ. దానిని గురించి ఆలోచిస్తున్నాను. రేపు నేను సాక్ష్యం ఇవ్వాలికదా!"

"పోనిద్దురూ, ఇతరుల వ్యవహారాలు మనకెందుకు? ఏమిటో! పెళ్ళాంతో మాటామంతీ లేకుండాపోయింది మీకు." దెప్పిపొడిచింది నళిని.

ప్రభాకర్ మళ్ళీ ఆలోచనలోపడ్డాడు.

ఏమిటి నళిని ఈ రోజు ఇలా మాట్లాడుతున్నది. ఇద్దరు బిడ్డలు కలిగారేకాని ఏనాడూ ఆమెద్వారా ముద్దూముచ్చటకూ తను నోచుకోలేదు. అసలు నళినిలో ఏదైనా భూతం ఆవేశించలేదు కదా! కానీ త్వరపడి ఏ నిర్ణయానికి రాకూడదు.

ఆమె అతనిని తన అభిముఖంగా త్రిప్పుకుంది.

యాంత్రికంగా తిరిగాడు ప్రభాకర్.

అతని నుదురును చుంబించింది. చలించలేదు ప్రభాకర్. అతని కపోలాలను ముద్దుపెట్టుకుంది. కదలికలేదు ప్రభాకర్‌లో.

అధరపానం చేసింది. అతడు మారుముద్దు పెట్టలేదు. ఆమెకు విసుగుపుట్టింది మనస్సులో. అణుచుకుంది తన మనోభావాలను.

అతని మస్తిష్కంలో తరంగాలు ప్రమోగుతున్నాయి. భార్య చర్యలు అతనికి అవగతం కావటంలేదు. అతని చేతిని తీసుకొని తన వక్షస్థలంపై ఉంచింది.

అతనిని తన బిగికౌగిలిలో బంధించింది.

అతడు ఆమె చేతిలో కీలుబొమ్మ అయినాడు.

"వట్టి కేకలగొడ్డు" అని సుతారంగా తిట్టింది.

ప్రభాకర్‌కు తిక్కెక్కింది. తనా మాటలవాడు. ఇన్ని సంవత్సరాలుగా కాపురం అక్కరలేదన్నట్లు సంచరించింది ఇవాళ, ఇన్నాళ్ళకు తనని తప్పుపట్టుందా ఈ ఆడది. ఇక ఆమె తనను కవ్వించనక్కరలేదు. తన పురుషత్వాన్ని అవమానించవలసిన అవసరంలేదు.

ఆమెను గాఢంగా కౌగిలించుకున్నాడు. ముద్దు పెట్టుకున్నాడు. అక్కున చేర్చుకున్నాడు. పెనవేసుకున్నాడు. ఇన్నాళ్ళకు వారు అనంగరాజ్య సుఖాలనుభవించారు తృప్తిగా. మరునాడు ఉదయం ఏడు గంటలకే లేపింది నళిని భర్తను. ఎనిమిది గంటలకు సాక్ష్యానికి పోవాలని గుర్తుచేసి టిఫిను కాఫీ అందించింది.

అతడు గున్నేశ్వరరావు ప్లీడరుదగ్గరకు పోవటానికి దుస్తులు వేసుకుని బయలుదేరాడు.

తలకు నూనెరాసి తల దువ్వుతూ

"స్త్రీలను ద్వేషించకండీ!" అంది గోముగా.

"ఇక నేను స్త్రీలను ఎన్నటికీ ద్వేషించకుండా చేశావు నీవు" అని ఆమెను పొగిడాడు ప్రభాకర్.

"సాక్ష్యం సరిగా చెప్పండి. తబ్బిబ్బయితే అందరూ నవ్వుతారు" హెచ్చరించింది నళిని.

"పాఠం నేర్పడానికి నీవు వున్నావుగా" వ్యంగ్యంగాపలికాడు ప్రభాకర్.

"ఆపండి మీ పోకిరీ పలుకులు. నేను వినలేను" అంది చిరుకోపంతో నళిని.

ఆమె బుగ్గమీద ఒక చిటికె వేశాడు ప్రభాకర్.

అతన్ని దగ్గరకులాక్కొని గట్టిగా ముద్దుపెట్టుకుంది నళిని.

విడివడి వాకిలి తలుపుతీసి అతన్ని బయటికి నెట్టింది.

20

అది ఫిబ్రవరి 18. ఛీఫ్ మెట్రొపాలిటన్ మేజస్ట్రేటు కోర్టులో గున్నేశ్వరరావు కేసువిచారణ తేదీ. ఈ రోజు కోర్టువిచారణ బహు పసందుగా ఉంటుందని చాలమంది ఊహించారు. యథాప్రకారం జనం నిండుగావచ్చారు. కేసు పిలిచారు. ముద్దాయి బోనులో ఉన్నాడు.

ఫిర్యాది మేజర్ గున్నేశ్వరరావు సాక్షిబోనెక్కాడు.

గుమాస్తా అతనిచేత ప్రమాణం చేయించాడు.

అడ్డుసవాళ్ళు వెయ్యండని మేజస్ట్రేటు ముద్దాయి ప్లీడరు వీరభద్రయ్యను కోరాడు.

వీరభద్రయ్యది ఆజానుబాహు విగ్రహం. బుర్రమీసాలు, వెడల్పయిన ముఖం. విశాలమైన వక్షస్థలం. ఆలయంలోని వీరభద్రస్వామి విగ్రహంలా ఉన్నాడు.

ఫిర్యాది తరఫున సాక్షులు కోర్టుహాలులో ఉండరాదని బంట్రోతుద్వారా కేకవేయించాడు ఆయన. రామలింగం ప్రభాకర్‌లు లేచి బయటికివెళ్ళారు.

"గున్నేశ్వరరావుగారూ! మీ భార్యకు కమలాకరరావుగారికి పరిచయం చేసింది మీరేకదా?"

"అవును."

"ఆయనను తరచుగా మీరు మీ ఇంటికి ఆహ్వానించేవారు కదా?"

"నిజమే"

"మీరు ఇంట్లో లేనప్పుడు కూడ కమలాకరరావుగారు మీ ఇంటికి తరచు వస్తూవుండేవారు"

"కాదనను"

"ఆయనను మీరు లేనప్పుడు రావద్దని మీరు చెప్పలేదు."

"చెప్పవలసిన అవసరంలేదు"

"చెప్పారా అని ప్రశ్న"

"అలాగని ఆయనకు చెప్పలేదు"

"మరచిపోయాము. ఆయన మీ శాఖలోనే మీ పై ఆఫీసరు"

"సత్యమే"

"మీరు ఆయనతో మంచిగా ఉండాలని, మీపై ఆయనకు సదభిప్రాయం ఉండాలని మీరు అభిలషించేవారు"

"ఏ ఆఫీసరయినా పై ఆఫీసరుతో మంచిగా ఉండాలని కోరుకుంటాడు"

"ఇతరుల విషయం నా కవసరం లేదు. మీ విషయం చెప్పండి"

"నేనూ అలాగే కోరుకునేవాణ్ణి."

"కమలాకరరావుగారిని విందులకు మీ ఇంటికి పిలిపించి నప్పుడు మీ భార్యచేత అతనికిష్టమయిన పిండివంటలు వగైరాలు చేయించి పెట్టేవారు కదా?"

"అవును; అందులో అబ్బురమేముంది"

"మెస్‌లోగాని ఇతరత్రాగాని పార్టీలయిన తరువాత మీరూ, కమలాకరరావుగారు మీ భార్యకలసి మీ ఇంటికివచ్చిన రోజు లున్నాయి"

"ఉన్నాయి"

"అలాంటి రాత్రులుకూడా ఉన్నాయి."

"అవును"

"అలా మీరు వస్తున్నపుడు మీ అంతస్తులో కాపురముండే వాళ్ళు మిమ్మల్ని చూడటం తటస్థించేదేనా ?"

"ఎందుకు చూడరు. మేమేమి రహస్యంగా వస్తేగా?"

"అదికాదండీ. చూడటం సంభవించిందా? అని ప్రశ్న"

"మా అంతస్తులోవాళ్ళు మమ్మల్ని అలా కొన్ని సమయాలలో చూచారు."

"చివరి ప్రశ్న. చూడండి గున్నేశ్వరరావుగారూ! మీ పై అఫీసరు కమలాకరరావుగారి దయసంపాదించి మెప్పుపొందే నిమిత్తం మీరు మీ భార్యకూ ఆయనకూ ఏకాంతం కల్పించి జత కలిపారు. ఏమంటారు"

"అలా ఏ మగాడూ చేయడు. అసంభవం"

"మీరు అలా చేసారని నేను బాధ్యతాపూర్వకంగా అంటున్నాను"

"అబద్ధం. నేను ఆయనకు ఏకాంతం కల్పించలేదు. ఆయనే కల్పించుకున్నాడు"

"పోనీ మీరన్నట్లే ఆయనే ఏకాంతాన్ని కల్పించుకున్నాడని వాదనకోసం అంగీకరిద్దాం. మీరెప్పుడైనా అభ్యంతరం పెట్టారా?"

"నేను ఎలా అభ్యంతరం పెట్టాలి?"

"చూడండి. మీరు నన్ను ఎదురు ప్రశ్న వేయరాదు. ప్రశ్నలువేసే హక్కు ప్లీడరుది. సమాధానాలుచెప్పే బాధ్యత

సాక్షిది. ఈ విషయం తెలిసికొని దయచేసి ఎదురు ప్రశ్నలువేయ కుండా సూటిగా నా ప్రశ్నలకు సమాధానాలు చెప్పండి."

"ఎలా చెప్తారండీ. గుంటచిక్కు ప్రశ్నలు వేస్తుంటే?"

"గున్నేశ్వరరావుగారూ! వీరభద్రయ్యగారు నెమ్మదిగా మర్యాదగా చెప్పారు. వాదించటం మానివేసి అడిగిన ప్రశ్నలకు సూటిగా సమాధానాలు చెప్పండి"

సాక్షి ప్రశ్నను మరచిపోయాడేమోనని వీరభద్రయ్య ప్రశ్నను మళ్ళీవేసాడు.

"అభ్యంతరం పెట్టలేదు."

"మీ వయస్సు"

"ముప్పదిరెండు ఏండ్లు"

"మీ భార్య వయస్సు"

"ఇరువదియారు సంవత్సరాలు"

"ముద్దాయి వయస్సు"

"ముప్పయితొమ్మిది ఉంటాయి."

"సైనికాధికారులు స్త్రీలను గౌరవిస్తారు కదూ"

"అవును"

"ఆఫీసర్ల మెస్‌లలో, విందులలో మిలటరీ ఆఫీసర్లు మత్తు పానీయాలు పుచ్చుకుంటారు"

"అది తప్పుకాదే!"

"పుచ్చుకుంటారంటాను"

"త్రాగుతారు"

"ఆఫీసర్ల కుటుంబాలకుచెందిన స్త్రీల సమక్షంలోనే 'హార్డు' డ్రింక్సు త్రాగటం జరుగుతుంది"

"స్త్రీలు ఎప్పుడూ అభ్యంతరం పెట్టరు"

"నా ప్రశ్న ఆఫీసర్లు స్త్రీల సమక్షంలో త్రాగుతారని"

"అవును"

"స్త్రీలను దుర్భషలాడటం లాంటివి జరుగవు"

"మీకు మిలిటరీ వారితో పరిచయం లేదేమో. ఎట్టి పరిస్థితుల్లోను మిలిటరీ ఆఫీసరు స్త్రీని అవమానించడు."

"మీరెప్పుడైనా మీ భార్యపై చేయిచేసుకున్నారా?"

"అది పిచ్చి ప్రశ్న"

"పిచ్చి ప్రశ్నలను కూడా వేసేహక్కు నాకుంది నా క్లయింటు ఇచ్చిన సంజాయిషీనిబట్టి, నా క్లయింటు క్షేమం కోసం"

"ఇలాంటి ప్రశ్నలు వేయవద్దని అవతలవైపు న్యాయవాదిని ఆదేశించవలసిందిగా కోర్టువారిని ప్రార్థిస్తున్నాను" ఫిర్యాది ప్లీడరు లేస్తూ అన్నాడు.

"ఫిర్యాది ప్లీడరు లేవదీసిన అభ్యంతరాన్ని త్రోసివేయడమయింది" అని మేజస్ట్రీటుగారు ప్రకటించి-

"అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పండి గున్నేశ్వరరావు గారూ!" అని హెచ్చరించారు.

"నేనెప్పుడు నా భార్యను కొట్టలేదు. అలాంటి ఊహ నాకు రాలేదు ఏనాడూ"

"పోనీ మందలించారా?"

"అవసరం కలగలేదు; మందలించలేదు"

"మీరేదో చూచిన సంఘటనను వివరించారు. సరే. దానికి క్రితం ఎప్పుడైనా మీ భార్య కమలాకరరావుతో ఏ రకంగానైనా సంచరించిన తీరు మీకు అభ్యంతరకరంగా తోచిందా?"

"అలాంటి సంఘటనలు రెండు మూడు ఉన్నాయి"

"వాటిని గురించి మీ సాక్ష్యం తప్ప ఇతరుల సాక్ష్యంలేదు"

"లేదు."

"మీ భార్యా కమలాకరరావుగారు పరస్పరం ప్రేమించుకున్నారు"

"అక్రమం. అలా జరగటానికి వీల్లేదు"

"సూటిగా అడిగినదానికి సమాధానం చెప్పండి"

"అవును"

"ఈ విషయం మీకు ఎప్పుడు అవగతం అయింది"

"1981 జూన్ లో"

"జూన్ నుండి డిసెంబరు వరకు కమలాకరరావుగారు మీ ఇంటికి వస్తూపోతూనే ఉన్నారు"

"అవును"

"మీరు లేనప్పుడుకూడా ఆయనవచ్చి మీ భార్యతో కాలం గడిపిన సందర్భాలు ఉన్నాయి"

"ఉన్నాయి"

"చూడండి. మీ భార్యా, కమలాకరరావుగారూ జతకూడటం విషయం తెలిసి సమ్మతించి మీరు ఊరుకున్నారు."

"అబద్ధం అబద్ధం." ఇంచుమించుగా అరచినంత పని చేశాడు గున్నేశ్వరరావు.

క్రాసు అయిపోయిందని చెప్పాడు వీరభద్రయ్య.

"రీ ఎగ్జామినేషను ఉందా?" సీతారామయ్యను అడిగాడు మేజస్ట్రీటు.

"ఒక్క ప్రశ్నవుంది" అని ఫిర్యాది ప్లీడరు అడగబోయి మళ్ళీ మానుకున్నాడు.

"తరువాతి సాక్షి పేరు" అడిగాడు గుమాస్తా.

"ప్రభాకర్" అన్నాడు ఫిర్యాది న్యాయవాది.

ప్రభాకర్‌ను కేకవేశాడు బంట్రోతు. ప్రమాణంచేయించాడు. ఫిర్యాదవైపు ప్లీడరులేచి పేరు, వృత్తి, నివాసం, గున్నేశ్వరరావుతో పరిచయం, మొదలయిన కొన్ని ప్రశ్నలడిగింతరువాత ఇలా విచారించటం ప్రారంభించాడు.

"గున్నేశ్వరరావుగారి భార్య నీరజను ఎప్పుడైనా చూచారా"

"అనేక పర్యాయాలు చూచాను"

"ఆమె స్వభావం ఎలాంటిది"

"ఆమెకు ముద్దాయితో అక్రమసంబంధం"

"మీకెలా తెలుసు?"

"ఆమె భుజంమీద చేయివేసుకొని ముద్దాయి నడవటం నేను చూచాను."

"ఎక్కడ? ఎప్పుడు?"

"మా అంతస్తులో కారిడరులో. ఏడు ఎనిమిది నెలలక్రితం నుండి రాత్రిళ్ళుకూడా"

"వీరభద్రయ్యగారూ మీరు క్రాస్ చేయువచ్చును" అని ఫిర్యాది ప్లీడరు కూర్చున్నాడు.

వీరభద్రయ్య లేచాడు. హాలులో కలకలం. బంట్రోతు సైలెన్సు కేకతో నిశ్శబ్దం ఏర్పడింది.

వీరభద్రయ్య నిటారుగా నిలబడి గొంతు సవరించుకున్నాడు.

"మిస్టర్ ప్రభాకర్! నీరజను కమలాకరరావును కారిడరులో చూచామన్నారే. గున్నేశ్వరరావు, నీరజ, కమలాకరరావు కలసి రావడం మీరు ఎప్పుడైనా చూచారా?"

"చూచాను"

"ఎన్నిసార్లు"

"పదిసార్లు"

"అందులో రాత్రిపూట ఎన్నిసార్లు?"

"అయిదుసార్లు"

"నీరజ భుజంమీద చేయివేసుకొని ముద్దాయి ఎన్నిసార్లు మీకు కనపడ్డాడు"

"ఎనిమిదిసార్లు"

నీరజ భుజంమీద చెయ్యివేసుకొని ముద్దాయి గున్నేశ్వరరావు ప్రక్కన నడుస్తూ మీకు కనపడినాడా?

"కనపడ్డాడు"

"ఎన్నిసార్లు"

"నాలుగుసార్లు"

క్రాసు అయిపోయిందని ముద్దాయి న్యాయవాది కోర్టుకు మనవిచేసుకున్నాడు.

ఫిర్యాది ప్లీడరు మరల అడిగే ప్రశ్నలు లేవన్నందున సాక్షిని పంపించివేశారు.

తరువాత సాక్షిపేరు రామలింగంగా చెప్పించుకుని అతనిని పిలిపించి బోనులో ప్రమాణం చేయించాడు గుమాస్తా.

ఫిర్యాది తరఫు ప్లీడరు సీతారామయ్య లేచాడు.

కొన్ని ప్రశ్నల తరువాత ఇలా సాగింది.

"గున్నేశ్వరరావు భార్య నీరజ తెలుసునా ?"

"తెలుసు"

"ముద్దాయి తెలుసునా"

"గున్నేశ్వరరావుగారి ఇంటికి వస్తూపోతూ ఉంటాడు."

"నీరజ స్వభావమెట్టిది"

"ఆమెకు ముద్దాయికి అక్రమ సంబంధం"

"మీకెలా తెలుసు"

"మా అంతస్తులో వాటాలోనే కదండి వారు ఉండేది."

"ఏ ఆధారాన్నిబట్టి మీరు అలా చెప్తున్నారు"

"గున్నేశ్వరరావు ఊళ్ళో లేనప్పుడుకూడ ముద్దాయి వారి ఇంటికి వచ్చేవాడు."

"అప్పుడు ఇంట్లో ఎవరు ఉండేవారు."

"నీరజ మాత్రం ఉండేది"

"అలా వచ్చినపుడు ఎంతసేపు ఉండిపోయేవాడు"

"సుమారు ఒక గంట రెండు గంటలు ఉండి వెళ్ళేవాడు."

"వాళ్ళు ఏం చేసేవాళ్ళు."

"పొడు బుద్ధులున్న ఆడమగా ఏం చేస్తారో అదే చేసేవారు"

"మీకెలా తెలుసు"

"నేను చూచాను"

"ఎలా చూచావు"

"వాకిలి తలుపుకుండే రంధ్రంగుండా."

ముద్దాయి ప్లీడరు వీరభద్రయ్య లేచాడు.

"చూడండి రామలింగంగారూ మీరు పూజా పునస్కారాములా చేస్తారు"

"అవును"

"మీరు సెక్రటేరియటులో సెక్షను సూపరింటెండెంటు."

"అవును"

"మీకు సంతానంలేదు"

"అవును"

"మీ అఫీసు పని గంటలు"

"ఉదయం పదిన్నరనుండి సాయంత్రం 5 గంటల వరకు"

"మీ వ్యాసంగాలు"

"ప్రతిరోజూ క్లబ్బుకువెళ్ళి చీట్లపేక ఆడి రాత్రి 9 గంటలకు ఇంటికి చేరతాను."

"సెలవురోజు ఏంచేస్తారు"

"మా ఆవిడను సినిమాకుతీసుకొని వెళ్ళినరోజు సాయంత్రం తప్ప మిగతా పగలంతా క్లబ్బులోనే ఉంటాను"

"డబ్బుపెట్టి పేకాట ఆడతారా"

"లేదండి. నేను కంట్రాక్టు బ్రిడ్జిలో రాష్ట్ర ఆటగాణ్ణి"

"కమలాకరరావుగారు ఎప్పుడైనా మీరు చూడగా నీరజతో గున్నేశ్వరరావుతో కలసి గున్నేశ్వరరావు ఇంటికి వచ్చారా?"

"వచ్చారు"

"నీరజ భుజంపై చేయివేసి కమలాకరరావుగారు గున్నేశ్వరరావు పక్కన నడుస్తుండగా గున్నేశ్వరరావు ఇంటికివచ్చారా?"

"రాకేమండి. అనేకసార్లు వచ్చారు"

"మీరేదో వాకిలిలో రంధ్రం గుండా చూశామంటిరే, ఆ సంఘటనకు ముందా వెనుకా మీరు వాళ్ళ ముగ్గురిని అలా చూసింది."

"ముందేనండి"

"వాటిలో మొదటిసారి ఎప్పుడు చూచి వుంటారు"

"ఆగస్టు 81 అనిగుర్తు"

"మీరేదో వాళ్ళని చూచామన్నారుకదా! వాకిలిలో రంధ్రం గుండా చూస్తే బెడ్ రూమ్‌లో భాగం కనపడుతుందా?"

"బెడ్‌రూము కన్పడదు; కాని వాళ్ళుఎదురుగా డ్రాయింగు రూం సోఫాలో పడుకొని ఉన్నారండి."

హాలంతా విరగబడి నవ్వింది.

వీరభద్రయ్య ముఖం చిన్నబుచ్చుకున్నాడు.

"వాకిలి రంధ్రంలోగుండా చూశామంటిరే ఏ వేళప్పుడు?"

"రాత్రి తొమ్మిదిన్నర గంటలకు"

మళ్ళీ శ్రోతలంతా నవ్వారు. "సైలెన్సు" అని కేకలు వేశాడు బంట్రోతు.

క్రాసు అయిపోయిందన్నాడు వీరభద్రయ్య.

"సారీ" అన్నాడు సీతారామయ్య.

ముద్దాయిని ప్రశ్నలడిగే నిమిత్తం ఫిబ్రవరి 21వ తేదీకి కేసును వాయిదా వేశారు.

ఫిర్యాది ప్లీడరు బలే తెలివికలవాడని కొందరూ, ముద్దాయి ప్లీడరు చాకులాంటివాడని మరికొందరూ, చివరి సాక్షి రామలింగం ముద్దాయి ప్లీడరును చిత్తుచేశాడని ఇంకా కొందరు ఇళ్ళకు చెప్పుకుంటూవెళ్ళారు. సాయంత్రం పత్రికలలోనూ, మరునాటి ఉదయం పత్రికలలోనూ కేసు విచారణ యావత్తూ వచ్చింది.

సాహసంకల ఒక వ్యాపారి, గండిపేట చెరువుగట్టున బుల్లి బుల్లి ఇండ్లను చవకగా నిర్మించాడు. ఒక వరండా, ఒకేగది అంతే ఆ ఇంటి విస్తీర్ణము. కాకపోతే గదిలో బుల్లి వంటఅరుగు, అంతసైజు భోజనాల బల్ల, రెండు కుర్చీలు, ఒక మంచమూ బెడ్ మాత్రం ఉన్నాయి. వాటిని విహార యాత్రికులకు అద్దెకిస్తారు రోజుకింత అని. హైదరాబాదులో ప్లాటులో మ్రగ్గిపోయేవాళ్ళు వారం చివర అక్కడికి చేరతారు. భోజనం టిఫిను ఇత్యాది నిత్యావసరాలు సరఫరా చేయటానికి ఒక చిన్న కాంటీను ఏర్పాటు చేశాడు ఆ వ్యాపారి. ఆ బుల్లిఇళ్ళ సంఖ్య ఇరవయి మాత్రమే. వాటిని 'కాటేజీలు' అని పిలవడంకద్దు. వీటికి శుక్రవారం సాయంత్రం వరకు డిమాండు ఉండదు.

గండిపేట కాటేజీలలో చోటుకోసం, రెండు జంటలు ఏక కాలంలో చేరాయి. ఒకటి పద్మినీ సూర్యారావుల జంట, మరొకటి మోహనరావు చిత్రావతుల జంట. సమయం శుక్రవారం రాత్రి

తొమ్మిది గంటలు. చెరివక కాటేజీ దొరికింది. మోహనరావు పద్మినిని గుర్తుపట్టాడు; కాని పలకరించలేదు. పద్మిని మోహనరావును చూచింది;

"మోహనరావుగారూ! కులాసా? కాటేజీ దొరికిందా?" అడిగింది పద్మిని.

మోహనరావు తనలో తను కుంచించుకు పొయ్యాడు. అతని వెంటనున్న చిత్రావతి ప్రక్కకు తప్పుకుంది.

"ఊ" అని మాత్రం అనగలిగాడు.

"ఏమిటి మీరు నన్ను గుర్తుపట్టలేదా? నేను 304 నెంబరు ఫ్లాటు పద్మినిని" అని గుర్తుచేసింది అతనికి.

మోహనరావు భయకంపితుడయి ఆఫీసు బయటికి వెళ్ళాడు. పద్మిని కడుపార నవ్వుకుంది.

"పద్మినీ! ఏమిటీ అల్లరి చిల్లరి పనులు. నీకు ఏనాడూ ఎవరిని చూచినా భయం లేదనుకో. కాని తతిమ్మా అందరూ అలాంటివాళ్ళుకాదుగా!" మృదువుగా మందలించాడు సూర్యారావు.

"కాదు, సూర్యం! అంతలావు పెద్దవ్యాపారి ఇంతచిన్న తప్పుచేయటానికి భయపడుతుంటే ఏడిపించాలని సరదాపుట్టింది" సంజాయిషీ చెప్పుకుంది పద్మిని.

"నీ వరసేఅంత. నిన్ను అని ఏం ప్రయోజనం" సూర్యం వెష్టపడ్డాడు.

తరువాత పద్మిని సూర్యారావులు తమ కాటేజీకి వెళ్ళి పోయారు.

వాళ్ళు వెళ్ళడం బయటనుంచి గమనిస్తున్న మోహనరావు ధైర్యంగా ముందుకువచ్చి ఒక కాటేజీని అద్దెకు తీసుకున్నాడు. చిత్రావతిని వెంటబెట్టుకుని అందులో ప్రవేశించాడు. కాని అతని ఆనందానికి ఆ రోజు అవకట్టపడింది. రుక్మిణికి చెప్తుందేమో ఈ తుంటరిపిల్ల. ఆ పద్మిని మహ తెంపరి. తన సంసారం ఏమికాను ? ఇంతవరకూ రుక్మిణి తనను అనుమానించలేదు. ఇలా యోచించసాగాడు మోహనరావు. ఈ నాటి సంఘటన చిత్రావతికి అవమానకరంగా కన్పట్టులేదు కాని ఆమెకు చీకాకు కలిగింది. మోహనరావు భయభ్రాంతుడగుట ఒకటి తనకు ఉత్సాహ భంగం కలుగటం రెండవది. ఈ కారణంచేత ఆమె ఆ రాత్రి సుఖించలేక పోయింది. తలనొప్పి హఠాత్తుగా వచ్చిందని సాకుచూపి మోహన రావు యాంత్రిక ప్రేమపాశాన్నుండి ఆ రాత్రికి తప్పించుకో గలిగింది. తెల్లవారేటప్పటికి వారిరువురూ హైదరాబాద్ చేరు కున్నారు.

తెగత్రాగిన మైకంలో ఒళ్ళుతెలియకుండా పడివున్న పద్మినీ సూర్యారావులు మరునాడు మధ్యాహ్నం పన్నెండు గంటలకు లక్డీకాపూల్ చేరారు. ఈసారి అపార్టుమెంట్సు గేటువద్దనే పద్మినిని దింపి సూర్యారావు కారు నడిపించుకొని వెళ్ళిపోయాడు. పద్మిని మూడవఅంతస్తు చేరింది తమ బిల్డింగులో. రామలింగంగారి ఫ్లాటు తలుపుతట్టి సౌభాగ్యమ్మను బయటికిపిలిచి ఆమెకు ఇలా తెలిపింది.

"పిన్నిగారూ! వినండి మంచి తాజావార్త. మజావార్త. నిన్న రాత్రి గండిపేట కాటేజీలవద్ద 305 నెంబరు ఫ్లాటు ఆయన మోహన రావుగారు తటస్థపడ్డాడు వెంట ఒక యువతితో. ఆ అమ్మాయి ఏమీ అందగత్తె కాదు సుమండీ; వట్టి సాదామనిషి. అబ్బ అటువంటి

వాళ్ళకోసం ఎలా ఆరాటపడతారో ఈ మగాళ్ళు. నాకు బహుచెడ్డ చిరాకేసిందంటే నమ్మండీ! అంతలావు పెద్దమనిషినీ నీరు కార్చేశాను. ఏం చేశానో ఊహిస్తారూ! మీకెందుకులెండి ఆ శ్రమ. నేను ఆయనను పేరుపెట్టి పిలచి నేనండీ పద్మనిని అన్నాను. పాపం ఆ మగపురుషుడు అదిరిపోయ్యాడంటే నమ్మండి. అహ్హహ." అంటూ ఆమె తన వాటా వైపుకు నడిచింది.

సౌభాగ్యమ్మ తల తిరిగిపోయింది.

పద్మిని పోకిలాపిల్ల; ఒకరకంగా ఆలోచిస్తే తిరుగుమోతు. కాని అబద్ధమాడదు చచ్చినా. బలేమనిషి.

ఈ సమాచారం రుక్మిణికి అందజేయాలని ఎంచింది. రుక్మిణి ఎంత సాధ్వీమతల్లి. గుణవంతురాలు; ఆదర్శగృహిణి. అటువంటి ఆమెభర్తకు ఈ వయస్సులో ముగ్గురుపిల్లలు కలిగినతరువాత ఈ బయటతిరుగుడా? దేనికయినా హద్దూపద్దూ ఉండాలి. సనాతనత్వం సర్వనాశనదీ మయిపోతున్నది. భారత సంస్కృతి బండపాలవుతున్నది. తను మీనమేషాలు లెక్కపెట్టుకుంటూ కూర్చోవటానికి వీలులేదు.

సౌభాగ్యమ్మ రుక్మిణి వాకిలి తలుపుతట్టింది. రుక్మిణితప్ప ఇంట్లో ఎవరూలేరు. పిల్లలు బళ్ళకువెళ్ళారు. భర్త వ్యాపారపు పని మీదవెళ్ళాడు. రుక్మిణి సౌభాగ్యమ్మను సాదరంగా లోనికిపిలిచింది. ఇద్దరూ సోఫామీద కూర్చున్నారు. రావడమయితే ఊపుగావచ్చింది కాని ఈ పాడు వార్త ఆమెకు - అందులో రుక్మిణిలాంటి మనిషికి - ఎలా అందజేయాలోనని తికమకపడింది సౌభాగ్యమ్మ.

చివరకు గుండెదిటవుచేసుకుంది.

"రుక్మిణిగారూ ! నేనొక పాపిష్టి వార్తను మోసుకొని వస్తున్నాను. అసలు, దాన్ని మీకు చెప్పడమా లేదా అని సందేహించాను. మీరు తట్టుకోగలనంటే చెప్తాను."

"సౌభాగ్యమ్మగారూ! మీబోటి సౌశీల్యవంతులు విన్నవార్త అంత ఘోరమయింది కాకూడదు. ఏదైనా మీరున్నారుకదా ధైర్యం చెప్పటానికి. సెలవివ్వండి"

"రుక్మిణిగారూ, 304 నెంబరు ఫ్లాటులో మీ ప్రక్క ఫ్లాటులో ఉన్న వెంకటరావుగారి భార్య పద్మినిని మీరు చూచారు కదా ! ఆ షోకిల్లాపిల్ల"

"చూచినట్లే గుర్తు."

"ఆమె ఒకరకమైన తిరుగుమోతు. ఆమెకు నిన్న శుక్రవారం రాత్రి మీ వారు ఒక సాదా యువతితో గండిపేట కాటేజీల వద్ద కన్పించారట. పద్మిని పలకరిస్తే మీ వారు భయంతో జారుకున్నారట"

"చూడండి సౌభాగ్యమ్మగారూ ! ఇలాంటి మాటలు గిట్టని వాళ్ళు పుట్టిస్తారు. లేక ఒక్కొక్కపుడు మంచివాళ్ళు పొరపడి, లేనిది ఉన్నట్లు ఎంచవచ్చును. ఏదైనా మావారు అటువంటి వారుకాదు. ఆయన అగ్నిహోత్రం."

లేచి నుంచున్నది రుక్మిణి.

సౌభాగ్యమ్మ నిట్టూరుస్తూ తన వాటాలోకి వెళ్ళిపోయింది.

21

శనివారం సాయంత్రం కృష్ణారావు ఫోనుచేశాడు సావిత్రికి. "నన్ను మీ ఇంటికి రమ్మన్నారు ఆ రోజు సినిమాహాలులో నేను

కృష్ణారావును. ఎన్నింటికి రమ్మంటారు."

"వీలయితే అరగంటలో రండి" మధురమైన కంఠధ్వనితో పలికింది సావిత్రి.

నాలుగున్నర గంటలకు కృష్ణారావు వస్తానన్నాడు.

అతడు వస్తాడని ఫలహారాదులు తయారు చేయించింది సావిత్రి. వాకిలి తలుపు ఓరగా తెరచి ఉంచింది.

రానేవచ్చాడు కృష్ణారావు.

అతనిని చూచి అబ్బురపడింది. సినిమాహాల్లో లైట్లు వెలుతురులో కన్పడ్డ కృష్ణారావుకాడు ఇతడు. ఎంత అందగాడు అప్రియత్నంగా మాట పెదవులదాకావచ్చి ఆగిపోయింది.

"నేనేనండి కృష్ణారావును. గుర్తుపట్టలేదా ఏమిటి కొంపతీసి" అన్నాడు.

గొంతుని పోల్చుకుంది సావిత్రి.

సోఫా చూపించి "ఆశీనులుకండి" అంది.

లోపలికి వెళ్ళివచ్చింది. అతనికి ఎదురుగా కుర్చీలో సావిత్రి కూర్చుంది.

పనికత్తె ఫలహారాలుతెచ్చి టీపాయ్ మీదపెట్టింది.

"ఇప్పుడే తీసుకొని వచ్చానండీ" అన్నాడు కృష్ణారావు.

"టీ టైముకువచ్చి ఫలహారం చెయ్యనంటే ఎలా ?"

పకపకా నవ్వింది సావిత్రి.

ఆమె పలువరస ముత్యాలవలె మెరిసిపోయాయి.

"మరి మీరు ముందుగా టీకి రండని ఆహ్వానించలేదుగా" నెపం ఆమెపై వేశాడు అతడు.

"మిమ్మల్ని మీరే ఆహ్వానించుకుంటిరి నాల్గున్నరకు వస్తానని చెప్పి. ఆహ్వానించటానికి మీరు నాకు అవకాశం ఇస్తేగా"

"బలే దెబ్బకొట్టారండీ! ఓడిపోయాను" అన్నాడు కృష్ణారావు.

"అలా దారికిరండి. ఓడిపోయినవాళ్ళు గెలిచినవారి మాట వినాలి'' ఆజ్ఞాపించే ధోరణిలో పలికింది సావిత్రి.

"చిత్తం'' అంటూ ఫలహారం తీసుకోవడం మొదలు పెట్టాడు. కాని చూపులు ఆమె ముఖంమీదనే ఉన్నాయి.

ఇద్దరూ ఒకేసారి నవ్వారు.

అతని మనస్సులో ఏముందో కాని అతని చూపులో మటుకు మర్యాద, మన్నన ఉన్నాయి. సంతృప్తికలిగింది సావిత్రికి. పనిమనిషి ట్రేలో రెండు టీ కప్పులు తెచ్చింది. ఒక కప్పును సావిత్రి స్వయంగా కృష్ణారావుకు అందించింది. అతని వేళ్ళు ఆమె వేళ్ళను స్పృశించాయి.

'అది అనాలోచితమా లేక వ్యూహాత్మక కార్యమా' అనే యోచనలోపడ్డది సావిత్రి. తన మనస్సు ప్రతిదానినీ శంకిస్తున్నదని ఎంచింది. 'సంశయాత్మా వినశ్యతి' అని తను ఎప్పుడో చదివింది. కృష్ణారావు నిష్కల్మష హృదయుడిలా కనిపిస్తున్నాడు.

"ఏం మహాత్మా! వక్కపొడి వేసుకుంటారా. తమలపాకు కిళ్లీ వేసుకుంటారా'' అడిగింది సావిత్రి.

"తాంబూల రంజిత అధరాలే నాకు ఇష్టం" భావ ప్రకటన చేశాడు కృష్ణారావు.

అతని రసికత్వానికి ఆమె ముగ్ధురాలయింది.

"సుశీలా! కిళ్లీలు తీసుకురా''

పనిమనిషి సాసరులో కిళ్లీలు, తమలపాకు చిలకలూ, వక్కపొడీ తెచ్చింది.

సాసరును కృష్ణారావువైపు చాచింది సావిత్రి. తీసుకుని టీపాయ్‌మీద పెట్టాడు.

"ఖద్దరంటే నాకిష్టం."

"తమలపాకు చిలకలు ఖద్దరే" అంది సావిత్రి.

వక్కపొడనీ, చిలకలను వేసుకున్నాడు కృష్ణారావు.

కిళ్లీ వేసుకున్నది సావిత్రి.

"మీరేం చేస్తుంటారు" ప్రశ్నించింది సావిత్రి.

"ఏం చేస్తాను. పెళ్ళాం పిల్లలులేక, నా అనే తోడులేక గాలిపటంలా ఎగురుతున్నాను."

"సూత్రంవేస్తే ఆ ఎగరటానికి హద్దూపద్దూ ఏర్పడతాయి" ఆ ఉపమానాన్ని కొనసాగించింది సావిత్రి.

"సూత్రధారిణి తటస్థించాలి కదా!" భావస్ఫూరకంగా పలికాడు కృష్ణారావు.

అతడు బ్రహ్మచారి అని గ్రహించింది. ఆ రోజు తనను కారులో దిగపెట్టిపోయిన వైనం గమనించి ధనవంతుడని ఆకళింపు చేసుకుంది. రూపమూ సుందరం. మాటా చమత్కారయుతం. కంఠమూ మార్దవం. వయస్సా తరుణుడు. దృక్కులా సూదంటురాళ్ళు. ముఖమూ ప్రఫుల్ల చంద్రం. తనకు తగినవాడని తేల్చుకుంది. అతనిని చేయిజారి పోనీయకూడదని నిర్ణయానికి వచ్చింది. తాను త్వరపడి లోకువకాకూడదు. అయినా ఇంకా కొంతకాలం పరిశీలించటం మంచిదేమో. 'మేడిపండుచూడ మేలిమైయుండు,

పొట్ట విచ్చిచూడ పురుగులుండు' అన్నాడు వేమన. అంత అనుభవజ్ఞుడు చెప్పిన లోకజ్ఞానాన్ని తనబోటివాళ్ళు తప్పక ఖాతరు చేయాలి. వేగిరపడి జీవితాన్ని చేతులార ధ్వంసం చేసుకోరాదు. అసలే, ఇప్పటికి ముక్కచెక్కలయింది తన జీవితం.

"ఏమిటో! సుదీర్ఘంగా ఆలోచిస్తున్నారు" కృష్ణారావు తన ఉత్కంఠ వెలిబుచ్చాడు.

"ఏమీలేదు! నేను ఒకటి అడిగితే ఈయన మరో విషయం చెప్పారే! ఏమిటి చెప్మా అని ఆలోచిస్తున్నాను" అని ఫకున నవ్వింది సావిత్రి.

సావిత్రి నవ్వినపుడల్లా ఆమె బుగ్గలు సొట్టలుపడతాయి.

ఆ అంశాన్ని ఇంతకుక్రితం గమనించిన కృష్ణారావు ఇపుడు ఆ సోయగాన్ని చూచాడు. పరవశుడయినాడు.

ఆ సొట్టబుగ్గల సావిత్రిని ఒక్కసారిగా తన కౌగిలిలోకి తీసుకోవాలన్నంత ఉద్రేకం వచ్చింది. నిగ్రహించుకున్నాడు.

"ఓస్! అదా? నాది ఎగుమతి దిగుమతి వ్యాపారం"

"స్మగ్లింగు కాదుకదా?" తన మనస్సును సమాధాన పరుచుకోటానికి సావిత్రి వేసిన ప్రశ్న.

షాక్ తిన్నాడు కాస్సేపు. నిశ్చేష్టుడయినాడు కృష్ణారావు.

"సావిత్రిగారూ! మీరు బలే చమత్కారంగా మాట్లాడతారండీ. నా సరుకు అంతా నికార్సేనండీ"

"ఐ యామ్ సారీ" తన విచారాన్ని వ్యక్తం చేసింది సావిత్రి.

"మరచిపోండి. తమాషాకు అలా అన్నాను. అంతే" అన్నాడు కృష్ణారావు.

"కాలాతీతమయింది వెళ్తాను. మరో ఎంగేజ్‌మెంటువుంది." అంటూ అతడు లేచాడు.

"ఒక్కక్షణం ఉండండి. ఒక సాఫ్ట్‌డ్రింకు తెస్తాను" అని ఇంట్లోకివెళ్ళి రెండు మజా సీసాలతో సావిత్రి ప్రత్యక్షమయింది.

అతడు ఆమెను ఎగాదిగా చూశాడు. ఆమెలో అతనికి రతీదేవిని తలదన్నే ఆకర్షణ గోచరమయింది. డ్రింకుసీసా తీసుకుని ఆమెవంక తదేక దృష్టితో చూస్తున్నాడు.

"మీరు దేవతలులాగ ఉన్నారే" అని నవ్వింది.

"మా నగచెట్టెక్కిస్తున్నారు" అనగల్గాడు అతడు.

"అదికాదండీ, అనిమిషత్వం దేవతల లక్షణం కదా!"

నా సంగతి అలాఉంచండి. మీరు సాక్షాత్తు దేవతాస్వరూపులు"

"ఇంతసేపటికి మీకు ఛాన్సువచ్చింది. అనండి. ఏంచేస్తాం. ఎంతయినా ఆడవాళ్ళం కదా! మాట పడాల్సిందే!" మాట మార్చింది సావిత్రి.

ఆమెవద్ద సెలవు తీసుకుని అతడు వెళ్ళిపోయాడు. అతడు లిఫ్టులోకి వెళ్ళేంతవరకు అతనివైపు చూస్తూ వాకిట్లో నిలబడింది సావిత్రి.

ఇంతలో రామలింగంగారు పద్మిని భర్త వెంకట్రావుతో కారిడరులో మాట్లాడుతుండటం తను చూసింది. తనకెందుకని లోపలికి వెళ్ళిపోయింది.

"వెంకట్రావుగారూ! ఒక విషయం మీతో మాట్లాడాలని చాల రోజులనుంచీ వేచివున్నానండీ'' రామలింగం తన వేదనను ఎరుకపరిచాడు.

"ఎప్పుడైనా మీరువచ్చి మాట్లాడితే సరిపోయేది కదా!'' అన్నాడు నొచ్చుకుంటూ వెంకట్రావు.

"ఏంలేదు, వ్యక్తిగత విషయం. అందుకని సందేహించాను''

"మీ వ్యక్తిగత విషయమా? నా వ్యక్తిగత విషయమా?'' కరుకుగావుంది వెంకట్రావు కంఠధ్వని.

పులి ఆవు పై లంఘించపోతున్నది. పసికట్టింది ఆవు. తప్పించుకోటానికి అవకాశంలేదు. కొమ్ములతో రక్షించుకొందామనే అభిప్రాయానికి వచ్చింది.

''క్షమించాలి మీ వ్యక్తిగత విషయమే. మీ భార్య పద్మిని అక్రమచర్యలు. ఆ సూర్యారావుతో విహారాలు వినోదాలు, శుక్రవారం రాత్రి గండిపేట కాటేజీలో లీలలు. చేతనయితే ఆమెను అదుపు చేసి అప్రతిష్ట తప్పించుకోండి'' గబగబా నాలుగు మాటలూ అనేసి జవాబు కోసం ఎదురుచూడకుండా లిఫ్టులోకి వెళ్ళి క్రిందికి దిగాడు రామలింగం.

పులి ఆవుపై లంఘించి మెడ కొరికింది.

ఆవు విడిపించుకుంది.

ఆవు పులిని కొమ్ములతో కుమ్మింది. గాయపడిన పులి పారిపోయింది.

తను తన వాటాలోకి పోయాడు.

వెంకట్రావు తనఫ్లాటులో ఒక్కడూ కూర్చున్నాడు. బయటికి షాపింగుకు వెళ్ళిన పద్మిని ఇంకా ఇంటికిరాలేదు. పనిమనిషి వెళ్ళిపోయి చాలాసేపయినది. డ్రాయింగురూంలో కూర్చున్నాడు. హాలులో లైటు వేసుకోలేదు. ఒక చిన్న జీరోవాట్ బల్బు మాత్రం వెలుగుతున్నది.

ఆలోచనలు సైన్యంలా అతని బుర్రను ఆక్రమిస్తున్నాయి. ఆలోచనా రహితంగా సమాధ్యావ్యస్థలోకి జారుకోవాలని అభిలషించాడు. ఒక ఆలోచనను నెట్టివేస్తే మరో ఆలోచన చైనా సైన్యపు వ్యూహంలాగ ఉంది వాటిపద్ధతి. ఒక తుపాకికి ముగ్గురు సైనికులట. ఎలా వేగడం? ఇంతకూ సమస్య ఏమిటి? తన భార్య పరాయి మగాళ్ళతో యథేచ్ఛగా తిరుగుతుందని నిందారోపణ. ఆమె సామాన్యకాదే! ఆమె పడుపువృత్తి సాగించటంలేదే! ఆమెలాంటి అందగత్తె, చలాకీ మనిషి వేశ్యావృత్తిని చేపట్టే అందరికీ అందుబాటులో ఉండేది, అలా కాకుండాపోయిందనా ఈ 'పెద్దమనుష్యుల' బాధ? ఇంతకూ ఇది తనకూ, తన భార్యకూ, ఆమె ఇతర ప్రియులకు సంబంధించిన విషయం. ఈ మూడు రకాల వ్యక్తులు పట్టించుకోకపోతే తతిమ్మా వాళ్ళకెందుకు ఈ బాధ? దర్యాప్తు చేయటానికి ఎందుకింత శ్రమ. తను ఎవరి విషయమూ పట్టించుకోవడంలేదే! రామలింగంగారిని పిలిచి "ఏమయ్యా! ఇన్నాళ్ళు కాపురంచేసినా నీకు పిల్లలు కలగలేదం? నీవు నపుంసకుడివా? నీ భార్య గొడ్రాలా?" అని ప్రశ్న పరంపర కురిపించలేదే? తను సుఖంగావుంటే రామలింగయ్య చూడలేకపోతున్నాడు. అందుకే తన జీవితంలో విషపుచుక్క విదిలించాలని రామలింగం తాపత్రయపడుతన్నాడు. తనకు ఏ విషయం తక్కువచేయని

పద్మిని సరదాలను తను అరికట్టడు; అరికట్టితలచుకోలేను. లోకం కుళ్ళికుళ్ళి ఏడవనీ పాడులోకాన్ని.

ఇలా దీర్ఘంగా ఆలోచిస్తున్న వెంకట్రావును పద్మిని స్పర్శ ఈ లోకంలోకి తెచ్చింది.

"అదేమిటి? ఆ చెమటేమిటి? ఫ్యాను లేకుండా కూర్చుని బాధపడ్డారు. లేవండి స్నానానికి. వెంటనే భోజనంచేసి రెండో ఆటకు సినిమాకు వెళ్దాం తొందరపెట్టింది" పద్మిని.

పద్మిని భుజంమీద చెయ్యివేసి లేచాడు వెంకట్రావు.

22

ఫిబ్రవరి ఇరువదవ తేదీ. మధ్యాహ్నం పన్నెండు గంటలకు నీరజ అక్క ఇంటికివెళ్ళింది నళిని. నీరజ ఆమెను కౌగలించుకొని

"అక్కా! వచ్చావా! నీతో ఎన్నో విషయాలు మాట్లాడాలని అనుకుంటున్నాను. నేను ఆ బిల్డింగుకు రావడానికి బిక్కచచ్చి రావటం లేదు" తన నిస్సహాయతను వెలిబుచ్చింది.

"నేనే వస్తాగా! నీకు ఆ శ్రమ ఎందుకూ? ఇంతకూ మావారి సౌఖ్యం ఎలాగుంది?"

"మనకు చాల అనుకూలంగావుందని ప్లీడరు వీరభద్రయ్య గారు కమలాకరానికి నాకూ చెప్పారు. అంతా నీ చలవ" నీరజ కృతజ్ఞతాసూచకంగా నళిని భుజంపై చెయ్యివేసింది.

"ఆ మాటే తెలుసుకుందామని అనుకుంటే ఇప్పటివరకు తీర లేదు. ఆయనను అడగడం నాకు ఇష్టం లేకపోయింది!"

"ఎలా తెచ్చావు అక్కా బావగారిలో మార్పు?" కుతూహలాన్ని ప్రదర్శించింది నీరజ.

"ఆ! అదా! ఒక దెబ్బకు రెండు పిట్టలు తా" చిన్న పిల్లలా ఎగిరింది నళిని.

నీరజకు ఇదంతా అర్ధంకాలేదు. అందుకని మౌనంవహించింది.

"చెల్లీ! నిన్ను హడలగొట్టానా? ఏంలేదు. నాదొక విషాద గాథ. అదంతా విన్పించి పెనుతుఫానులో ఇరుక్కున్న నావలా ఉన్న నీకు బాధ కలిగించలేను."

"అక్కా. జీవితంలో ఈ మలుపుతో నా మనసు బండరాయి అయిపోయింది. నాకేం పరవాలేదు. చెప్పు నీ కథ. ఆప్తులతో చెప్తుంటే బాధ సగం పోతుందంటారు." తొందరపెట్టింది నీరజ.

నళిని అంతర్దృష్టిలో పడింది. మాట్లాడుతున్నది తన తోతను.

"నా భర్త ప్రభాకర్ మంచివాడే కాని సెక్సు విషయం ఏమీ తెలియని మూర్ఖుడు. నాకు ఇద్దరు పిల్లలు. కాపురానికి వచ్చి నాలుగేండ్లు. నన్ను ఏనాడు అలరించిన పాపానపోలేదు. తన అవసరం తీర్చుకుని దలుపుకుపోతాడు. మొన్న 17వ తేదీదాకా నేను అనాఘ్రాత పుష్పాన్ని. అతగాడు నా శరీరాన్ని అనుభవించేవాడేమోకాని నా మనస్సులో అతనికి స్థానం లేకపోయింది."

"ఊ" అంది నీరజ సానుభూతితో.

"కమలాకరరావుగారికి వ్యతిరేకంగా తను సాక్ష్యం చెప్ప బోతున్నానని నాతో చెప్పాడు. ప్రయత్నం విరమించుకోమని

ప్రాధేయపడ్డాను. వినలేదు కారణం అడిగాను. స్త్రీ జాతిపై ద్వేషం అన్నాడు. ఆలోచించాను. అతనిచేత నీకు అనుకూలంగా సాక్ష్యం చెప్పించటానికి కృతనిశ్చయనయ్యాను. సూటిగా అడిగితే నిరాకరించే మొండిఘటం అతడు. ప్లాను వేశాను అమలుపరిచాను. పథకం పారింది. మనం గెలిచాం."

ప్లాను ఏమిటో, అది ఎలా ఫలించిందో తెలుసుకోటానికి ఆదుర్దా ఎక్కువయింది నీరజలో.

"అక్కా ఎలా విజయం సాధించావో చెప్పవూ ? నీ విజయ గర్వంలో నేనూ పాలుపంచుకుంటాను. నీ సంతోషాన్ని ద్విగుణీకృతం చేస్తాను." ప్రాధేయపడింది నీరజ.

"నేను అతనిని అభిమానించేదాన్ని కాదు. అతడు ఏకాంతంగా నా వద్దకువస్తే గొంగళిపురుగు ప్రాకినట్లుండేది నాకు. తలనొప్పియని, సుస్తీయని ఏదో సాకుచెప్పేదాన్ని. అది అబద్ధమనీ అతనికీ తెలుసు, నాకూ తెలుసు. అతని పని ముగించుకుని అతడు వెళ్ళేవాడు. అసంతృప్తితో నేను సతమతమయ్యేదాన్ని. నేను ఉద్రేకరహితమైన మంచుముక్కనని అతడి భావం. అందువల్ల అతనికి నాపై ద్వేషం. దానిని స్త్రీ జాతిపై ద్వేషంగా మార్చుకున్నాడు. ఈ పరిస్థితి మార్చాలనుకున్నాను. మార్చాను. మూడురోజుల క్రిందట అతనిని కవ్వించాను లైంగికంగా. అతడు లొంగలేదు. అతని తిట్టాను. అతని పురుషాధిక్యతాభావానికి ఆఘాతం కలిగింది. 'సై' అన్నాడు. 'సై' అన్నాను. ఇద్దరం సుఖపడ్డాం.''

"నీవు మాస్టరుప్లానరువు అక్కా!"

నీరజ మాటలు నళినికి వినపట్టం లేదు.

కేసు విచారణ రోజున ఆయన ప్లీడరు దగ్గరకు పొయ్యే టప్పుడు స్త్రీ జాతిపై ద్వేషం పెంచుకోవద్దని హితవు చెప్పాను.

స్త్రీ జాతిని ద్వేషించకుండా చేశావుకదా అన్నారాయన.

సాక్ష్యం సరిగాచెప్పండి లేకపోతే అప్రతిష్ట అని హెచ్చరించి పంపాను. సాక్ష్యమూ సరిగాచెప్పాడు. నా మనిషి నాకూ దక్కాడు."

"నిన్ను అభినందిస్తున్నాను అక్కా. నా కోసం ఎంతో త్యాగంచేశావు నీవు" నీరజ నళినిని కౌగిలించుకుని ఉక్కిరిబిక్కిరి చేసింది.

నళిని ఈ లోకంలోకివచ్చింది.

"ఏమిటి చెల్లీ ఇదంతా" అని అమాయకంగా అడిగింది నళిని.

ఇంతసేపు అదొకరకపు మైకంలోవుండి నళిని మాట్లాడిందని అప్పటికి అవగతమయింది నీరజకు.

"నన్ను రక్షించావు అక్కా" స్తుతించింది నీరజ.

"పిచ్చిపిల్లా ! లాభించింది నేనమ్మా. నా కాపురం నిలిచింది నీ సందర్భంగా" మారుపలికింది నళిని.

పిల్లలువచ్చే వేళయింది వెళ్ళివస్తానని నళిని తన బిల్డింగులో మూడవ అంతస్తుకు చేరింది. తనతోపాటు లిఫ్టు దిగిన రాధమ్మ గారు నళినిని కుశలప్రశ్నాధికం చేసింది. నళిని కమలాకరరావుపై పెట్టబడిన కేసు సంగతి చెప్పింది. నీరజకు సహాయం చెయ్యమని కోరింది. సమయం రావాలికదా అని ఆమె గోపాలంగారి ఫ్లాటు వైపుకు నడిచిపోయింది.

"రండి, రండి, రాధమ్మగారూ!" అన్నాడు గోపాలంగారు.

"నేను ఒక పావుగంట ముందుగా వచ్చాను. మీకు ఇబ్బందేమో!" అన్నది రాధమ్మ.

"ఇబ్బంది అనుకుంటే ఇబ్బంది; లేదనుకుంటే లేదు" ఇక్కట్లు వెనుకనున్న మనోభావాన్ని విశదపరిచాడు గోపాలంగారు.

"మొన్న సాగిన చర్చను అక్కడినుంచే కొనసాగిద్దాం. మహిళోద్యమంయెడల మీ అభిప్రాయాన్ని వివరిస్తారా" నెమ్మదిగా, మర్యాదగా అడిగింది రాధమ్మ.

"సమాజంలో ఒకప్పుడు మహిళలదే పై చేయిగా ఉండేదని అది మాతృస్వామ్య కాలంలోనని కొందరు వాదిస్తారు. అలాకాదు ఒకప్పుడు స్త్రీ పురుషులిద్దరూ సమానులుగా ఉండేవారు. తరువాతి కాలంలో పురుషుడే స్త్రీని సామాజిక పరంగా అణగద్రొక్కి ఆమెను కొన్నాళ్ళు బానిసనుగా, కొన్నాళ్ళు ద్వితీయశ్రేణి పౌరస్థానంలో ఉంచాడు. ఇది రెండవ దృక్పథం. ఏ దృక్పథాన్ని విశ్వసించటానికితగిన ఆధారాలు ప్రపంచవ్యాప్తంగాలేవు. ఒక్కొక్క దేశంలో ఒక్కొక్క పరిస్థితివుంది. ఒక దేశంలో మొదటి వాదానికి ఆధారభూతమయిన సాక్ష్యం దొరికితే మరొక దేశంలో రెండవ వాదానికి అనుగుణమైన సాక్ష్యం దొరుకుతున్నది." తనకు తెలిసిన సమాచారాన్ని వివరించాడు గోపాలంబాబు.

"మీరు ఈ వాదాలలో దేనిని అభిమానిస్తారు"

"చూడండి. వాదాలు తప్పు రైటు అనే ప్రసక్తిలేదు. వాటికి సాక్ష్యాధారాలు ఉన్నాయా లేవా అనేదే ప్రశ్న. ఇక్కడ వ్యక్తిగత ఆవేశాలకు కావేషాలకు స్థానంలేదు." స్పష్టీకరించారు గోపాలంబాబు.

"స్త్రీ యొక్క పతనం ఎప్పుడు ప్రారంభమయింది?" అడిగింది రాధమ్మ.

"వ్యవసాయ నాగరికత తొలిదశలో"

"స్త్రీ పురుషులు వేటాడే రోజుల్లో స్త్రీకి పురుషునికన్న ఎక్కువ హోదా వున్నదంటారు. నిజమేనా?"

"అది నిజంకాదు. కాగా మాతృస్వామ్యం అమలులో వున్న దేశాలలో అది వాస్తవం."

"ఏది ఏమైనా వ్యవసాయం ప్రారంభం కాగానే స్త్రీకి చెడ్డ రోజులు వచ్చాయంటారు"

"ఒక రకంగా అంతే. ఎందుకంటే అరణ్యాలలో కంద మూలాదులు ఏరుకొని భుజించేరోజుల్లో ఆపనంతా స్త్రీలేచేసేవారు. వారికి మన్నన ఉండేది. వ్యవసాయంలో భూమిని దున్నకుండా విత్తనాలుచల్లిన రోజుల్లోకూడ సమాజంలో స్త్రీస్థానం దెబ్బతినలేదు. నాగలివచ్చి భూమిని దున్నడం ప్రారంభించిన తరువాత ఆమె పరిస్థితిమారింది. ఆమెను బానిసనుచేశాడు పురుషుడు. బలవంతంగా పెండ్లి చేసుకున్నాడు. ఆమెను సొత్తుగా పరిగణించాడు. బైబిలులో పాత నిబంధన గమనిస్తే ఈ విషయం బోధపడుతుంది."

"ఆమెను అణచివేసి రెండవ తరగతి మనిషిగా చూచిన తొలిరోజులేవి?"

"ప్రజాస్వామ్యం ఆనాడు వెల్లవిరిసిందని చెప్పే గ్రీకు నగర రాజ్యం ఏథెన్సులోనే బానిసలకు, స్త్రీకి వోటుహక్కులేదు. రోమను నాగరికతలో ఆమెది రెండవస్థానం. అంతేగాదు స్త్రీలకు విహారాల్లో సన్యాసినులుగా స్థానం ఇమ్మంటే బుద్ధుడు నిరాకరించాడు. అంత

అతని పినపల్లి పట్టుపడ్డే చోటు పెట్టాడు. మనువువచ్చిన తరువాత రక్షకుడు లేకుండా ఆమెకు అస్తిత్వం పోయింది."

"మరి ఈనాటికి భారత మహిళాస్థానం ఎలా మెరుగయిన దంటారు?"

"బ్రిటిషువారి హయాంలో కొన్ని సంస్కరణలు వేగంగా జరిగిపోయాయి. 19 శతాబ్దంలో, సతీసహమన నిషేధచట్టం, విధవా వివాహచట్టం, బాలికలకు విద్యాభ్యాసం వచ్చాయి. కాని 1857 లో సిపాయికలహం లేక మహావిప్లవం సంభవించిన తరువాత బ్రిటిషు ప్రభుత్వం భారతజాతి సామాజిక జీవితంలో జోక్యం కలుగజేసుకోడానికి నిరాకరించింది. దాంతో సంఘసంస్కరణ కార్యక్రమం వారిపరంగా కుంటుపడ్డది."

"ఉద్యమాలు ఏమైనా స్త్రీ జాతి విముక్తికి దోహదం చేశాయంటారా"

"అనేక రకాల ఉద్యమాలు సాయపడ్డాయి. ఉదాహరణకు భక్తి ఉద్యమం వల్ల అనేక మంది స్త్రీభక్తాగ్రేసరులు ఉదయించారు. మహారాష్ట్రంలో మిరాబాయి, తమిళదేశంలో అండ్రాళులు బీహారు, ఒరిస్సా ప్రాంతంలో చైతన్యప్రభు శిష్యురాండ్రు ఇలా ఎందరో ముందుకువచ్చారు. బ్రహ్మసమాజం స్త్రీల శృంఖలాలను తెంపడానికి ఆంగ్ల విద్యను వారికి అందుబాటులోకి తేవడానికి ఉపకరించింది. తరువాత గాంధియుగం. పురుషులతోసమానంగా సత్యాగ్రహానికి స్త్రీలకు ఆయన అర్హతనిచ్చాడు. దేశ స్వాతంత్ర్య సమరంలో స్త్రీలు విరివిగా పాల్గొన్నారు. హింసాయుత దౌర్జన్యవాద రాజకీయాల్లో, సోషలిస్టు, కమ్యూనిస్టు,

రాడికల్ రాజకీయాల్లో స్త్రీ పురుషులు సమాన హోదాతో పాల్గొన్నారు. మార్క్స్, లెనిన్, ఎం. ఎన్. రాయ్ ప్రభృతులు స్త్రీ విమోచనపై నొక్కిపెట్టారు."

"ఇప్పటికీ భారత స్త్రీ వెనుకబడివుంది ఎందుచేత?"

"ఆమెను వెనుకకులాగేవి బీదరికం, నిరక్షరాస్యత, అజ్ఞానం. ఈ నాడు మునుపటికన్న ఆమె పరిస్థితి మెరుగయింది. కొన్ని హక్కులను ఆమె సంపాదించుకున్నది. కాని వాటి ఉనికే ఆమెకు తెలియదు. ఆమెలో జాగృతి చైతన్యంలేవు. అవి లేనినాడు స్త్రీలు సంఘటితం కాలేరు. స్త్రీ శక్తి విజృంభించకపోతే వారి పరిస్థితి మారదు."

"తొలిరోజుల్లో సంఘసంస్కర్తలలో ఎక్కువమంది పురుషులే కదా!"

"ఆ మాట నిజమే. కాని పరిస్థితి మారింది. స్త్రీలు ముందుండి పోరాడాలి ఈనాడు. కాకపోతే దూరదృష్టికల పురుషులు, సామాజిక చైతన్యంకల పురుషులు వారికి అండగా నిలబడతారు అంతే. స్త్రీ విమోచన కార్యక్రమానికి పురుషులు అడ్డం గాకపోతే అదే పదివేలు."

గోపాలంగారి విస్తృత పాండిత్యానికి శేముషీ దురంధరత్వానికి ఆమె తన మనస్సులో జోహారులర్పించింది.

"క్షమించండి చాల సేపు కూర్చున్నాను" అని లేచింది రాధమ్మ.

"చూడమ్మా! నీ వయస్సెంత?"

అదిరిపాటు కన్పించింది ఆమె ముఖంలో. ఇప్పటివరకు అమలులోవున్న నానుడి ప్రకారం స్త్రీ యొక్క వయస్సునూ, పురుషుని సంపాదనను అడగరాదని సామాజిక నియమము. అది ఆ నాటిమాట. స్త్రీ పురుషులు సమాన హోదాతో ఉద్యోగాలు, వృత్తులు, వ్యాపారాలు సాగించే ఈ రోజుల్లో ఇలాంటి ప్రశ్నకు స్త్రీలు ఉలిక్కిపడనవసరంలేదు. కాని భారతనారి సంస్కృతి ఎంతయినా వారిని వదలదు. అందుకే విన్నతనం కన్పడింది రాధమ్మ ముఖంలో. తెప్పరిల్లి

"నాకు ఏబది ఏండ్లండీ" అన్నది.

"మరి ఎందుకు కాదమ్మా అడిగింది. నీవు నాకన్నా చిన్న దానవనే విషయాన్ని ధృవపరచుకోటానికి"

"మీకన్న అన్నింట్లోనూ నేను చిన్నదాన్నే" సవినయంగా పలికింది రాధమ్మ.

"అయితే విను. ఇకనుంచి నిన్ను రాధా అని పిలుస్తాను. నీవు అభ్యంతరం లేదుకదా!"

"ఎంత మాట! నా వాళ్ళంతా నన్ను అలానే పిలుస్తారు."

"మరో విషయం. నీవు నన్ను గోపాల్ అని పిలువు. నా ఆప్తులు నన్ను అలాగే పిలుస్తారు."

"చిత్తం. అలాగే" అని తలవంచుకుని పలికింది.

గోపాలంగారి పెదవులమీద ఒక్క క్షణం మందహాసం వెలసి మాయమయింది. గోపాలంగారి మీద రాధమ్మకున్న గౌరవం అభిమానంగా మారింది.

23

ఫిబ్రవరి 21. గున్నేశ్వరరావు కేసు వాయిదా. ఈనాడు కోర్టులో జనసమ్మర్ధంలేదు. క్రొత్త సాక్షి విచారణ ఉండదని తెలిసి ఎవరూ అట్టే ఎక్కువ సంఖ్యలో రాలేదు.

గున్నేశ్వరరావు కేసు పిలిచారు. కమలాకరరావు ముద్దాయి బోనులో నిలచి ఉన్నాడు.

మేజస్ట్రీటుగారు కాగితంమీద ఏదో వ్రాసుకుని వచ్చినట్లు వుంది. అది చూచి ముద్దాయిని ప్రశ్నలడగదలిచాడు. ముద్దాయి న్యాయవాది వీరభద్రయ్యగారిని చూచి ప్రారంభిద్దామా అన్నారు.

"చిత్తము" అన్నాడు వీరభద్రయ్య.

ముద్దాయినుద్దేశించి మేజస్ట్రీటుగారు ఇలా అన్నారు.

"మిమ్మల్ని కొన్ని ప్రశ్నలడుగుతాను. ఇష్టమైతే సమాధానం చెప్పండి వ్రాసుకుంటాను. వీటిని కేసు సందర్భంగా నేను వాడుకోవచ్చని మీరు గుర్తుంచుకొని మాట్లాడండి."

"చిత్తం" అన్నాడు కమలాకరరావు.

"నీరజ గున్నేశ్వరరావు భార్యయని పురోహితుడు విద్యారణ్య శాస్త్రి, రామారావు, మేజర్ ఆనంద్ చెప్పారు. మీరు ఈ విషయంగా ఏం చెపుతారు?"

"నిజమేనని అంగీకరిస్తున్నాను" అన్నాడు కమలాకరరావు.

"నీరజ గున్నేశ్వరరావు భార్యయని మీకు తెలుసని మేజర్ ఆనంద్, ఫిర్యాది సాక్ష్యం చెప్పారు. ఏమంటారు?"

"అది నిజం"

"మీరు నీరజతో అక్రమసంబంధం కల్గివున్నారని సాక్షి ప్రభాకర్ చెప్పాడు. ఏమంటారు?"

"నేను నీరజ ప్రేమించుకుని ఆలుమగలవలె సంచరించే వాళ్ళం. అందులో అక్రమసంబంధ ప్రసక్తి లేదు."

హాలులో కలకలం. బంట్రోతు కేకతో సద్దుమణిగింది.

"మీరు నీరజ భుజంపై చెయ్యివేసి ఫిర్యాది సమక్షంలోనే తిరిగేవారని సాక్షి ప్రభాకర్ అంటున్నాడు. మీరేమంటారు?"

"నిజమే"

"మీరు నీరజ డ్రాయింగు రూంలో లైంగిక సంపర్కము కలిగివున్నస్థితిలో మిమ్మల్ని వాకిలిలోని రంధ్రంగుండా చూచానని సాక్షి రామలింగం అంటున్నాడు. మీరేమంటారు?"

"పచ్చి అబద్ధమంటాను. మేము ఏనాడు డ్రాయింగు రూంలో సంబంధం పెట్టుకోలేదు. మాకంత దుర్గతి కలుగలేదు. గున్నేశ్వరరావు పడకగదిలోనే మేము లైంగికంగా సంచరించే వాళ్ళం. రామలింగం అబద్ధాలకోరు." ముద్దాయి ఆవేశంగా జవాబిచ్చాడు.

"మీరూ నీరజ లైంగిక కార్యక్రమంలో ఉండగా తను మిమ్మల్ని చూచానని ఫిర్యాది సాక్ష్యంచెప్పాడు. మీరేమంటారు?"

"అది పచ్చి అబద్ధము. మేమిద్దరం కలసి ఉన్నపుడు అతడు ఏనాడూ మా దగ్గరకురాలేదు. మమ్మల్ని చూడలేదు. అది కేసు కోసం చెప్పిన తప్పుడు సాక్ష్యం."

నీరజకు ఇష్టంగానే మీరు ఆమెతో లైంగికంగా వ్యవహరించారని ఫిర్యాది సాక్ష్యం. ఏమంటారు?"

"అది ముమ్మాటికీ నిజం."

"ఫిర్యాదియొక్క ఎరుకసమ్మతులు లేకుండా అతని లాలూచీ లేకుండా మీరు నీరజతో లైంగికసంబంధం పెట్టుకున్నారని ఫిర్యాది సాక్ష్యం. మీరేమంటారు?"

"ఈ ఆరోపణ అసత్యం. మా ఇద్దరికి పరిచయం కల్పించింది ఫిర్యాది. మా ఇద్దరిని సన్నిహితులనుచేసింది అతడే. మా లైంగిక సంబంధానికి అవకాశాలు కల్పించింది అతడే. సమ్మతించింది అతడే. ఈ వ్యవహారమంతా మొదటినుండి అతనికి తెలిసేజరిగింది. తెలిసి బుద్ధిపూర్వకంగా, ఉద్దేశపూర్వకంగా ఊరకున్నది అతనే. అతని లాలూచీలేనిది నీరజకు నాకు సంబంధం ఏర్పడేది కాదు."

"ఇంకా ఏమన్నా చెప్పుకుంటారా?"

"నీరజకు నాకు లైంగిక సంబంధం కల్పించి, దానివల్ల నా ద్వారా లాభించి ఉన్నతోద్యోగం సంపాదించుకుని, ఎవరో మెస్‌లో నవ్వారని, తనకేదో పరువున్నట్లు అది ఇపుడు పోయినట్లు భ్రమపడి నాపై అక్రమంగా అసత్యపు ఆరోపణలతో, కేసుపెట్టి తప్పుడు సాక్ష్యాలు చెప్పించాడు ఫిర్యాది. నేను నీరజ గాఢంగా ప్రేమించుకున్నాం. ఫిర్యాది మర్యాదస్తుడయితే ఆమెకు విడాకు లివ్వాలి. నేను అపుడు ఆమెను వివాహం చేసుకుంటాను."

"బలే బాగా చెప్పావయ్యా" అన్నాడు ఎవడో చూడటానికి వచ్చినవాడు.

"అలా మాట్లాడే వాళ్ళని బయటికి పంపించివేస్తాను" బెదిరించాడు మేజస్ట్రేటు.

కేసులో ముద్దాయిపై కోర్టువారు ఛార్జి మోపాలనా లేదా అనే విషయం ఆలోచించటానికి ఫిబ్రవరి 24కు కేసు వాయిదా వేశారు.

24

ఫిబ్రవరి 21 సాయంత్రం దినపత్రికలు, ఫిబ్రవరి 22 ఉదయపు దినపత్రికలు ఈ కేసులో ముద్దాయి స్టేటుమెంటుకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చాయి. "గున్నేశ్వరరావు కేసులో ముద్దాయి స్టేటుమెంటు. సంబంధాన్ని ఒప్పుకుంటూ ఫిర్యాది ఎరుక సమ్మతులతోను, ఉపేక్షసాయంతోనే ఇదంతా జరిగిందని వాదన."

మరో పత్రిక ఇలా శీర్షిక పెట్టింది.

"గున్నేశ్వరరావు కేసులో మరోమలుపు.

ముద్దాయికి తన భార్యకూ సంబంధం ఉన్నదని ఫిర్యాదికి తెలుసు. ఫిర్యాది సమ్మతి, ఉపేక్ష ఉన్నాయి"

ముద్దాయి స్టేటుమెంటు చదివిన కొందరు ముద్దాయికి శిక్ష తప్పదని, ఈ రకపువైఖరి తీసుకున్నందువల్ల తన మెడకు తనే ఉరి వేసుకున్నాడని అభిప్రాయ ప్రకటనచేశారు.

"వచ్చాడోయ్! ఈ నాటికి ఒక సత్యహరిశ్చంద్రుడు. కోర్టులో నిజంచెప్పటం తెలివితక్కువ కదుటయ్యా" అని కొందరు విమర్శించారు.

"ఏమయితేనేం! హుందాగావుంది ముద్దాయి స్టేటుమెంటు. సామాజిక నేరం చేసినా అలా నిలబడాలి ఉక్కు మనిషిలా" అని కొందరు ముద్దాయిని పొగడడం సాగించారు.

"ఈ కేసులో తేలుతుంది ప్లీడరుగా వీరభద్రయ్య భవిష్యత్తు" అని కొందరు న్యాయవాదులు రిమార్కులు పాసుచేశారు.

"కల్నల్ కమలాకరరావు లాంటివాళ్ళు నిజంచెప్పి నిలబడ్డేనే శాసనాలు మారతాయి." అని కొందరు సామాజిక శాస్త్రజ్ఞులు పలికారు.

"వెధవ! చేసిన తప్పుకు సిగ్గుపడి ఏ నుయ్యిలోనో చెరువులోనేపడి చావక ఎదురు తిరిగి వాదిస్తున్నాడోయ్ చవట." అని సనాతనులు తిట్టిపోశారు.

"అయ్యో! అయ్యో ఎంత ఘోరం. స్నేహితుడిలావచ్చి వాడి పెళ్ళాన్ని వాడికి కాకుండా చేస్తాడా ఎంత పెద్ద ఆఫీసరయితే మాత్రం. వీడి జిమ్మడ" అని బామ్మలు, అమ్మమ్మలు కమలాకరరావును తిట్టినతిట్టు తిట్టకుండా తిట్టారు.

"పాపం! ఆ అమ్మాయి నీరజకు మధ్య ఎంత ఇబ్బంది వచ్చిందో" అని తరుణులు నీరజకు సానుభూతి చూపారు.

"ఈ వ్యభిచార నేరం శిక్షాస్మృతిలో నుంచి తొలగించాలి. స్త్రీ భర్తయొక్క వస్తువు అనే భావనమీద ఆధారపడ్డది ఈ నేరం. ఇది నేరం కానేకారదు" అన్నారు విప్లవ భావాలుకల యువతీయువకులు.

"భార్య వ్యభిచారం విడాకులకు వ్యాజ్యకారణం కావచ్చుకాని నేరాలజాబితాలో ఉండటానికి వీలులేదు. ఇది స్త్రీజాతికి అవమానం" అని ప్రగతిశీల మహిళా సంఘాలు తీర్మానాలు ఆమోదించి రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలకు పంపాయి.

"ఈ నేరం భార్య ప్రియునిమీదే మోపవచ్చు కాని భర్త ప్రియురాలిపై మోపడానికిలేదు కనుక ఇది స్త్రీ పురుష సమానత్వ సిద్ధాంతానికి విరుద్ధం. ఇది స్త్రీలయెడ వివక్ష. కనుక దీనిని

శిక్షాస్మృతి నుండి తొలగించాలని సంస్కరణ వాదాన్ని అంగీక రించే మహిళా సంఘాలు తీర్మానాలను ఆమోదించి అలా కరపత్రా లను పంచారు.

ఫిబ్రవరి 24వ తేదీన ఈ కేసును గురించి మేజస్ట్రేటుగారు విచారిస్తారు గనుక అర్జంటుగా ఫిబ్రవరి 23న మధ్యాహ్నం మూడు గంటలకు ఊరేగింపు చార్మినార్ వద్ద బయలుదేరి కోర్టుల మీదుగా వెళ్ళివచ్చి కోఠీలో అంతం కావాలని విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలు, సంస్కరణవాద మహిళాసంఘాలు, ప్రగతిశీల మహిళా సంఘాలు సమష్టి ప్రకటన చేశాయి.

ఫిబ్రవరి 23 మధ్యాహ్నం జనం తండోపతండాలుగా వచ్చారు. చార్మినారు ప్రక్కసందులనిండా జనమే. అప్పటికీ రద్దీ తగ్గించ డానికి నిర్వాహకులు రెండు వరుసలలోనే ఊరేగింపు తీద్దామను కున్నారు. ముందు పెద్ద బ్యానరువుంది. దానిపై "497 వ సెక్షనును శిక్షాస్మృతి నుండి తీసివేయాలి" అని పెద్ద అక్షరాలతో వ్రాసివున్నది. దానిని ఇరువులు మధ్యవయస్కులైన స్త్రీలు పట్టుకున్నారు. వారి వెనక అశేష విద్యార్థినీ విద్యార్థి యువజన బృందం. అట్టలతో తయారుచేసిన ప్లే కార్డులు పట్టుకుని బారులలో నుంచున్నారు. ఆ ప్లే కార్డుపై ఇలా వ్రాసివున్నది.

"స్త్రీల యెడ వివక్ష నశించాలి"
"ద్వంద్వ నీతి నశించాలి"
"స్త్రీ వస్తువుకాదు. మనిషి"
"వ్యభిచారం నేరం కారాదు"
"497వ సెక్షనును ఐ.పి.సి. నుండి తొలగించాలి"
"లైంగిక అవినీతి నేరం కారాదు"

"ఇలాంటి కేసులను రద్దుచేసే శాసనం కావాలి"
"మహిళోద్యమ ఐక్యత వర్ధిల్లాలి"
"స్త్రీ జాతి జాగృతితో కదలాలి"
"స్త్రీ జాతి చైతన్యంతో పురోగమించాలి"
"జమీందారీ మనస్తత్వం డౌన్ డౌన్"
"రాతి యుగపు ఆలోచనలు డౌన్ డౌన్"
"బలపరచండి స్త్రీ శక్తిని"
"ఎదిరించండి పురుషాధిపత్యాన్ని"
"పురుషుల పెత్తందారీతనం డౌన్ డౌన్"
"పురుష దురహంకారం నశించాలి"
"స్త్రీ విమోచన ఉంటేనే సామాజికాభ్యుదయం"
"వర్ధిల్లాలి విద్యార్థి యువజన ఐక్యత"
"వర్ధిల్లాలి పీడిత తాడిత జనపు ఐక్యత"
"వర్ధిల్లాలి వనితల ఐక్యత"
"వర్ధిల్లాలి అణగారిన ప్రజానీకపు ఐక్యత"
"ఎదిరించండి దౌర్జన్య శాసనాలను"
"పోరాడండి ప్రతీఘాతక శక్తులతో"
"స్త్రీలను అణచివేసే మతాలు నశించాలి"
"మహిళల హక్కులను కాలదన్నే శాసనాలు రద్దుకావాలి."
"స్వార్ధపరశక్తుల కుట్రలను ఎదిరించండి"

ఇలా ఎన్నో రకాల కర్రలకుకట్టిన అట్టలుచేతపూని బాలికలు, యువతులు, మధ్యవయస్కులైన స్త్రీలు ముందుకు నడుస్తుంటే ఊరేగింపులో వెనకగా అన్ని వయస్సుల పురుషులు బారులుతీరి వస్తున్నారు. ఊరేగింపు మైలున్నర పొడుగుసాగింది. ఊరేగింపు

పొడవునా నాల్గు మైకులతో నినాదాలిస్తుంటే ఊరేగింపులో వాళ్ళు ఆ నినాదాలను అందుకుంటున్నారు. ఒక్కొక్కప్పుడు రోడ్ల కిరుపక్కల బారులుతీరి నిలుచుండి ఊరేగింపును చూస్తున్నవారు కూడ నినాదాలివ్వటం మొదలుపెట్టారు. పోలీసు కమీషనరు ఆఫీసుకుపోయే రోడ్డులో జనం కదలటానికి వీలులేకుండావుంది. ఊరేగింపు కమీషనరు కార్యాలయం దాకా పోయి తిరగాలని నిర్ణయం. కోర్టుల దగ్గరకు వచ్చేవరకు గొంతులు పెద్దవి చేశారు ప్రదర్శకులు. నినాదాల శబ్దంతో దిక్కులు పిక్కటిల్లి పోతున్నాయి. కోర్టులలో జనం అంతా ఒక్క జడ్జీలు, బెంచి గుమాస్తాలు తప్ప అందరూ బయటికివచ్చారు ఊరేగింపును చూడటానికి. ఇంత పెద్ద స్త్రీల ఊరేగింపు ఇటీవల రెండు మూడేండ్లుగా హైదరాబాద్ నగరంలో జరగలేదని చెప్పుకుంటు న్నారు జనం.

ఇంతలో ఊరేగింపు చూచేవాళ్ళలో ఒకడు "దింతో చీఫ్ మెట్రిపాలిటన్ మేజస్ట్రేటు ఖాళీ" అన్నాడు. కోర్టు సిబ్బంది అంతానవ్వారు. "పెద్ద అయ్యగారి భార్య ఊరోగింపులోముందుండి ఉండాలి చూడండిరా" అన్నాడు ఒక ముసలి బంట్రోతు.

"అదిగో ఆమే, బ్యానరుపట్టుకున్న ఇద్దరిలో కుడి వైపుననున్న ఆమె, ఛీఫ్ మేజస్ట్రేట్ గారి భార్య" అని అరిచాడు ఒక బంట్రోతు.

కోర్టు బంట్రోతుల సిబ్బందిలో కలవరం బయలుదేరింది.

"పెద్ద అయ్యగారిని కూడా రమ్మనండిరా ఆయనజన్మలో చూస్తాడా ఈ దృశ్యం మళ్ళీ" అన్నాడు ఒక సాహసి.

ఊరేగింపు వెనుదిరిగింది. సాలార్‌జంగ్ మ్యూజియం రోడ్డు మీదుగా అఫ్జల్‌గంజికి మళ్ళించారు పోలీసులు నిర్వాహకుల సమ్మతితో.

ఆ రోజు సాయంత్రం పత్రికలను అరగంట ఆపుకొని ఊరేగింపు ఫోటోలతో సహా ప్రకటించాయి సాయింకాలపు దిన పత్రికలు. కొన్ని దినపత్రికలు గున్నేశ్వరరావు, నీరజ, కల్నల్ కమలాకరరావుల ఫోటోలను వేశాయి. ఈ ఊరేగింపు వార్తలు, ప్రచారం చూచి కేసు ఏమవుతుందోనని భయపడ్తున్నారు గున్నేశ్వరరావు, అతనిప్లీడరు సీతారామయ్య. ఏదో కేసు అనుకున్నారు కాని ఇంత రభస అవుతుందని వారు ఊహించలేదు. వారికి గుండెధైర్యం పూర్తిగా పోయింది. కేసు విషయం బయటికి వచ్చినప్పటి నుండి అజ్ఞాతవాసంలోవున్న నీరజ ప్రసిద్ధ నారీమణి అయింది. ఊరేగింపు జరిగిన మర్నాడు ఆమెను, ఆమెదృఢమైన ప్రేమను అభినందిస్తూ నాలుగు వందల ఫోనుకాల్సు వచ్చాయి. ఆమె ఒక ఉద్యమానికి ప్రతీక అయింది.

ఆ రోజు ఫిబ్రవరి 24.
కోర్టులో గున్నేశ్వరరావు కేసు పిలిచారు.
ముద్దాయి హాజరయినాడు బోనులో.

ముద్దాయి ప్లీడరు వీరభద్రయ్య ముఖంలో దర్పం, ఫిర్యాది ప్లీడరు సీతారామయ్య ముఖంలో దైన్యం కనపడుతున్నాయి.

కేసును గురించి మీరేమైనా వాదనలు చేస్తారాయని ఇరువురి న్యాయవాదులను మేజస్ట్రీటు అడిగారు.

"చిత్తం రికార్డంతా తమవద్దనే ఉందికదా!" అన్నాడు ఫిర్యాది తరపు ప్లీడరు.

"సాక్షి వాఙ్మూలాలను తమరే రాసుకున్నారు కనుక కేసంతా తమకు అవగతమే" అన్నాడు ముద్దాయి తరపు ప్లీడరు.

ఒక అయిదు నిమిషాలు ఏదో కాగితాలమీద వ్రాశాడు మేజస్ట్రేటు.

తరువాత చదివాడు. అది ఇలావుంది.

"హైదరాబాద్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజస్ట్రేటు అయిన కె. ప్రసాదరావు అనే నేను టి. కమలాకరరావు అనే నీపై ఇలా ఛార్జి మోపుతున్నాను."

"1981 డిసెంబరు ప్రాంతంలో నీవు పి. గున్నేశ్వరరావు అనే అతని భార్య అయిన నీరజతో లైంగిక సంపర్కం పెట్టుకున్నావని, ఆమె గున్నేశ్వరరావు భార్య అని నీకు తెలుసునని, ఆ చర్యను నీవు గున్నేశ్వరరావు యొక్క సమ్మతిగాని, ఎరుకతో కూడిన ఉపేక్షాభావంగాని లేకుండా చేశావని, అందువల్ల భారత శిక్షాస్మృతి 497వ సెక్షను క్రింద శిక్షింపబడే నేరాన్ని నీవు చేశావని, ఈ కోర్టు ఆ నేరాన్ని విచారించడానికి హక్కు కలిగియున్నదనిన్నీ,

ఈ నేరారోపణపై నిన్ను కోర్టులో విచారించాలనిన్నీ నేను ఉత్తరువు చేస్తున్నాను."

"నీవు నేరం చేశావా?" ప్రశ్న అడిగాడు.

"నేను నేరం చేయలేదు. నిర్దోషిని" ముద్దాయి చెప్పాడు.

"నీకు ఉత్తర సాక్ష్యం ఉందా"

"ఉంది" ముద్దాయి చెప్పాడు.

"ఏమండీ కోదండరామయ్యగారూ! ప్రాసిక్యూషన్ సాక్షులలో ఎవరినైనా క్రాసు ఎగ్జామినేషన్ చేస్తారా. ఆ విషయం ఇప్పుడే చేస్తారా. మళ్ళీ దానికి వాయిదా కావాలా"

"అక్కరలేదండీ. ఫిర్యాదిని ఒక్కడినే క్రాసు పరీక్షచేస్తాము" ముద్దాయి తరఫు ప్లీడరు కోర్టుకు విన్నవించుకున్నాడు. మేజస్ట్రేటు

దీనిని గురించి ఏదో నమోదు చేసుకున్నాడు. ఫిర్యాది తరఫు ప్లీడరు సీతారామయ్యను చూచి

"ఫిర్యాదిని ఇపుడే బోనులో పెట్టగలరా!" అని అడిగాడు.

"చిత్తం. అలాగే" అన్నాడు ఫిర్యాది న్యాయవాది.

ప్లీడరు ప్రక్కనున్న గున్నేశ్వరరావును బోను ఎక్కించాడు గుమస్తా. ప్రమాణం చేయించాడు.

వీరభద్రయ్యగారు లేచారు.

"చూడండి గున్నేశ్వరరావుగారూ! మీకు పెండ్లయే నాటికి మీరు కెప్టెన్ మాత్రమే."

"అవును." గున్నేశ్వరరావు సమాధానం.

"మీకన్న సీనియరులు మేజరు కావలసినవాళ్ళు ఉన్నారు."

"మీరు మేజరయారు. మేజరు కానివారు అయిదు ఆరుగురు వున్నారు."

"మేజరు సెలక్షన్ గ్రేడా లేక సీనియారిటీ ఉద్యోగమా?"

"సెలెక్షను గ్రేడు"

"ప్రమోషను నిర్ణయించేదెవరు?"

"బ్రిగేడియరు"

"బ్రిగేడియరుకు ఎవరు సిఫారసుచేయాలి?"

"కల్నల్"

"మిమ్మల్ని ఉన్నత పదవికి సిఫారసుచేసిన కల్నల్ ఎవరు?"

"ముద్దాయి"

"మీరు మేజర్ ఎపుడయ్యారు?"

"1979 లో"

"పెండ్లి అయిన ఎన్ని ఏండ్లకు?"

"ఏడాదికి"

"ఆఫీసర్లలో కొంతమందికి మీ మీద ఈర్ష్యగా ఉండేది కదూ"

"ప్రమోషను రానివారికి ఉండేది"

"మీకు పెండ్లి కాకముందు కమలాకరరావుగారు మీ పై అభిమానంగా ఉండేవారా?"

"అందరినీ చూసినట్లు నన్నూ చూచేవారు"

"మీ ప్రమోషనును ప్రతిపాదించిందెపుడు?"

"1978 జూలై లో"

"మొదటిసారిగా కమలాకరరావుగారు తన చెల్లెలుతో గానీ, విడిగా ఒంటరిగా గాని మీ ఇంటికి వచ్చిందెపుడు?"

"1978 మార్చిలో"

"చూడండి గున్నేశ్వరరావుగారూ! మీరు ముద్దాయిని మీ భార్యతో గదిలో లైంగిక సంపర్కంలో ఉండగా చూచామని చెప్పారు కదూ!"

"అవును"

"క్యాంపుకువెళ్ళి మూడోరోజు రాత్రి మీరు మీ ఇంట్లో ప్రవేశిస్తున్నపుడు చూచినవారు ఏవరైనా ఉన్నారా?"

"లేరు"

"అయిపోయింది ప్రశ్న" అన్నాడు ముద్దాయి తరఫు న్యాయవాది.

"ఉత్తరసాక్ష్యం విచారించడానికి నవంబరు 4వ తేదీకి వాయిదా వేస్తున్నాను. నాలుగు రోజులలోగా సాక్షుల జాబితాను ముద్దాయి దాఖలుచేసి ఫిర్యాదికి జాబితా నకలు ఒకటి ఇవ్వాలి" ఉత్తరువు ప్యాసు చేశారు మేజస్ట్రీటు.

ఉత్తర సాక్ష్యానికి మార్చి 4వ తేదీకి వాయిదా వేసినట్లు వార్తపత్రికలలో వచ్చింది.

25

మరునాడు సాయంత్రం నళిని నీరజ అక్కగారి ఇంటికి వెళ్ళింది. నీరజ కోసం వచ్చిన కమలాకరరావు అక్కడే ఉన్నాడు. నీరజ నళినిని పరిచయం చేసింది తన అక్కయ్యని. వారిరువురూ ప్లీడరు దగ్గరకు పోబోతున్నారు. నళినిని కూడా రమ్మన్నారు. ఒక్క గంటలో ఇంటివద్ద దింపుతామన్నారు. నళిని సమ్మతించి వారివెంట వీరభద్రయ్యగారి ఆఫీసుకు వెళ్ళింది. నళినిని తన అక్కయ్యగా, గున్నేశ్వరరావు తరఫున సాక్ష్యం చెప్పిన ప్రభాకర్ భార్యగా నీరజ ప్లీడరుగారికి పరిచయం చేసింది.

"మీ భర్తగారి సాక్ష్యం మాకు చాల అనుకూలమమ్మా" అని నళినిని అభినందించాడు.

నళిని ముఖం సంతోషంతో వెలిగింది.

"మా అక్కయ్య నా కోసం ఏమైనా చేస్తుంది" అని ప్లీడరుగారికి చెప్పింది నీరజ.

"అంతకన్న మనకు కావలసిందేముంది?" అన్నాడు ప్లీడరు.

"అంతేకాదు; ఇంకా సాక్షులను తెస్తుంది ఆమె" అన్నది నీరజ.

"మీ ప్లాటుగాక మూడవ అంతస్తులో ఎన్ని వాటాలున్నా యమ్మా" నళినిని అడిగాడు వీరభద్రయ్య.

"మొత్తం ఎనిమిది. అందులో గున్నేశ్వరరావుది ఒకటి పోను మిగతావి ఏడు. ఈ ఏడింటిలో ఇద్దరు ఇప్పటికే సాక్ష్యం చెప్పారు. మిగతా వారిలో ఇద్దరు ఎటూరారు. పోతే మూడు వాటాలవారున్నారు. వారు సంఘ సంస్కర్త గోపాలంగారు, యూనివర్సిటీ రీడరు రాధమ్మ, ఒక తరుణి విధవరాలయి పిల్లలను చదివించుకుంటూ ఉన్నది. వీరిలో రాధమ్మగారి సహాయాన్ని అర్థించాను. సమయం వచ్చినపుడు చూద్దాంలేఅమ్మా అన్నారు. గోపాలంగారిది దయార్ధ్ర హృదయం. వారెప్పుడూ ప్రేయసీ ప్రియులనుగా ఉన్నవారిని ఆదుకుంటారు. ఇకపోతే మూడవ ఆమె సావిత్రిని హెచ్చరించాలి. వీరందరి విషయం రేపు సాయంత్రానికి నీరజకు కబురుపెట్టాను. ఇకపోతే నా సాక్ష్యం కావాలంటే ఎపుడూసిద్ధంగావుంది. తరువాత మీ ఇష్టం."

"అమ్మా మీ సాక్ష్యంవల్ల మాకు పెద్దగా లాభించేది లేక పోయినా అది మాకు ధైర్యాన్నిస్తుంది. మీ భర్తగారు అటూ మీరు ఇటూ ఓ అద్భుతంగా ఉంటుంది"

"ఆయన చెప్పినా, నేను చెప్పినా, తతిమ్మా ముగ్గురు చెప్పినా ఒకటే విషయమండీ" అన్నది నళిని.

"ఏమిటమ్మా అదీ"

"ఏంలేదు. కమలాకరరావుగారు నీరజ చనువుగా, ఆప్యాయంగా తనువులురాసుకుంటూ గున్నేశ్వరరావుగారివాటాలోకి వెళ్ళేవారని అపుడు గున్నేశ్వరరావు కూడా వారి వెంట ఉండగా చూచామని. అంతే అంతకన్నా ఎక్కువా లేదు. తక్కువా లేదు."

"చాలమ్మా! చాలు! మీ భర్త చెప్పిన దానిమీద కేసంతా నిర్మాణం చేస్తున్నాను".

కమలాకరరావును సాక్ష్యంగా విచారించడమా లేదా అని తీవ్రంగా ఆలోచించామనీ, చివరకు కమలాకరరావును నీరజను సాక్షులుగా విచారించదలచానని ప్లీడరు చెప్పాడు. సాక్షుల లిస్టు ఫిబ్రవరి 27న దాఖలు చేస్తానని" చెప్పాడు.

నీరజ, కమలాకరరావులు నళినిని కిరణ్ అపార్టుమెంట్సు గేటువద్దదింపి వెళ్ళారు.

ఆమె మూడవ అంతస్తుకు చేరింది. సావిత్రి ఉందేమోనని చూచింది. ఆమె ఇంట్లోలేదని పనిమనిషి చెప్పింది. అంత రాధమ్మ ఇంట్లో ఉందేమోనని డోర్ బెల్ నొక్కింది. రాధమ్మ తలుపుతీసింది. గోపాలంగారు కూడా అక్కడే ఉన్నారు. తన పని సగంపైగా పూర్తయినట్లు నళిని తలపోసింది. గోపాలంగారికి నమస్కరించి కూర్చున్నది. తను వచ్చిన పని వారిద్దరికి చెప్పింది. రాధమ్మ నీరజపై తన సానుభూతిని వ్యక్తంచేసింది. ఊరేగింపు విశేషాలను, కేసు అంశాలను పత్రికలలో చదువుతున్నామని గోపాలంగారు చెప్పారు. నిజానికిమించి ఒక్కమాట కూడా చెప్పమన్నారు. అది చాలంది నళిని. తనయినా తన భర్త చెప్పినమేరకే చెప్తానని వారికి తెలియజెప్పింది. కమలాకరరావు నీరజ చనువుగా ఒకరి బుజాలపై మరొకరు చేతులువేసుకుని గున్నేశ్వరరావు వెంటరాగా గున్నేశ్వరరావు ప్లాటుకు వెళ్ళడమో రావడమోతప్ప సాక్షులు ఎక్కువగా చెప్పవలసింది లేదని మిగిలినదానిని అసలు వాళ్ళు నీరజ కమలాకరరావులు బోనెక్కి సాక్ష్యాలు చెప్పడం పూర్తిచేసు కుంటారని నళిని చెప్పింది. అలాగయితే ఉత్తర సాక్షులుగా

ఉండటానికి గోపాలంగారు, రాధమ్మ అంగీకరించారు. రేపు ఈ విషయాన్ని నీరజకు తెలియజేస్తానని వారికి చెప్పి నళిని వెళ్ళింది తన వాటాకు. త్రోవలో రుక్మిణి కనపడింది నళినికి. ఎక్కడ నుంచి వస్తున్నావని అడిగిన రుక్మిణికి విషయమంతా వివరంగా చెప్పింది. రుక్మిణి నీరజపట్ల తన సానుభూతిని వ్యక్తంచేసింది. తన నిస్సహాయతకు సిగ్గుపడింది.

పరవాలేదని మిగతా 7 ప్లాట్లల్లో నల్లురుదాకా కమలాకరరావు తరఫున సాక్ష్యం చెప్తారని, కనుక తను సాక్ష్యం చెప్పలేనందుకు ఆమె విచారించనక్కరలేదని, నళిని రుక్మిణికి నచ్చచెప్పి తన ఇంటికి పోయింది.

26

ఫిబ్రవరి 26న తేదీ ఉదయం 11 గంటలవేళ నళిని సావిత్రి వాటాకు బయలుదేరింది. సావిత్రిని ఉత్తరసాక్ష్యం చెప్పమని కోరింది. అన్ని వివరాలు చెప్పింది. నవంబరు 4వ తేదీన తనకేదో పని వున్నదని మరొక రోజుకు వాయిదా వేయిస్తే తను ఆ రోజున వచ్చి సాక్ష్యం చెప్పగలనని సావిత్రి నళినికి హామీ ఇచ్చింది. అంత ఆ సాయంత్రం నీరజ అక్క ఇంటికివెళ్ళి నీరజనుకలసి తను, రాధమ్మ, గోపాలం, సావిత్రి కిరణ్ అపార్టుమెంట్సు నుండి సాక్ష్యము చెప్పేవారిని ఆమెకు జాబితా వ్రాసి ఇచ్చి వెళ్ళింది. నళినిని అపార్టుమెంట్సు గేటువద్ద దింపి నీరజ ప్లీడరుదగ్గరకువెళ్ళి జాబితా ఇచ్చివచ్చింది. వారందరికి సమనులు తీసుకోమని చెప్పి వచ్చింది.

అదేరోజున సావిత్రి ఇంటికి కృష్ణారావు వస్తానని ఫోను చేశాడు.

ఇటీవల వారానికి ఒకసారి సావిత్రి కృష్ణారావులు కలిసికుంటు న్నారు. ఒకరి అభిప్రాయాలు ఒకరు తెలుసుకుంటున్నారు. ఉభయులకు ఆసక్తికరమైన విషయాలపై చర్చలు చేసు కుంటున్నారు. అలా చాలా సన్నిహితులయ్యారు. సావిత్రి కూడా కృష్ణారావు అనుపానులు తీసుకుందామని అతని ఇంటికి, ఆఫీసుకు వెళ్ళివచ్చింది. కృష్ణారావు ఎంత ఏగిరేపక్షి అయినా ఎందుకో సావిత్రిమీద వ్యామోహం పెంచుకున్నాడు. ఇంచుమించుగా రెండు మూడు రోజుల్లో వారిలో ఎవరో ఒకరు వివాహప్రస్తావన తెచ్చే పరిస్థితి ఏర్పడింది.

కృష్ణారావు సావిత్రి ఇంటికి వచ్చాడు.

సావిత్రి ఎదురేగి సాదరంగా ఆహ్వానించి అతనిని డ్రాయింగు రూంలోకి తెచ్చింది.

"సావిత్రీ! ఈ రోజు నేను ఇక్కడికి ఇంత అర్జంటుగా ఎందుకు వచ్చానో చెప్పుకో" అన్నాడు కృష్ణారావు.

"ఫస్ట్ షో సినిమాకు టిక్కెట్లు రిజర్వు చేయించాను. పోదాం రమ్మని తీసుకుని వెళ్ళటానికి వచ్చారు."

"ఊహూ!"

"ఈ రోజు 'త్రి ఏసెస్' లో డిన్నరు కని టేబులు రిజర్వు చేశాను అనిచెప్పి అచ్చటికి వెళ్ళటానికి"

"కాదు. ఫెయిల్ అయావు"

"టాంక్ బండ్ మీదికి షికారు పోదాము అని చెప్పటానికి"

"అదికాదు"

సావిత్రికి చికాకువస్తున్నది. ఊడుకుంటున్నది ఏమిటీ తనకి పిచ్చిపరీక్ష.

"అయితే ఎగ్జిబిషన్‌కు పోయి 'జెయింట్ వీల్' ఎక్కడానికి"

"పొరపాటు"

"షాపింగుకు పోవడానికి"

"రాంగ్"

"ఆర్ట్ ఎగ్జిబిషన్ చూడటానికి"

"శుద్ధ తప్పు"

"ఇక నేను ఊహించి చెప్పను బాబూ! నువ్వేచెప్పు."

"అయితే విను. ఈ రోజు నిన్ను ఒక కోరిక కాదు, -ఇలాంటి సందర్భాలలో పెద్దమాటలు వాడాలిగా — అభ్యర్థనను చేయబోతున్నాను."

తను గ్రహించినా ఏమీ తెలియనట్టు అతనికి ఎదురుగా కూర్చుని "ఎంతలావు కోరికేటి బాబూ!" అని వెక్కిరించింది సావిత్రి.

అది ఏమి ఆకర్షణోకాని ఆమె వెక్కిరించినా, నవ్వినా అతడు పరవశుడయిపోతాడు. ఆ అంశం ఆమెకు బాగా తెలుసు. అందుకే అతని బలహీనతను తను కనుకూలంగా వాడుకుంటుంది.

"నీ కంతా వెక్కిరింపుగానే ఉంటుంది. నేను ఉక్కిరి బిక్కిరి అయిపోతూ వుంటే."

"ఎందుకో పాపం అంత అవస్థ! ముందుగా మాట మాత్రం చెప్పివుంటే సాయపడేదాన్నే" ఫక్కున నవ్వింది.

ఆమె బుగ్గలు సొట్టపడ్డయి.

కృష్ణారావు తన్మయుడయినాడు.

ఆమెను ఒడిలోకి లాక్కొని ముద్దాడుదామనుకున్నాడు. ఇంతవరకూ తనతో తిరిగిన ఆడపిల్లలు వేరు, ఈ ఘటం వేరు అని తలచి తమాయించుకున్నాడు.

"నన్ను విసిగించి చంపక. నిశ్శబ్దంగా నాకు ఎదురుగా కూర్చో" అన్నాడు కృష్ణారావు.

"నేను పాఠశాలలో చదివే పిల్లననుకున్నావా సిట్, స్టాండు అనటానికి?" సవాలు చేసింది అతని అధికారాన్ని. చిరుకోపాన్ని ప్రదర్శించింది.

ఆమెకు కోపంవచ్చినా అతని దృష్టిలో అందమే.

"ఆ మూడు ముళ్ళూ పడనీ. సిట్ స్టాండు అనకుండానే నీవే బుద్ధిగా కూర్చుంటావు."

"ఎవరు బాబూ అంతలావు వరుడు?" కొంటెగా అడిగింది.

"వీడే" అంటూ సోఫాలో నుంచి లేచి ఆమె నడుంమీద అరచేతితో తట్టాడు.

"పెండ్లి కాకముందే అధికారం చలాయిస్తున్నారే అబ్బాయి గారు" వెటకారంగా పలికింది సావిత్రి.

"ఇప్పుడేముంది ముందున్నది ముసళ్ళ పండగ" అన్నాడు కృష్ణారావు.

"చాలదాకా వచ్చిందే వ్యవహారం! ఈ పెత్తనాన్ని మనం సహించం అని తెలియదులాగుంది అబ్బాయిగారికి!"

అనుమానం వచ్చింది కృష్ణారావుకు. ఇది పరియాచకమా, లేక ఇది కేవల వ్యంగ్యమా? ఏమయినా కాని చల్లకువచ్చి ముంత దాచటం అనవసరమనుకున్నాడు.

"సావిత్రీ!"

ఆ పిలుపుకు ఆమె పరవశించింది.

ఇప్పటివరకు వున్న గాంభీర్యం ఎగిరిపోయింది.

మళ్ళీ అతడు "సావిత్రీ!" అన్నాడు.

ఆ మృదు మధురకంఠంలో నుండివచ్చిన శబ్దం లయాన్వితమైన వేణునాదంపలె ఆమె వీనులకు సోకింది. ఆమె మనసులో కరిగిపోయింది. ఇదే అదనని గ్రహించిన కృష్ణారావు ఆమెను తన ఒడిలోకిలాక్కొని తనివితీర చుంబించాడు. ఆమె అడ్డుపెట్ట లేదు. పారవశ్యంలో తేలియాడుతున్నది.

ఇంతలో ప్రక్క బెడ్ రూములోనుండి

"అమ్మా!" అనే పిలుపు ఆమె చెవులకు విన్పించింది.

ఒక్కసారిగాలేచి మరొక్క ఉదుటున పడకగదిలోకిపెళ్ళింది. జ్వరంతో వళ్ళు సలసల కాగిపోతున్న బాబును హృదయానికి హత్తుకుంది. అతనిని సముదాయించింది. మరల తిరిగి డ్రాయింగు రూంలోకి వచ్చింది. కృష్ణారావు అక్కడే కూర్చొన్నాడు కాని అతడు అంతర్ముఖుడై ఉన్నాడు. ఈమె రాకను అతడు గమనించ లేదు. ఏదో గంభీర ఆలోచనా సాగరంలో తేలియాడుతున్నాడు. అతని ఏకాంతాన్ని భంగం చేయటం ఇష్టంలేక ఆమె మౌనంగా కూర్చున్నది.

అతని నుదురు ముడుతలు పడింది. నాసికాపుటాలు అదురుతున్నాయి. ఏదో ప్రళయం సంభవించ పోతున్నదని ఆమెకు అవగతం అయింది. అవన్నీ తుఫాను చిహ్నాలు.

"ఆ పిల్లలను బోర్డింగులో పెట్టడానికి నీవు అంగీకరిస్తేనే నీకు నాకు పెండ్లి జరుగుతుంది."

సావిత్రి తలమీద పిడుగు పడ్డట్టయ్యింది. సీతా అమ్మవారు తన తల్లి భూమాత ఒడిలోకి పోయిందని ప్రతీతి. అది ఎంత నిజమో కాని తను మాత్రం ఇపుడు భూమిలోకి చొచ్చుకుపోతున్నది. తన కాళ్ళు ఎక్కడికో భూ గర్భంలోకి పోతున్నవి. అరక్షణం క్రింద స్వర్గ ద్వారాలు తన కోసం తెరుచుకుని ఉన్నాయి. ఇపుడు నరకద్వారం తెరచివుంది తన కోసం. అసలు తను ఎందుకు ఆశించినట్లు ఈ సుఖాన్ని. ఆశించింది పో! హఠాత్తుగా అది తనకు కాకుండా పోవడమెందుకు. ఎద్దైనా బేల కాకూడదు తను.

"నీవనేదేమిటి కృష్ణా! నాకు బోధపడేటట్లు చెప్పు." ఆమె గొంతులో ఏదో ప్రార్ధన ఉన్నట్లు తనకే తోచింది.

తన బలహీనతకు తనే అచ్చెరువు పడింది. ఇన్నాళ్ళనుండి కన్పడని ఈ బలహీనత ఈ రోజు ఇలా ప్రదర్శితమవుతుందేమిటి చెప్మా?

కృష్ణారావు గొంతు మార్చాడు. పూర్వపు పరుష కంఠ ధ్వని మారింది. దాని స్థానంలో మార్ధవం ప్రవేశించింది. కాని దార్ఢ్యం పోలేదు. మాట తియ్యగావుంది కాని గట్టితనం లోపించ లేదు.

"అదికాదు సావిత్రి. నీవు ఆ పిల్లలతో నా ఇంటికివస్తే నీవూ సుఖపడలేవు. నన్నూ సుఖపెట్టలేవు"

"కృష్ణా! అంటే నిన్ను స్వీకరిస్తాను కాని నీ పిల్లలను స్వీకరించలేను అనేగా ఆ మాటల అర్ధం."

ఆమె వాలకం చూచి అతను భయపడ్డాడు.

తన భావాలు వాచ్యం చెయ్యడానికి వెనుకంజ వేశాడు.

"ఊ" అని మాత్రం అనగలిగాడు.

ఆమె తోక తొక్కిన త్రాచయింది. ఆమె చేతిలో ఏదైనా ఆయుధం ఉంటే అతని పని ఏమయ్యేదో చెప్పడం కష్టం. తన భావాలను అదుపులో పెట్టుకుంది సావిత్రి. ఆమె దారికి వస్తుందని భావించాడు కృష్ణారావు. ఇంతదూరం వచ్చాక ఆడది ఏంచేస్తుంది? మళ్ళీ వెనుకడుగు వేయకలదా? అసంభవం. ఆమె తనకు లొంగి వస్తుందని అతడు ఆశించాడు. ఆమె తనను ప్రార్థిస్తుందని, అపుడు తను ధృతి పోగొట్టుకోకుండా ఏమనాలో మనసులో రిహార్సలు చేసుకుంటున్నాడు.

కాని, తను ఆశించిన వరుసకు ఆమె రాలేదు.

ఆమె తనలోతానేదో ఆలోచించుకుంటున్నది.

అణుబాంబు పేలుతున్నదన్నట్లు గుండె దడతో ఎదురు చూస్తున్నాడు అతడు ఆమె అభిప్రాయ ప్రకటన కోసం.

పలికింది ఆమె. పదాలు స్పష్టంగా వినిపిస్తున్నాయి.

"ఇక మీరు వెళ్ళవచ్చు కృష్ణారావుగారూ!"

ఆ ఉచ్చారణ, ఆ సంబోధనారీతి, ఆ ముఖ గాంభీర్యం అతనికి భయోత్పాతం కలిగించాయి.

నిశ్చేష్టుడయ్యాడు. తానాశించింది ఒకటి. సంభవించింది మరొకటి. అతని ఆత్మాభిమానం దెబ్బతిన్నది. అతని పౌరుషంపై ఆఘాతం తగిలింది. తనేరా అంత మర్యాద లేనివాడు అని బాధ పడ్డాడు. చూపించాలి తన తడాఖా ఆమెకు అనుకున్నాడు.

లేచి నుంచున్నాడు. ఆమె లేచి నుంచున్నది. ఇద్దరి ముఖాలు జేవురించి ఉన్నాయి ఇద్దరి కళ్ళల్లో క్రోధారుణ దీప్తులు వెల్లివిరుస్తున్నాయి.

"సావిత్రీ ! నీకు నా సంగతి తెలియదు. నేను కో అంటే కోటిమంది కాంతలు నా కౌగిట్లో వాలతారు. అసలు అలాగే జరిగింది ఇన్నాళ్ళు. పాలు బజారులో దొరుకుతున్నపుడు ఆవునికొని మేపటం ఎందుకని ఇన్నాళ్ళు పెళ్ళిచేసుకోలేదు. అలాంటి వాడిని నీపట్ల దౌర్బల్యానికి లోనయినాను. ఇంతలావు వాడిని నేను నిన్ను, అభ్యర్థిస్తే తిరస్కరించావు. సిరి వస్తుంటే మోకాలు అడ్డుపెట్టు కున్నావు. పాయసంలో లవణం వేసుకున్నావు. పాలు విరగ కొట్టుకున్నావు. చేజేతుల స్వర్గసౌఖ్యాన్ని త్రోసిరాజన్నావు. నీకిపుడు అర్థం కాదు నీ తెలివితక్కువ తనం. ముందు ముందు చేసిన పొరపాటుకు కుమిలి కుమిలి బాధపడతావు" శాపనార్థాలు పెట్టాడు కృష్ణారావు.

"కృష్ణారావు! ఏమిటి నీవనేది. నీవు-ఇప్పుడే చెప్పుకున్నావు ఎంత గొప్పవాడివో - నన్ను ప్రేమించావా ! నీ కసలు ప్రేమంటే ఏమిటో తెలుసా. ఒకవ్యక్తి మరొక వ్యక్తిని నిజంగా ప్రేమిస్తే అవతలి వ్యక్తి బలహీనతలతో సహా ఆ వ్యక్తిని అభిమానిస్తాడు. అంతేకాని అవతలి మనిషిలో మంచిగుణాలను ప్రేమించి, బలహీనత లను నెట్టి పారవేయమనడు. ప్రతి మనిషిలోను మంచీ చెడూ రెండూ సమ్మిశ్రితమయి ఉంటాయి. రెంటినీ విడదీయటం వీలు కాదు దేని మోతాదు ఎక్కువగా ఉన్నది, దుష్టాంశం సహించటానికి వీలయిన డిగ్రీలోనే ఉందా లేదా అనేది ముఖ్యాంశం. నీవు నా నవ్వువల్ల ఆకర్షితుడవయ్యావు. నా సొట్ట బుగ్గలను చూచి పరవశించి పోయావు. ముత్యాలలాంటి నా పలువరుసకు దాసుడ వయ్యావు. అంతేకాని నా మాతృ హృదయాన్ని అవలోకనం చెయ్యలేక పోయావు. నీకు సునిశిత దృష్టిలేదు. బాహ్యసౌందర్యం

వల్ల ప్రభావితుడవేకాని అవతలివ్యక్తియొక్క అంతస్సౌందర్యాన్ని ఆస్వాదించలేని అల్పజ్ఞుడవు. అందుకే బజారు స్త్రీల చుట్టూ ఇన్నాళ్ళు పరిభ్రమించావు. తీరా నీకు బాగుపడే రోజులొచ్చే టప్పటికి మళ్ళీ బురదలో కూరుకుపొయ్యావు.

నీవు ఏమయిపోతే ఏంగాని నీ స్వరూప దర్శనంచేసి నన్ను పతితురాలు కాకుండా కాపాడావు. అందుకు నీకు పదివేల దణ్ణాలు. నీ ఈ మహోపకారాన్ని నేను ఈ జన్మలో మర్చిపోలేను"

ఇంతలో పిల్లవాడు కేకపెట్టాడు. ఆమె లోపలికి పోయింది. అతడు వెలుపలికి వెళ్ళాడు.

29

కమలాకరరావు తరఫున సాక్ష్యం చెప్పదలచుకున్న గోపాలం, రాధమ్మ, నళిని మార్చి 4న కోర్టుకు వచ్చారు. కోర్టుహాలు జనానికి చాలలేదు. వరండాలనిండా జనం. రద్దీ ఎక్కువగావుంది.

సాక్షుల జాబితాను చదివిన మేజస్ట్రీటు ముఖంతో ఆశ్చర్య రేఖలు పొడసూపినయి. ముద్దాయిని బోనెక్కిస్తున్నారా అని ముద్దాయి తరఫు ప్లీడరు వీరభద్రయ్యగారిని అడిగినాడు.

"అవును" అని వినయంగా వీరభద్రయ్య సమాధానం చెప్పాడు.

కమలాకరం సాక్ష్యం ప్రారంభించాడు. మామూలు తతంగం, కొన్ని ఉపోద్ఘాతంగా ఉండే ప్రశ్నలు అయిపోయిన తరువాత అతని సాక్ష్యంలో ముఖ్యాంశాలు వెలువడినాయి.

"నాకు ఫిర్యాదిఅయిన గున్నేశ్వరరావు తనభార్యను మెస్‌లో పరిచయం చేసేనాటికి అతడు కెప్టెన్ మాత్రమే. అతని ఆహ్వానం

మేరకు నేనూ, నా చెల్లెలూ అతని ఇంటికి వస్తూపోతూ ఉండే వాళ్ళం. తరువాత అతని పిలుపు ప్రకారం నేను ఒక్కడినే అతని ఇంటికి వెళ్తూవుండేవాడిని. అతడు, అతని భార్య నీరజ నన్నెంతో గౌరవంగా చూచేవారు. నా కోసం ప్రత్యేకంగా పిండివంటలు వగైరాలు చేసేది. తన ఇంటిని నా ఇంటిలాగానే చూచుకోమని ఫిర్యాది నాతో చెప్పాడు. మొదట్లో అతడు ఇంటిలో లేకపోతే నేను తిరిగి వెళ్ళిపోయాను. అలా తిరిగి వెళ్ళిపోయి ఆశాభంగం పొందవద్దనీ, తను ఇంట్లో లేకపోయినా తన భార్య నాకు అతిధి సత్కారాలు చేస్తుందనీ గున్నేశ్వరం చెప్పాడు. అతని మాటల ప్రకారం నేను అతడు ఇంటిలో లేకపోయినా ఇంట్లోకి పోయేవాడిని. ఆమె నన్నెంతో ఆదరించేది. నాకు అన్ని మర్యాదలు, సదుపాయాలు చేయమని గున్నేశ్వరం తనతో చెప్పినట్లు ఆమె నాతో చెప్పింది. అయినా నేను మర్యాద పోగొట్టుకోకుండా జాగ్రత్తగా వ్యవహరించేవాడిని. ఒకరోజు సాయంత్రం నేను గున్నేశ్వరం ఇంటికి వెళ్ళాను. ఆయనా ఇలా అన్నాడు.

"మీరు అవివాహితులు. బ్రహ్మచారుల బాధలు నాకు తెలుసు నేనూ ఒకప్పుడు బ్రహ్మచారినే. కాని ఇపుడు ఈమె-అంటే తన భార్య అని అతని అర్థం - వల్ల నేను బాధపడుతున్నాను. నేను పరాయి గ్రామం లేక ప్రదేశం వెళ్ళినప్పుడు ఒంటరిగా ఉండటం భయమంటుంది. కనుక నా యందు దయయుంచి నేను లేనపుడు మీరు మా ఇంట్లోవుండండి. నాఇంట్లో గెస్టు బెడ్‌రూంవుంది. నాభార్య మిమ్మల్ని ఆదరిస్తుంది. మీకు వంటవాడు తయారుచేసే భోజనం తినాల్సిన స్థితి తప్పుతుంది. నా భార్యకూ తోడువుంటుంది. నాకు సాయం చేసిన వారవుతారు" అని గున్నేశ్వరం నన్ను ప్రాధేయపడ్డాడు.

ఇది ఎంతవరకు సత్యమో పరీక్షిద్దామని ఆయన ఊరిలో లేనపుడు నేను అతని ఇంటికి అంటే కిరణ్ ఎపార్టుమెంట్సులో

అతడు కాపురముంటున్న 302 నెంబరు ఫ్లాటుకు వెళ్ళాను. నీరజ నన్ను ఆహ్వానించి ఆదరంగా భోజనం పెట్టింది. గెస్టు రూంలో నాకు వసతి ఏర్పాటు చేసింది. ఆమె నన్ను సంతోషపెట్టాలని తాపత్రియ పడుతుందని నేను గ్రహించాను. నేను ఏరికోరి ఇబ్బందులను కొని తెచ్చుకున్నట్లు గ్రహించాను. నేను నా బెడ్ రూంలో పడుకొని చదువు కుంటున్నాను. ఆమె ఏదో మిషమీద నా గది లోకి వచ్చివెళ్ళేది. మరునాడు ఉదయం నేను వెళ్ళిపోయాను. గున్నేశ్వరం టూర్నుండి తిరిగివచ్చాడు. తను తిరిగి వచ్చేవరకు నేను ఉండకూండా ఒక రాత్రి మాత్రమే అతని ఇంట్లోవుండి వెళ్ళి పోవటంవల్ల తన భార్య నాకు అతిధి సత్కారంలో లోపంచేసి ఉంటుందని తను భావిస్తున్నట్లు చెప్పాడు. అది పొరపాటు అభిప్రాయమని నేను చెప్పాను. తనది తప్పుడు అంచనా కాదని రుజువుచేయటానికి ఈ సారి తను టూర్కు వెళ్ళినపుడు నేను తన ఇంట్లో ఉండాలని అతడు పట్టుపట్టాడు. తన భార్యచేసే మర్యాద లను గ్రహించమని ప్రాధేయపడ్డాడు. సరేనన్నాను. అలాగే వాళ్ళింటికి వెళ్ళాను. ఆ రోజు రాత్రి నీరజ శోభనపు పెండ్లి కూతురులా నా పడకగదిలోకి వచ్చింది. ఆమె భావం గ్రహించాను. నేను దిగ్భ్రమ చెందాను. నేను మిత్రద్రోహిని కానని స్పష్టీక రించాను. ఆమె కళ్ళ నీళ్ళు పెట్టుకుంది. కారణం అడిగాను. తన భర్త మగతనం లేనివాడని, తను ఎవరినైనా ప్రేమించ వచ్చని తన భర్త తనతో చెప్పాడని, తను అడ్డుకానన్నాడని, ఆమె నాతో చెప్పింది. ఆమె నిష్కల్మష హృదయగా తోచింది. ఆమె మాటలను మనసులో పెట్టుకుని గున్నేశ్వరరావు నడతను సమీక్షించాను. ఆమె చెప్పింది వాస్తవమని తోచింది. నేను అవివాహితుడిని. బ్రహ్మచారిని. నాకు భార్య కాదగిన స్త్రీ కోసం

అన్వేషిస్తున్నాను. నీరజలో నాకు ఆ లక్షణాలు కన్పించాయి. ఈ ప్రత్యేక పరిస్థితుల్లో నేను నీరజతో పొందుపెట్టుకున్నాను. ఆమె నన్ను అలరించింది. ఆదరించింది. మేము ప్రేయసీ ప్రియులము అయినాము. టూర్ నుండి తిరిగివచ్చిన గున్నేశ్వరం విషయం గ్రహించి సంతోషించాడు. అప్పటినుండి ఈ ఏర్పాటు నడుస్తున్నది. వాస్తవానికి నీరజ నా భార్య. చట్టం ప్రకారం ఆమె అతని భార్య. మేము ముగ్గురం అరమరికలు లేకుండా ప్రవర్తిస్తున్నాము. ఈ వాతావరణం వారి వివాహమయిన ఆరు నెలలలోనే జరిగింది. నేను గున్నేశ్వరం పేరును మేజరు పదవికి ప్రతిపాదించాను. పై అధికారులు ఆమోదించారు. అతడు మేజర్ అయినాడు. మేము ముగ్గురం ఏక కుటుంబంగా ఉండేవారము. మెస్‌లో పార్టీ జరిగిన తరువాత మేము ముగ్గురం ఫిర్యాది ఇంటికి వచ్చేవాళ్ళము. నేను నీరజ భర్తలాగనే ప్రవర్తించేవాడిని. కిరణ్ అపార్టుమెంట్సులోకి రాగానే నేను ఆమె చెట్టాపట్టాలు వేసుకుని, భుజాలపై చేతులువేసుకుని, ఒకరిని ఒకరు రాసుకుంటూ తిరిగేవాళ్ళం. అపుడు ఫిర్యాది మా వెంటవుండేవాడు. ఆ బిల్డింగులో ఫ్లాటు వాళ్ళంతా మమ్మల్ని చూచేవాళ్ళు. గున్నేశ్వరరావు ఊళ్ళో ఉన్నపుడుకూడా నేను అతని ఇంటిలోనే ఉండేవాడిని. నేను నీరజ ఒక పడకగదిలో వాడుకునే వాళ్ళం. రెండవ పడకగదిని గున్నేశ్వరం వాడుకునేవాడు. నేను ఆఫీసర్సు మెస్‌లో కూడ ఆమెతో చనువుగా ఉండేవాడిని. అలా 1982 జనవరి మొదటి వారం వరకు నడిచింది. ఒకరోజు తోటి ఆఫీసర్లు కొందరు గున్నేశ్వర రావుని అవహేళన చేశారు. తన పరువు పోయిందని అతను అభిప్రాయపడ్డాడు. నిజానికి బెటాలియనులో అతనిని ఎవరూ గౌరవించేవారు కాదు. అందువల్ల తన కున్నదనుకునే ప్రతిష్టను-

అతనికేమీ ప్రతిష్టలేదు - కాపాడుకునే నిమిత్తం అతడు ఈ కేసు దాఖలు చేశాడు. తప్పుడు సాక్ష్యం చెప్పాడు; చెప్పించాడు. నీరజకూ నాకూ వున్న లైంగిక సంబంధం పూర్తిగా నీరజ భర్త కల్పించిందే. అతడే మమ్మల్ని జతచేశాడు. మమ్మల్ని ప్రోత్స హించాడు. మా సంబంధానికి సమ్మతించడమే కాక సంతోషించాడు. మేము భార్యా భర్తలంగా కలసి ఉంటున్నామని అతనికి 1978 మార్చి నుండి తెలుసు. ఒకవేళ లా ప్రకారం అతని సమ్మతి లేదని భావించినా అతని ఎరుకతో కూడిన ఉపేక్ష అతని వాదనను బాధిస్తుంది. నేను నేరంచేయలేదు. నేను నీరజ ప్రేమించుకున్నాం. గున్నేశ్వరరావు విడాకులిస్తే వివాహమాడతాం. ఇది వాస్తవం."

ముద్దాయి కమలాకరరావు వాఙ్మూలం విన్న జనం ముద్దాయి హుందాతనాన్ని, నిజాయితీని మెచ్చుకున్నారు.

క్రాస్ ఎగ్జామినేషను చేసిన ఫిర్యాది న్యాయవాది ఎంతో కృషిచేశాడు ముద్దాయిని బోల్తావేద్దామని.

కమలాకరరావు నిజం చెప్తున్నాడు కనుక బోల్తా పడలేదు. తన కేసును బలహీనపరిచే ఒక్క అంశాన్ని కూడా అతడు ఫిర్యాది న్యాయవాదికి అందించలేదు.

నీరజ బోను ఎక్కింది ముద్దాయి తరపు సాక్షిగా. కమలాకరరావు కథనాన్ని ఆమె బలపరచింది. ఇద్దరి సాక్ష్యంలో తేడాలు ఏమీలేవు. విశ్వప్రయత్నంచేసాడు ఫిర్యాది ప్లీడరు సీతారామయ్య. చలించలేదు ఆమె. తన జీవితం కోర్టు పరమైనదని మనస్సులో ఏమి బాధపడుతున్నదో ఏమోకాని సాక్ష్యం మాత్రం పకడ్బందీగా చెప్పింది. ఆమె సాక్ష్యంతో కోర్టులోవున్న జనం మాత్రం చాల వరకు ముదాయిని అభిమానించేవారుగా తయారయారు.

తరువాత గోపాలంగారు సాక్షిగా బోనులో నిల్చారు. ఆయనను చూడగానే జనంలో కలకలం బయలుదేరింది. ఆయన పేరు మోసిన సంఘసంస్కర్త కదా! నిజాయితీపరుడుని ఆయన ప్రఖ్యాతి వహించాడు. మేజస్ట్రిటుగారు కుర్చీలోకదిలాడు గోపాలం గారి సాక్ష్యం మొదలవంగానే. తను కిరణ్ అపార్టుమెంట్సులో 'ఎ' బిల్డింగులో 308 నెంబరు ఫ్లాటులో కాపురముంటున్నానని, కమలాకరరావు నీరజ భుజంపై చేయివేసి ముందు నడుస్తుంటే వెనుక గున్నేశ్వరరావు నడవటం తను నాలుగు సంవత్సరాలలో నాలుగు అయిదు సార్లు చూచానని చెప్పారు. ఆయన సాక్ష్యాన్ని కదిలించలేకపోయాడు గున్నేశ్వరం న్యాయవాది. స్త్రీ పురుషుల స్వైరవిహారాన్ని ప్రోత్సహిస్తారని, అందువల్ల ముద్దాయి తరఫు అసత్యపు సాక్ష్యం చెప్తున్నారని గోపాలంగారికి సూచన చేశాడు.

నళిని బోను ఎక్కింది. గున్నేశ్వరం తరఫు సాక్ష్యం చెప్పిన ప్రభాకర్ భార్య ఈమేనని ఎవరో అన్నారు. దాంతో ఆమె వాఙ్మూలాన్ని ఆసక్తితో విన్నారు కోర్టులోని శ్రోతలు. ముద్దాయి నీరజ ఒకరినొకరు ఒరుసుకుంటూ కారిడరులో నడవటం ప్రక్కగా గున్నేశ్వరరావు నడవటం గత మూడేండ్లలో తను అరడజను పర్యాయాలు చూచానని ఆమె చెప్పింది. ప్లీడరు సీతా రామయ్య ఆమెను పల్టీకొట్టించాలని సవాలక్ష అడ్డుప్రశ్నలు వేశాడు. లాభం లేకపోయింది. చివరకు "నీవు నీరజ స్నేహితురాలివి కనుక ముద్దాయికి అనుకూలంగా అబద్ధపు సాక్ష్యం చెప్తున్నావు" అని కూర్చున్నాడు.

తరువాత రాధమ్మ బోను ఎక్కింది. ఏబదవపడిలోవున్న స్త్రీ, పైగా యూనివర్సిటీ రీడరు సాక్ష్యం చెప్పటానికివస్తే జనం

శ్రద్ధగా విన్నారు. కమలాకరరావు నీరజ చెట్టాపట్టాలేసుకొని కారిడరులో నడుస్తుంటే ప్రక్కన గున్నేశ్వరరావు ఉన్నాడని అలా వాళ్ళను ఏడాదిక్రింద ఒకసారి, రెండేండ్ల క్రింద మరొకసారి చూచానని ఆమె చెప్పింది. సీతారామయ్య ఆమె సాక్ష్యంలో వైరుధ్యాలు తేవాలని ఎంతగానో శ్రమపడ్డాడు. అతని ఆయాసం వృధా అయింది. తను ఈ సాక్షుల చేతిలో పరాజయం పొందానసే భావన ఆ ప్లీడరుకు కలిగింది. దానితో కోపం వచ్చింది. ఆ స్థితిలో రాధమ్మ సాక్ష్యంను ఎదుర్కొవటానికి సూచన చేయడం మరచిపోయాడు.

ముద్దాయి న్యాయవాది వీరభద్రయ్యగారు మరోసాక్షి ఈ రోజు రాలేకపోయిందని నాల్గురోజుల తదనంతం వాయిదా వెయ్యమని అభ్యర్థించాడు. కోర్టువారు అంగీకరించి కేసును మార్చి 8వ తేదీకి వాయిదావేశారు. ఆ రోజుకు కోర్టు ముగిసింది.

నీరజ నళినిని కౌగలించుకుని "అక్కా! మనం గెలిచినట్లే" అన్నది. కోర్టువెలుపలి జనంలో కొందరు కమలాకరరావుగారిని కలసి అభినందించారు. అనేకమంది యువతులు నీరజను ప్రశంసించారు. చాలమంది గోపాలంగారికి నమస్కారంచేసి వెళ్ళారు. నళినిని, గోపాలంగారిని, రాధమ్మను అపార్టుమెంట్సువద్ద దింపి కృతజ్ఞతాపూర్వకంగా నమస్కారంచేసి నీరజ కమలాకరరావులు వెళ్ళిపోయారు.

ఆ రాత్రి ప్రభాకరం నళినితో మాట్లాడుతూ

"నేను ఫిర్యాది తరఫు సాక్ష్యంచెప్తే నీవు ముద్దాయి తరఫు సాక్ష్యం చెప్పావుటగా ?" అన్నాడు.

"నిజమే! సాక్ష్యం చెప్పాను. నేను మీరు చెప్పినదానినే చెప్పాను. ఒక్కమాట అదనంగా చెప్పలేదు. నేను మీ భార్యననే మాట మర్చిపోకండి" అని కూనిరాగం తీసింది నళిని.

"ఈ కేసు మొదలైనప్పటి నుంచే నీవు నాకా విషయం జ్ఞాపకం చేశావు" అన్నాడు ప్రభాకర్ నిష్టూరంగా.

"అబ్బ! జరిగిపోయినదానికి దెప్పకండి" ప్రాధేయపడింది నళిని. ఇద్దరూ హాయిగా నవ్వుకున్నారు.

28

శుక్రవారం మధ్యాహ్నం సూర్యారావు పద్మిని యింటికి వచ్చాడు మహా ఉల్లాసంగా.

"పద్మినీ! మనము ఇప్పుడు ఎక్కడికి వెళ్తున్నామో చెప్పుకో" అంటూ డ్రాయింగు రూంలోకి వచ్చాడు. పనిమనిషి వచ్చి "అమ్మగారు నిద్రపోతున్నారు, అయ్యగారు ఇంట్లో లేరు" అని చెప్పి వంటింట్లోకివెళ్ళి ఫ్రిజ్‌లోనుంచి మజా డ్రింకు తెచ్చి ఇచ్చి వెళ్ళింది. డ్రింకు త్రాగాడు సూర్యారావు. పద్మిని నిద్రలేచిందాకా కూర్చోడానికి తనకు కాలవ్యవధి లేదు. ఆమె పడకగదిలోకి వెళ్ళి ఆమె బుగ్గలపై ముద్దుపెట్టుకున్నాడు.

"ఆపు సూర్యం! నీ ఆగడం" అంటూ మరోప్రక్కకు తిరిగింది. పడకకు అవతలివైపుకు మళ్ళి మరో చెంపపై చిటికవేశాడు.

"ఏమిటా కొంటెతనం సూర్యం" అంటూ ఆమె లేచింది.

"పద్మినీ! నీవు నిద్రపోతున్నావుకదా! ముద్దుపెట్టుకున్నది నేనని నీకెట్లా తెలిసింది?"

"అమ్మదొంగా! ఆడవాళ్ళ రహస్యాలను అడిగి తెలిసికోవాలనేనా" అన్నది వయ్యారంగా వళ్ళు విరుస్తూ.

"నీవు ఆ మాట చెప్పందే నేనీగదిలోనుంచి పోను".

"నిన్నెవరు పొమ్మన్నారు? ఇక్కడే వుండు" అన్నది పద్మిని.

"వెంకట్రావు వచ్చి మనిద్దర్ని ఈ గదిలో చూస్తే"

"అబ్బో! ఎంతభయం? ఎంత మానమర్యాదలు? అయినా వెంకట్రావు ఈ క్షణంలోవస్తే అతడే వెళ్ళిపోతాడు. నీకేం భయం, నాకేం బెదురు?"

"నీ రౌడీతనం ముందు పాపం వెంకట్రావు ఎంతవాడు? వట్టి అమాయకుడు. గోవువంటివాడు" పద్మినిని నిరసించి వెంకట్రావుపై సానుభూతి వొలకపోశాడు.

"పోనీ! వెంకట్రావుపై అంత జాలిగలవాడవు నా దగ్గరకు రావటం మానుకోకూడదూ?" గునుస్తూ అడిగింది పద్మిని.

"రాకుండా ఎలా వుంటాను. మత్తుమందు పెట్టి నీవు నన్ను ఆడిస్తుంటే" తన స్థితిని విశదం చేశాడు సూర్యారావు.

"సూర్యం! ఏమంత అర్జంటు పనుందని నాకు నిద్రాభంగం చేశావు" కోపం అభినయిస్తూ పలికింది పద్మిని.

"అర్జంటు పనిలేకపోతే దేవివారికి శ్రమ కలిగిస్తానా?" భయభక్తుల నటన చేశాడు సూర్యారావు.

"అలా క్షమాపణ కోరుకో! ఇంతకూ నీకేమి కావాలిభక్తా?"

"దేవీప్రసన్నం"

"అది నీపట్ల ఎప్పుడూ ఉంటుంది భక్తా" అని లేచి నిలుచున్నది. చెదరిన ముంగురులతో, ముఖంపై స్వేదబిందువులతో, నలిగిన వలువతో ఆమె రూపం అత్యంత సుందరతరమయింది.

ఆ భువనమోహనమూర్తిని చూస్తూ ఊరకుండలేకపోయాడు సూర్యారావు.

లేచి నుంచుని ఆమెను కౌగలించుకుని ఆమె అధరపానం చేశాడు. దాంతో ఆ నాటకీయత ముగిసింది.

"సూర్యం ఏమిటీ హడావుడి? ఎక్కడకు పోవాలి? ఏ ఊరికి ప్రయాణం?"

ఏదో ఊరికి ప్రయాణం పెట్టుకుని ఏర్పాట్లు చేసుకుని మరీ పద్మిని దగ్గరకు రావటం అతనికి పరిపాటి. ఇంతవరకు పద్మిని అతని ప్రయాణాలకు అభ్యంతరం పెట్టలేదు. అతని ప్రతిపాదనను వ్యతిరేకించలేదు. ఆ భరోసాతోనే అతడు హడావుడిగా వస్తాడు. ఆ విషయం పద్మినికి తెలుసు.

"తిరుపతికి వెళ్ళడానికి ఏర్పాట్లుచేసి వచ్చాను. మూడు రోజుల యాత్ర. ఇహం పరం రెండూ కలసివస్తాయి."

"నీలాంటి పాపాత్ములకు ఎప్పుడూ అదే ఆలోచన" కొంటెగా చెప్పింది పద్మిని.

విరగబడి నవ్వాడు సూర్యారావు.

"తిట్టే తిట్టావుకాని గంటలో ప్రయాణం. సిద్ధమవు"అన్నాడు సూర్యారావు.

"ఎన్నడూలేనిది అతని గొంతులో ఆజ్ఞాసూచకమైనదేదో ఉన్నట్లు" పద్మినికి స్ఫురించింది.

"నేను తిరుపతికి రాను" గట్టిగా చెప్పింది పద్మిని.

తనపై కొరడాదెబ్బ తగిలినట్లు భావించాడు సూర్యారావు.

ఎన్నడూలేనిది పద్మిని కెందుకొచ్చింది ఈ పెంకితనం? అర్ధంకాలేదు అతనికి ఎంతగా బుర్ర బద్దలుకొట్టుకున్నా. అనవసరమైన పట్టుదలలకు అవివేకమనిపించింది అతనికి.

"ఏమిటి పద్మినీ! ఎన్నడూలేనిది ఇంతగా మొరాయించావు?" అన్నాడు.

"డ్రాయింగురూంలోకి పద ఆలోచిద్దాం." అన్నది పద్మిని.

పద్మినికి తనకూ మధ్య ఏదైనా అఘాతం ఏర్పడుతున్నదా యని భయపడ్డాడు.

డ్రాయింగురూంలో కూర్చున్నాడు.

ఆమె తల దువ్వుకొని దుస్తులు వేసుకుని వచ్చింది.

దేదీప్యమానంగా వెలిగిపోతున్నది ఆమె సుందరూపం.

"ఇంతకూ పనిమనిషి నీకు త్రాగటానికి మంచినీళ్ళయినా ఇచ్చిందా?" అన్నది మంచినీళ్ళగ్లాసు అందిస్తూ.

"ఆమె 'మజా' ఇచ్చింది. నీవు మంచినీళ్లు త్రాగిస్తున్నావు" అన్నాడు సూర్యారావు బుంగమూతి పెట్టిన చిన్నపిల్లవాడిలా.

"నా బుల్లి సూర్యం! ఊరికే ఉడుక్కోకు. ప్రయాణం ఎప్పుడు? నీవు చెప్పిన ఊరికికాదు; నేను ఎన్నుకున్న ఊరికి."

సూర్యానికి ఇప్పటికి అంతుపట్టింది ఆమె ఆంతర్యం.

ఎగిరి గంతేశాడు. "ఏ ఊరు అది ?"

"బెంగుళూరు."

ఆశాభంగం చెందాడు సూర్యారావు.

"ఇహమయితే ఉన్నదికాని పర మెట్లా ?"

సందేహం వెలార్చాడు సూర్యారావు.

"ప్రతినెలా పాపం చేయటం. వెంటనే దేవుడికి మొక్కుకోవటం. నాకు విసుగెత్తింది బాబూ నీవరస."

"మళ్ళీ 'మూడ్' మారింది. ఇవ్వాళ ఏం మూడ్తుందో" అనుకున్నాడు.

"వరం కావాలా ? అయితే లేపాక్షి వీరభద్రస్వామివారిని చూద్దాం."

"ఏనాడూ దేవాలయపు పేరెత్తని నీ నోట ఒక దేవుని పేరు రావటం ఆశ్చర్యం కదూ ?"

"నీకన్నీ అద్భుతాలుగానే ఉంటాయి. లేపాక్షి శిల్ప సౌందర్యాన్ని గురించి ఇటీవల చదివాను. చూడ ముచ్చటేసింది" వివరించింది పద్మిని.

మళ్ళీ హతాశుడయినాడు.

నిజంగా పద్మినికి దైవభక్తి ఏర్పడుతున్నదని సంతోషించాడు ఒక్కక్షణం. అది కాస్తా లిప్తకాలంలో మటుమాయం అయింది.

పద్మిని విషయంలో ఏదీ ఖచ్చితంగా చెప్పటానికివీలులేదు. ఆమె స్వతంత్రురాలు. ఆమె స్వాతంత్ర్యానికి ప్రమాదం

సంభవిస్తుందని అమెకుఅనుమానింకలిగితేచాలు వెంటనే ఆమె తన వైఖరిని, తన వ్యూహాన్ని, తన ఎత్తుగడలను, కార్యక్రమాలను అన్నింటినీ మార్చివేస్తుంది.

"సూర్యం! బెంగుళూరులో మకాం చేద్దాం. లేపాక్షి చూచి వద్దాం. బెంగుళూరులో నీవు వ్యాపారం పని చూసుకో కావాలంటే వీరభద్రస్వామికి లేపాక్షిలో పూజచేయించు' ఇహమూ పరమూ కలిసివస్తాయి నీకు."

సూర్యం ఆనందానికి మితిలేదు. పద్మిని అంగీకరించింది ప్రయాణానికి. ఏ వూరైతేనేం? ఇక దేవుడంటారా! ప్రతి ఊళ్ళోనూ దేవుడుంటాడు. ప్రతి ఊళ్లోనూ పాపం చేయవచ్చు, ఆ ఊళ్లోనే ప్రక్షాళన చేసుకోవచ్చు. పద్మిని ప్రక్కనుంటే చాలు భుక్తీ ముక్తీ రక్తీ అన్నీ దొరుకుతాయి తనకు. తన అదృష్టానికి తనే అభినందించుకున్నాడు తనను.

"ఎన్ని గంటలకు కారు తేచ్చేది?'' మర్యాదకోసం అడిగాడు సూర్యారావు.

"ఆ వివరాలన్నీ నీ యిష్టంవచ్చినట్లు జరిపించు" అన్నది పద్మిని.

ఆ వాక్యాన్ని విశ్లేషిస్తే "నీవుకాదు యజమానివి. యజమానిని నేను. నిర్ణయాధికారం నాది. అమలు పరచటం నీ వంతు; ఆజ్ఞాపించడం నా వంతు. విధానం నాది; వివరాలు నీవి మహత్ యోచన నాది; అల్పస్థాయిలో ఆలోచన నీది" అన్నట్లుంటుంది. అందుకే సూర్యారావు పద్మిని సమక్షంలో ఆలోచించడు. పొరపాటున ఎప్పుడైనా ఏనాడైనా యోచన చేశాడనుకో! ఏమవుతుంది,

తన చింతనను హుష్ కాకీ అని ఎగరగొట్టేస్తుంది. ఆలోచించడం ఎందుకు! కాదనిపించుకోవడమెందుకు?

"సాయంత్రం నాలుగు గంటలకు కారులో బయలుదేరదాం" అని చెప్పి వెళ్ళిపోయాడు సూర్యారావు.

సరిగ్గా నాలుగు గంటలకు సూర్యారావు మళ్ళీ పద్మిని ఇంటికి వచ్చాడు. వాకిలి తలుపు బార్లగా తీసిఉంది. ఇదేమిటి విడ్డూరం ఫ్లాటు వాకిలి తలుపు తీసి ఉన్నది. ఏమయినా ఘోరం సంభవించలేదుకదా అని మనసులో మథనపడ్డాడు.

లోపలికి వెళ్ళాడు. పార్వతీ అమ్మవారిలా అలంకరించుకుని పద్మిని సోఫాలో కూర్చుని ఉన్నది. సోఫా ప్రక్కన సర్దిన ఆమె సూటుకేసున్నది. అలాంటి అలంకరణను పద్మిని అంతకు ముందు ఎన్నడూ చేసుకోలేదు. నుదుట రూపాయంత కుంకుమ బొట్టు, పెద్ద కొప్పు, గోచిపోసి కట్టిన చీర, బుట్టపు రవిక, మెడ నిండా రత్నాలు పొదిగిన బంగారు హారాలు, ముత్యాల సరాలు, చేతులకు దండకడియాల గాజులు, కాలివ్రేళ్ళకు మెట్టెలు, ముంగాళ్ళకు పట్టీలు, నడుముకు అంగుళం వెడల్పున్న బంగారు వడ్డాణం. ఆ అతిలోక సౌందర్యానికి ఎవరైనా తలఒగ్గాల్సిందే! తలవంచి నమస్కరించవలసిందే. ఏమిటి దీని అర్థం? ఎందుకీ అలంకరణ? ఎవరికోసం ఈ ఆర్భాటం? ఆమెముందు, ఆ మహాదేవతముందు తను అల్పజ్ఞుడిగా కన్పడుతున్నాడు. ఇదంతా తనని అవమానించడానికా? లేక భర్త వెంకటావ్రును వదలివేసే పథకమా? లేక తనకు దైవభక్తి కలుగుతున్నదని సూచించడానికా? కాక పార్వతీ అమ్మవారి సౌందర్యమూ, గంభీరతా ముందు స్వరమూ ఉగడడుపు అని నిరూపించటానికా? లేక పట్టిఉన్నాదమా? ఏదీఆలోచించకుండా

ఉన్నపుడు పద్మినిని ఆరాధించాడు. పద్మిని పొందు అనుభవించాడు. ఆమె గొప్పతనాన్ని ఊహించుకున్నాడు. ఆమె సౌందర్యానికి ముగ్ధుడైనాడు. ఆమె ఆకర్షణశక్తికి బానిసయినాడు. ఇప్పుడు ఆమెను దేవతాలంకరణలో చూస్తుంటే తనలో ఏదో పిరికితనం ఆవహిస్తున్నది. బహుశః మానసికశాస్త్ర పరిశీలకులు చెప్తున్నట్లు ఆ వేషంలో ఆమెలో తన తల్లి కన్పడుతున్నదేమో!" ఆమె ఆ రూపంలో ఉన్నంతకాలం ఆమె అతనికి దూరమవుతుంది కాముక వ్యాపారంలో.

ఈ ఆలోచనా పరంపరనుండి తేరుకున్నాడు సూర్యారావు.

"పోదామా" అన్నాడు పూర్తిగా తల ఎత్తకుండానే.

"నేను మంగళవారం ఉదయానికి వస్తాను చెప్పు. అయ్యగారిని కనిపెట్టి ఉండు అని పనిమనిషికి పురమాయించింది. పెట్టెను సూర్యారావు చేతికిచ్చింది. ఇద్దరూ లిఫ్టులో దిగి కారు దగ్గరకు వచ్చారు. అందరి దృక్కులూ ఆమెపైనే ఉన్నాయి. ఇన్నాళ్ళనుండి తను ఈ బిల్డింగుకు రాకపోకలు సాగిస్తున్నాడు. అంతగా ఎవరు తనను గురించి పట్టించుకున్నట్లులేదు. ఈ రోజు అందరి కళ్ళూ ముందు ఆమెమీద తరువాత తనమీద ప్రసరిస్తున్నట్లు పసిగట్టాడు సూర్యారావు. అసౌకర్యాన్ని అనుభవించాడు. ఆమె సూటుకేసు వెనుకసీటులో పెట్టాడు. ఆమె ముందుసీటులో కూర్చున్నది. తను డ్రైవరుసీటులో కూర్చున్నాడు. కారుకదిలింది. సూర్యారావు నిట్టూర్చాడు.

ఒక పావుగంటసేపు తను ఆమెతో ఏమీ మాట్లాడలేదు. ఆమె కూడా పల్కరించలేదు. కారు నగరందాటి బెంగుళూరు రహదారి పట్టింది. తను వూపిరి పీల్చుకున్నాడు. జంతు ప్రదర్శనశాల

ప్రాంతంలో ఒక టీ కొట్టు దగ్గర ఆపాడు. ఆమెకు టీ తెచ్చి ఇచ్చాడు. ఆమె టీ తాగింది. తన కప్పూ, ఆమె కప్పూ రెండూ దుకాణదారునికి చేర్చాడు. దుకాణంలో ఉన్నవారు, రోడ్డుమీద నుంచున్నవారూ అందరూ ఆమెనే చూస్తున్నారు. అక్కడ అర క్షణం ఉండలేకపోయ్యాడు. కారు 'స్టార్టు' చేసి బయలుదేరాడు.

"రాత్రికి కర్నూలులో మకాం ఏర్పాటుచేశాను నీ కిష్టమేనా" అన్నాడు సూర్యారావు.

"లేపాక్షి తీసుకుని వెడతావు అనుకున్నానే" అన్నది.

"మొదట్లో అలాగే అనుకున్నాను. కాని నీ వంటిమీద ఇంత బంగారం పెట్టుకుని పల్లెటూళ్ళో-అందులో క్రొత్త ఊళ్ళో నిద్ర చేయడం భద్రతదృష్ట్యా మంచిదికాదని నా ఉద్దేశ్యము." అర్థోక్తిగా అన్నాడు ఆమె కళ్ళల్లోకి చూస్తూ.

"నా కుమారుని దగ్గరకు పోతున్నాను కదా అని ఈ అలంకరణ చేసుకున్నాను"

వెంటనే స్ఫురించలేదు దాని భావం సూర్యారావుకు.

"సూర్యం. లేపాక్షిలో దేవుడు వీరభద్రస్వామి. వీరభద్ర స్వామి పార్వతి కుమారుడని మరచిపోకు. అప్పటికి అవగత మయింది ఆమె మనస్సు.

కాని మళ్ళీ ఒక సందేహం.

పద్మిని సన్యాసంవేపు మొగ్గుతుందా? అనే అనుమానం అతనిని పట్టి వేధించసాగింది.

"పద్మినీ! కర్నూలులో మకాం చేద్దాం. రేపు ఉదయం బయలుదేరుదాం లేపాక్షికి. అపుడు నీవు మళ్ళీ పార్వతి వేషం వేసుకుందువుగాని" అన్నాడు అర్ధనిమీలిత నేత్రుడై.

పద్మిని ఊ కొట్టింది.

రాత్రి పది గంటలకు కర్నూలు చేరారు. అప్పటికే వారి కోసం పెద్ద హోటలులో డబుల్ రూం కేటాయించబడివుంది.

స్నానాదికాలు ముగించుకుని భోజనం చేశారు. భోజనం ముందు "మందు" పుచ్చుకోవటం వారిద్దరికి అలవాటు. మామూలు పద్ధతిలో సీసా బిరడాతీయబోయాడు సూర్యారావు. పద్మిని అతనిని వారించింది. అతడు ఒక్కడే తీసుకోటానికి సంకోచిస్తున్నాడు.

అతనిని కూడా ఆ ప్రయత్నంనుండి మాన్పించింది పద్మిని.

భోజనాల తర్వాత పార్వతి దుస్తులు మార్చుకుంది- ఈసారి ఆమె రూపం మోహినీ రూపం అయింది. ఆ రూపంలోనున్న విష్ణువును శివుడు మోహించి సమాగమాన్ని అభిలషించాడని, తత్ఫలితంగానే శివుడు మోహిని సమాగమం పొందగలిగాడని పురాణాలు చెప్తారు. పార్వతిలాంటి సౌందర్యవతిని, ప్రీతిభావంతురాలని భార్యగా పొందగల శివుడే మోహిని మోహంలో పడితే సూర్యారావు ఒకలెక్కా. ఆ రాత్రి సూర్యారావు, పద్మిని పరిష్వంగ సుఖాన్ని మామూలుకన్నా సహస్రాధికంగా పొందారు. ఇన్నాళ్ళకు అతను మరో జ్ఞానోదయాన్ని పొందాడు. ఇంతవరకు తనకు పద్మిని స్త్రీగా సౌఖ్యంఇవ్వలేదనేదే ఆ జ్ఞానం. పద్మిని మత్తుపానీయం పుచ్చుకునేది; అతిగా స్వీకరించేది. స్పృహ కోల్పోయేది. తను ఆమెవల్ల పొందిన అనుభవం చైతన్యరహితమైన బొమ్మతో పొందు మాత్రమే. కాని ఆమె తన భర్తకు అందించే సుఖం నూటికి నూరుపాళ్ళది. ఆమె నిజమైన పతివ్రత. బహుశః అందువల్లనే కాబోలు వెంకట్రావు ఆమె ఎలా తనతో తిరిగినా పట్టించుకునేవాడు కాదు.

వెంకట్రావు నిజంగా అదృష్టవంతుడు. తనే దురదృష్టవంతుడు. పద్మిని అంటే ఏమిటో ఈ రాత్రివరకు తనకు తెలియదు. ఇపుడామె నిజస్వరూపం, ఆమె మనోగతం అతనికి అవగతమయ్యాయి.

29

మ్మరునాడు ఉదయం పది గటలకు పద్మినీ సూర్యారావులు లేపాక్షికి బయులుదేరారు. లేపాక్షి చేరేటప్పటికి రెండున్నర గంట అయింది. వెంటతెచ్చుకున్న భోజనాన్ని సేవించారు. మూడు గంటలకు దేవాలయ ప్రవేశంచేశారు. దేవాలయంలో వనిచేసే ఉద్యోగి ఒకతడు గైడుగా వ్యవహరిస్తానన్నాడు, సరేనన్నారు. దేవాలయం కట్టించిన అతనికథ, కళ్యాణమంటపం అన్నీ చూచారు. దేవాలయం కప్పుమీద చిత్రించిన తైలవర్ణ చిత్రాలను చూచారు. పద్మిని మొదటనుంచీ ఏదో పారవశ్యంలోవుంది. ఆమె పార్వతీ దేవి అలంకరణతోనే వచ్చింది దేవాలయానికి. వీరభద్రస్వామిని చూచింది. అప్పుడు ఆమె అర్థనిమీలిత అయింది. అప్పుడు ఆమెను చూచిన సూర్యారావు ఇక ఆమె తనకు దక్కదనుకున్నాడు. తరువాత ముఖమండపంలోకి వచ్చారు. అచ్చట ఒక స్తంభంలో నాట్యంచేసే రంభను నాలుగు అడుగుల ఎత్తున చెక్కాడు శిల్పి. చుట్టూవున్న స్థంభాలపై ఇతర దేవతలు వాయిద్య విశేషాలను వాయిస్తున్నారు. త్రిమూర్తులు కూడ అందులో ఉన్నారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు, ఇంద్రుడు, కుబేరుడు, అగ్ని, సూర్యుడు దేవతలపెద్దలంతా ఉన్నారు. పద్మిని మండపం మధ్య లో కూర్చుని ఆ యా దేవతల విగ్రహాలను చూస్తున్నది. ఒక దేవతను చూచి మళ్ళీ రంభను చూస్తున్నది. ఆ నాట్య భంగిమంలోని రంభను చూచినవారెవరూ తమ జీవితంలో మరచిపోలేరు.

ఆ రంభను అలా చూస్తూనే ఆమె ఒక గంట గడిపింది. సూర్యారావు తొందరపెట్టకపోతే ఇంకా అలా ఎన్ని రోజులు కూర్చుండేది. చీకటి పడేలోగా ఆ ఊరు వదిలి మెయిన్‌రోడ్డు చేరాలని అతని సంకల్పం. అది ఆమెకు తెలియజేసి ఆమెను త్వరగా అక్కడ నుండి లేవదీశాడు. తరువాత నందీశ్వరుని దగ్గరకు వచ్చారు. 25అడుగుల పొడవు, 10అడుగుల వెడల్పున వృషభరూపం ఏకశిలలో చెక్కబడింది. ఆ వృషభం కూర్చున్న తీరు, గిట్టల సొగసు, కాళ్ళ అందం, మెళ్ళో గంటల వరుస, నాసికా పుటాలు, చెవులు, ఊపురం, అవయవసౌష్టవం ఒకటేమిటి సర్వం సర్వాంగసుందరంగా ఉన్నది. ఆ వృషభరాజాన్ని చిత్రించిన శిల్పి ఎవరో! ఆ రంభ శిల్పాన్ని మలిచిన కళాకారుడెవ్వడో! పిచ్చి బొమ్మగీసి, పనికిమాలిన పుస్తకం రాసి, లల్లాయి పదాలు అల్లి పేర్లు వేసుకుంటారు చిత్రకారులు, రచయితలు, కవిపుంగవులూ. ఆ నాడు ఆ కీర్తి కండూతి లేదేమో!

నందీశ్వరునిచూస్తూ అరగంట సేపున్నది పద్మిని. సూర్యుడు పశ్చిమాద్రికి చేరాడు. బలవంతాన పద్మినిని కారులోకి చేర్చాడు. రాత్రి తొమ్మిది గంటలకు బెంగుళూరు చేరారు. పార్వతీదేవి అలంకరణాన్ని పద్మిని విసర్జించింది. ఆ రాత్రికూడా పద్మిని మద్యము ముట్టలేదు. సూర్యారావుని త్రాగనీయలేదు.

పద్మిని మామూలుగా అతిగా మాట్లాడేది. అలాంటి వ్యక్తి లేపాక్షి వెళ్ళివచ్చిన రాత్రి మౌనంగావుంది. అసలు ఈ ప్రయాణంలో ఆమెను తనుగా పల్కరించడానికి సూర్యారావుకు ధైర్యం చాలటంలేదు. అతడు ఆత్మవిశ్వాసం పోగొట్టుకున్నాడు. కాని దాని వల్ల లాభంకూడా లేకపోలేదు. త్రాగి మైకంలోవున్న పద్మిని వేరు. త్రాగకుండా జాగృతికల్గి చైతన్యంతో తొణికిసలాడే పద్మిని వేరు,

అలాంటి పద్మినిని తను నిన్నరాత్రి దర్శించగలిగాడు. మరి ఈ రాత్రి తనఅదృష్టం ఎలావుంటుందో ఏమో! తనుకూడా ఆమెను ప్రోత్సహించకుండా పడకమీదికివెళ్ళిపోయాడు. అపుడు ఆమె సోఫాలో కూర్చునివుంది. అలా అరగంటసేపు కూర్చుంది. దుస్తులు మార్చుకునే నిమిత్తం డ్రెసింగురూమ్‌లోకివెళ్ళింది. సూర్యారావు గ్రుడ్లప్పగించి చూస్తున్నాడు. ఇంతలో డ్రెస్సింగు రూము తలుపు తెరుచుకుంది. పద్మిని బయటికివచ్చింది. లేపాక్షి దేవాలయంలోని రంభ ప్రతిరూపాన్ని చూచాడు సూర్యారావు వెంటనే తిరుపతి వేంకటేశ్వరస్వామిని, లేపాక్షి వీరభద్రస్వామిని, మైసూరు చాముండీదేవిని తలుచుకుని మనస్సులో నమస్కారాలు చేశాడు. లేపాక్షిలోని రంభ నాట్య భంగిమలో పద్మిని నిల్చున్నది. సూర్యారావుకుకూడా కళాత్మకభావన కలిగింది. లేచి లేపాక్షిలోని ఇంద్రుని భంగిమలో నిల్చున్నాడు. పద్మిని నాట్యంచేస్తూ సూర్యారావు చేతుల్లో వాలిపోయింది. ఆమెను పడకపై చేర్చాడు సూర్యారావు. ఆ రాత్రి శక్తికొలది వారు కాముని అర్చించారు. వారకాంతలునే కామశాస్త్ర పాండిత్యాన్ని మెచ్చుకుంటారు. దేవవేశ్య పొందు ఊహింపనలవి కాదు. సూర్యారావు అదృష్టంవల్ల సోమవారం రాత్రికూడా అలాగే సంబరంగా గడిచిపోయింది. ఈ మూడు రాత్రులు సూర్యారావు మొత్తం జీవితంలో శోభాయమైనవి; సంతోషదాయకమైనవి. ఆనంద ప్రదమైనవి; అంతేకాదు విజ్ఞానదాయకమైనవి.

ఆనందం అవధులు దాటినందువల్లనేమో ఇక ఈ జీవితం చాలించినా పరవాలేదనుకున్నాడు సూర్యారావు మూడోరోజు రాత్రి.

మంగళవారం బయలుదేరారు పద్మినీ సూర్యారావులు హైదరాబాద్‌కు తెల్లవారు జామున 3 గంటలకు. ఇద్దరి మనస్సులు

తేలికగా ఉన్నాయి. ఎవరి మనస్సులోను దోషభావం లేశమయినా లేదు. ఎక్కడో ఏదో లోకంలో విహరిస్తున్నట్లుగా వారు ఊగిపోతున్నారు. సూర్యారావు ఊహాలోకంలో విహరిస్తున్నాడు. సిటీ కాలేజి దగ్గరకు వచ్చేటప్పటికి వాళ్ళ కారుకు ఎదురుగా ఒక లారీ వచ్చింది. లారీ రోడ్డుకు సరిఅయిన దిక్కుననే వస్తున్నది. కాగా రోడ్డుమీద తనకు అడ్డంవచ్చిన ఒక ఆవును తప్పించుకునే నిమిత్తం ఒక్కసారిగా సూర్యారావు డ్రైవింగ్ చక్రాన్ని కుడివైపుకు తోశాడు. దాని ఫలితంగా అతని కారు సైడుకు కుడివైపున పడిపోయింది. లారీ డ్రైవరు "సడన్ బ్రేక్" వేసి తన లారీ ఆపుకున్నాడు జనం చేరారు. చిన్నకారు డ్రైవరుకి ప్రాణం పోయిందని కొందరూ, ప్రాణం కొట్టుకులాడుతుందని కొందరూ జనం మాట్లాడుకుంటున్నారు. సిటీ కాలేజి మూలవుండే పోలీసు వచ్చి చిన్న కారునూ, స్పృహలోలేని పద్మినిని చూచుకునే బాధ్యత తను వహించాడు. జనంలోనుండి నల్గురు పురుషులు వలంటీర్లుగా వచ్చి సూర్యారావును ఉస్మానియా ఆసుపత్రికి మోసుకునివెళ్ళారు. స్పృహవచ్చిన పద్మినిని కూడా ఉస్మానియా ఆసుపత్రికి తీసుకొనివెళ్ళారు. ఆమె బ్యాగులో ఆమె అడ్రసుచూచిన పోలీసు ఆమె ఇంటికి ఫోనుచేసి చెప్పాడు. ఆమెకు వైద్యోపచారం పూర్తయేటప్పటికి ఆమె దగ్గరకు వెంకట్రావు చేరాడు. అదృష్టవశాత్తు ఆమెకు పెద్దగా దెబ్బలు తగలలేదు. ఆమె సూర్యారావు విషయం చెప్పింది. వెంకట్రావు వెళ్ళి వాకబు చేసివచ్చాడు. అప్పటికే సూర్యారావు చనిపోయాడు. వెంకట్రావు పద్మినిని ఇంటికి తీసుకునివెళ్ళాడు.

మరునాడు పత్రికలలో వెంకట్రావుగారి భార్య పద్మిని, ప్రముఖ వ్యాపారస్తుడు సూర్యారావు విహారయాత్రకు బెంగుళూరు

వెళ్ళి తిరిగివస్తుండగా వారి కారు కుడిప్రక్కకు పడిపోయిందని వెంటనే కారుడ్రైవుచేస్తున్న సూర్యారావు చనిపోయాడని, పద్మినికి కొద్దిగాయాలు తగిలాయని, ఆమె భర్త ఆమెను ఉస్మానియా ఆస్పత్రినుంచి తీసుకొనివెళ్ళాడని ప్రముఖంగా ప్రచురించబడింది.

30

ఆరోజు గండిపేట కాటేజీలవద్ద పద్మిని చేసిన రసాభాసవల్ల మోహనరావు చిత్రావతుల విహారయాత్రకు విఘ్నం ఏర్పడింది. అప్పటినుండి దూరప్రాంతాలకు ప్రయాణం కట్టడం సాగించాడు మోహనరావు చిత్రావతితో. ఈసారి రెండవ శనివారం, ఆదివారం లకు శ్రీశైలపుణ్యక్షేత్రానికి ఎంపికచేశాడు మోహనరావు. శ్రీశైలంలో అన్నిటికన్నా చివరగానున్న కాటేజీలలో ఒకదానిని రిజర్వు చేయించాడు రావు. అలాగే శనివారం ఉదయం బయలుదేరి రాత్రికి శ్రీశైలం చేరారు. స్నానాదులు పూర్తిచేసుకొని స్వామి సేవచేసుకుని కాటేజీకి చేరారు. ఒకసారి కాటేజీల లైన్లు అన్నీ తిరిగి చూచివచ్చాడు. తనకు తెలిసినవాళ్ళు ఎవరూ కనపడలేదు. ధైర్యంవచ్చింది. హాయి కలిగింది. అతడు అద్దెకు తీసుకున్న కాటేజీ విశిష్టమైనది. దానికి చుట్టూ ప్రహరీగోడ ఉన్నది. చిన్న వరండా, హాలు, ప్రక్కన పడకగది, హాలువెనుక వంటగది; దొడ్లో ఖాళీప్రదేశము. అద్దె ఎక్కువయినా బాగున్నదని దాన్ని బుక్ చేశాడు అతడు. చుట్టుప్రక్కల కాటేజీలన్నీ ఒక అంతస్తువే.

మోహనరావు ఇటీవల మద్యపానం అలవాటుచేసుకున్నాడు. కానీ అది అతి అయితే తన వినోదం రసాభాసం అవుతుందని గ్రహించాడు. కనుక ఆ విషయంలో కొంతగా తనపై అదుపు పెట్టుకున్నాడు మోహనరావు.

చిత్రావతి తనూ చెరి రెండు గ్లాసులు పుచ్చుకున్నారు. కొంచెం ఉత్సాహం వచ్చింది ఇద్దరికీ. మన్మథుణ్ని భస్మంచేసిన పరమశివుని ప్రథమంగా పూజించి తరువాత మన్మథపూజకు గడంగారు వారిరువురు.

"చిత్రా! ఈ రెండు రాత్రులూ పూర్తిగా మనవి. పరాయి వాళ్ళవల్ల మనకు చీకాకు ఉండదు. మన ఏకాంతానికి భంగం ఉండదు."

"రావుగారూ! నేనూ అదే అనుకుంటున్నాను. మీరు వారమంతా పనిచేసి అలసిపోతారు. మీకు టానిక్‌లాగా వారాంతాన వినోదమూ విలాసమూ ఉండాలి."

"చిత్రా! నీవే నాకు టానిక్. నీవే నాకు వినోదాన్ని ఇచ్చేది. నీవే నాకు ఉత్తేజాన్ని ఇచ్చేది."

"మరీ నన్ను అలా పొగిడేయకండి. మునగ చెట్టెక్కించకండి రావుగారూ. నేను మీ ఉద్యోగినికదా! నా ధర్మం నేను నెరవేరుస్తున్నాను. అంతే."

"చిత్రా! నీవువచ్చి సోఫాలో నా సరసన కూర్చో." చిత్రావతి మోహనరావు ప్రక్కన కూర్చున్నది. ఆమెను దగ్గరకు లాక్కున్నాడు రావు. ఆమె బుగ్గలమీద ముద్దులవర్షం కురిపించాడు. ఆమె అతని ఒడిలో కూర్చొని చేతులు వెనక్కి అతని మెడమీదవేసి అతని తలనువంచి ముద్దు పుచ్చుకున్నది.

ఆ చమత్కారానికి రావు సంతసించాడు.

చిత్రావతి అందగత్తెకాదని రావుకు తెలుసు. ఆమెలో ఆకర్షణశక్తి కనపడదు. ఆమెకు సంభాషణాచాతుర్యం లేదు. ఉన్నదొకటే కామశాస్త్ర పాండిత్యం. ఈ సంగతి తెలిసిన తన ఆప్తుడొకడు ఆమెను తనకు సిఫారసుచేశాడు. కాని ఆ విషయంలో

ఆమె ప్రావీణ్యతను పరిశీలించటానికి అతనికి అవకాశం దొరకలేదు ఇంతవరకు. మొదటి పర్యాయం సమావేశస్థలం తన ఇల్లయింది. రెండవసారి గండిపేటలో పద్మిని పలకరింపుతో రసహీనమయింది. మూడవసారి ఇక్కడ శ్రీశైల పుణ్యక్షేత్రంలో తటస్థించింది. భగవంతుని కృప ఎలా ఉన్నదో ఏమో!

రావునిలేపి చిత్రావతి శయనాగారంలోకి తీసుకొని వెళ్ళింది. అతనిని పడకమీదికి లాగింది.

అధ్యాపకత్వం వహించింది. చుంబన విధానాలను వివరించింది. దంతక్షత ప్రాముఖ్యాన్ని తెలియజెప్పింది. నఖక్షత విశిష్టతను విశదం చేసింది. ఆలింగనం వైచిత్రిని ఎరుకపరిచింది. పావురా పల్కులు పలికింది. పలురకాల కూజితాలు గొంతులో కులికించింది. జిలిగు తిట్ల ఆవశ్యకతను నిరూపించింది. బంధ విశేషాలను అతనికి పరిచయం చేసింది. స్త్రీదే పై చేయియని ఉద్ఘాటించింది; రుజువుచేసింది. ఈ రంగంలో ఆమె ఉపాధ్యాయిని; అతడు శిష్యుడు. ఆమెది విశేష పాండిత్యం; అతగాడు క్రొత్తగా బడిలోచేరినవిద్యార్థి. ఆమెది అనుభవైకజ్ఞానం; అతడిది మిడిమిడి జ్ఞానం.

ఆఫీసులో అతడు 'బాస్'; ఆమె ఉద్యోగిని. కార్యాలయంలో అతడు సర్వాధికారి; ఆమె స్వతంత్ర. అచ్చట అతడు జ్ఞానధనుడు. ఆమెది ఒకటవ తరగతి చదువు. ఇదంతా తలచుకుంటే మోహనరావుకు నవ్వువచ్చింది. పెద్దగా నవ్వాడు.

చిత్రావతికి ఈ అసందర్భ హాసం అర్థం కాలేదు. నవ్వుకు కారణం చెప్పేవరకు తను వస్త్రవిహీనగానే ఉంటానని బెదిరించింది.

దానివల్ల తనకు లాభమేకాని నష్టం లేదన్నాడు. తర్జనితో అదిలించింది. నాలికతో వెక్కిరించింది. అతడు చలించలేదు. అధరపానంచేసి గట్టిగా దంతక్షతం చేసింది.

"చెప్తాను. శిక్ష వెయ్యవద్దు" అని అరిచాడు.

తన ఊహను ఆమెకు తెలివిడి చేశాడు. ఆమె విరగబడి నవ్వింది. అతనిని గట్టిగా కౌగలించుకుని అతనిని ఉక్కిరి బిక్కిరి చేసింది. తన భార్య రుక్మిణి జ్ఞాపకం వచ్చింది. తన భార్యతో పొందు మహానదిలో స్నానం. చిత్రావతి సాంగత్యం సముద్ర స్నానం. రుక్మిణితో సంభాషణ సన్నాయి వాయిద్యగీతం. చిత్రావతితో మాటలు పాశ్చాత్య 'జాజ్' నృత్యగీతం. రుక్మిణిహృదయం తటాకజల సదృశం. చిత్రావతి మనస్సు సెలయేటి నీరు.

ఈ వయస్సులో తన కెంమకీ గెంతులు. తనని చూచి తనకే నవ్వు వచ్చింది మోహనరావుకు.

ఇంతలో రావుకు మరో ఆలోచన వచ్చింది. ఎలాగూ చిత్రావతి సాంగత్యాన్ని అభిలషించాడు. ఈ రెండు రోజులూ ఆమె అందించగల ఆనందాన్నంతా మిగల్చకుండా పొందాలని రావు నిశ్చయించుకున్నాడు.

ఇంతలో కిటికీవైపు చూచాడు. బయట పుచ్చపువ్వులాంటి వెన్నెల. ఆ వెన్నెల్లో విహరించాలని మనసయింది. చిత్రావతిని పిలిచి దొడ్లోకి తీసికొనివెళ్ళాడు. వెన్నెలచూచిన ఆమెకూడా పరవశించింది. రావుగారూ వెన్నెట్లో చెరోగ్లాసు పుచ్చుకుందామంది.

"నీవు స్పృహ కోల్పోవకపోతే ఇస్తాను" అన్నాడు.

"మూడు గ్లాసులకే తూలతానా" అని సగర్వంగా జవాబు చెప్పింది.

దొడ్లో రెండు కుర్చీలు వేశాడు. ఒక టీపాయ్ తెచ్చి పెట్టాడు సీసా రెండుగ్లాసులూ. ఐస్ముక్కలూ తెచ్చాడు. చెరో గ్లాసూ పుచ్చుకున్నారు అతనికి కిక్ వచ్చింది. ఆమె నిబ్బరంగా ఉంది. అతడు ఆమెకు దగ్గరగా జరిగాడు.

ఇంతలో చిత్రావతి పొలికేక పెట్టింది "ఏదో కుట్టింది' అని.

ఇంట్లోకి పరుగెత్తి దొడ్లొ లైటువేశాడు. ఆమె నేలపై పడి వుంది.

ఒక త్రాచుపాము జరజరా గోడ ప్రక్కనున్న పుట్టలోకి పోతున్నది.

చకచకా తన గూడకట్టు చించి కుట్టినచోటికిపైగా గట్టిగా కట్టుకట్టాడు.

వంట ఇంటిలోకి వెళ్ళి కత్తితెచ్చి కుట్టినచోట బాగాచెక్కాడు. తన మెడిసిన్ బాక్సులో ఉన్న అయిడిను పూశాడు. ఆమెను పడకగదిలో మంచంమీద పడుకోబెట్టాడు. ప్రక్క కాటేజీవాళ్ళను లేపి వాళ్ళను ఆమెకు కాపలా ఉంచి డాక్టరుకోసం పరుగెత్తాడు. డాక్టరు వచ్చేటప్పటికి ఒకగంట పట్టింది. అతడు వచ్చి పరీక్ష చేశాడు. ప్రాణంపోయిందని తేల్చాడు డాక్టరు.

మరునాడు ప్రొద్దున్నే ఆమె శవాన్ని కారులో వేసుకుని మనిషి సాయం తీసుకొని హైదాబాదుకు మధ్యాహ్నం ఒంటి గంటకు చేర్చాడు.

చిత్రావతి తల్లిదండ్రులకు శవాన్ని అప్పగించాడు. తన ఆఫీసు పనిమీద శక్రటరీతో శ్రీశైలం వెళితే అచ్చట ఆమె దొడ్లొకి

వెళితే పాము కరచి చనిపోయిందని వాళ్ళకు చెప్పాడు. తన మంచితనాన్ని ప్రదర్శించుకోవటానికి వాళ్ళకు పదిహేనువేలరూపాయలకు చెక్కు యిచ్చాడు. ఆమె తల్లిదండ్రులు అతని మాట విశ్వసించారు. ఆమె చావు తమ దురదృష్టమనుకున్నారు. అతడు చేసిన సహాయానికి కృతజ్ఞత తెలిపారు. శవదహనం అయ్యే వరకు అతడు అక్కడే ఉన్నాడు.

అతడు ఇంటికి వచ్చేటప్పటికి ఆదివారం రాత్రి 7 గంటలయింది. డోర్ బెల్ నొక్కాడు. రుక్మిణే స్వయంగా తలుపుతీసింది. అతని ముఖాన్ని స్వేదబిందువులు ముట్టడివేసి వున్నాయి. అతని ముఖంలో దైన్యం విలయతాండవం చేస్తున్నది, రుక్మిణి అతనిని పలకరించలేదు. అతడు ఆమెతో ఆ రాత్రి మాట్లాడలేదు.

31

ఏప్రాార్చి వచ్చింది. ఆరోజు సావిత్రికోర్టుకువెళ్ళి గోపాలంగారు రాధమ్మల లాగానే అదేరకం సాక్ష్యం చెప్పింది. నీరజతో ఎకచకాలాడుకుంటూ తన చేతిని ఆమె నడుంచుట్టూవేసి కమలాకరరావు ముందు నడుస్తున్నాడని అతని ప్రక్కన గున్నేశ్వరరావు నడుస్తున్నాడని 1980 లో ఒకసారి 1981 లో మరియొకసారి అలా జరిగిందని ఆమె సాక్ష్యం చెప్పింది. నానాయాతన పడ్డా ఫిర్యాది తరఫు ప్లీడరు ఆమె సాక్ష్యానికి విలువలేకుండా చేయలేకపోయాడు. కడుపుమండి "నీవు పైకం తీసుకొని అబద్ధపు సాక్ష్యం చెప్తున్నావు" అని ఆమెకు సూచన చేశాడు.

ఆమెకు కోపం వచ్చింది.

"నాకు 30 లక్షల రూపాయల ఆస్థి ఉంది. పదిమంది కమలాకరరావుగార్లను, 20 మంది గున్నేశ్వరరావులను కొనగల ఆర్థిక స్తోమతు తనకు ఉన్నదని ఘంటాపథంగా చెప్పింది.

దాంతో హాలులో చేరిన జనమంతా విరగబడి నవ్వారు. న్యాయవాదులు ముసిముసి నవ్వులు నవ్వారు.

మేజస్ట్రీటు ముఖంపై దరహాసం వెలిసింది.

వాదనలకు మార్చి 10 వ తేదీకి వాయిదా వేశాడు.

సావిత్రి కోర్టు బయటికివచ్చింది. నీరజ వచ్చి సావిత్రిని కౌగలించుకుని కృతజ్ఞతలు తెలియజేసింది. సావిత్రిని అపార్టుమెంట్సు గేటు ఎదుట దింపి నీరజ కమలాకరరావులు వెళ్ళిపోయారు. సావిత్రి లిఫ్టులో పైకిపోతుంటే పద్మిని కనుపించింది. ఆమెను పరామర్శ చేసింది సావిత్రి.

పద్మిని ఫ్లాటులోకి వెళ్ళేటప్పటికి వెంకటాద్రివు ఇంట్లోనే ఉన్నాడు. పద్మిని ఆరోగ్యం కుదుటపడేవరకు పద్మిని విహార యాత్రను గురించి మాట్లాడలేదు. ఆమెకూడా హెచ్చరించలేదు. ఆమె డ్రాయింగు రూంలోకి ప్రవేశించగానే "పద్మినీ! ఒకసారి ఇలారా! నీతో మాట్లాడాలి" అన్నాడు వెంకటాద్రివు.

పద్మినికి ఎంతో భయంవేసింది. అతని కంఠధ్వనిలో ఏదో మార్పు వచ్చింది. అందులో గాంభీర్యమూ, కాఠిన్యమూ రెండూ పెనవేసుకుని ఉన్నాయి.

పులిలాంటి పిల్ల తను. అలాంటిది పిల్లి అయింది. వచ్చి అతనికి ఎదురుగా సోఫాలో కూర్చుంది.

ఆమె ముఖం వివర్ణమై ఉంది. అసలు ఆ కారు ప్రమాదం జరిగిన తరువాత ఆమె ముఖాన ఏనాడు మందహాసరేఖ కన్పించలేదు.

"పద్మ! నీ ఇన్నాళ్ళుగా నీ ఇష్టము వచ్చినట్లు తిరుగుతుంటే సహించి ఊరుకున్నాను. ఇక నీ తిరుగుళ్ళకు స్వస్తి చెప్పాలి. అంతగా వీలుకాకపోతే ఆ ఏడ్చేదేదో ఇంట్లో ఏడు."

ఈ మాటలు గబగబా అనేసి వెంకట్రావు ఇంట్లో నుంచి బయటికి వెళ్ళిపోయాడు. ఎవరో తనని కొరడాతో కొట్టినట్లుగా బాధపడ్డది పద్మిని. ఒకప్పుడు పద్మిని ఎదుట నుంచుని గట్టిగా మాట్లాడటానికి భయపడేవాడు వెంకట్రావు. అలాంటి వెంకట్రావుకు ఇలా మాట్లాడటానికి గుండె ధైర్యం వచ్చింది. ఆమెలేచి తన పడకగదిలోకి పోయి వెక్కివెక్కి ఏడ్చింది. కాసేపు వెంకట్రావును తన మనస్సులో నిందించింది. ఇంకా ఆలోచిస్తే అతనిపై కోపం పోయింది. అతనిమీద జాలివేసింది. ఇతర కుటుంబాలలో భర్తలతో పోల్చిచూస్తే వెంకట్రావు దేవునివంటివాడు. అతడు కాబట్టి ఇన్ని సంవత్సరాలుగా తనను సహించాడు. మరొకడయితే ఆమెను జుట్టుపట్టుకుని బయటకి ఈడ్చేవాడు. అలాంటిచర్యకు తనఅందం, చందం, విద్య, ఆస్తి అడ్డువచ్చేవి కావు. ఇంతకూ వెంకట్రావు తనని ఏమంత ఇబ్బంది పడమనలేదే! ఏడ్చేదేదో ఇంట్లో ఏడవమన్నాడు. ఇంతేగా! ఎంత మంచివాడు వెంకట్రావు. అతడు తనని గాఢంగా ప్రేమిస్తున్నాడు. లేకపోతే అతని నోట ఆ మాట రాదు. అతడు అమృతుడు. నవనీత హృదయుడు. తను ఎంత పాపాత్మురాలు! అలాంటి వెంకట్రావును వదిలి, అంతేగాక అతనిని అప్రతిష్టపాలుచేస్తూ పరాయివాడితో కులికింది. జరిగిందేదో జరిగిపోయింది. ఇకనుంచి తను వెంకట్రావును అన్యాయం చేయకూడదు. నిశ్చయం చేసుకుంది.

ఇంతలో వెంకట్రావు తిరిగి ఇంటికివచ్చాడు. ఎదురువెళ్ళి వెంకట్రావును కౌగలించుకుని అతని చేతిని తన చేతిలోకి తీసుకొని గట్టిగా నొక్కింది. ఈ ప్రవర్తనకు విస్తుపోయాడు వెంకట్రావు. ఏదో తను ఊహించలేనంత మార్పు ఆమెలో వచ్చిందని ఊహించాడు. నిజంగా అలా సంభవిస్తే ఈ ప్రపంచంలో తనకన్నా అదృష్టవంతుడెవరూ ఉండరని అతని నమ్మకం.

"భోజనంచేద్దాం రండి" అని అతని చేతినిపట్టుకొని ఆమె భోజనాల బల్ల దగ్గరకు తీసుకొని వెళ్ళింది.

ఆమె గొంతులోని మధురభావానికి, మార్దవానికి అతడు ముగ్ధుడైనాడు. చేతులు చాచాడు. అతని కౌగిలిలోకి ఆమె జారిపోయింది.

32

చిత్రావతి మరణంతరువాత మోహనరావు జీవితవిధానంలో మార్పువచ్చింది. ఆఫీసుకు పోవడం నెల రోజులుగా మానివేశాడు. వ్యాపారం పనులు మేనేజరుపై వదిలివేశాడు. ఇంట్లోకూడా ఎక్కువ కాలం తన పడకగదిలో గడిపేవాడు. చదువుకోవడం, శూన్య దృక్కులతో ఇంటిపై కప్పువైపుచూస్తూ ఊరుకోవడం అతని కార్యక్రమాలు. చిత్రావతి మరణం విషయం పత్రికలలో వచ్చింది. "వ్యాపారస్తుని శృంగారానికి ఉద్యోగిని బలి. అనే శీర్షికతో-

జరిగిన కథ అంతా ఒక వారపత్రికలో పడింది. నిజానికి అది ఊహాచిత్రం. కాని ఆ ఊహ చాలవరకు సత్యానికి దగ్గరగా వచ్చింది. ఈ పత్రికలో వచ్చిన ప్రాచుర్యానికి వణికిపోయాడు మోహనరావు. ఈ పత్రికను తన భార్య రుక్మిణి చూస్తుందేమోనని

అతడు భయపడ్డాడు. కాని ఆమె అలాంటి వార్తలు చదవదని అతని ధైర్యం. ఆమె ఈ విషయం తనతో ప్రస్తావించలేదు కనుక ఆమె పత్రిక చూడలేదని అతని విశ్వాసం. ఇన్నాళ్ళు ఆమెతో కాపురంచేసిన మోహనరావు ఆమెను ఇంతవరకు అర్థం చేసుకోలేక పోయాడు. రుక్మిణి గంభీరస్వభావం కలదని తనకు తెలుసు. అతడు వారాంతంలో ఎక్కడికి వెళ్ళాడో ఆమె అడుగలేదు; అతడు చెప్పలేదు. ఆమె అతనితో మామూలుగా మాట్లాడుతున్నది; కాని తనలో ద్వేషభావం ఉన్నందువల్ల ఆమె మితభాషిగా ఉంటున్నదని అతని అనుమానం.

ఇలా కాలం గడుస్తున్నది. సౌభాగ్యమ్మకు రామలింగం ఆ వారపత్రికను తెచ్చి ఇచ్చాడు. ఎప్పుడువెళ్ళి ఈ సమాచారం రుక్మిణికి అందిద్దామా అనే భావంతో ఆమె మనస్సు సతమతమవుతుంది. హృదయం సలసల కాగిపోతున్నది. మధ్యాహ్నమయితే మోహనరావు ఇంటిలో ఉండడు కదాయని ఊహించి మధ్యాహ్నం రుక్మిణి ఇంటికి వెళ్ళింది. రుక్మిణే స్వయంగా తలుపు తీసింది. రుక్మిణి చేతికి ఆ పత్రికను అందించి "నీకు ఎంత కష్టం వచ్చిందమ్మా!" అని ఆమె యెడ సానుభూతి చూపించింది. రుక్మిణికి ఒక్కక్షణం చిత్తస్థబ్దత కలిగింది; తమాయించుకున్నది. తన మనోగత భావాలను బహిర్గతం కాకుండా జాగ్రత్తపడింది.

"సౌభాగ్యమ్మగారూ! మీరు కాబట్టి నా మీద ఇంత ఆప్యాయతతో యీ పత్రికతెచ్చి ఇచ్చారు. మరెవరు ఇలా చేయగలరు చెప్పండి. కృతజ్ఞురాలను. ఇంట్లో పనివుంది, వస్తాను. మరోసారి కలసి ఈ విషయం విపులంగా తీరికగా మాట్లాడుదాం." అని కుర్చీలోంచి లేచి నుంచున్నది. సౌభాగ్యమ్మ లేవక తప్పిందికాదు.

రుక్మిణి మాటలలో ఎంతో మర్యాద కన్పట్టుతున్నది. కాని సౌభాగ్యమ్మ మనసులో అనుమానం చోటుచేసుకుంది. రుక్మిణి మాటలు వ్యంగ్యార్థకాలు కాదా? ఏమో! ఇతమిత్థమని చెప్పలేని స్థితిలో ఉన్నది సౌభాగ్యమ్మ. మరోసారి రుక్మిణితో సంభాషణ సాగి స్తేకాని ఈ విషయం తేలదని ఆమె నిర్ణయించుకుంది.

"వస్తానమ్మా! ఏం జాగ్రత్త పడతావో ఏమో!" అంటూ సౌభాగ్యమ్మ వెళ్ళిపోయింది.

సౌభాగ్యమ్మను సాగనంపి రుక్మిణి ఆ పత్రిక అంతా జాగ్రత్తగా చదివింది. ఆమె వంటిపై గొంగళిపురుగులు ప్రాకినట్లుంది. ఈ పత్రికవాడు ఈ కథను ఎలా వ్రాయగలిగాడు? మోహనరావు చిత్రావతుల ఏకాంతంలో జరిగిన విషయాలు వీడికి ఎలా తెలిశాయి! అసంభవం. ఇందులో కొంత సత్యముండి వుండవచ్చును. కాని అంతా సత్యముకాదు; సత్యం కానేరదు. చాలవరకు ఊహ కల్పనగానోపు. ఇంతకూ ఈ పరిస్థితిలో తన విధ్యుక్త ధర్మమేమిటి? మోహనరావు ప్రవర్తన గత ఇరవయి రోజులుగా మామూలుకు భిన్నంగా ఉంది. అతనిలో ఏదో దోషభావం చోటు చేసుకున్నట్లు ఆమెకు స్ఫురించింది. మోహనరావు పశ్చాత్తప్తుడా? నిజంగా జరిగినదానికి అతడు విచారిస్తుంటే అతడిని ఇతరత్రా బాధపెట్టడం సముచితం కాదు కదా! అతడు గతాన్ని గురించి చింతిస్తున్నాడనేదానికి ఆధారమేమిటి? బహుశః అతనికి మరేదైన బాధ కలిగిందా? ఈ భావాలతో ఉక్కిరి బిక్కిరి అయింది ఆమె.

మోహనరావు టీ త్రాగేనిమిత్తం భోజనాల బల్ల దగ్గరకు వచ్చాడు. రుక్మిణి అతనికి ఫలహారం పెట్టి టీ ఇచ్చింది. అతడు

టీ తాగ్రటం ఇంచుమించుగా అయిపోయిన తరుణంలో రుక్మిణి ఆ పత్రికను అతనిముందు ఉంచింది. దానిని అతడు అంతకు ముందు ఎన్నోరోజులక్రిందటో చూచాడు. పత్రికను ప్రక్కకు నెట్టాడు. రుక్మిణి ముఖం చూడలేక తల వంచుకున్నాడు. ఆమె అతని చుబుకం పట్టుకుని అతని తల ఎత్తింది. ఉలిక్కిపడ్డాడు మోహనరావు. ఆమెస్పర్శ అతనికి విచిత్రానుభూతి కలుగజేసింది. తన శరీరం అగ్నిహోత్రాన్ని తాకినట్లుంది.

"ఏమండీ! ఈ వయస్సులో ఈ కుప్పిగంతులేమిటండీ? మీ రుక్మిణి మీకు ఇన్నాళ్ళకు పనికిరాకుండా పోయిందా?"

ఆమె ఒడిలో తలపెట్టి భోరున ఏడ్చాడు మోహనరావు.

సాదరంగా అతని శిరస్సు నిమిరింది ఆమె. శీతకరుని కిరణాలు తాకిన స్ఫూర్తి కలిగింది అతనికి. సేదదీరాడు మోహనరావు.

"రుక్మిణీ! ఈ పాపిని క్షమించగలవా?"

"ఆ స్ఫురణ ఒకసారి కలిగితే మరల పాపం చేయలేరండీ" అన్నది ఆమె.

"నా రుక్మిణి కరుణాదృష్టే నాకు అండ."

"నన్ను మీరు పొగడాల్సిన అవసరం కలుగకూడదండీ!"

"నిజంకూడ చెప్పనక్కరలేదా?"

"భార్యపరంగా అక్కరలేదు."

మళ్ళీ మోహనరావు సందిగ్ధావస్థలో పడ్డాడు. ఆమె తనను ఎగతాళిచేయటం లేదుకదా? ఏమో?

"రుక్మిణీ! సముద్రానికి ఒడ్డు ఉందేమోకాని, నీ కరుణకు మేరలేదు." అని ఆమె రెండుచేతులూ తనచేతుల్లోకి తీసికొన్నాడు. అతడు ఆమెకు అంజలి ఘటించినట్లు దృశ్యమయింది.

33

ప్రకాష్ పద్మజలు ఒకనాటి సాయంకాలం ఇందిరాపార్కులో ఒక గుబురుచెట్టు మరుగున కూర్చున్నారు. వ్యభిచారం నేరాన్ని శిక్షాస్మృతిలోనుండి తీసివేయాలనే ఊరేగింపులో వారు పాల్గొన్నారు. అపుడపుడు గున్నేశ్వరరావు కేసుకు హాజరవుతున్నారు. అప్పుడప్పుడూ పార్కులలో సమావేశమయి కాలం వెళ్ళబుచ్చు కుంటున్నారు.

"పద్మజా! ఈ జీవితం నీకు దుర్భంగా తోచటం లేదూ?" అన్నాడు ప్రకాష్.

తనేదో ఆలోచిస్తున్నది పద్మజ. చటుక్కున తలెత్తి ప్రకాష్ వంక చూచింది. అతని ముఖంలో విన్నదనం పరిస్ఫుటంగా గోచరిస్తున్నది. అతనిపై జాలి వేసింది ఆమెకు.

"ప్రకాష్ ఎందుకు బాధపడ్తున్నావ్" అని ప్రశ్నించింది.

"ఎందుకా? మన దుర్భర దారిద్ర్యానికి."

"బాధను తీసివేయలేనప్పుడు భరించాలిగా" పద్మజ మారు పలికింది.

"ఏ జన్మలో ఏ పాపం చేశామో ?" అనుమానాన్ని బహిర్గతం చేశాడు ప్రకాష్.

"జన్మలులేవు, గిన్మలులేవు. జన్మలను చూచి వచ్చిన వాడెవడున్నాడు ? ఉన్నా ఈ జన్మలో చేసిన ఈ పాపానికి ఈ శిక్ష అని ఎవరు చెప్పారు ?"

"పెద్దలూ ధర్మశాస్త్రవేత్తలూ చెప్పారు."

"అదంతా వారి ఊహాత్మక భావన. దానిని మనం నిజమని నమ్మి కష్టాలు తెచ్చుకుంటున్నాం" పద్మజ గంభీరంగా చెప్పింది.

"మన దరిద్రానికి మనపాపపుణ్యాలు కారణాలుకాకపోతే మరి దేవుడు మనలను ఇలా ఎందుకు నరకయాతనపాలు చేయాలి ?"

"దేవుడు ఉంటేగా మనలను కష్టపెట్టటానికి. మన కర్మఫలం అంటే మన పూర్వజన్మఫలం మనం అనుభవిస్తుంటే దేవుడు చేయగలిగిందేమిటి ? అతడు కేవలం సాక్షీమాత్రుడవుతాడు. అలాకాక కర్మతో నిమిత్తం లేకుండా మనం పుణ్య పాపాలను అనుభవించాల్సివస్తే, అది దేవుని లీల అని మనం సరిపెట్టుకోదలిస్తే మనల్ని ఇంత కష్టపెట్టే దేవుడు క్రూరుడన్నమాట. మనకలాంటి దేవునితో పనిలేదు. వాడిని పూజించటం, భజించడం అనవసరం."

"పద్మజా ? పోనీ మన దరిద్రానికి కారణం ఏమిటో నీవు వివరించు."

"మన దారిద్ర్యం మానవ కల్పితం. ఈ సంఘ వ్యవస్థా లోపమే ఈ బీదతనం."

"మరి ఇలాంటి వ్యవస్థను సృష్టించింది ఎవరు ?"

"స్వార్థపరులు, అజ్ఞానులు, అలసత్వ ప్రదర్శకులు."

"అంటే చివరకు నీవు, నేను కూడానా ?"

"అవును. స్వార్థపరుడు తన అవసరానికి అనుకూలంగా వ్యవహరిస్తాడు. అజ్ఞాని అతనిని అనుసరిస్తాడు. ఇదంతా తెలిసి కూడా చీమకుట్టినట్లుగాకూడా బాధపడని, వ్యధ అనుభవించని మనం దోషులంకాక మరేమిటి ?"

"ఉరుము ఉరిమి మంగలంమీదపడ్డట్లు మనబోటివాళ్ళ మీద విరుచుకుపడతావేం ?"

"అవును. యథాప్రజా తథా రాజా" అనేమాట ఊరక పుట్టలేదు."

పద్మజ వాదనపటిమకు ఆశ్చర్యాంబుధిలో తేలియాడు తున్నాడు ప్రకాష్.

"అయితే మనం ఏం చేయాలి ?"

"ఈ దారిద్ర్యాన్ని, ఈ అజ్ఞానాన్ని పారద్రోలటానికి ప్రయత్నించేవారి వర్గంలో చేరాలి. ప్రజలను నిద్రలేపాలి. వారు కలసికట్టుగా వ్యవహరించేలా చూడాలి. వారు సంఘటిత కార్యక్రమాన్ని చేపట్టేలా ప్రోత్సాహపరచాలి. ఈ వ్యవస్థను మార్చే విప్లవం తేవాలి" ఆవేశంగా మాట్లాడింది పద్మజ.

"అయితే విప్లవానికి నాయకత్వం వహించాలంటావా ?"

"సమయం వచ్చినపుడు ప్రజలే విప్లవమార్గాన్ని చేపట్టారు. నాయకత్వం వహించడంకాదు మన విధి. మనం ప్రజలకు స్నేహితులుగా, మార్గదర్శకులంగా, తత్వవేత్తలుగా వ్యవహరించాలి.

ప్రజలే తమ నాయకులను వారు సృష్టించుకోగల పరిస్థితులను మనం సృష్టించాలి. దానికి మున్ముందుగా బూజుపట్టిన భావాలను, సనాతన సంప్రదాయాలను విడనాడాలి. మనలో భావవిప్లవం రావాలి. దాంతో మనం కార్యాచరణకు గడగాలి."

"పద్మజా ! నీకింత జ్ఞానం ఎలా కలిగింది" తన సందేహం బయటపెట్టాడు ప్రకాష్.

"ఇదంతా అనుభవం నేర్పిన పాఠం. సునిశిత పరిశోధనా ఫలితం. మనో వేదనా విర్భూత సందేశం."

"విప్లవంకోసం కృషిచేద్దాం పద్మజా నేటినుండి"

"విప్లవం బహుముఖం, సామాజికం, సాంస్కృతికం, రాజకీయ, ఆర్థికం. దీనికోసం కృషిచేయటానికి ఏదో ఒక మార్గం ఎక్కడో అక్కడ ప్రారంభించాలి" పద్మజ విశదీకరించింది.

"ముందు మనం సామాజికరంగంలో విప్లవాన్ని సాధిద్దాం" ప్రకాష్ ఉత్సాహాన్ని ప్రదర్శించాడు.

"మనిద్దరం పెండ్లికాకపూర్వమే ఆలుమగలుగా ఉండటం వల్ల సాంఘికంగా తిరుగుబాటు చేశాము. అంతటితో చాలదు, ఆగిపోకూడదు. సమాజంలోని అధిక సంఖ్యాకులు ఇన్నాళ్ళనుంచి మననెత్తిన విలయతాండవం చేస్తున్న సనాతన దుష్టసంప్రదాయాలను తునాతునకలు చేయాలి. అప్పుడే అది విప్లవమనిపించుకుంటుంది" స్పష్టీకరించింది పద్మజ.

"నా జీవితానికి ఒక లక్ష్యాన్ని, గమ్యాన్ని నిర్దేశించావు" అంటూ పద్మజను అభినందించాడు ప్రకాష్.

"బాహాటంగా, బహిరంగంగా. ఏ సంకోచమూ లేకుండా, నిర్భయంగా దుష్టమైన సామాజిక నియమాలను మనం ఉల్లంఘించటమేకాక ఇతరులచేత తోసిరాజనిపించే ప్రయత్నానికి నడుంకట్టాలి మనం" అన్నది పద్మజ.

ప్రకాష్ తల ఊపాడు.

34

సాక్ష్యం చెప్పి వచ్చిన తరువాత సావిత్రికి మనస్సు వికలమయింది. మనశ్శాంతికోసం రాధమ్మ దగ్గరకు వెళ్ళింది. ఇటీవల కృష్ణారావుమధ్య తనమధ్య జరిగిన సంఘటనలను చెప్పింది. తను కృష్ణారావుతో చెప్పిన చివరిమాటలను యథాతథంగా రాధమ్మకు తెలియజెప్పింది.

ఇదంతా విన్న రాధమ్మ మనసు తేలికపడింది. సావిత్రి సుడిగుండంనుండి తప్పించుకోగల్గినందుకు సంతసించింది. సావిత్రిని కౌగలించుకుంది. ఆమె చూపిన ఆదరానికి, వాత్సల్యానికి సావిత్రి మురిసిపోయింది.

సంభాషణ అనేక విషయాలపై సాగి చివరకు సూర్యారావు మరణం, చిత్రావతి పాముకాటు పడటంమీదికి దొర్లింది. ఈవిషాద సంఘటనలకు కారణాలు ఏవైనా అవి వారికి సంబంధించినవారిపై చెరగని ముద్రవేస్తుందని వారిరువురూ అంగీకరించారు.

స్వైరవిహారము మనిషిని కించపరుస్తుందనే అభిప్రాయాన్ని రాధమ్మ వెలిబుచ్చింది.

"మానవ సంబంధాలలో కామము, మోహము, ప్రేమచోటు చేసుకున్నాయి. వాటిలో కామము ముఖ్యమయినదే. కాని అంతస్తులో ప్రేమకన్న చాల తక్కువది. కామప్రవృత్తి పశు గణంలోకూడా ఉంటుంది. కాని మానవుడికి పశువుకు తేడా వున్న దని మనం అంగీకరిస్తున్నాం. అలాంటి పరిస్థితిలో మానవుడు ప్రేమకు ప్రాధాన్యమివ్వడంలో ఆశ్చర్యంలేదు." వివరించింది రాధమ్మ.

"అయితే ప్రేమలేని కామం పశుత్వమనే కదా మీ అభి ప్రాయం?" పృచ్ఛ చేసింది సావిత్రి.

"సరిగ్గా గ్రహించావమ్మా. అయితే ఇక్కడ మరో విష యాన్ని స్పష్టీకరించాలి. ప్రేమలేని కామాన్ని గర్హిస్తున్నాం. కాని ఒకటి మాత్రం గుర్తుంచుకోవాలి. కామం లేక సెక్సులేని ప్రేమ అసంపూర్ణం; అసమగ్రం. అది కేవలం ఊహాకల్పిత భావం. అది అనేక మనోవికారాలకు కూడా దారితీస్తుంది."

"సకాలంలో మీరు సరియయిన సలహా ఇవ్వకపోతే నేను ఈ పాటికి కృష్ణారావులాంటి స్వార్థపరునిచేతిలో నలిగి నాశనమయి పోయి యుండేదాన్ని."

"ఇందులో నాదేమున్నదమ్మా! నీకున్న నైతికబద్ధత, వ్యవహారజ్ఞానం రెండూ నిన్ను రక్షించాయి. కాని ...."

"ఏదో అర్ధాంతరంగా ఆగిపోయారు. సెలవివ్వండి" అని సావిత్రి రాధమ్మను అభ్యర్థించింది.

"నాకు నిన్ను గురించి ఒక్కటే విచారమమ్మా! చివరకు మళ్ళీ నీ వొక్కతెవే మిగిలిపోయావు!"

"ఒకప్పుడు మీరన్నట్లు భావించేదాన్ని, ఈ నాటి పరిస్థితి వేరు. నాకు తీరికలేకుండా చేయటానికి పిల్లలున్నారు. సలహా సంప్రతింపులకు మీరూ, గోపాలంగారూ ఉన్నారు. శేషజీవితం సమాజసేవలో గడపగలను. మీ సాంగత్యం నాకా ధృతిని సంతరించి పెట్టింది."

సావిత్రి దృఢంగా పలికింది.

రాధమ్మ సావిత్రి వైఖరిని చూచి సంతుష్టాంతరంగ అయింది.

సావిత్రి వెళ్ళిపోయిన తరువాత రాధమ్మ గోపాలంగారి వాటాకు చేరింది. కుశల ప్రశ్నాదికమయిపోయిన తరువాత "రాధా! ఏమిటి విశేషాలు?" అని గోపాలంగారు సంభాషణ ప్రారంభించారు.

"ఒక సమస్య విశ్లేషణలో కొన్ని అనుమానాలువచ్చి మీ వద్దకు వచ్చాను" వచ్చిన పనిని పూర్తిగా బయట పెట్టకుండా.

అదేదో వివరించమని గోపాలంగారు కోరితే రాధమ్మ విశదీకరణకు పూనుకున్నది

"సూర్యారావు, చిత్రావతుల మరణవార్తలు ఆ సంబంధమైన గాథలు మీరు విన్నారు కదా!"

"ఎందుకు మనుషులు ఇలాంటి సన్నివేశాలలో ఇరుక్కుంటారు? అనే విషయం నన్ను కలవరపెడ్తున్నది."

"ఏ వ్యక్తి అయినా చనిపోయాడని తెలిస్తే ప్రతి మానవుడూ చింతాక్రాంతుడవుతాడు. అది సహజం. మానవజాతి అంతా

ఒకటే అనే భావం మనందరిలో ఉంది. అది మన సంస్కృతి వారసత్వం. కనుక మనం మరొకరి కష్టసుఖాల విషయంగా స్పందిస్తాం. అదే నీ పరంగా జరిగింది. అంతే. దానికి అబ్బుర పడవలసింది లేదు."

"వాళ్ళు ఎందుకు అలా ప్రవర్తించి ఉంటారు?"

"పద్మినీ వెంకట్రావులు, రుక్మిణీ మోహనరావులు ఆదర్శ దంపతులుగా నీవు పరిగణించావా లేదా?"

"వారు అలాగే కన్పడ్డారు నాకు."

"కాని ఆ కుటుంబంలో ఒక పురుషుడూ, ఒక స్త్రీ మామూలు సామాజిక ధర్మాలను అతిక్రమించారు కదా!"

"అవును"

"అలా ప్రవర్తించిన పద్మినికి, మోహనరావుకు సంతృప్తి కరమైన కుటుంబ జీవితం ఉన్నట్లేనా?"

"ఉన్నట్లుకాదు, ఉన్నది"

"మరి ఎందుకు ఆ తిరుగుళ్ళు"

"పద్మిని వివాహాత్పూర్వం స్వేచ్ఛగా సంచరించేది. వివాహం ఆమె దృష్టిలో ఆమెకు సంకెళ్ళు వేసింది. నిజానికి వెంకట్రావు ఆమెకు ఏ బంధాలు తగిలించలేదు. ఆమెకు ఎంతో స్వేచ్ఛ ఇచ్చాడు. అయినా వివాహమనేది బంధమని, దానిలో ప్రతిజీవి ఆ నియమాల ప్రకారం సంచరించాలని ఆమె అభిప్రాయ పడింది. ఇది సంస్కృతి ప్రభావం. ఒకవైపు ధర్మనిర్వహణ, మరోవైపు స్వేచ్ఛా ప్రవృత్తి. కనుక వెంకట్రావును భర్తను

అలరించింది; సుఖపెట్టింది. సూర్యారావుతో సంబంధం పెట్టుకొని తన స్వేచ్ఛా ప్రవృత్తిని తృప్తి పరుచుకుంది. అలాగే మోహనరావు. మోహనరావుకు సంవేశనపరంగా చిత్ర విచిత్ర భంగిమలను ప్రయోగపూరితంగా తెలిసికోవాలని కోర్కె కలిగివుంటుంది. తన భార్య రుక్మిణి ముగ్గురు బిడ్డల తల్లి. ధర్మప్రవృత్తికల స్త్రీ. అలాంటి ఆమెను తన కోర్కెలను - అందులో విడ్డూరమైన కోర్కెలను - తీర్చమని అడగలేకపోయాడు. అతని దృష్టిలో రుక్మిణి పవిత్రురాలు. తనది అపవిత్రమైన కాంక్ష. దానిని ఆమె ద్వారా తీర్చుకోవటం అసంభవం. అంతేకాదు అది అధర్మం కూడాను. కనుక దానికై చిత్రావతిని ఎంపిక చేసుకున్నాడు."

"ఇంతకూ పద్మిని, మోహనరావులు విడివిడిగా చేసిన దుష్టకార్యాలు క్షంతవ్యమంటారు మీరు."

వాటిని ప్రోత్సహించను నేను. కాని ఆ చర్యలకు వారు పూనుకోవటంలో వారి వైఖరిని, మనోభావాలను అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తాను. ఆయా పరిస్థితులను పరిగణనలోనికి తీసుకుంటాను. అపుడు నిర్ణయిస్తాను అది సమయోచితమైనవా కావా అనే విషయం.''

"ఇంతకూ వారి చర్యలు యుక్తమంటారా? అయుక్తమంటారా?"

"ఇక్కడ ముఖ్యమైన విషయాన్ని గమనించాలి. వీరి చర్యలవల్ల ముఖ్యంగా ఆందోళన వెలిపుచ్చాల్సింది పద్మినిభర్త వెంకట్రావు, మోహనరావు భార్య రుక్మిణి. వారు — అంటే వెంకట్రావు పద్మినిని, రుక్మిణి మోహనరావును క్షమించగల్గితే, అలాగే ఈ చర్యలు సూర్యారావుకు, చిత్రావతికి సమ్మతమయితే

మనం — అంటే మీరూ, నేనూ, సమాజమూ, — ఈ విషయంలో దోష నిర్ణయానికి పూనుకోవటం అనవసర శ్రమ పైగా వృథా ప్రయాస అవుతుంది. కనుక నేను ఆ ప్రయత్నం చెయ్యను."

"అంటే సామాజిక నియమాలను, ధర్మాలను అందరూ అతిక్రమించ వచ్చునంటారా?" రాధమ్మ ఉద్రేకంగా ప్రశ్నించింది.

"సామాజిక నియమాలు రెండు రకాలు. కొన్నింటిని అతిక్రమిస్తే సంఘానికి నష్టం వాటిల్లుతుంది. మరి కొన్నింటిని అతిక్రమిస్తే అలా నడచిన వారి సన్నిహితులకే ఇబ్బంది కల్గుతుంది. రెండవరకం ధర్మాన్ని వ్యతిరేకిస్తే సన్నిహితులుతప్ప మరెవ్వరూ ప్రమేయం పెట్టుకోవాల్సిన అవసరంలేదు. ఇది ధర్మసూక్ష్మం."

ఇంతవరకూ పద్మిని, మోహనరావులను పెద్ద నేరస్తులుగా ఎంచింది రాధమ్మ. ఇపుడు ఆమెకు కనువిప్పు అయింది. ఒక రకంగా చూస్తే రాధమ్మ చకితురాలయినట్లు వర్ణించవచ్చు.

35

కోర్టు హాలు జనంతో కిటకిటలాడుడూ ఉంది. పత్రికా విలేఖరులు పెద్దసంఖ్యలో వచ్చారు. ఆ రోజు గున్నేశ్వరరావు కేసులో వాదనలు జరిగాయి.

ప్రశ్న అల్లా ముద్దాయి ఫిర్యాది సమ్మతిలేకుండా, ఎరుకతో కూడిన ఉపేక్షలేకుండా ఫిర్యాది భార్య నీరజతో లైంగిక సంపర్కం ఏర్పరుచుకున్నాడా లేదా అనేదే. ఈ సందర్భంలో ఫిర్యాది సాక్ష్యం తగినంతగా ఉందని ఫిర్యాది ప్లీడరు సీతారామయ్య పట్టుదలగా వాదించాడు. కొన్ని పరిస్థితులలో ఒక్క ఫిర్యాది సాక్ష్యం

మీదనే ముద్దాయిని నేరస్తునిగా నిర్ణయించవచ్చని కోర్టుతీర్పులు చదివి వినిపించాడు. ముద్దాయికి తన భార్యకు ఫిర్యాదే ముందు పరిచయం, తరువాత ఏకాంతం, సంబంధం కల్పించాడని, అతని సమ్మతితోనే ఈ వ్యవహారం అంతా నడిచిందని, ఒకవేళ అతని సమ్మతిలేదని కోర్టువారు ఎంచినా అతని ఎరుకతో కూడిన ఉపేక్షా వైఖరి రుజువయిందని, గోపాలంగారిలాంటి సంఘ సంస్కర్త, రాధమ్మలాంటి విద్యావతి, నళినిలాంటి గృహిణి, సావిత్రిలాంటి ధనవంతురాలయిన పొరుగువాటా నివాసి, అన్నిటికన్నా మిన్న ఫిర్యాది తరఫు సాక్షి ప్రభాకర్ వాఙ్మూలాలనుపట్టి ముద్దాయి, నీరజ ఫిర్యాది సమక్షంలో అతని అభ్యంతరంలేకుండా ఆలుమగలు సంచరించేరీతిలో చనువుగా ప్రవర్తించాడని తేలిందని ముద్దాయి తరఫు న్యాయవాది వీరభద్రియ్య గట్టిగా వాదించాడు. నీరజ, ముద్దాయిలు సాక్ష్యాలు నమ్మతగినవని వీరభద్రియ్య కోర్టువారికి నివేదించాడు. తీర్పుకొరకు ఏప్రిల్ 1 వ తేదీకి వాయిదాపడింది.

మరునాడు పత్రికలలో ఫిర్యాది, ముద్దాయి, నీరజల ఫోటోలు, న్యాయవాదుల బొమ్మలు, వాదనల సారాంశం ప్రముఖంగా ప్రచురితమయినాయి. జనం ఎక్కడ తీరికగా చేరినా ఈ విషయాన్నే చర్చించసాగారు.

రాధమ్మ చదివింది ఈ వార్తను. ఆమె మనస్సులో క్రొత్త క్రొత్త ఊహలు పొడసూపుతున్నాయి. ఆమె తన మనోభావాలను గమనించసాగింది. గోపాలంగారి మేధాశక్తి, విశ్లేషణ చేసే సత్తా ఆమెను ఆకట్టుకున్నాయి. అందువల్ల ఆమె అతనియెడ గౌరవాన్ని పెంచుకుంది. అతని సహృదయత్వం,

స్నేహప్రియత్వం, ఆదరణ ఆమెను ఆకర్షించాయి. తద్వారా ఆయనపై అభిమానం పెంచుకున్నది. మొన్నటి సమావేశంలో ఆయనకు మానవతపట్ల గౌరవం, కరుణాదృష్టి, ధర్మాధర్మ వివేచనాశక్తి ఆమెను ముగ్ధురాలిని చేశాయి. తను ఆయనకు దగ్గరయింది. బాగా ఆలోచిస్తే అది ప్రేమభావంగా తేలింది.

ఇది స్ఫురించగానే ఆమె దేహం పులకితమయింది. ఇన్ని ఏళ్ళకు, ఇంతవయస్సుపైబడిన తరువాత ఆమెకు ప్రేమాంకురమయింది. ఇది చాల విచిత్రంగా కన్పడింది ఆమెకు. ఇది ఎలా పరిణమిస్తుందో అని ఆమెకు భయం కలిగింది. ఈ వయస్సులో మరల ప్రేమించ ప్రయత్నించడంలో విఫలమయితే ఆమెజీవితం మరీ దుఃఖభాజనమవుతుంది. ఈ విషయంలో తను తగు జాగ్రత్తలో ఉండటం మంచిది.

సాయంత్రం గోపాలంగారి వాటాకు వెళ్ళింది. ఆమె మనస్సులో మార్పువల్లనో మరెందువల్లనో గోపాలంగారు తనను ఆప్యాయతను మించిన భావంతో ఆహ్వానించారని తలచింది.

"రాధా! రా ఏమి కబుర్లు మోసుకొనివచ్చావు" అన్నారు గోపాలరావుగారు.

"చదివారుగా గున్నేశ్వరరావు కేసులో వాదనలు పత్రికలలో?"

"చదివాను, సంతోషించానుకూడా. కమలాకరరావు, నీరజ వీరిద్దరు, ఎంత బాధాకరమైనా, నిజం చెప్పటం చాల గొప్ప విషయం. ఈ రోజుల్లో వాస్తవాన్ని బయలుపరచి సమర్ధించుకోపూనడం గొప్ప విశేషం. ఆ మాటకువస్తే వాళ్ళ న్యాయవాది

కోదండరామయ్యగారుకూడా మంచివారు. క్లయింట్లు నిజం చెప్తామన్నా నిజం చెప్పనీయరు చాలామంది ప్లీడర్లు. అలాకాకుండా ధైర్యంచేసి నీరజచేత కమలాకరరావుచేత సాక్ష్యం చెప్పించడం ఒకవిధంగా సాహసం క్రిందనే లెక్క. ఇలా అందరూ ఎవరికి వారుగా సత్యంకోసం నిలబడితే తప్ప సత్యం జయించదు."

గోపాలంగారి సత్యనిరతి రాధమ్మ హృదయంలో అంతకు ముందే ఉన్న ప్రేమ బీజాలను పోషించింది.

"కమలాకరరావు, నీరజ పెండ్లిచేసుకోవడానికి వీలయితే బాగుండును."

తన అంతర్గత మనోభావాన్ని తెలియపర్చింది రాధమ్మ.

"ఈ కేసు కొట్టివేస్తేనో, నీరజ విడాకులు పొందగలిగితేనో అది సాధ్యం."

"కేసు కమలాకరరావు పక్షం అవుతుంది. మీరు అతని తరఫున సాక్ష్యం చెప్పిన తరువాత నాకా ధైర్యం కలిగింది" రాధమ్మ అతనియెడ తన గౌరవభావాన్ని వెలిబుచ్చింది.

"రాధా! కోర్టులలో కేసులు అచ్చంగా సాక్ష్యంమీదనే ఆధారపడవు గెలుపుకు. అనేక అంశాలు దానిని నిర్ణయిస్తాయి."

సావిత్రికి తను చెప్పిన సలహా మంచిదో కాదో గోపాలంగారి అభిప్రాయం తెలుసుకోవాలనిఅనిపించింది ఆమెకు. సావిత్రి చరిత్ర అంతా పూసగుచ్చినట్లు చెప్పింది వారికి. గోపాలంమాట వినాలని కుతూహలపడ్డది రాధమ్మ.

"రాధా! నీవు ఇచ్చిన సలహా బహుదొడ్డది. సంఘ సంస్కర్తలంగా చలామణీ అయ్యేమనం స్వైరవిహారాన్ని సమర్థించము;

ప్రోత్సాహపరచం. పిల్లల భవిష్యత్తు దృష్ట్యా ఆమె ఆ నిర్ణయానికి రావడం సముచితం. నిజానికి హడావుడిగా ఎవడినో ఒకడిని కట్టుకోవడం ఆమెకూ మంచిది కాదు. ఆమెను ఆమె పిల్లలతోసహా స్వీకరించలేనివారు ఆమెను స్వీకరించదలచనట్లే. ఆమెను సంపూర్ణంగా స్వీకరించాలి. ఆమె విధవయని ఆమెకు పిల్లలున్నారని తెలిసి, ఆమెకు ఆస్థి ఉన్నదనే విషయం తెలియకుండా ఆమెను స్వీకరించదలిస్తేనే ఆమెను ప్రేమించినట్లు. అలా కానినాడు ఆమె ఇప్పటిలాగా ఉండిపోవలసిందే. గోపాలంగారు తను సావిత్రికి ఇచ్చిన సలహాను ఆమోదించటం ఆమెకు ఎంతో ఉల్లాసాన్ని కల్గించింది.

ప్రకాష్ పద్మజల అవస్థ తెలిసిన రాధమ్మ వాళ్ళకు వివాహమయితే బాగుండునని ఆశించింది.

"ఎవరయినా వాళ్ళకు ఆశ్రయం ఇవ్వగలిగితే కదా!" అని గోపాలంగారు ఊరకున్నారు.

నీరజద్వారా అంతకు క్రితమే ప్రభాకర్ నళినుల కుటుంబం స్థిమితపడ్డ విషయం గ్రహించింది రాధమ్మ.

ఆ కథ గోపాలంగారికి చెప్పింది. ఆయన విరగడినవ్వారు.

"చూచావా రాధా! ఇతరులకు మేలుచేయ పూనుకున్నవాండ్లకు మంచి అనేది ఎలా వెన్నాడివస్తుందో! నీరజ కాపురం బాగుచేయపోతే తన కాపురంకూడ మెరుగుపడ్డది"అంటూ రాధమ్మ కళ్ళలోకి చూశారు గోపాలంగారు. ఆ దృక్కులలో ఏదో అలౌకికత్వం భాసిస్తున్నది. బహుశః ఆయన తనలో తన

భార్య కాంతమ్మను చూస్తున్నారా అనే శంక ఆమెకు కలిగింది. ఆయన తనవంక అలాగే కాసేపు చూచారు. ఇది గ్రహించిన రాధమ్మ పరవశించిపోయింది.

"మీ సూక్తులు వింటూంటే నాకు పరమానందంగా వుంది. కాలేజీకి పోకుండా మీతో మాట్లాడుతూ కూర్చోబుద్ధి పుట్టున్నది."

"రాధా! నాలోనూ అలాంటి భావనే ఉదయించింది." ఈ వాక్యం రాధమ్మకు కర్ణరసాయనమయింది.

"అదంతా నా అదృష్టం" రాధమ్మ మొగం జేగీయమానంగా విలసిల్లుతున్నది.

"రాధా! నాకు ప్రీతిపాత్రమైన విషయాలను ఇంత ఆవేదనతో, నిజాయితీతో, పరిశీలనాదృష్టితో నాతో చర్చించేవారు ఇటీవల తటస్థించలేదు. నీవు నా జీవితంలో ప్రవేశించి నాకున్న ఆ కాస్త కొరత తీర్చావు." ఆయన గొంతు జీరబోయింది.

ఆయన మనోభావాలను వినగల్గినందులకు ఆమె తన అదృష్టానికి జోహారులర్పించింది.

తన ప్రేమ అచిరకాలంలోనే ఫలవంతం కాగల చిహ్నాలు ఆమెకు కన్పించాయి. అసంతృప్తితో చర్చ ముగించి ఆమె తన వాటాకు వెళ్ళిపోయింది.

36

అది గున్నేశ్వరరావు కేసు తీర్పురోజు. మేజస్ట్రీటు ఇంకా రాలేదు. కోర్టుహాలులో జనం ఊహాగానాలు చేస్తున్నారు. ముద్దాయికి శిక్ష తప్పదని కొందరంటుంటే, కేసు కొట్టివేయడం తథ్యమని మరి కొంతమంది వాదిస్తున్నారు. సరిగ్గా పదకొండు గంటలకు మేజస్ట్రీటు వచ్చారు. నీంజకు అంతగావుండే నిమిత్తం నళిని కోర్టుకు వచ్చింది. ఆమెతోపాటు సావిత్రి వచ్చింది. తను సాక్ష్యం చెప్పిన కేసు తీరు ఏమవుతుందో తెలిసికుందామనే కుతూహలంతో రామలింగం భార్య సౌభాగ్యమ్మను వెంటపెట్టుకొని వచ్చి కోర్టు హాలులో ఆశీనుడయినాడు. ప్రభాకరం ఆ వేళకు పరుగెత్తుకొని కోర్టుకు చేరాడు. ఈ కేసులో మొదటినుండి ఆసక్తి చూపుతున్న ప్రకాష్ పద్మజలుకూడా జనంలో ఉన్నారు.

మేజస్ట్రీటు సీటుపై ఆసీనుడయ్యాడు కోర్టుహాలులో. చీమ చిటుకుమన్నా వినపడేటంత నిశ్శబ్దం. హాలులోని వందమంది దృష్టి మేజస్ట్రీటు ముఖంపై కేంద్రీకరించబడి ఉంది.

కేసు పిలిచాడు బెంచి గుమాస్తా. కమలాకరరావు వచ్చి ముద్దాయి బోనులో నిల్చున్నాడు. మేజస్ట్రీటు తీర్పు చెప్పాడు.

"ముద్దాయిని నిర్దోషిగా నిర్ణయించి ఈ కేసు కొట్టేస్తున్నాను." అన్న వాక్యం స్పష్టంగా చెప్పాడు.

జనం లేచారు.

న్యాయమయిన తీర్పు అని ఒక గుంపు, అవినీతికరమైన నిర్ణయమయిన మరోగుంపు వ్యాఖ్యానాలు సాగుతున్నాయి.

కమలాకరరావు బయటికివచ్చి నీరజ కళ్ళల్లోకి చూచాడు. ఆమె అశ్రుకణాలురాల్చింది. సావిత్రి ,నళిని, నీరజను అభినందించి వెళ్ళారు. ప్రభాకరం కమలాకరరావును కలిసి భావస్ఫూరకంగా కరస్పర్శచేశాడు. ప్రకాష్ పద్మజలు కమలాకరరావు నీరజలకు నమస్కరించి 'న్యాయం గెలిచింది' అని తమ అభిప్రాయం వెలిబుచ్చారు. నీరజ కమలాకరరావులు ప్లీడరు వీరభద్రయ్య గారికి కృతజ్ఞత తెల్పారు.

రామలింగం, సౌభాగ్యమ్మలు ముఖాలు చిట్లించుకుని ఇళ్ళకు మళ్ళారు. గున్నేశ్వరరావును ఎగతాళి చేసింది అక్కడ చేరిన యువక బృందం. అతని ప్లీడరు సీతారామయ్య గంభీరంగా మరో కోర్టుకుపోయాడు.

ఈ తీర్పు విషయం గోపాలంగారికి తెలియజేద్దామని ప్రకాష్ పద్మజలు గోపాలంగారి ఇంటికి వెళ్ళారు. ఆయనకు ఆ విషయం వివరించారు. ఆయన తన సంతోషాన్ని వ్యక్తంచేశారు. సత్యం జయించినందుకు ఆనందించారు.

మీకు ఇంకా ఇల్లు దొరకలేదా యని ప్రకాష్ పద్మజలను ప్రశ్నించారు గోపాలంగారు. తమ పరిస్థితిని విశదీకరించింది పద్మజ. తమ విషయంగా వారి సలహా పొందాలని ఆమెకు ఆసక్తి కలిగింది.

"బాబుగారూ! ఆ సంగారెడ్డి ఉదంతంవల్ల మీకు మా పట్ల అసహ్యభావం కలిగితే అది మా దురదృష్టంగా భావిస్తాం."

"అలా ఎందుకు ఆలోచిస్తున్నావమ్మా! నాకు మీ పట్ల ఆదర భావమేకాని అన్యధా మరే భావమూలేదు."

ఈ మాటలతో ప్రకాష్ పద్మజలు మనసులో ఊరటచెందారు.

"తమబోటి పెద్దలు విశాలహృదయంతో సంచరిస్తారని మాకు తెలుసు. అయినా మామూలు ధోరణిలో భయపడ్డాం" అని ప్రకాష్ తన మనో భావాలను అభివ్యక్తం చేశాడు.

గోపాలంగారు ఏదో ఆలోచిస్తున్నట్లు కాసేపు మౌనంగా ఉన్నారు. తరువాత మాట్లాడటం ప్రారంభించారు.

"నీతి, అవినీతి అనే వాటిని పరిస్థితులపై ఆధారపడి అన్వయం చెయ్యాలి. జీవితంలో శాశ్వతమయిన మానవ విలువలు ఉన్నాయి. ప్రేమ, వాత్సల్యం, స్నేహం, కరుణ, దయ సోదర భావం ఇలాంటివి సార్వకాలికాలు. వాటి బహిర్గతరూపాలు పరిస్థితులను బట్టి మారుతూవుంటాయి. అలాగే వ్యవస్థలుకూడ దేశ కాలాలను బట్టి వైవిధ్యంతో ఉంటాయి. ధర్మం సార్వజనీనం. ధర్మ సూక్ష్మం వైయుక్తికం. కనుక మీరు ప్రేమించుకున్న జంటగా దాంపత్య జీవితం గడపటం నాకు సమ్మతమే. ఇళ్ళున్న ధనవంతులే వివాహమాడి దాంపత్య జీవితం సాగించటానికి అర్హులనే భావన నాకు ఏనాడులేదు. సమాజంలో అన్ని వర్గాలకు సమానావకాశాలుండాలని కోరుకునేవాణ్ణి. అలా కాకపోతే స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే పదాలకు అర్థంలేదు."

తాము సంచరిస్తున్న తీరు దుష్టంకాదని, అవినీతికరం కాదని మాత్రమే ప్రకాష్ పద్మజలకు తెలుసు. ఇంత వివరంగా వారు సమస్యకు విశ్లేషణ చేయలేదు. ఈ విశదీకరణ వారికి ధైర్యాన్ని స్థయిర్యాన్ని సంతరించి పెట్టింది. వారు గోపాలంగారి దగ్గర సెలవుతీసుకొని వెళ్తూవుంటే త్రోవలో రాధమ్మగారు కన్పించారు.

కేసు తీర్పు ఆమెకు చెప్పారు వారు. ఆమెకు నమస్కారంచేసి వారు వెళ్ళిపోయారు.

రాధమ్మ ఆ రోజు సాయంత్రం అయిదు గంటలకు గోపాలం గారి వాటాకు వెళ్ళింది. ఆయన ఆమెను ప్రీతితో ఆహ్వానించారు. ఆమె రాక పోకలు ఆయనకు అలవాటయినాయి. ఆమె రాక కోసం ఆయన నిరీక్షిస్తున్నారనే ఊహ ఆమెకు తోచింది. ఆమె ఉల్లాసంగావుంది. తన మనోభావాల వ్యక్తీకరణకు అవకాశం చేజిక్కించుకోవాలని ఆమె సంకల్పం. ఈనాడు మామూలుకన్న అందంగా ఆమె అలంకరించుకున్నది. వేషంకూడ తదనుగుణంగా ధరించింది. అంతకుముందు సాదాగావుండే అధ్యాపకురాలు కాదు ఆమె. స్త్రీత్వం ఆమెలో మూర్తీభవించి ఉంది.

గోపాలంగారు ఆమెను చూచారు. ఒక్కక్షణం ఆయనకు తన భార్య కాంతం గుర్తుకొచ్చింది. తన భార్యలోకూడ హుందాతో కూడిన స్త్రీత్వం ఉండేది. తరుణులలోవుండే చాపల్యస్వభావం కాదది. తన సృజనాశక్తిని అవగతంచేసుకున్న మహిళ మనస్తత్వమది.

రాధమ్మ ఆయన కెదురుగా కుర్చీలో ఆశీనురాలయింది.

"కమలాకరరావును నిర్దోషిగా కోర్టువాడు నిర్ణయించిన విషయం మీకూ తెలిసే ఉంటుంది" అని సంభాషణను మొదలు పెట్టింది.

"తెలిసింది. పద్మజ చెప్పింది ఇందాక" అన్నారు గోపాలంగారు.

ప్రకాష్, పద్మజల పేర్లు వినగానే ఆమెకు వాళ్ళ సంబంధం స్ఫురణకు వచ్చింది. దానిని గోపాలంగారు ఆమోదిస్తున్నారా లేదా? ఆమోదిస్తే సెక్సు విషయంలో వారికి చాల ఉదారభావాలు ఉన్నట్లు లెక్క. అంత ఉదారతను చూపించే గోపాలరావుగారు తన పరంగా కూడా ఆ ఉదారతనే చూపవచ్చుననే ఆశ ఆమె మనస్సులో పొటకరించింది.

"పాపం! ప్రకాష్ పద్మజలు ఇంటివారు కాలేకపోయారు" వారిపట్ల తనకున్న జాలిని ప్రదర్శించింది.

"వారిద్దరూ ప్రేయసీప్రియులు. ఆలుమగలు కాకపోతే కాపురం చేయడానికి ఇల్లు దొరకక. ఇల్లులేక ఇంటివారు కాలేదు. ఇది వారి తప్పుకాదు. దరిద్రానికి సమాజంలో చోటు కల్పించిన వ్యవస్థది. ఆ వ్యవస్థను తెలిసో తెలియకో ప్రత్యక్షంగా-పరోక్షంగా బలపరుస్తున్న మనది. ఆ వ్యవస్థను కొనసాగనిస్తున్న ప్రజలది" ఆవేశపూరితంగా పలికారు గోపాలంగారు. ఇంత ఆవేశాన్ని ఆయనలో ఎన్నడూ చూడలేదు రాధమ్మ.

"మరి కన్యలుగా మిగిలిపోయిన స్త్రీల విషయం" ఆ సమస్యను లేవనెత్తింది రాధమ్మ.

"ఈనాటి సమాజంలో వరకట్నమివ్వలేని కుటుంబాల్లో ఆడపిల్లలకు పెండ్లికావటంలేదు. వారు అవివాహితులుగానే ఉండిపోతున్నారు. ముద్దుకృష్ణ అన్నట్లు "ఆడపిల్లను కన్నందుకు తండ్రికి వేసే జరిమానాయే వరకట్నం!" ఇది ఆర్థిక సమస్య మాత్రమే అనుకుంటే అంతకన్న పొరపాటుండదు. ఇదిస్త్రీ పురుష సమానత్వ సమస్య. వధువు + వరకట్నం = వరుడు. కాబట్టి

వధువు వరునికన్నా తక్కువనేకదా. ఈ వైఖరిని మనం నిరసించాలి: దీనిని మనం వ్యతిరేకించాలి. ఈ దురాచారాన్ని మనం రూపుమాపాలి."

వరకట్న సమస్యమీద తనూ అనేక పర్యాయాలు ఉపన్యసించింది కాని ఈ నూతన దృక్పథంతో తను సమస్యను విశ్లేషించలేదు. గోపాలంగారు ప్రతి సమస్యనూ అందరికన్నా విభిన్నంగా ఆలోచిస్తారు. అదే ఆయన ప్రత్యేకత.

సంభాషణ అనేక విషయాలపై దొర్లి చివరకు ముసలితనం మీదికి దొర్లింది.

"ముసలితనం రెండురకాలు- శారీరకం, మానసికం. శారీరకమైన ముసలితనాన్ని ఎవరూ తప్పించుకోలేరు. కానిమానసికమైన ముసలితనాన్ని రాకుండా చేసుకోటానికి అందరికీ అవకాశం ఉంది. తన విషయంలో, తనచుట్టూ ఉన్న సమాజాన్ని గురించి, ప్రాకృతిక ప్రపంచాన్ని గురించి శ్రద్ధతీసుకునేవాడు ఏనాటికీ వృద్ధుడు కానేరడు. కాకపోతే జ్ఞానవృద్ధుడు కావచ్చును. జీవితంపై ఆసక్తి చూపలేనివాడు వైరాశ్యానికి త్వరలో లోనవుతాడు. మనిషిలో మందకొడితనాన్ని ఉద్భవింప చేస్తాయి. అది స్తబ్ధతకు దారితీస్తుంది. చైతన్యరాహిత్యం మరణంతో సమానం" గోపాలంగారు విశదీకరించారు.

"మీరు నిత్య యవ్వనులు" రాధమ్మ మందహాసపూర్వకంగా గోపాలంగారిని అభినందించింది.

ఈ వాక్యంవిన్న గోపాలంగారు చకితులయారు. తనభార్య కాంతం తనను గురించి ఎప్పుడూ ఇలాగే అనేది. తలయెత్తికళ్ళల్లో

కళ్ళు పెట్టి రాధమ్మను చూచారు. ఆయనకు రాధమ్మ కనిపించటం లేదు. ఆమెలో ఆయన తన సతి కాంతాన్ని చూస్తున్నారు.

"కాంతం!" అని పిలిచి రాధమ్మవంక చేతులు చాచారు.

రాధ గోపాలంగారి బాహుపంజరంలోనికి జారింది. వారిద్ద రికీ బాహ్యచైతన్యం కలిగేటప్పటికి వారిద్దరూ ఏకశరీరులుగా ఉన్నారు.

37

కమలాకరరావు కేసు కొట్టివేసిన మరునాడు పత్రికలు ఆ వార్తను పతాకశీర్షికలతో ప్రకటించాయి. ఒక ఆంగ్ల దిన పత్రిక, ఒక ఆంధ్రదినపత్రిక వ్యభిచారనేరాన్ని భారతశిక్షాస్మృతి నుండి ఎత్తివేయాలని సంపాదకీయాలు వ్రాశాయి. అలా ఈ అంశం ప్రజలకు ఆసక్తిదాయకమైన చర్చా విషయమయింది.

సనాతనులు మండిపడ్డారు. కుహనా సనాతనులు తమ ఆగ్రహాన్ని ప్రకటించారు.సంస్కారులుతీర్పునుసమర్థించారు. యువకులు తీర్పును ఆహ్వానించారు. కొంతమంది అయోమయావస్థలోపడ్డారు. కమలాకరరావు నీరజల ప్రవర్తనను ఆమోదించనూలేరు; ఖండించనూలేరు. ఇలా వారివారి మనఃప్రవృత్తుల ననుసరించి, సంస్కార విశేషాన్నిబట్టి వ్యాఖ్యానాలు చేసారు ప్రజలు.

తరువాత నాలుగురోజులకు ఆదివారంనాడు రాధమ్మ ఇంటిలో ఒక టీ పార్టీ జరిగింది. దానికి నీరజ కమలాకరరావులు ఆహ్వానితులు. ప్రభాకరం నళినులను రాధమ్మ పిలిచింది. సావిత్రి, గోపాలంగారు, ప్రకాష్‌పద్మజలు వచ్చారు. ఆనాడు ఆమె ఇల్లు కళ కళలాడుతూ ఉంది. అక్కడ చేరిన వారందరిలో గోపాలంగారే

వయోవృద్ధులు, జ్ఞానవృద్ధులుకూడాను, రాధమ్మ వారిని ప్రసంగించవలసిందని కోరింది. గోపాలంగారు ఆమె అభ్యర్థనను ఆమోదించారు.

"ఈరోజు మనం కమలాకరరావుగారి విడుదల సందర్భంగా వేడుకచేసుకోవటానికి సమావేశమయినాం. ఆ కేసులో వారు గెలవడం అంటే సత్యం జయించడం అన్నమాట. ప్రేమ విజయం పొందడం అది. ఈ ప్రపంచం ప్రేమతోనిండి నిబిడీ కృతంగా ఉంది. ఈ ప్రేమ సందర్భాన్ని బట్టి వాత్సల్యంగా, అనురాగంగా, కరుణగా, అభిమానంగా అనేక రూపాంతరాలు కలిగి ఉంటున్నది. నిష్కల్మషమైన ప్రేమలో స్వార్థంకన్న త్యాగం మోతాదు ఎక్కువ. ఉదాహరణకు నీరజ పిరికిపందలా పారిపోలేదు. తను అభిమానించిన కమలాకరరావుగారిని కాపాడటానికి విశ్వప్రయత్నం చేసింది. అవివేకులయిన ప్రజలు నిందించినా పరవాలేదని తలంచి కోర్టు రంగంలోకి దిగింది. అవతలి ప్లీడరువేసే అడ్డుసవాళ్ళకు బెదరకుండా, చలించకుండా నిబ్బరంగా సాక్ష్యం చెప్పింది. అందుకు మీ అందరి తరఫునా నేను ఆమెను అభినందిస్తున్నాను"

తతిమ్మా వారంతా ఆమోదసూచకంగా కరతాళధ్వనులు చేశారు.

ఆయన తమ ప్రసంగాన్ని కొనసాగించారు.

"ప్రేమను అవగతం చేసుకోటానికి సహృదయత కావాలి. అవతలి మనిషియొక్క కష్టాలకు, సుఖాలకు స్పందించ గలిగే పరస్పర అవగాహన ప్రేమకు తొలిమెట్టు. ఒకరి నొకరు అర్థం చేసుకోని స్త్రీ పురుషులు ప్రేమించుకున్నామని భ్రమపడవచ్చును.

అది తాత్కాలిక వ్యామోహమే. కామం ఇద్దరిని దగ్గరకు చేర్చ వచ్చును. అలాగే మోహం ఇద్దరిని సన్నిహితులను చేయవచ్చును. కాని అవి ఎక్కువ కాలం వారిని ఆకట్టలేవు. వాటి మెరుగు పోతుంది; తళుకు వాడిపోతుంది. ప్రేమకు శాశ్వతత్వ లక్షణం ఉన్నది. దానికి సెక్సు జీవితం ప్రాతిపదిక. సెక్సులేని ప్రేమ ఎక్కువ కాలం నిలువనేరదు. కాని సెక్స్ ప్రేమకాదు. ప్రేమ సెక్సు కన్న గొప్పది. ప్రేమ ఉన్నచోట సెక్సు సామాన్యంగా వుంటుంది. ప్రేమతో నిమిత్తంలేని సెక్సు జంతుప్రవృత్తి క్రింద జమ.

వివాహం ప్రేమ జీవితాన్ని క్రమబద్ధం చేస్తుంది. అది అవసరమయిన వ్యవస్థ. ఇది సామాన్యధర్మం. అసామాన్యుల విషయంలో ఈ ధర్మం అక్కరకు రాకపోవచ్చును. వారు విధిగా వివాహమాడనవసరంలేదు. వివాహానికి మూలకందమయిన ప్రేమ ఆ స్త్రీ పురుషులమధ్య ఉంటుంది. వారి ప్రత్యేక పరిస్థితుల్లో వారు వివాహమనే బంధాన్ని స్వీకరించ నక్కరలేదు. ఇంతవరకు ఈ దేశంలో, వివాహాత్పూర్వం యువతీయువకులు ఎంత ప్రేయసీ ప్రియులయినా దాంపత్యజీవితం గడపటాన్ని సంఘం ఆమోదించ లేదు. కాని మన నగర జీవితం మన ఆలోచనలలో మార్పును కోరుతున్నది. నగరాలు పెరిగిపోయినయి; జనాభా విపరీతంగా వృద్ధి చెందింది. నివాస గృహాల సంఖ్య జనాభాలో దంపతుల సంఖ్యకు తక్కువగావుంది. కనుక అందరూ దంపతులకు ఇళ్ళు దొరకటంలేదు. పైగా ఈ పెట్టుబడిదారీ సమాజంలో ఇళ్ళ అద్దెలు సామాన్యులకు అందుబాటులో లేవు. గదులు దొరకని కారణాన అనేకమంది యువతీ యువకులు అవివాహితులుగా ఉండి పోతున్నారు. అందులో కొందరు ఏబదవ పడిలో పడుతున్నారు.

వారి దురవస్తకు మనం బాధపడటం మానివేశాం. మనలో స్పందించే శక్తినశిస్తున్నది. పైగా ఈ సమాజంలోని సనాతనులు, చాంధసులు వారిని బ్రహ్మచారులుగా ఉండవలసిందని శాసిస్తున్నారు. ఇది ఘోరం, అన్యాయం. ఈ అక్రమాన్ని మనం సమష్టిగాను, వ్యష్టిగాను ఎదిరించాలి."

ఈ మాటలువిన్న సావిత్రి ఉత్తేజితురాలయింది. తన శాయశక్తులా ఈ దుర్మార్గాన్ని ఎదిరిస్తానని ప్రకటించింది.

"మనం చాలమందిమి సంస్కారులమని మనం తలపోస్తున్నాం. కాని అది నిజంగాదు. అవతలి వ్యక్తియెడ ఆదరంతో వ్యవహరించగలగడమే సంస్కారానికి లక్షణం, 'నా సుఖాన్ని నేను పొందుతాను. తతిమ్మావాళ్ళ ఊహలతో, ఆలోచనలతో, భావాలతో, అభిరుచులతో, అభినివేశాలతో నాకు ప్రమేయం లేదు' అనే చింతనతో ప్రవర్తించే స్త్రీని గాని పురుషుణ్ణిగాని సంస్కారిగా ఎంచలేము. ఇతరులను గురించి ఎక్కువగా ఆలోచించగల వ్యక్తి నిజానికి స్వార్థపరుడికన్నా ఎక్కువ సుఖపడతాడు. మనం అవతలి మనిషిని ప్రేమిస్తే అవతలి వ్యక్తి మనలను ప్రేమిస్తాడు. అది ఫలవంత మవుతుంది. ఇది మనకందరికీ అనుభవైక వేద్యమే."

గోపాలంగారి ఉపన్యాసంలో ఈ భాగం ప్రభాకరం నళినులపై చెరగనిముద్ర వేసింది.

"ప్రతి వ్యక్తిలోనూ మంచీ చెడ్డా ఉంటాయి. అభిలషణీయము అనభిలషణీయమూ రెండూ చోటుచేసు కుంటాయి. పరిపూర్ణంగా సద్గుణవంతుడు దొరకడు. సర్వం దుర్మార్గమయిన ప్రవృత్తికల మనిషీ కనుపించడు. ప్రపంచం అంతా అచ్చంగా

తెలుపుగా, నలుపుగా ఉండదు. మధ్యలో అనేక రంగులువుంటాయి. అలాంటి సందర్భంలో ఒకవ్యక్తి మరొకవ్యక్తిని ప్రేమించటమంటే అన్ని లక్షణాలను పరిగణనలోకి తీసుకుని పరిగ్రహించటం అన్న మాట. అలా కానినాడు దానిని ప్రేమ అని పిలవటం పొరపాటు."

ఈ భాగం సావిత్రికి మనశ్శాంతిని ఇచ్చింది. కృష్ణారావును తను తిరస్కరించటం చాల మంచిపని యని ఆమెకు విశ్వాసం కల్గింది.

చేరినవారంతా గోపాలంగారి అభిభాషణను ఆసక్తితో వింటున్నారు. అవి ఆణిముత్యాలు. ఆయన పాండితీ ప్రతిభ, అనుభవజ్ఞానమూ అందులో ద్యోతకమవుతున్నాయి.

"ప్రేమకు వయస్సుతో నిమిత్తంలేదు. కన్యలు ప్రేమకు లోనుకావచ్చును. తరుణులు ఆ ప్రవాహంలోపడి ఈదులాడవచ్చును. ఈడు మళ్ళినవారు దానికై తపియించవచ్చును. ఇదే ధర్మం పురుషులకూ వర్తిస్తుంది. ప్రేమ స్వరూపాన్ని తెలిసికున్నవారి సంఖ్య పెరుగుతున్న కొలదీ ప్రపంచంలో స్పర్థ, వైషమ్యం, వైరుధ్యం, సంఘర్షణ తగ్గిపోతాయి. ఈ విశ్వంలో శాంతి, సౌభాగ్యం, సౌహార్దం నెలకొంటాయి. అలాంటి జగత్తును సృష్టించటానికి మనం కృషిచేయాలి. ఆ ప్రయత్నంలోనే మనకు తృప్తి; మనకు మనశ్శాంతి. అలా చేసిననాడే మన జీవితాలు సార్థకం అవుతాయి. అపుడే మనం మనుషులుగా ప్రవర్తించిన వాళ్ళం అవుతాము."

గోపాలంగారు ముగించేటప్పటికి ఆయన కళ్ళలోనుండి అశ్రుధారలు ప్రవహిస్తున్నాయి. ఆ ఉపన్యాసం వారికి నాలుక నుండి రాలేదు. ఆ మాటలు వారి హృదయంలోనుండి సూటిగా దూసుకుని వచ్చినయి. ఉద్వేగంతో ఆయన కంపించి

పోతున్నారు. రాధమ్మవచ్చి వారి చెయ్యిపట్టుకుని సోఫాలో కూర్చో బెట్టింది. ఆమె కనుకొలకులలో అశ్రుకణాలు చేరి ఉన్నాయి. ఈదృశ్యం చూచిన తతిమ్మావారు చకితులయినారు.

సావిత్రి లేచి నిలబడింది. ఆమె ముఖం దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నది. ఆమెలో దృఢనిశ్చయత్వ భావన ప్రస్ఫుటంగా కన్పడుతున్నది. ఆమె ఎలుగెత్తి ఇలాగు చెప్పింది.

"గోపాలంగారి ప్రసంగం నాకు కనువిప్పు కలుగజేసింది. లోకంలో అంధకారం సర్వసర్వత్రా వ్యాపించి ఉంది. ఒక్కసారిగా ఇపుడు ఆ చీకటిని పారద్రోలలేము; ఆ కాలం ఆసన్నం కాకపోదు. అంతదాకా ఏం చేయాలి? ఏమీ చేయలేమనే నిస్పృహతో కాలం వెళ్ళబుచ్చాలా? లేక చేతనయినంత కృషిచేస్తూ పరిస్థితి సంపూర్ణంగా మార్చటానికి వలసిన మందీ మార్బలాన్ని సంతరించుకోవాలా? రెండవ మార్గం నాకు సమ్మతంగా కన్పడుతున్నది, కనుక నాకు ఉన్న మరియొక చిన్న వాటాను పద్మజా ప్రకాష్‌లకు నివాసంక్రింద ఇస్తున్నాను. నన్ను అపార్థం చేసుకొనక, అన్యథా భావించక నా ఈ కానుకను స్వీకరించవలసినదిగా పద్మజా ప్రకాష్ లను కోరుతున్నాను."

తమచెవులను తామే నమ్మలేకపోయారు పద్మజాప్రకాష్‌లు. తతిమ్మావారు సావిత్రిని అభినందించే ఉద్దేశంతో కరతాళధ్వనులు చేశారు. నళిని సావిత్రిని కౌగలించుకున్నది. రాధమ్మ వచ్చి ఆమె శిరము మూర్కొన్నది. నీరజ ఆమె కరస్పర్శ చేసింది.

ప్రభాకరం గోపాలంగారి నుద్దేశించి–

"ఇదంతా తమ అమోఘ వచనా ప్రాభవఫలం" అన్నాడు.

"తమబోటి పెద్దల ప్రోత్సాహంతో మాబోటివాళ్ళంముందుకు సాగిపోగలం. ఆశీర్వదించండి" అని గోపాలంగారిని కమలాకర రావు కోరాడు.

"మరి ఎప్పుడమ్మా కమలాకరరావుతో నీ వివాహం" అని నీరజను ప్రశ్నించారు గోపాలంగారు.

"విడాకుల పిటీషను పెట్టాను. అది నాకనుకూలంగా తీర్పు రాగానే" అని ఆమె జవాబిచ్చింది.

"శుభం" అన్నారు గోపాలంగారు.

"తమరే మా పెండ్లికి ఆధ్వర్యం వహించాలి" నీరజ ఆయనను కోరింది.

"అంతకన్నా సంతోషకరమైన సంగతి ఏముంటుందమ్మా?" అని ఆయన ప్రకాష్‌వైపు తిరిగి-

"ఏమయ్యా! ఇల్లు దొరికింది కదా! మీరు ఒక యింటి వాళ్ళయేది ఎప్పుడు?" అని చమత్కరించారు.

"ముహూర్త నిర్ణయ బాధ్యత తమదే" అని అతడు బదులు చెప్పాడు.

"ఆ హక్కు పద్మజది. ఏమమ్మా ఏమంటావు?" పద్మజను హెచ్చరించారు ఆయన.

అవునన్నట్లుగా పద్మజ తలపంకించింది.

ఈ రెండు పెండ్లిండ్లు ఒకేసారి జరిగితే బాగుంటుందని సావిత్రి సూచించింది. నళిని బలపరచింది.

నీరజ పద్మజలు అంగీకరించారు. కమలాకరరావు, ప్రకాష్‌లు ఆమోదించారు. రాధమ్మ చప్పట్లు చరుస్తూ తన సుముఖతను వ్యక్తపరిచింది. గోపాలంగారు లేచి ఆశీర్వదిస్తున్నట్లుగా నీరజ పద్మజల తలలను నిమిరారు.

38

నీరజ గున్నేశ్వరరావునుండి విడాకులుపొందింది. గోపాలం గారి ఆధ్వర్యాన నీరజ కమలాకరరావుల వివాహం, పద్మజ ప్రకాష్‌ల పెండ్లి ఒకేరోజున ఒకే ఆవరణలో జరిగాయి. పెళ్ళి ఏర్పాట్లను నళినీ సావిత్రిలు చేశారు. రాధమ్మ పెండ్లికి వచ్చిన పెద్దలకు స్వాగతం చెప్పింది. ప్రభాకర్ ఆహ్వానితులను మర్యాద చేశాడు. పద్మినీ వెంకటాద్రివులు, రుక్మిణీ మోహనరావులు వచ్చి వధూవరుల జంటలకు శుభాకాంక్షలు తెలిపారు.

"కలిమిలేములలో కష్టసుఖాలలో పాలుపంచుకుంటూ ఒకరి నొకరు సాయపడుతూ, ఆలుమగలంగా జీవితభాగస్వాములంగా జీవయాత్ర సాగిద్దాం" అనే ప్రమాణాన్ని వధూవరుల జంటలచేత చేయించారు గోపాలంగారు. జంటనగరాలలోని అన్నివర్గాల సంఘ సంస్కరణాభిలాషులూ ఆ వివాహాలకు హాజరయి తమవంతు బలాన్ని సంస్కరణోద్యమానికి అందించి తమ విద్యుక్తధర్మాన్ని నెరవేర్చుకున్నారు.

ఆ రోజు సాయంత్రం గోపాలంగారు రాధమ్మ ఇంటికి వచ్చారు. రాధమ్మ స్వాగతం పలికింది. ఆమె మనస్సులో ఎన్నో

తలపులు; చిత్రవిచిత్రమయిన భావనలెన్నో మెదులుతున్నాయి. గోపాలంగారు తనని వివాహమాడమని ఈ రోజు తనల్ని కోర తారా? ఏమో! అలా జరుగుతుందా? ఆయన గంభీర స్వభా వుడు! ఆయనకు ధర్మంతెలుసు; ధర్మసూక్ష్మమూ తెలుసు. ప్రకాష్ పద్మజల విషయంలో ధర్మసూక్ష్మగా చెప్పబడిన వివాహేతరపూర్వ దాంపత్యజీవితం తమ సందర్భంగా ధర్మసూక్ష్మంగా గోపాలంగారు భావిస్తారా? ఖండితంగా చెప్పటం కష్టం. కాగా ప్రకాష్ పద్మజలకు తనకూ గోపాలంగారికీ వయస్సులో, అనుభవంలో, ఇంకా ఎన్నిం టిలోనో తేడా ఉంది. వారి విషయంలో సమ్మతమయింది, తమ పరంగా అంగీకారయోగ్యం కాకపోవచ్చును. ఇంతకూ గోపాలం గారు వివాహ ప్రస్తావన తేకపోతే తను ఏం చేయాలి? పోనీ, తనే ఆ ప్రసక్తి తెస్తే? ఆయన ప్రసన్నముఖుడు కాకపోతే? అంతకన్నా అవమానం ఉంటుందా? ఇంతవరకు జీవితంలో ఎన్నో దెబ్బలు తగిలాయి తనకు! మరో అఘాతాన్ని తను సహించలేదు. కనుక నిబ్బరంగా ఉండాలి తను ఆ నిర్ణయానికి వచ్చింది రాధమ్మ.

"రాధా!" అన్నారు గోపాలంగారు.

"ఆహా! ఆ పిలుపులో ఎంత మాధుర్యం! మళ్ళీ అలా పిలిస్తే బాగుండును" తనలో అనుకుంది రాధమ్మ.

"పిలిచారా" అంది రాధమ్మ.

"రాధా! మనం ఇలా స్నేహితులముగా ...."

"అంతేనా?"

"ప్రేయసీ ప్రియులముగా ...."

"నా అదృష్టం పండింది."

"పండదాం."

గోపాలంగారు ఎందుకో పెండ్లి ఊసు ఎత్తరని ఆమె తెల్సుకున్నది.

"రాధా! నీకిది సమ్మతమేనా?"

రాధమ్మ తలదించుకుని నేలవైపు చూస్తున్నది.

ఆమె మనస్సులోని భావాలు ఆయనకు అవగతం కాలేదు.

"వివాహమయిన స్త్రీ పురుషులు ఒకే ఇంట్లో నివసించడం సర్వసామాన్య విషయం. కాని మనలాంటివాళ్ళ స్థితివేరు. మనిద్దరి జీవితం సగం పైబడ్డది. ఇద్దరికీ కొన్ని అభిరుచులూ, అలవాట్లు వగైరాలు దృఢంగా ఏర్పడ్డాయి. ఇప్పుడు వాటిని మార్చుకోలేము. చాలవరకు అలుమగల మధ్య మనస్పర్థలు కలిగేది చిన్న విషయాలమీదనే. పెండ్లికాగానే అన్ని అంశాలు వాటంతట అవి సర్దుకుంటాయనుకుంటారు చాలమంది. కాని పెండ్లి అయిన తదుపరి వైవాహిక జీవితం సుఖప్రదం కావటానికి దంపతులిరువురూ ఎంతో కృషిచేయాలి. ఇంతకూ నేనుచెప్పేదేమంటే మనిద్దరి మధ్య పెండ్లి తంతు అక్కరలేదు. మనిద్దరికీ సంతానం అక్కరలేదు. ఇద్దరం ఎవరిఇళ్ళల్లో వాళ్ళంగి వశిస్తూ నెయ్యం నెరపుతూ, పరస్పర ప్రేమాభిమానాలను పెంచుకుంటూ, ఒకరినొకరు గౌరవించుకుంటూ జీవితాలు గడుపుదాం. తోటివాళ్ళకు ఎంతోకొంత సాయంచేస్తూ, ప్రపంచంలో అలముకున్న యీ గాఢ తమస్సును పూర్తిగా పటాపంచలు చేయలేకపోయినా ఏదోమూల కాస్త వెలు

తురునయినా ప్రసారించే ఒక దివ్వెను వెలిగిద్దాం. అదే మన జీవితపరమార్థం. అప్పుడే మన జీవితాలు సార్థకం."

"గోపాలంగారూ...."

రాధమ్మ గొంతులో ఆర్ద్రత గోచరించింది.

"రాధా! నేను చెప్పింది అనుచితమా?"

"కాదు గోపాలం! ఎన్నటికీ కాదు; కాబోదు."

గోపాలం ఆమెవైపు చేతులు చాచాడు.

"రాధా!"

"గోపాలం!" అంటూ తన్మయత్వంతో రాధమ్మ ఆయన బాహుబంధంలో ఇమిడిపోయింది.

-/ అయిపోయింది. /-

చివరిమాట

ఈ నవల ఆసాంతం చదివిన జిజ్ఞాసువులకు అనేక ప్రశ్నలు ఉదయించవచ్చు. వయస్సు మళ్ళిన ఈ రచయిత, ఏదో ఉద్యమాల పేరుతో సమాజంలో నడయాడుతున్న ఈమె ఎందుకిలాంటి రచన చేశారు? ఒక రకంగాచూస్తే ఈ నవలలో సెక్సుకు ప్రాధాన్యత ఉన్నట్లు కన్పట్టుతున్నదే ఈమె పవిత్ర వివాహ బంధాన్ని అపహాస్యం చేస్తున్నారా? సమాజంలో అరాజకత్వాన్ని, నియంత్రణ రాహిత్యాన్ని ప్రబోధించటమా వీరు నిర్ణయించుకున్న విధి? ఇది నీతిని కూలద్రోస్తుంది; అవినీతిని పెంపొందిస్తుంది. వయస్సులోవున్న యువతీ యువకులను రెచ్చగొడ్తుంది. వారిలో మనోవికారాలు కలిగిస్తుంది. ఇలా ఎన్నో విమర్శలు చేయవచ్చు. అంతేకాదు సమాజంలో ముఖ్యసమస్యలైన ఆకలి, దారిద్ర్యం, అజ్ఞానం, అనారోగ్యం, అవిద్య, నిరాశ్రయం లాంటి వాటిని వదలివేసి ఈ సమస్యపై ఎందుకు ఈ రాత ఈనాడు? ఎవరిని ఉద్ధరించటానికి? చౌకబారు 'పేరు' కోసం తాపత్రయం కాక మరేమిటి? ఇలా ఎన్నో సందేహాలు, అనుమానాలు, ప్రశ్నలు చదువరుల

సంస్కృతీ సంప్రదాయాలనుబట్టి తలఎత్తుతాయి. వీటికి క్లుప్తంగా సమాధానం చెప్పటానికే ఈ చివరి మాట.

ప్రశ్నలను చివరినుండి పేర్కొని సమాధానం చెప్పటం సముచితం. సమాజాన్ని, అందులోని వ్యక్తుల్ని వేధించేవి సవాలక్షసమస్యలు. మౌలికమయినవిగా దర్శనమిస్తాయి. ఉదాహరణకుమార్క్స్ యొక్క సంప్రదాయ అనుయాయులకు భౌతిక పరిస్థితులు అందులో ముఖ్యంగా ఆర్థిక సమస్యలు ప్రధానమయినవిగా కనిపిస్తయి. రాష్ట్రీయ స్వయం సేవక సంఘం వారికి జాతి ధర్మాన్ని పోషించేవి మాత్రమే ఆమోదయోగ్యాలు. జమాఅతే ఇస్లామ్ హింద్ మహమ్మదుఆదేశించిన పరిశుద్ధవర్తనానికీ పెద్ద పీటవేస్తుంది. ఆ యా మతాచార్యుల బోధలకనుగుణంగా ఆ యా మతాలవారు సమస్యలలో కొన్నింటిని మాత్రమే పేర్కొని అవే ప్రప్రధానమయినవని వాదిస్తున్నారు. ఈ రోజుల్లోకూడ ఎనిమిది మంది సంతానాన్ని కలిగిన పురాణ శాస్త్రుల్లుగారు సైతం కళత్ర వియోగానికి తల్లడిల్లిపోతున్నారు. ధర్మరక్షణ కోసమే సంతాన ప్రాప్తిని అభిలషించాలని నిత్యమూ ప్రచారంచేసే ఆ వ్యక్తి సతీ సంయోగాన్ని వాంఛిస్తూనే ఉన్నాడు. సమాజస్థితిని, దేశ భవిష్యత్తును, చివరకు ఆలి ఆరోగ్యాన్ని సైతం ఖాతరుచేయకుండా పిల్లలను కంటున్నాడు. దేనికి ఆ వ్యక్తికి ముందు పీటవేసినట్లు?

ఆర్థిక సమస్యల ప్రాధాన్యతను ఎవరూ కాదనలేరు; కాదన రాదు. కాగా 'ఉపరితలానికి' చెందిన రాజకీయం, తత్వం, మతం,

నీతి, సెక్సు, వివాహం మొదలయిన వాటికి సామాజిక జీవితంలో చోటువుంది. వాటికి కొంత స్వతంత్ర ప్రతిపత్తి (AUTONOMY) ఉందని మార్క్సిస్టులూ అంగీకరిస్తారు. కాకపోతే ఆర్థికం, రాజకీయం, మతం, తత్వం వగైరాలు అన్నీ సమాన హోదాతో ఉంటాయని ఒకటి మరియొక దానిపై విశేష ప్రభావాన్ని చూపుతుందని రాడికల్ హ్యూమనిస్టులు వాదిస్తారు. ఆర్థికవ్యవస్థ మారితే సమాజం దానంతటదే చక్కబడుతుందనే భావనను యాంత్రిక మన తత్వంకల మార్క్సిస్టులు ప్రచారం చేస్తున్నారు. దీనిని మావోలాంటి 'సృజనాత్మక' మార్క్సిస్టులు ఆమోదించరు. పురాతన సంస్కృతీ రూపాలతో పోరాటం అనివార్యమని వారి ఆలోచన. ఆర్థికపోరాటం జరిగేటప్పుడు ఇది జరగాలా లేక ఆర్థిక వ్యవస్థను మార్చిన తరువాత ఈ పునికి పూనుకోవాలా లేక ఆర్థికవ్యసస్థను మార్చటానికి వలసిన సాధన సంపత్తినీ, మందీ మార్బలాన్ని యీ సాంస్కృతిక విప్లవభావాలు సమకూరుస్తాయా అనే అంశంపై విభేదాలు ఉన్నాయి. సమాజ సంక్లిష్టతను ఎవరూ కాదనరు. కాకపోతే ఏది ముందు, ఏది వెనుక అనే విషయంలోనే అభిప్రాయభేదాలు. సమాజంలో మార్పును తేవడానికి సంస్కృతీ పరమైన ప్రయత్నం అత్యంత అవసరమని రాడికల్ హ్యూమనిస్టుల ఆలోచన.

సామాజిక జీవితంలో స్త్రీ పురుషులు జతకట్టడాన్ని గమనిస్తున్నాం. సెక్సును వారు అనుభవించడం సర్వసాధారణ విదితం.

దానికి ఎల్లలు, హద్దులు, పరిమితులు నిర్ణయించడానికి వివాహ వ్యవస్థ ఏర్పాటయిన విషయం ఎల్లరకు విశదమే. అంతేగాదు ఆ వివాహవ్యవస్థ కొన్ని సందర్భాలలో ఆ బంధంలోవున్న స్త్రీ పురుషులను అణచివేస్తున్న మాటా వాస్తవమే. ఈ బాధను తప్పించుకోటానికి మార్గాంతరాలు అనేకం. ఆత్మహత్య, సన్యాసం, వెలిచవి, అలాంటివి. ఇటీవల విడాకులు, తర్వాత మళ్ళీ పెళ్ళి అవతరించింది. దీనిని 'సీరియల్ మ్యారేజి' అంటాం. పాశ్చాత్య దేశాలలో దీనికి సార్వజన అంగీకారం వచ్చింది. భారతదేశంలో దీనిని అత్యధికంగా అనుసరించకపోయినా దీనియెడ వైముఖ్యం క్రమక్రమంగా తగ్గుతున్నది. భారత శిక్షాస్మృతిని రచించినవాడు మెకాలే; పందొమ్మిదవ శతాబ్దపు కృషి అది. వివాహిత స్త్రీతో ఆమె భర్త సమ్మతిలేకుండా, కనీసం అతని ఎరుకతోకూడిన ఉపేక్ష లేకుండా లైంగికానుబంధం ఏర్పరచుకున్న పురుషుడు శిక్షార్హుడు. ఇది నేడు నేరం. ఒకనాడు వ్యభిచరించిన స్త్రీ పురుషులిద్దరికీ శిక్ష లుండేవి. భారత సమాజంలో స్త్రీ నికృష్ట స్థితిలో ఉందని గ్రహించిన బ్రిటిషువారు స్త్రీని దోషిగా నిర్ణయించదలచలేదు. కనుక పురుషునికే శిక్ష పరిమితమయింది. స్త్రీ భర్త సొత్తు కనుక, ఆ ఆస్థిని అపహరించిన మరో పురుషునికిని శిక్ష వేయాలనే అనాగరిక భావానికి ఇది పరాకాష్ట. వ్యభిచారం సామాజికంగా దుష్టంకావచ్చు కాని నేరం కానవసరంలేదు.

స్త్రీ జీవితాన్ని సెక్సు పరంగా శాసించిన సనాతనులు సెక్సును అపవిత్రంగా చూస్తారు. స్త్రీని 'సెక్సు సింబల్' గా

పరిగణించే 'ఆధునికులు' సెక్సును మంచినీళ్ళ ప్రాయంగా పరిగణిస్తారు. ఇద్దరికీ సెక్సుపట్ల సరియైన అవగాహనలేదు; సహేతుకమైన భావనలేదు. ప్రేమలేని సెక్సూ, సెక్సులేని అనురాగమూ రెండూ నింద్యాలే, అవాంఛితాలే.

ఈ సందర్భంలో నీతి చర్చనీయాంశమవుతుంది. సమాజానికి, మరోరకంగా చెప్పాలంటే, మరోవ్యక్తికి కష్టనష్టాలు కలిగించని స్త్రీ పురుషజంట యొక్క ప్రవర్తనపట్ల - వారు వయోజనులయితే - ఎవరూ ఆక్రోశించనక్కరలేదు; ఆందోళన చెందనవసరంలేదు. అడగవలసింది ఒకే ఒక ప్రశ్న. వారి చర్యలు ప్రేమ పురస్సరాలా లేక కేవలం కామ ప్రేరితాలా? మనిషికీ జంతువుకూ ఉండే తేడాని గుర్తించిన మనం ఈ ప్రశ్నను లేవనెత్తటంలో ఆశ్చర్యంలేదు.

వ్యక్తుల సంక్షేమంకోసం సమాజం ఏర్పడింది. సమాజగతిని నిర్దేశిస్తూ సామాజిక ధర్మాలు ఉద్భవించాయి. ఇవి సర్వసామాన్య మయినవి. కాని ప్రత్యేక పరిస్థితుల్లో, కొంతమంది వ్యక్తులపరంగా ఇవి అక్రమాన్ని, దౌర్జన్యాన్ని, హింసను పోషించవచ్చు. అపుడు ఆ సామాన్య ధర్మాతిక్రమణం వారిపట్ల నీతిమార్గమవుతుంది. ఇది ధర్మసూక్ష్మం.

పైన ఉటంకించబడిన సూత్రాలను అర్థంచేసుకున్నవారికి అనుమానాలు పటాపంచలవుతాయి; భయ సందేహాలు తొలగిపోతయి. వివాహ వ్యవస్థయొక్క ఉత్కృష్టతను చాటేదే

ఈ గ్రంథం. ప్రకాష్ పద్మజలు, నీరజ కమలాకరరావులు వివాహబంధాన్ని స్వచ్ఛందంగా స్వీకరిస్తారు. ప్రభాకరం నళి నులు వివాహవ్యవస్థను ఆనందప్రదం చేసుకుంటారు. దారి తప్పిన పద్మిని, మోహనరావు వివాహబంధ ప్రాశస్త్యాన్ని గుర్తి స్తారు. సంప్రదాయపరులైన రామలింగం సౌభాగ్యమ్మల విషయం సరేసరి. సావిత్రి వివాహాన్నే అభిలషిస్తుంది. ఇలా ఆరుజంటలు, ఒక మహిళ మొత్తం పదముగ్గురు వైవాహిక జీవిత విశిష్టతను గౌరవిస్తారు.

పెండ్లి అనే బండికి ఇరుసయిన ప్రేమపై ఈ రచనలో నొక్కి వున్నమాట నిజమే. అది సరియైన దృక్పథమని రచయిత విశ్వాసం.

నవలలోని సెక్సు సంబంధాలను గురించి ఒకమాట అప్ర స్తుతంకాదు. కథా సంవిధానంలో సందర్భోచితంగా అదిదొర్లుతుంది. అంతేకాని అది పరమంకాదు; గమ్యంకాదు. ప్రకాష్ పద్మజలు వివాహేతూర్వ సెక్సుకు ప్రతీకలు. పద్మిని, మోహనరావు వెలి చవిలో సెక్సును దర్శించినవారు. ప్రభాకరం, నళిని దాంపత్య జీవితంలో సెక్సు పాత్రను తమ చర్యల ద్వారా విశదీకరిస్తారు. రాధాగోపాలంలు వివాహంలేని సెక్సును ప్రతిబింబిస్తారు. ఇందరి లోనూ ప్రేమసహిత సెక్సేకాని మరి ఇతరం లేదు.

నవలలో మనకు కనుపించే అనేక పాత్రలను, సంఘటన లను సూత్రప్రాయంగా కట్టిపడవేసేది గున్నేశ్వరరావు తనభార్య

నీరజ ప్రియునిపై పెట్టిన క్రిమినలు కేసు. అది అసులో గొట్టం: ముత్యాలసరంలోని బంగారు తీగె. సమాజంలో మహిళస్థానాన్ని, హోదాను గురించి మౌలికమయిన ప్రశ్నను అది లేవనెత్తుతుంది. మహిళాభ్యుదయాన్ని ఆశిస్తూ వ్రాసిన గ్రంథము ఇది.

నవలలు అనేక తెఱగులు. వినోదాన్ని, ఆహ్లాదాన్ని మాత్రం అందించేవి; కాలక్షేపం చేయటానికి పనికివచ్చేవి. చిత్ర విచిత్ర సన్ని వేశాలతో మనలో వున్న అద్భుత భావానికి పదును పెట్టేవి; కాసేపు చమత్కారంగా చక్కిలిగింత పెట్టేవి. ఒక నిర్దిష్ట తత్వాన్ని ప్రచారం చేయటానికి అనువుగా నవలా ప్రక్రియలో రాయబడి, చదువరిని మధ్యలో ఆపి ఉపన్యాసాలిచ్చేవి; అలాకాక ఈ సామాజిక దౌష్ట్యాన్ని మరచిపోవడానికి పాఠకుని ఊహాలోకంలో విహరింపచేసేవి. సమాజంలో ఉన్న ఏదో యొక సమస్యను తీసుకుని దానిని బహుముఖంగా విశ్లేషణచేసి దాని స్వరూప స్వభావాలను గ్రంథపఠనం చేసేవారికి అవగతం చేసేవి; అంతటితో ఆగక సమస్యా పరిష్కార మార్గాలను సూచించేవి.

ఒకటిమాత్రం సత్యం. ఉబుసుపోక రాశింది కాదీ కథ.

ఇంతా చదివి రచయిత్రిని నిందించపూనితే ఎక్కడో ఏదో లోపం ఉందన్నమాట.

ఎం. వి. రామమూర్తి



రచయిత ఇతర గ్రంథాలు

వ్యాస సంకలనాలు

ఓ మహిళా! ముందుకు సాగిపో	7-00
మారుతున్న సమాజం-మహిళలు	5-00
మహిళాదశాబ్దం	7-50
స్త్రీ విమోచన	7-50
మహిళాభ్యుదయం	15-00
భావ వాహిని	5-50
మనం దేనికి బానిసలం?	3-50
తల్లే పిల్లను చంపితే?	3-50
విముక్తి ఉద్యమాలు: మహనీయులు	3-50
ఆధునిక స్త్రీ	12-00
ఆంధ్రప్రదేశ్‌లో హేతువాద ఉద్యమ చరిత్ర	2-00
ఇస్లాం: స్త్రీలు	15-00

నవలలు

కాంతి కిరణాలు	12-00
వెలిగిన జ్యోతి	12-00
చీకటి వెలుగులు	10-00
ప్రేమ+సెక్స్ = నీతి	17-00
"ఈ దేశం నాదేనా?"	5-00

సంకలనం

వివాహం: నేడు, రేపు	20-00

కథలు

మాతృత్వానికి మరోముడి	20-00

అచ్చులో

సామ్రాజ్ఞి రుద్రమదేవి (బాలల నవల)

క్రైస్తవం: స్త్రీలు (విమర్శనాత్మక గ్రంథం)

హిందూమతం: స్త్రీలు (పరిశీలనాత్మక గ్రంథం)

ఆం. ప్ర. లో మహిళోద్యమం: మహిళా సంఘాలు

Women, Tradition & Culture

Women's Movement & Associations in A. P.

Women in Revolt Saga of Struggle